


ఈనాడు

కరీంనగర్ 2-7-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 323

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi






# శతమర్కటం.. వృక్ష నాశనం!

## కోతుల బెడదకు చెట్లను నరికేస్తున్న గ్రామస్థులు

- ఆహార పంటలను వదిలి వాణిజ్య పంటలవైపు రైతుల మొగ్గు
- రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ప్రాజెక్టు అధ్యయనంలో గుర్తింపు
- మరోవైపు హరితహారానికి సిద్ధమవుతున్న సర్కారు
- వన్యప్రాణి సంరక్షణ పంట పరిహార పథకం పరిష్కారమంటున్న నిపుణులు

ఈనాడు - హైదరాబాద్

అడవుల్లో ఆహారం దొరక్క... గ్రామాల్లో ప్రవేశించిన వానరాలతో మనుషులే కాదు.. జీవవైవిధ్యమూ ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పచ్చటి పల్లెలు మోడు వారుతున్నాయి. కొన్ని జిల్లాల్లో కోతుల బెడదకు రోడ్డు పక్కన, ఇంటి ఆవరణలో ఉన్న వృక్షాలను గ్రామస్థులు నరికేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో.. ఇష్టంగా పెంచుకున్న చెట్లను తెగనరుక్కుంటున్నారు. రైతులు ఆహార పంటలు వదిలి ...మిగతా 2లో



ఖమ్మం జిల్లా పెద్దమునగాలలో నరికివేసిన వేప చెట్లు

# జల గణ మన



- ప్రారంభమైన జలశక్తి అభియాన్
- నీటి ఎద్దడిపై ప్రచారోద్యమాన్ని చేపట్టిన కేంద్రం
- దేశవ్యాప్తంగా రెండు దశల్లో అమలు
- ఏపీలో 9, తెలంగాణలో 24 జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు 2లో

దేశంలో నానాటికీ తరిగిపోతున్న జల వనరులను సంరక్షించుకొని, వాన నీటిని ఒడిసి పట్టుకొనేలా ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు జలశక్తి అభియాన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం భారీ కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నీటి పొదుపు, సంరక్షణ, పునర్వినియోగాలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణను ప్రకటించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని నీటికి ఇబ్బందిపడుతున్న 256 జిల్లాలు, 1592 బ్లాకుల్లో రెండు దశల్లో నిర్వహించదలచిన ప్రచార ఉద్యమాన్ని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సోమవారం ప్రారంభించారు. కేంద్రం నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. తొలి దశ కార్యక్రమాలు నిర్వహించే రాష్ట్రాల్లో తెలంగాణ ఉంది. ఈ రాష్ట్రానికి చెందిన 24 జిల్లాలు, 137 బ్లాకులను ఇందుకు ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ (9 జిల్లాలు, 64 బ్లాకులు), తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చెరి రెండో దశలోకి వస్తాయి. అన్ని వర్గాల ప్రజలను మమేకం చేయనున్నారు.

### దేశవ్యాప్తంగా కార్యక్షేత్రాలు

ఎంపిక చేసిన **256** జిల్లాలు.. **1592** బ్లాకులు

### రెండు దశల్లో కార్యాచరణ..

- ఈనెల (జులై) 1 నుంచి సెప్టెంబరు 15 వరకు తొలిదశ.
- అక్టోబరు 1 నుంచి నవంబరు 30 వరకు మలి దశ

### అయిదు అంశాలపై ప్రత్యేక దృష్టి

**1.** నీటి పరిరక్షణ, వాన నీటి సంరక్షణ **2.** సంప్రదాయ జలవనరులు, కుంటలు, చెరువుల పునరుద్ధరణ, **3.** పునర్వినియోగార్హమైన, రీఛార్జికి వీలైన నిర్మాణాలు చేపట్టడం **4.** వాటర్‌షెడ్ అభివృద్ధి **5.** పెద్దఎత్తున అటవీకరణ కార్యక్రమం

### ప్రతి జిల్లాకు కేంద్ర ప్రభుత్వ అధికారి

256 మంది కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులకు ఒక్కొక్కరికి ఒక్కో జిల్లా బాధ్యతల అప్పగింత.

### శ్రమదానం

ప్రజలకు విస్తృత భాగస్వామ్యం కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వంలోని ప్రతిశాఖ ఏదో ఒక రోజును ఎంచుకొని కార్యక్రమాల్లో పాల్గొనాలి.



# ఫీజులుంపై సుప్రీం కొరడా

## ఇంజినీరింగ్ విద్యార్థులకు ఊరట

- సాంకేతిక కళాశాలలకు ఎదురుదెబ్బ
- నియంత్రణ కమిటీదే నిర్ణయాధికారమని స్పష్టీకరణ
- రుసుములపై మీ జోక్యమేంటని హైకోర్టుకు ప్రశ్న
- వాసవి, శ్రీనిధి ఫీజుల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం

ఈనాడు - దిల్లీ, హైదరాబాద్

ఫీజుల చెల్లింపు విషయంలో తెలంగాణలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరట లభించింది. రుసుముల నిర్ణయాధికారం తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్‌ఆర్‌సీ)దేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వాసవి, శ్రీనిధి కళాశాలల ఫీజుల పెంపు విషయంలో హైకోర్టు పరిధికి మించి వ్యవహరించిందని అభిప్రాయపడింది. దీంతో ఇంజినీరింగ్ కళాశాలలకు సుప్రీం తీర్పు షాక్ ఇచ్చినట్లయింది. ఇక రాష్ట్రంలో కళాశాలలను కూడా కట్టడి చేయడానికి అవకాశం ఏర్పడిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఇదీ ఫీజుల పెంపు నేపథ్యం..**

ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఈడీ, న్యాయవిద్య, ఎంబీఏ తదితర కళాశాలలకు ప్రతి మూడేళ్లకు ఒకసారి టీఏఎఫ్‌ఆర్‌సీ వార్షిక రుసుములను నిర్ణయిస్తుంది. ...మిగతా 2లో

## తెలుగు రాష్ట్రాలకు వేర్వేరు గవర్నర్లు!

- పార్లమెంటు సమావేశాల తర్వాత నియమించే అవకాశం
- హోంశాఖ వర్గాల సమాచారం

3లో

## లోయలోకి దూసుకెళ్లిన బస్సు

జమ్మూ కశ్మీర్‌లో 35 మంది దుర్మరణం 11లో





హాంకాంగ్ పార్లమెంటులోకి చొచ్చుకెళ్లిన నిరసనకారులు 2లో

## హాంకాంగ్ పార్లమెంటులో విధ్వంసం



## నీళ్లు లేని బాబ్లీ.. గేట్ల ఎత్తివేత

- దిగువకు నీళ్లు రాకపోవడం ఆరేళ్లలో తొలిసారి 2లో

### మున్సిపాలిటీల్లో

## ప్రత్యేకాధికారుల పాలన

### నేటితో పాలక వర్గాల గడువు పూర్తి

### ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పురపాలక సంఘాలు, మూడు నగర పాలక సంస్థల్లో 2014 జులైలో కొలువుదీరిన పాలక వర్గాల గడువు మంగళవారంతో ముగియనుంది. సిద్దిపేట, అచ్చంపేట పురపాలక సంఘాలు, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం నగరపాలక సంస్థలు మినహా రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో బుధవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలనను ప్రారంభించేలా ఉన్నతాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్త పాలక వర్గాలు బాధ్యతలు స్వీకరించేవరకూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

**వార్డుల ముసాయిదా ప్రచురణ నేడే**

ఈ నెలాఖరకు పురపాలక ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది. పురపాలక సంఘాల వార్డులను ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఖరారు చేసిన సర్కారు తాజాగా వార్డుల పునర్విభజన ప్రక్రియను ఆదివారం ప్రారంభించింది. మంగళవారం వార్డుల పునర్విభజన ముసాయిదాను ప్రచురించనుంది. ఈ ప్రక్రియను ఎనిమిది రోజుల్లో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ...మిగతా 2లో



సోమవారం సచివాలయ భవనాల సందర్శనకు వస్తున్న కాంగ్రెస్ నేతలు వీహెచ్, సీతక్క, పొన్నం ప్రభాకర్, రేవంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, భట్టివిక్రమార్క తదితరులు

## కూల్చివేతకు ఒప్పుకోం

- సచివాలయం, అసెంబ్లీల్లో వసతులు లేవని ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోంది
- ప్రజా ఉద్యమంగా మారుస్తాం
- భవనాల సందర్శన సందర్భంగా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు

3లో

### కీళ్ల మార్పిడి బాధితులకు

## శుభవార్త!

- పిజో ఎలక్ట్రిక్ పదార్థాలతో ఉపకరణాల తయారీ
- అందుబాటులోకి వస్తే చికిత్సానంతర పరీక్షలు సులభం
- ఐఐటీ హైదరాబాద్‌లో కొనసాగుతున్న పరిశోధనలు



ఈనాడు, సంగారెడ్డి: వయసు పెరుగుతున్న కొద్దీ చాలా మందిని మోకాళ్లు, తుంటి, కీళ్ల సమస్యలు తీవ్రంగా వేధిస్తుంటాయి. ఇలాంటి వారికి వైద్యులు కృత్రిమ ఉపకరణాలు అమర్చి ఊరట కలిగిస్తున్నారు. వీటిని అల్యూమినియం, జిర్కోనియం లోహాలతో తయారు చేస్తున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా పిజో ఎలక్ట్రిక్ పదార్థాలు చక్కని పరిష్కారం చూపుతాయంటూ ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం రాకెట్లు, ఉపగ్రహాల తయారీలో ఈ పిజో విద్యుత్తు పదార్థాలను వాడుతున్నారు. వీటితో తయారుచేసిన ఉపకరణాలపై భారం, ఒత్తిడి పడినప్పుడు విద్యుత్తు ఉత్పత్తవుతుంది. ...మిగతా 2లో




Eenadu epaper

# నీటి ఎద్దడిపై యుద్ధం

- **జలశక్తి అభియాన్ ప్రారంభం**

ఈనాడు - దిల్లీ

దేశవ్యాప్తంగా జలసంరక్షణ కార్యక్రమాలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు అన్ని శాఖలను రంగంలోకి దించుతోంది. అలాగే ప్రజలందరి భాగస్వామ్యాన్నీ కోరుకుంటోంది. ప్రధాన మంత్రి ముఖ్య సాంకేతిక సలహాదారు విజయ రాఘవన్ జల సంరక్షణకు సంబంధించిన సాంకేతిక సహకారం అందిస్తారు. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని శాస్త్రసాంకేతిక శాఖలు, విభాగాలను ఒకచోటికి తెచ్చి జల సంరక్షణ కోసం ఏ సాంకేతిక పరిజ్ఞానం అత్యుత్తమంగా ఉపయోగపడుతుందో మదించి దాన్ని అమల్లోకి తీసుకొస్తారు. ప్రచారోద్యమాన్ని పర్యవేక్షించి విజయవంతం చేసే బాధ్యతలను 256 మంది కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులకు అప్పగించారు. వీరు ఒక్కొక్కరు ఒక్కో జిల్లా బాధ్యతలను పర్యవేక్షిస్తారు. వీరికి తోడు 447 మంది ఉపకార్యదర్శులు, డైరెక్టర్లు పాల్గొంటారు. కేంద్ర భూగర్భ జల మండలి, కేంద్ర జల మండలితో పాటు కేంద్ర ప్రభుత్వంలోని జలవనరులకు సంబంధించిన ఇతర విభాగాలకు చెందిన 447 మంది సాంకేతిక అధికారులు కూడా భాగస్వాములవుతారు. ప్రతి రాష్ట్రంలో అక్కడి అదనపు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు ఒక్కో బ్లాకుకు ఇద్దరు అధికారులను బాధ్యులుగా నియమిస్తారు.

## ఏం చేస్తారంటే...

- జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా నీటిసంరక్షణ ప్రణాళిక రూపొందిస్తారు. రైతులు తక్కువ నీటితో ఎక్కువ పంటలు సాగుచేసే దిశగా ప్రోత్సహించడానికి ప్రతి జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్ర మేళాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా రైతులు సంప్రదాయ సాగునీటి విధానం నుంచి బిందు, తుంపర సేద్యం వైపు మళ్లేలా ప్రోత్సహిస్తారు.
- పట్టణాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థ జలాల పునర్వినియోగంపై దృష్టి సారిస్తారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన నోడల్ అధికారులు స్థానిక సంస్థలతో సమావేశమై వ్యర్థ నీటి పునర్వినియోగానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి నిర్దిష్ట గడువులోగా అమల్లోకి తెస్తారు. ఈ నీటిని పారిశ్రామిక, వ్యవసాయ అవసరాల కోసం మళ్లిస్తారు. వంటశాలలు, మరుగుదొడ్ల నుంచి వెలువడే గ్రే, బ్లాక్‌వాటర్‌ను వేరువేరు మార్గాల ద్వారా వదిలిపెట్టే విధంగా ఇప్పుడున్న చట్టాల్లో మార్పులు తీసుకొస్తారు. ఈ రెండింటికీ ప్రత్యేక గొట్టపు మార్గాలు ఏర్పాటు చేస్తే మరుగుదొడ్డి నీటి కంటే వంట గది నుంచి వచ్చే నీటిని శుద్ధిచేయడానికి తక్కువ ఖర్చు అవుతుంది కాబట్టి అన్ని చోట్లా ఈ విధానాలను తీసుకొచ్చేలా ప్రోత్సహిస్తారు.
- పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి పట్టణంలో కనీసం ఒక జలవనరును అభివృద్ధి చేయడమో, లేదంటే ఇప్పుడున్న వాటిని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావడమో చేస్తారు. ఈ కార్యక్రమాన్ని సాంకేతికంగా విజయవంతం చేసేందుకు శాస్త్రవేత్తలు, ఐఐటీయన్లను భాగస్వాములను చేస్తారు.
- అంతిమంగా గ్రామాల్లో నీరుపారే పల్లపు ప్రాంతాలను గుర్తించేలా త్రీడీ మ్యాపులు అభివృద్ధి చేసి అక్కడ నీటి సంరక్షణ నిర్మాణాలు చేపడతారు.

ఇందులో కేంద్ర జలశక్తి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, పర్యావరణ, అటవీ, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖలు భాగస్వాములవుతాయి.

### ప్రజలందరికీ భాగస్వామ్యం

ప్రజా ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు, నెహ్రూ యువకేంద్రాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, పాఠశాల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులను ఇందులో భాగస్వాములను చేస్తారు. ఇది సాంకేతికతో ముడిపడి ఉన్నందున జిల్లా స్థాయిలో ఇంజినీరింగ్ విద్యార్థులనూ ఆహ్వానిస్తారు. కేంద్రంలోని ప్రతి శాఖ జులై 1 నుంచి సెప్టెంబరు 15లోపు ఏదో ఒక రోజును ఎంచుకొని ఆ రోజు పూర్తిస్థాయిలో జల సంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రజలంతా జలశక్తి అభియాన్‌లో పాల్గొని శ్రమదానం చేయాలని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో తాము చేసిన నీటిసంరక్షణ పనులకు సంబంధించిన ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఇతరులకు స్ఫూర్తినివ్వాలని కోరారు. దేశంలో ఏటా వర్షం రూపంలో లభ్యమయ్యే 420 శతకోటి ఘనపు మీటర్ల నీటిలోంచి 8శాతానికి మించి ఉపయోగించుకోలేకపోతున్నామన్నారు. అందుకే దీన్ని జనచేతన ఉద్యమంగా మలచి ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ గురించి చర్చించేలా, ఆలోచించేలా చేయడానికి ఈ బృహత్తర ప్రచారోద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. దేశంలో చాలా రాష్ట్రాలు ఇప్పటికే జలసంరక్షణ కార్యక్రమాలు చేపట్టాయని, అందులో నీరు-చెట్టు ఒకటని పేర్కొన్నారు. ఇవన్నీ ఆశాజనకమైన ఫలితాలు ఇచ్చినట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో 65% నిధుల్ని సహజవనరుల సంరక్షణ కోసమే ఉపయోగిస్తారని, ఈసారి అందులో అత్యధిక మొత్తం జలసంరక్షణ కోసం వినియోగించాలని తెలిపారు.

# కీళ్ల మార్పిడి బాధితులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

దాని సాయంతో సంకేతాలు వెలువడతాయి. ఈ సంకేతాల ఆధారంగా అంతరిక్షంలోని ఉపగ్రహాల్లో తలెత్తే లోపాలను ఇక్కడ భూమిపై ఉండే శాస్త్రవేత్తలు గుర్తిస్తున్నారు. ప్రస్తుతం అమర్చుతున్న పరికరాల వల్ల అయితే లోపల ఏమైనా లోపాలు తలెత్తినా, పాడైపోయినా మళ్లీ శస్త్రచికిత్స చేసి పరిశీలించాలి. పిజో విద్యుత్తు పదార్థాలతో తయారు చేసిన కృత్రిమ మోకీళ్లు.. సంప్రదాయ కృత్రిమ కీళ్ల కంటే మేలని తమ పరిశోధనల్లో గుర్తించామంటూ ఐఐటీ భౌతికశాస్త్ర(ఫిజిక్స్) విభాగంలో పనిచేస్తున్న ఆచార్యుడు డాక్టర్ సాకేత్ ఆస్థానా వివరిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఐఐటీ వర్గాలు ఒక ప్రకటనను విడుదల చేశాయి. పిజో ఎలక్ట్రిక్ పదార్థాలు కణాల పరిమాణాన్ని తగ్గించడం వల్ల వాటి మెకానికల్ లక్షణాలను గణనీయంగా మెరుగుపరచవచ్చని నిరూపించారు. ఇవి శరీరంలో త్వరగా కలిసిపోతాయని, అలాంటి ఉపకరణాల తయారీకి అత్యంత అనువైనవని సాకేత్ వివరిస్తున్నారు. తక్కువ ఖర్చుతోనే వీటిని అందుబాటులోకి తెచ్చే వీలుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ పరిశోధనలు ప్రాథమిక దశలో ఉన్నాయి. వీటిపై మరింత విస్తృతంగా పనిచేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఈ పదార్థాలను ఉపయోగించి ఉపకరణాలను తయారు చేసేందుకు తమ పరిశోధన వీలు కల్పిస్తుందన్నారు.



ఐఐటీ ఆచార్యుడు డాక్టర్ సాకేత్ ఆస్థానాతో పాటు ఈ పరిశోధనలో పాలుపంచుకున్న విద్యార్థి కృష్ణార్జున్ బెనర్జీ

# ఇక మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన

(మొదటి పేజీ తరువాయి)

పురపాలక శాఖ నిర్దేశించుకుంది. అభ్యంతరాల పరిశీలన అనంతరం ఈ నెల 7వ తేదీన వార్డుల తుది రూపును ప్రకటించనుంది. ఈ ప్రక్రియను కొనసాగిస్తూనే లోక్‌సభ ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ఆ శాఖ కొనసాగిస్తోంది. ఈ రెండూ పూర్తయిన తర్వాత రిజర్వేషన్లు ఖరారైతే, పురపాలక ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయినట్లేనని అధికారులు పేర్కొంటున్నారు. వీలున్నంత వరకు ఈ నెలాఖరుకు ఎన్నికలు నిర్వహించేలా కసరత్తు ముమ్మరం చేసినట్టు చెబుతున్నారు.

# శతమర్కటం.. వృక్ష నాశనం

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య పంటలవైపు దృష్టిసారిస్తున్నారు. వర్షాకాలం కావడంతో హరితహారం కింద పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం.. ఈ అంశంపై దృష్టిసారించాలని నిపుణులు సూచిస్తున్నారు. వానరాల నుంచి గ్రామాలకు విముక్తి లభించాలంటే వన్యప్రాణి సంరక్షణ పంట పరిహార పథకం అమలు చేయాలని చెబుతున్నారు.

రాష్ట్రంలోని గ్రామాల్లో జీవ వైవిధ్య వనరుల గురించి తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి అధ్యయనం చేస్తోంది. ఒక్కో బృందానికి కొన్ని గ్రామాలను అప్పగించి సమగ్ర వివరాలతో పుస్తకాలను సిద్ధం చేస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ సైఫాబాద్ పీజీ కళాశాల వృక్షశాస్త్ర సహాయ ఆచార్యుడు మునగాల వెంకటరమణ బృందానికి ఖమ్మం జిల్లాలోని కొన్ని గ్రామాల అధ్యయన బాధ్యతలు అప్పగించారు. ఇందులోభాగంగా కామేపల్లి మండలం కొత్త లింగాల, కొనజర్ల మండలం పెద్ద మునగాల గ్రామాల్లో అడుగుపెట్టగానే ప్రతి ఇంటి ముందు ఉన్న చెట్లు నరికేసి ఉండటం చూసి వారు గ్రామస్థులను విచారించారు. ఒక్కో గ్రామంలో దాదాపు 3 వేల కోతులు సంచరిస్తున్నాయని అక్కడివారు చెప్పినప్పుడు ఆశ్చర్యపోయినా.. నరికేసిన చెట్లను చూడగానే కోతుల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకున్నారు. రాష్ట్రంలో కోతుల బెడద ఉన్న చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది.

### ఆహార కొరత..

- కోతుల సమస్యతో వేప, మామిడి, చింత వృక్షాలను నరికేస్తున్న గ్రామస్థులు
- ఇంటి ఆవరణలో, పెరటిలో కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను పెంచుకోలేని పరిస్థితులు
- పొలాల్లోనూ కూరగాయలను సాగు చేయడం నిలిపేసిన రైతులు
- కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ సాగు మానేసి వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపుతున్నారు
- జొన్న, మొక్కజొన్న బదులుగా మిర్చిని ఎక్కువగా సాగుచేస్తున్నారు
- వరి, పప్పుదినుసులు, కూరగాయలు పండే భూముల్లో కోతుల సమస్యతో టేకు, సుబాబుల్, జామ్ ఆయిల్, మలబార్ వేప లాంటి కలప మొక్కలను పెంచుతున్నారు.
- పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో ఆహార పంటల ఉత్పత్తులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

### ఇతర సమస్యలు..

- గ్రామ పొలిమేరలో, గ్రామంలోని వృక్షాలపైన ఉండే పక్షుల గూళ్లను, గుడ్లను కోతులు నాశనం చేస్తున్నాయి. దీంతో పక్షులు కనపడకుండా పోతున్నాయి.
- మనుషులు చనిపోతే కోతుల భయంతో కనీసం కాకులు కూడా రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.
- పెంకుటిళ్లు, రేకుల ఇళ్లను వానరాలు ధ్వంసం చేస్తున్నాయి.
- కోతులు కరవడంతో వివిధ రకాల వైరల్ వ్యాధుల బారిన పడుతున్న గ్రామస్థులు.
- గ్రామాల్లో కోతుల నియంత్రణకు అటవీ అధికారులు కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ సమస్య తీవ్రత మాత్రం తగ్గడం లేదు. కొన్నింటిని అడవుల్లో వదిలిపెట్టినా.. అక్కడ ఆహారం లేకపోవడంతో తిరిగి గ్రామాల్లోకి వస్తున్నాయి.

## పోడు భూముల్లో పండ్ల మొక్కలను ప్రోత్సహించాలి



**- డాక్టర్ ఎం.వెంకటరమణ, సహాయ ఆచార్యులు, వృక్షశాస్త్ర విభాగం, సైఫాబాద్ పీజీ కళాశాల**

అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండే వారికి వన్యప్రాణి సంరక్షణ పంట పరిహార పథకం వర్తింపజేయాలి. అక్కడి పోడు, వ్యవసాయ భూముల్లో పండ్ల తోటలు, జొన్న, మొక్కజొన్న, కందులు, మినుములు, పెసళ్లు, వేరుశనగ, చెరకు సాగు చేసి.. ఆ పంటలను వారు తీసుకోకుండా కోతులు, అడవిపందులకు వదిలిపెడ్తారో వారికి వార్షిక ఆదాయం కింద ఈ పథకాన్ని వర్తింపజేయాలి. పోడు భూముల్లో పండ్ల మొక్కలైన మామిడి, జామ, సంత్ర, పనస, నేరేడు, అల్లనేరేడు పెంచి వాటిని సంరక్షించేలా గిరిజనులను, అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండే గ్రామ రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇలా చేయడం ద్వారా పోడు భూముల సమస్య పరిష్కారంతోపాటు గిరిజనులకు లబ్ధి చేకూరుతుంది. వన్యప్రాణులు గ్రామాలకు రాకుండా ఉంటాయి.

## హాంకాంగ్ పార్లమెంటులో విధ్వంసం

హాంకాంగ్: దాదాపు మూడు వారాలుగా ఆందోళనలతో అట్టుడుకుతున్న హాంకాంగ్‌లో సోమవారం హింస చెలరేగింది. అనుమానిత నేరగాళ్లను చైనాకు అప్పగించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లును వ్యతిరేకిస్తూ నిరసనకారులు ముసుగులు వేసుకొని, హెల్మెట్లు ధరించి పార్లమెంటులోకి దూసుకెళ్లారు. నేతల చిత్రపటాలను చింపేశారు. గోడలపై రంగులు పూశారు. పోలీసులతో ఘర్షణ పడ్డారు. దీంతో నిరసనకారులపై పోలీసులు బాష్పవాయుగోళాలను ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. అతికష్టమ్మీద ఆందోళనకారులను పార్లమెంటు నుంచి బయటకు పంపించగలిగారు. బ్రిటిష్ పాలన ముగిసి, హాంకాంగ్‌ను తిరిగి చైనాకు అప్పగించి 22 ఏళ్లయిన రోజే తాజా విధ్వంసం చోటుచేసుకుంది.

# ఇంజినీరింగ్ సీట్లు 94 వేలు!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బీటెక్ సీట్ల సంఖ్య కొలిక్కి వస్తోంది. మొత్తం 94 వేల వరకు ఉండనున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలికి సోమవారం వరకు అందిన సమాచారం ప్రకారం 183 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 91,988 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లోని మొత్తం సీట్లలో 70 శాతం సీట్లను మాత్రమే కన్వీనర్ కోటా కింద కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం అన్నింటినీ కౌన్సెలింగ్ ద్వారానే కేటాయిస్తారు. అయితే ఇప్పటివరకు బీటెక్ కృత్రిమ మేధ, సీఎస్ ఐటీ లాంటి కోర్సులకు, సీట్ల పెంపునకు అనుమతి ఇవ్వని విద్యాశాఖ చివరి నిమిషంలో సోమవారం పచ్చజెండా ఊపింది. దాంతో ఒక్క జేఎన్‌టీయూహెచ్ పరిధిలోనే 1320 సీట్లు పెరుగుతాయి. ఇక ఓయూ పరిధిలోని కళాశాలల్లో పెరిగే వాటిని కలుపుకుంటే మొత్తం 1500 ఉండొచ్చని అంచనా. రెండో విడత కౌన్సెలింగ్ నాటికి ఇంకా సీట్ల సంఖ్య పెరగవచ్చని చెబుతున్నారు. కన్వీనర్ కోటా సీట్లకు ఈనెల 5వ తేదీ నుంచి ఆప్షన్లు ఇచ్చుకునే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా 62,213 సీట్లను విద్యార్థులకు కేటాయిస్తారు.

**జులై 1 నాటికి వర్సిటీల వారీగా కళాశాలలు...సీట్లు**

| విశ్వవిద్యాలయం | కళాశాలల సంఖ్య | మొత్తం సీట్లు |
|---|---|---|
| జేఎన్‌టీయూహెచ్ | 157 | 81,009 |
| ఓయూ | 15 | 8180 |
| కాకతీయ | 8 | 2565 |
| మహాత్మాగాంధీ | 1 | 180 |
| జయశంకర్ | 2 | 54 |
| మొత్తం | 183 | 91,988 |

(★ ఇందులో 14 ప్రభుత్వ కళాశాలలు ఉండగా వాటిల్లో 3109 సీట్లున్నాయి)

# ఫీజులుంపై సుప్రీం కొరడా

(మొదటి పేజీ తరువాయి)

ఆ కమిటీ 2016-17, 2017-18, 2018-19 విద్యా సంవత్సరాలకు 2016 జులైలో రుసుములను ఖరారు చేసింది. అయితే అవి తమకు సమ్మతం కాదని, వాటిని పెంచాలని శ్రీనిధి, వాసవి, సీబీఐటీ, ఎంజీఐటీ కళాశాలలు 2016లో హైకోర్టును ఆశ్రయించాయి. వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం కళాశాలలు ప్రతిపాదించుకున్న రుసుములను వసూలు చేసుకోవచ్చని.. అయితే అది కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటుందని 2018లో తీర్పునిచ్చింది. ఆ కళాశాలల్లో భారీగా రుసుములు చెల్లించాల్సి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. శ్రీనిధి, వాసవి కళాశాలల్లో పేరెంట్స్ అసోసియేషన్లు ఏర్పడ్డాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చొరవ తీసుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం, పేరెంట్స్ అసోసియేషన్ రుసుములపై సుప్రీం కోర్టును ఆశ్రయించాయి.

### సుప్రీం ఏం చెప్పింది?

ఈ పిటిషన్లపై సుదీర్ఘంగా విచారించిన జస్టిస్ అరుణ్ మిశ్ర నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఏప్రిల్ 10న తీర్పు రిజర్వులో ఉంచగా.. సోమవారం సుప్రీం జస్టిస్ నవీన్ సిన్హా తీర్పును వెలువరించారు. ''రుసుముల విషయంలో నియంత్రణ కమిటీ సిఫార్సుల్లో హైకోర్టు జోక్యం చేసుకుంది. నిర్ణయం తీసుకొనే అంశంపైనే సమీక్ష ఉంటుంది కానీ తీసుకొన్న నిర్ణయంలో మెరిట్‌పైన కాదు. న్యాయ సమీక్ష పేరుతో రుసుముల నియంత్రణ కమిటీ పరిధిలోకి వెళ్లి కోర్టులు నిర్ణయం తీసుకోకూడదు. నిపుణుల కమిటీ సిఫార్సుల్లో జోక్యం చేసుకోకూడదు'' అని స్పష్టం చేశారు.

పేరెంట్స్ అసోసియేషన్ తరఫున న్యాయవాది శ్రావణ్‌కుమార్, ప్రభుత్వం తరఫున న్యాయవాది వెంకటరెడ్డి, వాసవి కళాశాల తరఫున సీనియర్ న్యాయవాది ఫాలీ నారీమన్ వాదనలు వినిపించారు. నియంత్రణ కమిటీ కాలపరిమితి ముగిసిందని.. ఆ కమిటీ నిర్ణయించిన రుసుముల వల్ల సంస్థ నష్టపోతుందని నారీమన్ కోర్టుకు తెలిపారు. అయితే హైకోర్టు నిర్ణయించిన రుసుములు ప్రతిబంధకంగా మారాయని పేరెంట్స్ అసోసియేషన్ న్యాయవాది శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రవేశాల రుసుముల నిర్ణయాధికారంలో హైకోర్టు జోక్యం తగదని, నియంత్రణ కమిటీదే తుది నిర్ణయమని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది వెంకటరెడ్డి వాదించారు. పేరెంట్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రభుత్వం వాదనలు అంగీకరించిన సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పును పక్కన పెడుతూ ఆదేశాలిచ్చింది.

### ఇక అడ్డుకట్ట పడినట్లేనా!

తాజా తీర్పుతో రుసుములను నియంత్రించడంలో టీఎఫ్ఆర్సీ మరింత కఠినంగా వ్యవహరించనుంది. టీఎఫ్ఆర్సీ నిర్ణయించిన రుసుములను అంగీకరించని యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ వచ్చాయి. ఇక నుంచి అలా చేసేందుకు కళాశాలలు వెనకడుగు వేస్తాయని చెబుతున్నారు. దాంతో ప్రతి మూడేళ్లకు భారీగా రుసుములను పెంచుకునేందుకు కళాశాలలకు అవకాశం ఉండకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### సుప్రీం ఉత్తర్వులను అమలు చేయాలి

ఇంజినీరింగ్ ఫీజుల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని పేరెంట్స్ కమిటీ సోమవారం ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డిని కలిసి విన్నవించింది. న్యాయస్థానం తీర్పును సంపూర్ణంగా అమలు చేయాలని కమిటీ ప్రతినిధులు డా. వంగూరి మద్దులేటి, ఎన్.నారాయణ, శ్రీనాథ్, సురేష్ తదితరులు ఆయనకు విజ్ఞప్తి చేశారు.

**ఇదీ ప్రస్తుత రుసుముల పరిస్థితి**

| కళాశాల | టీఏఎఫ్ఆర్సీ ఫీజు | హైకోర్టు తీర్పు అనంతరం ఇలా.. (రూ. లక్షలు) | వచ్చే మూడేళ్లకు కాలేజీలు ఇచ్చిన ప్రతిపాదనలు (రూ. లక్షలు) |
|---|---|---|---|
| వాసవి | రూ. 97,000 | 1.60 | 1.90 |
| శ్రీనిధి | రూ. 97,000 | 1.37 | 1.76 |
| సీబీఐటీ | రూ. 1,13,500 | 2 | 3.19 |
| ఎంజీఐటీ | రూ. లక్ష | 1.60 | 2.30 |

(★ కళాశాలలు ఎంత ప్రతిపాదించుకున్నా టీఏఎఫ్ఆర్సీ మాత్రం గత ఫీజులకు అదనంగా 15 శాతంలోపు మాత్రమే పెంచుతోంది.)

### మాకు కూడా స్పష్టత వచ్చింది

'టీఏఎఫ్ఆర్సీ మాత్రమే రుసుములను నిర్ణయిస్తుందని. . తుది నిర్ణయం ఆ కమిటీదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో మాకు స్పష్టత వచ్చింది. వేలమంది విద్యార్థులకు ఊరట కలిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది'

**- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, కమిటీ సభ్యుడు తుమ్మల పాపిరెడ్డి**

### అన్ని వృత్తివిద్యా కళాశాలలకూ ఇదే తీర్పు

ఇప్పటివరకు న్యాయస్థానాలకు వెళ్లి ఎన్నో న్యాయ విద్య కళాశాలలు కూడా రుసుములను రెట్టింపు వసూలు చేశాయి.. వాటిపై కూడా దృష్టి సారిస్తాం. కేవలం ఇంజినీరింగ్ కళాశాలలకే కాదు.. అన్ని వృత్తి విద్యా కళాశాలలకు ఈ తీర్పు వర్తిస్తుంది.

- ఓ ఉన్నతాధికారి



## అది స్వాతంత్ర్యం కాదు!

దేశంలో భాగమైన ప్రతి ప్రాంతమూ తనకు తానుగా స్వయం నిర్ణయాధికార హక్కును ప్రకటించుకుంటూ పోతుంటే ఇక ఒక దేశం, ఒక జాతి అన్నదేదీ ఉండదు, స్వాతంత్ర్యమన్న భావనకు అర్థమూ ఉండదు!

- మహాత్మా గాంధీ

## గ్రహం అనుగ్రహం

**2-7-2019 మంగళవారం**

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
**అమావాస్య:** రా. 1.03 తదుపరి ఆషాఢ శుద్ధ పాడ్యమి
**మృగశిర నక్షత్రం:** ఉ. 8.33 తదుపరి ఆర్ద్ర
**అమృత ఘడియలు:** రా. 10.08 నుంచి 11.41 వరకు
**వర్జ్యం:** సా. 4.42 నుంచి 6.15 వరకు
**దుర్ముహూర్తం:** ఉ. 8.09 నుంచి 9.01 వరకు
తిరిగి రా. 10.57 నుంచి 11.41 వరకు
**రాహుకాలం:** మ. 3.00 నుంచి 4.30 వరకు
**సూర్యోదయం:** ఉ.5-32; **సూర్యాస్తమయం:** సా.6.33

# 15 శాతం వరకే ఫీజుల పెంపు!

- **ఇంజినీరింగ్ రుసుముల ఖరారుపై నియంత్రణ కమిటీ విచారణ**

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలల రుసుములను నిర్ణయించడానికి తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కసరత్తు మొదలు పెట్టింది. ఎంసెట్ ఆప్షన్ల ప్రక్రియ ఈనెల 5 నుంచి ప్రారంభమవుతుందని ఎంసెట్ ప్రవేశాల కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో టీఏఎఫ్ఆర్సీ ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. తాము ప్రతిపాదించిన రుసుములను ఖరారు చేయాలని హైకోర్టుకు వెళ్లిన 81 కళాశాలలకు వచ్చే మూడేళ్లకు శాశ్వత రుసుములను ఖరారు చేసేందుకు కమిటీ విచారణ సాగిస్తోంది. సోమవారం 20 కళాశాలల యజమానులను పిలిచి తాము నిర్ణయించిన రుసుముల గురించి వివరించింది. అనురాగ్ విద్యాసంస్థల ఛైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైతం కమిటీ ఎదుట హాజరయ్యారు. కమిటీ నిర్ణయించిన రుసుములకు అంగీకరించి సంతకాలు చేసినట్లు తెలిసింది. ఏ కళాశాలకైనా పెరుగుదల 15 శాతంలోపే ఖరారు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వసూలు చేస్తున్న రుసుం రూ.50 వేలు ఉంటే దానిపై 20 శాతం, రూ.50 రుసుం దాటితే దానిపై 15 శాతాన్ని తాత్కాలికంగా పెంచుతామని జూన్ 29న టీఏఎఫ్ఆర్సీ ప్రతిపాదించి ఆమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. గతంలో టీఏఎఫ్ఆర్సీ ఖరారు చేసిన ఫీజుపై అభ్యంతరాలుంటే కళాశాలలు అప్పీల్ చేసుకోడానికి రూ.10 వేల రుసుం ఉండేది. ఈసారి ఆ రుసుమును రూ.లక్షకు పెంచింది. సుప్రీం తాజా తీర్పుతో చాలావరకు కళాశాలలు కమిటీ ప్రతిపాదించిన రుసుములకు అంగీకరిస్తున్నట్లు తెలుస్తోంది.

# బాబ్లీ గేట్ల ఎత్తివేత

- **చుక్క నీరు లేక వెలవెలబోయిన ప్రాజెక్టు**

రెంజల్, బాసర, న్యూస్‌టుడే: గోదావరి నదిపై మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను కేంద్ర జలవనరుల సంఘం అధికారి వి. గంగాధర్ నేతృత్వంలో సోమవారం ఎత్తారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుంచి ఎస్సారెస్పీ ఈఈ రామారావు, ధవళేశ్వరం ఈఈ నారాయణరెడ్డి, మహారాష్ట్ర నుంచి నాందేడ్ జిల్లా ఈఈ గావానే పాల్గొన్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తినా దిగువకు చుక్క నీరు రాలేదు. 2.74 టీఎంసీల సామర్థ్యం ఉన్న బాబ్లీ పూర్తిగా అడుగంటిపోయి ఇసుక దిబ్బలతో ఎడారిగా మారింది. 2012లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల ఒకటి నుంచి అక్టోబరు 28 వరకు 120 రోజుల పాటు బాబ్లీ గేట్లు తెరిచి ఉంటాయని ఎస్సారెస్పీ ఈఈ రామారావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఎగువన మహారాష్ట్రలో వానలు కురిస్తేనే దిగువకు నీటి ప్రవాహం వచ్చే అవకాశాలు ఉన్నాయనిఆయన పేర్కొన్నారు.

### ఆరేళ్లలో తొలిసారి

ఏటా జులై ఒకటిన బాబ్లీ గేట్లు పైకి ఎత్తుతారు. దీంతో ఆ ప్రాజెక్టులోని నీరు దిగువకు ప్రవహించేది. కందకుర్తి వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తూ దిగువన ఉన్న శ్రీరాంసాగర్‌కుచేరుకునేది. బాబ్లీ ప్రాజెక్టు ద్వారా జులైలో దిగువకు నీరు రాకపోవడం ఆరేళ్లలో ఇదే తొలిసారి. గత ఏడాది మహారాష్ట్రలో బాబ్లీ, విష్ణుపురి ప్రాజెక్టుల ఎగువ భాగాన జూన్‌లో కురిసిన వర్షాలతో 11, 12 తేదీల్లో నాలుగు టీఎంసీల నీటిని ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు వదిలారు. దీంతో ఆ నీరు శ్రీరాంసాగర్‌కు చేరుకుంది. ఆ తర్వాత జులై ఒకటిన బాబ్లీ గేట్లు తెరిచే సమయానికి నిల్వ ఉన్న మరో 0.6 టీఎంసీ నీరు సైతం శ్రీరాంసాగర్‌కు చేరింది.

# నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణాధికారి రాజారావు తెలిపారు. బంగాళాఖాతంలో ఒడిశా తీరం వద్ద ఏర్పడిన అల్పపీడనం మంగళవారం వాయుగుండంగా మారే అవకాశముంది. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం కూడా ఉంది. సోమవారం రాష్ట్రంలో 353 ప్రాంతాల్లో ఒక మాదిరి వర్షాలు కురిశాయి. అత్యధికంగా గన్నవరం(నిజామాబాద్ జిల్లా)లో 40.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| నెల్లూరు | 39.0 | 29.0 |
| తిరుపతి | 38.3 | 29.3 |
| కడప | 37.0 | 27.0 |
| నల్గొండ | 37.0 | 23.6 |
| ఖమ్మం | 36.0 | 28.0 |
| సూర్యాపేట | 36.0 | 26.0 |
| కర్నూలు | 33.7 | 24.5 |
| విశాఖపట్నం | 33.6 | 27.2 |
| గుంటూరు | 32.9 | 27.2 |
| విజయవాడ | 31.9 | 26.4 |
| రామగుండం | 31.0 | 24.1 |
| మహబూబ్‌నగర్ | 31.0 | 24.1 |
| హన్మకొండ | 30.1 | 24.5 |
| కరీంనగర్ | 30.0 | 24.0 |
| నిజామాబాద్ | 29.9 | 24.3 |
| హైదరాబాద్ | 29.5 | 23.8 |
| ఆదిలాబాద్ | 28.5 | 23.5 |

SI & కానిస్టేబుల్స్
వర్రె సుధాకర్ సార్ ఆధ్వర్యంలో
LONG TERM BATCHES : 4-7-2019
Separate Batches for TM / EM
త్వరలో 15000 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
యూనిక్ స్టడీ సర్కిల్ DILSUKHNAGAR, HYD 9492459622 9059949607

# గోదారిపై కసరత్తు

## జలాల మళ్లింపుపై లోతైన అధ్యయనం ● రేపు తెలుగు రాష్ట్రాల ఇంజినీర్ల సమావేశం

ఈనాడు - హైదరాబాద్

గోదావరి వరద నీటిని కంతనపల్లి నుంచి శ్రీశైలానికి, పోలవరం నుంచి నదీగర్భం ద్వారా నాగార్జునసాగర్-శ్రీశైలానికి మళ్లించే ప్రతిపాదనలపై రెండు రాష్ట్రాల ఇంజినీర్లు మరింత లోతైన అధ్యయనం చేయనున్నారు. ప్రాథమికంగా సేకరించిన సమాచారంపై చర్చించేందుకు ఈ నెల 3వతేదీన హైదరాబాద్‌లో సమావేశం కానున్నారు. గోదావరి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు నీటిని మళ్లించడానికి 15 రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జూన్ 27న జరిగిన సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఇరురాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ నేతృత్వంలో అంతర్ రాష్ట్ర జలవనరుల విభాగం, హైడ్రాలజీ, విశ్రాంత ఇంజినీర్లతో కూడిన కమిటీ, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నేతృత్వంలో హైడ్రాలజీ విభాగం, ఇంజినీర్లతో కూడిన కమిటీలు పలు ప్రత్యామ్నాయాలపై ప్రాథమికంగా అధ్యయనం చేస్తున్నాయి.

### కంతనపల్లి వయా కొల్లాపూర్

గోదావరి వరద నీటిని కంతనపల్లి నుంచి చిట్యాల, మునుగోడు, నాగర్‌కర్నూల్ మీదుగా కొల్లాపూర్ వ్యాలీ ద్వారా శ్రీశైలంలోకి మళ్లించాల్సి ఉంటుందని ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి. నీటి ప్రవాహమార్గం సుమారు 350 కి.మీ. వరకు ఉంటుందని, మధ్యలో సొరంగమార్గం, లిఫ్టు నిర్మించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. నీటి తరలింపునకు కాలువ మార్గానికే 25 వేల నుంచి 30 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుందని, ఇందుకు ఆరేడు వేల కోట్ల రూపాయలు అవసరమని అంచనా. అటవీ అనుమతి, భారీ వ్యయం అవుతుందని, వీటన్నింటికీ మించి కాలువ ద్వారా నీరు వెళ్తున్నప్పుడు మధ్యలో మోటార్లు పెట్టి తోడుకొనే అవకాశం ఉందని, ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఇంజినీరింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

### పోలవరం నుంచి మళ్లిస్తే ఖర్చు తక్కువ

పోలవరం నుంచి నీటిని మళ్లిస్తే తక్కువ ఖర్చుతో పూర్తవుతుందని, నదీగర్భం ద్వారానే నీటిని మళ్లించవచ్చు కాబట్టి భూసేకరణ సమస్య కూడా తక్కువ ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. పోలవరం కుడి కాలువను అవకాశం ఉన్నంతమేరకు వినియోగించుకోవడం, లేనిచోట సమాంతరంగా ఇంకో కాలువ తవ్వి వైకుంఠాపురం రిజర్వాయర్‌కు నీరు చేర్చేలా ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. ఈ రిజర్వాయర్ నుంచి 20 మీటర్ల లిఫ్టుతో కృష్ణానది ద్వారానే పులిచింతలకు, 25 మీటర్ల లిఫ్టుతో నాగార్జునసాగర్ టేల్‌పాండ్‌కు నీటిని మళ్లించవచ్చు. రివర్సిబుల్ టర్బైన్స్‌ను వినియోగించుకొని టేల్‌పాండ్ ద్వారా నాగార్జునసాగర్‌కు, శ్రీశైలంకు మళ్లించడానికి వీలవుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే రోజూ 4 టీఎంసీలు మళ్లించాలంటే వ్యయం భారీగానే ఉంటుంది. దుమ్ముగూడెం -టేల్‌పాండ్ ద్వారా 165 టీఎంసీల నీటిని మళ్లించడానికి 2008లోనే రూ.20 వేల కోట్లు వ్యయమవుతుందని అంచనా. ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.30 వేల కోట్లకు పైగా అవుతుంది. 400 టీఎంసీలు అంటే దీనికి రెట్టింపు కంటే ఎక్కువవుతుంది. ఇలాంటి అన్ని అంశాలపైన 3వ తేదీన జరిగే సమావేశంలో ఉభయ రాష్ట్రాల ఇంజినీర్లు చర్చించి ఓ అభిప్రాయానికి రానున్నారు.

### దుమ్ముగూడెం సానుకూలమేనా?

దుమ్ముగూడెం నుంచి నాగార్జునసాగర్ టేల్‌పాండ్‌కు నీటిని మళ్లించే పథకంపైన కూడా చర్చించినా దీనిపై ఇంజినీర్లు అంత సానుకూలత వ్యక్తం చేయడం లేదు. ఈ పథకం గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన అవసరం లేదు. అయితే దుమ్ముగూడెం వద్ద సీతారామ ఎత్తిపోతల ఉంది. దీనిద్వారా ఖమ్మం జిల్లాతో పాటు నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద కూడా కొంత ఆయకట్టుకు నీరందుతుంది. ఈ నేపథ్యంలో ఓపథకం పక్కనే ఇంకో పథకం చేపట్టడం సరికాదని ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది. ఈ పథకానికి కూడా ఎక్కువ భూమిని సేకరించాల్సి ఉంటుందని భావిస్తున్నారు. వీటన్నింటి దృష్ట్యా కంతనపల్లి నుంచే మేలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## పెరుగుతున్న వరద

కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో గోదావరికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో తెలంగాణలోని ములుగు జిల్లా తుపాకులగూడెంలో గోదావరి నదిపై జరుగుతున్న పీవీ నరసింహారావు సుజల స్రవంతి వారధి పనులు నిలిచిపోయాయి. నదీ ప్రవాహానికి అడ్డుగా నిర్మించిన మూడు కాఫర్ డ్యాంలు తెగిపోయి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని వరద నీరు ముంచెత్తింది. ప్రస్తుతం ఇక్కడ 4 నుంచి 9 పియర్స్ వరకు పనులు జరుగుతున్నాయి. గత ఏడాది దాదాపు ఇదే సమయంలో వరద పోటెత్తడంతో పనులు నాలుగు నెలలపాటు నిలిచిపోయాయి. గుట్టలగంగారంలో ఉన్న దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటి లభ్యత పెరిగింది. ప్రాజెక్టులోని ఇన్‌టేక్‌వెల్ మోటార్ల మరమ్మతులు పూర్తవ్వకపోవడంతో అవి పూర్తి స్థాయిలో నడవడం లేదు. ప్రస్తుతం ఒక మోటారు ద్వారా మాత్రమే నీటిని పంపింగ్ చేస్తున్నారు. గోదావరి వరద పెరుగుతుండటంతో పూర్తి స్థాయిలో నీటిని పంపింగ్ చేసేలా ఇంజినీర్లు యంత్రాలను, సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు.



తుపాకులగూడెం వద్ద తెగిపోయిన కాఫర్‌డ్యాం

## పోలవరంపై సుప్రీంలో కౌంటరు దాఖలుకు ఏపీకి గడువు

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమ రాష్ట్రంలో ముంపు ప్రభావం ఉంటుందని, నిర్మాణం ఆపాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఒరిజనల్ సూట్(ఓఎస్)పై కౌంటరు దాఖలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గడువు ఇచ్చింది. తెలంగాణ దాఖలు చేసిన ఓఎస్‌ను సోమవారం జస్టిస్ అజయ్ రస్తోగి ఛాంబర్‌లో విచారించారు. కౌంటరు దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని ఏపీ అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ జి.నాగేశ్వర్‌రెడ్డి న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. ఎక్కువ సమయం ఇవ్వడం కుదరదని పేర్కొన్న న్యాయమూర్తి నాలుగు వారాల గడువు ఇచ్చారు. పోలవరానికి సంబంధించి సుప్రీంకోర్టులోని వేరే ధర్మాసనం వద్ద ఇతర రాష్ట్రాలు వేసిన ఒరిజనల్ సూట్‌లపై విచారణ పెండింగ్‌లో ఉందని, ఈ ఓఎస్‌నూ వాటితో జత చేయాలన్న తెలంగాణ తరపు న్యాయవాది కృష్ణమూర్తి స్వామి విజ్ఞప్తిని న్యాయమూర్తి అంగీకరించారు.

## కృష్ణా ట్రైబ్యునల్‌లో క్రాస్ ఎగ్జామినేషన్ వాయిదా

ఈనాడు, దిల్లీ: కృష్ణా ట్రైబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ క్రాస్ ఎగ్జామినేషన్ వాయిదా పడింది. జస్టిస్ బ్రిజేష్‌కుమార్, జస్టిస్ బీపీ దాస్, జస్టిస్ రామ్మోహన్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ముందు సోమవారం తెలంగాణ నీటిపారుదల సాక్షి ఘూను ఏపీ న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేయాల్సి ఉంది. తెలంగాణ వ్యవసాయ నిపుణుడు పళనిస్వామి క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తవకుండానే ఘూ క్రాస్ ఎగ్జామినేషన్‌కు వచ్చారని, ఈ క్రమంలో నీటిపారుదల అంశంపై కొంత సన్నద్ధం కావాలని ఏపీ అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ జి.నాగేశ్వరరెడ్డి వాయిదా కోరారు. వ్యక్తిగత కారణాలపై పళనిస్వామి గత క్రాస్ ఎగ్జామినేషన్ మధ్యలోనే సెలవుపై వెళ్లారని, ఘూను క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలన్న తెలంగాణ విజ్ఞప్తిని ధర్మాసనం అంగీకరించింది. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్, న్యాయవాదులు కొత్తవారు వచ్చారని.. నీటిపారుదల అంశంపై సన్నద్ధమవడానికి సమయం కావాలన్న ఏపీ విజ్ఞప్తిని ధర్మాసనం అంగీకరించింది. తదుపరి క్రాస్ ఎగ్జామినేషన్‌ను జులై 29, 30, 31లకు వాయిదా వేసింది.

## తెలుగు రాష్ట్రాలకు వేర్వేరు గవర్నర్లు!

### పార్లమెంటు సమావేశాల తర్వాత నియమించే అవకాశం

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాలకు వేర్వేరు గవర్నర్లు వచ్చే అవకాశం ఉన్నట్లు హోంశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్లమెంటు సమావేశాల తర్వాత రెండు రాష్ట్రాలకు ఇద్దరు గవర్నర్ల నియామకం జరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. విజయవాడలో ఇదివరకు ముఖ్యమంత్రి ఆఫీసుగా ఉన్న కార్యాలయాన్ని గవర్నర్ కార్యాలయంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నందున అందులో గవర్నర్ కొలువుతీరే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. విభజన చట్టం ప్రకారం పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నందున ఇన్నాళ్లు ఒకే గవర్నర్‌ను కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రస్తుత గవర్నర్ నరసింహన్ 2009 నుంచి కొనసాగుతూ వస్తున్నారు. కాగా రెండు రాష్ట్రాలు పూర్తిగా వాటి భూభాగాల నుంచి పరిపాలన సాగిస్తుండటం, హైకోర్టు కూడా వేరుపడిన నేపథ్యంలో గవర్నర్లను వేరుగా నియమిస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి కేంద్రం వచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుత గవర్నర్ పదేళ్లకు పైగా కొనసాగుతున్నారని, ఇంకా కొనసాగించడం బాగుండదన్న ఉద్దేశంతో హోంశాఖ ఉన్నట్లు చెబుతున్నారు. ఆయన్ను ఇక్కడి నుంచి బదిలీ చేయడమో, జమ్ముకశ్మీర్ వ్యవహారాల సలహాదారుగా ఉపయోగించుకోవడమో జరగొచ్చని హోంశాఖ వర్గాలు వ్యాఖ్యానించాయి. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి కొలువుదీరిన వెంటనే ప్రస్తుత గవర్నర్ మార్పునకు ప్రయత్నిస్తామని భాజపా తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించారు. ఆ పార్టీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నేతలు రెండు రాష్ట్రాలకు వేర్వేరు గవర్నర్లను నియమించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. అందులో భాగంగానే కొత్త గవర్నర్ల నియామకం జరగొచ్చని హోంశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

## కాంగ్రెస్ నేతలది విహారయాత్ర

### సచివాలయం, శాసనసభ సందర్శనపై మంత్రి తలసాని ధ్వజం



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సచివాలయం, శాసనసభ భవన నిర్మాణాలపై కాంగ్రెస్ నేతలు మసిబూసి మారేడు కాయ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధ్వజమెత్తారు. మీడియాలో ఉచిత ప్రచారం కోసం ప్రయత్నిస్తున్నారని, విహారయాత్రకు వచ్చినట్లుగా సచివాలయం, శాసనసభకు వచ్చి నాటకాలు ఆడారన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతలకు అభివృద్ధి గురించి పట్టింపు లేదు. ప్రాజెక్టులు, భవనాలను నిర్మించలేదు. ఉద్యోగ నియామకాలు జరపలేదు. సంక్షేమ పథకాలను చేపట్టలేదు. తెరాస ప్రభుత్వం ప్రజలకోణంలో పెద్దఎత్తున ప్రాజెక్టులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుంటే.. వాటిని ఆపాలని చూసి అభాసుపాలయ్యారు. చార్మినార్, గోల్కొండ కోటలా చరిత్రలో నిలిచిపోయేలా సచివాలయం, శాసనసభ భవనాలను నిర్మిస్తుంటే ఆటంకాలు సృష్టిస్తున్నారు. సోమవారం సచివాలయానికి వచ్చి అరగంటలోనే తిరిగి వెళ్లారు. సచివాలయ, శాసనసభ నూతన భవనాలు ప్రభుత్వానికి సంబంధించినవే తప్ప సీఎం కేసీఆర్‌వి కావని కాంగ్రెస్ నేతలకు తెలియదా? వారు మాకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరెన్ని చెప్పినా తెలంగాణ ప్రజలు గర్వపడేలా నూతన సచివాలయాన్ని, శాసనసభను నిర్మించి తీరుతాం. రేవంత్‌రెడ్డి ఆరోపణలు నేను పట్టించుకోను. ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతాయి' అని తలసాని అన్నారు.

### తెరాసను వీడే ప్రసక్తే లేదు: కడియం

ఈనాడు, వరంగల్: తాను తెరాసను వీడి భాజపాలో చేరుతున్నట్లు కొన్ని పత్రికలు, టీవీలు (ఈనాడు, ఈటీవీ కాదు) దుష్ప్రచారం చేస్తున్నాయని, తాను ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మారే ప్రసక్తే లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సోమవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. రాజకీయ స్వార్థం కోసం పార్టీలు మారాల్సిన అవసరం కానీ, పదవుల కోసం పాకులాడాల్సిన పరిస్థితి తనకు లేవని అందులో పేర్కొన్నారు. కులం, మతం ఆధారంగా రాజకీయాలు చేసే పార్టీలకు దూరంగా ఉంటానని, దళిత, ముస్లిం, క్రైస్తవ వ్యతిరేకమైన భారతీయ జనతా పార్టీలోకి వెళ్లే పరిస్థితి లేదని లేఖలో ఆయన వెల్లడించారు.

## ఫిరాయింపులపై పోరాటం కొనసాగుతూనే ఉంటుంది

### భట్టివిక్రమార్క

హైదరాబాద్, న్యూస్‌టుడే: పార్టీ ఫిరాయింపులపై ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని కాంగ్రెస్ శాసనసభాపక్షనేత మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. దీనిపై త్వరలోనే రాజకీయ నాయకులు, న్యాయ ప్రముఖులతో హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సోమవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై ఆగస్టు 15 నుంచి జనవరి 26 వరకు ప్రతి మండలంలో కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామన్నారు. 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల అనర్హత విషయంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. అంబేడ్కర్ అంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుచించడం లేదని, అందుకే కాంగ్రెస్ చేపట్టిన డా.బి.ఆర్.అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో అంబేడ్కర్ పేరు తొలగించారని విమర్శించారు. ఏఐసీసీ కార్యదర్శి వీహెచ్ తయారు చేయించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎక్కడ ఉంచినా పోలీసులు వెంటనే తీసుకువచ్చి పంజాగుట్ట సర్కిల్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడుతారని తాను భావించడం లేదని భట్టి తెలిపారు. పీసీసీ అధ్యక్ష పదవి కావాలని తాను అడగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో అధిష్ఠానం నిర్ణయమే అంతిమం అన్నారు.

## అందరికీ విద్యపై మరింత చర్చ జరగాలి

### లోక్‌సభలో తెరాస పక్ష నేత నామా నాగేశ్వరరావు

ఈనాడు, దిల్లీ: దేశంలోని వెనుకబడిన ప్రాంతాల్లో చాలా మందికి విద్య అందడం లేదని. . అందరికీ విద్య అందించే అంశంపై సభలో మరింతగా చర్చ జరగాలని తెరాస లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ సోమవారం ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల బోధనా సిబ్బంది రిజర్వేషన్ బిల్లు-2019పై చర్చలో నామా నాగేశ్వరరావు మాట్లాడారు. బిల్లుకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయ క్యాడర్‌లో ఏడు వేల ఖాళీల భర్తీకి ప్రవేశపెట్టిన ఈ బిల్లుతో ప్రతి రాష్ట్రానికీ మేలు చేకూరుతుందన్నారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రిజర్వేషన్లకు తమ పార్టీ అధినేత కేసీఆర్ తొలి నుంచి మద్దతు ఇస్తున్నారని నామా తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపుపై శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపించిందని తెలిపారు. ప్రస్తుత బిల్లుకు తాము మద్దతు ఇచ్చినట్లే తాము పంపిన బిల్లును ఆమోదించేందుకు కేంద్రం మద్దతివ్వాలని ఆయన కోరారు.

### గ్రూప్-2 మౌఖిక పరీక్షలకు అభ్యర్థుల జాబితా

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-2 మౌఖిక పరీక్షలకు రెండోవారం ఇంటర్వ్యూలకు (జులై 8 నుంచి 12 వరకు) హాజరయ్యే అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు పేర్కొంది.

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని విపక్షాలకు వేరే పని లేకనే శాసనసభ, సచివాలయం నిర్మాణాలు ఓ పెద్ద సమస్య అయినట్లు రాద్ధాంతం చేస్తున్నాయని తెరాస ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణ బాగు పడడం వారికి ఏ మాత్రం ఇష్టం లేదని, కొత్త భవనాలను అందరూ స్వాగతిస్తుంటే... కాంగ్రెస్, భాజపా నేతలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో సుమన్.. ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి గట్టు రామచందర్‌రావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాలనా కేంద్రాలను పటిష్ఠ పరచడంలో భాగంగానే కొత్త సచివాలయ, శాసనసభ నిర్మాణాలను తెరాస ప్రభుత్వం చేపట్టిందన్నారు. శాసనసభను పార్లమెంటు తరహాలో తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారని చెప్పారు. దుబారాను ఆయన సహించరని, ప్రజల అవసరాల కోసమే వాటిని చేపడుతున్నారన్నారు. సచివాలయం, శాసనసభలను సందర్శించిన కాంగ్రెస్ నేతలు వాస్తవాలను దాచి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. రైతులను అవమానించేలా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఆయనకు తగిన శాస్తి జరుగుతుందని సుమన్ హెచ్చరించారు.

### విపక్షాలది అనవసర రాద్ధాంతం: తెరాస

# కూల్చివేతకు ఒప్పుకోం

● అసెంబ్లీ, సచివాలయ భవనాల సందర్శన సందర్భంగా కాంగ్రెస్ నేతలు

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తామని అంటే అంగీకరించేది లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కొత్త సచివాలయం, అసెంబ్లీ నిర్మాణాలను అడ్డుకుంటామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. దీన్ని ప్రజా ఉద్యమంగా మారుస్తామన్నారు. వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన భవనాలు పటిష్ఠంగా ఉంటే వాటిని కూల్చేయడం సమంజసం కాదన్నారు. ప్రస్తుత శాసనసభ భవనం రాష్ట్ర ఎమ్మెల్యేల అవసరాలకు సరిపోతున్నప్పుడు కొత్త అసెంబ్లీ నిర్మాణం అవసరం ఏముందన్నారు. సోమవారం కాంగ్రెస్ శాసనసభాపక్షనేత మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో నాయకులబృందం అసెంబ్లీ, సచివాలయంలో అన్ని బ్లాకులను సందర్శించి భవనాలను పరిశీలించింది. ఈ బృందంలో ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, శాసనసభ్యులు డి.శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, పార్టీ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, పొన్నం ప్రభాకర్, కొండా విశ్వేశ్వరరెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, కొండేటి శ్రీధర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు సచివాలయం, అసెంబ్లీలోని భవనాలను పరిశీలించి ఎప్పుడు నిర్మించారు? ఎవరు ప్రారంభించారు? ఎలా ఉన్నాయి? అని చూశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.

### సీఎం సొంత వ్యవహారం కాదు: భట్టి

కొత్త సచివాలయ నిర్మాణం ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత వ్యవహారం కాదని భట్టివిక్రమార్క అన్నారు. సీఎం సొంతంగా భవనాలను నిర్మించుకుంటే తమకేం అభ్యంతరం లేదన్నారు. ప్రజాధనంతో చేపడుతున్నందుకే అభ్యంతరం చెబుతున్నామన్నారు. ముఖ్యమంత్రి మారినప్పుడల్లా కొత్త భవనాలను నిర్మించుకుంటామని అంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజాధనం వ్యయం చేస్తున్నపుడు శాసనసభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలియజెప్పడానికి అసెంబ్లీ, సచివాలయ సందర్శన చేసినట్లు చెప్పారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని అనేక ఆకాంక్షలతో తెచ్చుకున్నామని, సీఎం కేసీఆర్ దీన్ని విస్మరించి పాలన చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సరిపోయేలా భవనాలు ఉన్నా సచివాలయానికి, అసెంబ్లీకి వసతులు లేవని తెరాస ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. సచివాలయంలోని అన్ని బ్లాకులు పది సంవత్సరాలనుంచి 30 ఏళ్లలోపు నిర్మించినవే అన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారన్నారు.



అసెంబ్లీ వద్ద కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టివిక్రమార్క, జీవన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, పొన్నం తదితరులు

### ఒప్పుకునేది లేదు: రేవంత్‌రెడ్డి

కొత్త సచివాలయం నిర్మిస్తామనే ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితిల్లోనూ ఒప్పుకోదని ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. భవనాల కూల్చివేతను అడ్డుకునేందుకు రావాలంటూ కార్యకర్తలకు పిలుపునిస్తామని, త్వరలో దీన్ని ప్రజాఉద్యమంగా మారుస్తామన్నారు. సచివాలయంలో రూ.వెయ్యి కోట్ల విలువైన భవనాలను కూల్చేందుకు సిద్ధమవుతున్నారని ఇది సబబు కాదన్నారు. ప్రస్తుతం రూ.400 కోట్లతో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని చెబుతున్న సీఎం.. అనంతరం అంచనాలు పెంచుతారని రేవంత్ అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలను అడిగి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదని మంత్రి తలసాని చేసిన వ్యాఖ్యలు ఆయన ఆలోచనల ధోరణికి నిదర్శనమన్నారు. ప్రస్తుత సచివాలయం ఉంటే కుమారునికి సీఎం పీఠం వారసత్వంగా రాదనే ఆలోచనతోనే సీఎం కేసీఆర్ కొత్త సచివాలయం నిర్మాణం చేపడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో రాచరిక పాలన చేస్తామంటే ఊరుకోమన్నారు. కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలపై తమ పోరాటం ఆరంభం మాత్రమే అన్నారు. సచివాలయంలోని ప్రస్తుత భవనాలను పరిశీలించాకే కేసీఆర్ కొత్త సచివాలయం నిర్మాణంలో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రం రెండు లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో ఉంటే కొత్త భవనాలంటూ సీఎం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వీహెచ్ మండిపడ్డారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి, కె.లక్ష్మణ్ తదితరులు

## ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యల అంశంపై జోక్యం చేసుకోండి

### రాష్ట్రపతికి భాజపా రాష్ట్ర బృందం వినతి

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు వైఫల్యం, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న అంశంపై రాజ్యాంగాధిపతిగా జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు భాజపా రాష్ట్ర ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నేతృత్వంలోని బృందం సోమవారం రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఇంటర్ పరీక్షలకు 8.70 లక్షల మంది హాజరైతే 3.28 లక్షల మంది ఫెయిల్ అయ్యారని భాజపా నేతలు తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురైనా.. దీన్నో చిన్న ఘటనగా చూపే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. బోర్డు అధికారులు పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడికి సరిగా సిద్ధం కాలేదని.. ఎలాంటి అనుభవం లేని గ్లోబరీనా సంస్థకు బాధ్యత అప్పజెప్పారంటూ త్రిసభ్య కమిటీ పేర్కొన్నా ఇప్పటి వరకు ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదని రాష్ట్రపతికి వివరించారు. హైకోర్టు సూచనతో రీ వెరిఫికేషన్ చేసినా 1137 మంది మాత్రమే పాసయ్యారని తెలిపారు. గ్లోబరీనాకు రాజకీయ ప్రాబల్యం ఉన్న వ్యక్తుల రక్షణ ఉందని ఆరోపించారు. తాను ఉద్యమం చేస్తే బలవంతంగా దీక్ష భగ్నం చేశారని లక్ష్మణ్ రాష్ట్రపతికి వెల్లడించారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సాధ్యమైతే న్యాయ విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు సూచించాలన్నారు. అనంతరం ఇదే అంశంపై నేతలు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రపతిని కలిసిన బృందంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు పి.కె.కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యేలు ఇంద్రసేనారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, సీనియర్ నేతలు వెదిరె శ్రీరాం, అల్జాపూర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### 'బీసీ జాబితాలో చేర్చాలి'

ఈనాడు, హైదరాబాద్: తమను బీసీ జాబితాలో చేర్చాలని సన్నాయి, తోలుబొమ్మలాట, అద్దపు, భాగవతుల సామాజిక వర్గాల వారు సోమవారం తెలంగాణ బీసీ కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. కొత్త కులాల చేర్పుపై హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న బహిరంగ విచారణకు వారు హాజరయ్యారు.

### బొగ్గు ఉత్పత్తిలో 17.3 శాతం వృద్ధి: సింగరేణి

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2019-20) తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో బొగ్గు ఉత్పత్తికి సంబంధించి 17.3 శాతం వృద్ధి సాధించినట్లు సింగరేణి సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది ఇదే కాలంలో 1.45 కోట్ల టన్నుల బొగ్గు తవ్వగా ఈ ఏడాది 1.70 కోట్ల టన్నులు తవ్వినట్లు వెల్లడించింది. గత నెలలో గనుల నుంచి 55.19 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసింది.

# కొత్త జడ్పీలకు సీఈవో, ఏవో పోస్టులు

● ఇవన్నీ పదోన్నతుల ద్వారా భర్తీ

● డిప్యూటీ సీఈవో పోస్టు ఎత్తివేత

● మిగతా ఉద్యోగులంతా పాత జడ్పీల నుంచి పంపిణీ

● ఒక్కో జడ్పీ ఫర్నిచర్‌కు రూ.6.14 లక్షలు మంజూరు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని కొత్త జిల్లా పరిషత్‌లు అన్నింటికీ సీఈవో (ముఖ్య కార్యనిర్వహణ అధికారి), అకౌంట్స్ అధికారి (ఏవో) పోస్టులు ఉండనున్నాయి. పాతవాటిలో మాదిరిగా డిప్యూటీ సీఈవో పోస్టు ఉండదు. మిగతా సిబ్బందికి సంబంధించిన పోస్టులు పూర్వపు జడ్పీల నుంచి విభజన ద్వారా తాత్కాలికంగా పంపిణీ అవుతాయి. తెలంగాణలో 20 కొత్త జడ్పీలు ఈనెల 5వ తేదీన, మరో 3 జడ్పీలు ఆగస్టు 7న ఏర్పాటు కానున్నాయి. తొమ్మిది ఉమ్మడి జడ్పీలలో పనిచేస్తున్న డిప్యూటీ సీఈవోలు కొత్త వాటిలోని 9 జడ్పీలకు సీఈవోలుగా నియమితులవుతారు. ఇప్పటికే డిప్యూటీ సీఈవో హోదా నుంచి పదోన్నతులు పొందిన మరో 14 మంది మిగతా 14 జిల్లాలకు సీఈవోలుగా వెళ్తారు. పదోన్నతులపై 23 జడ్పీలకు ఏవోల నియామకం జరుగుతుంది. డిప్యూటీ సీఈవో బాధ్యతలనూ ఏవోలే నిర్వహిస్తారు. కొత్తవాటికి పోస్టుల మంజూరు తదితరాలపై పంచాయతీరాజ్ శాఖ మార్గదర్శకాలను వెలువరించింది.

◆ కొత్త జడ్పీలు ఏ జడ్పీ నుంచి వేరుపడుతున్నాయో.. ఆయా పాత జడ్పీల్లోని మిగతా పోస్టులన్నీ కొత్తవాటికి పంపిణీ అవుతాయి. కొత్త జడ్పీలకు వెళ్లని పోస్టులన్నీ ఆయా పాత జడ్పీల్లో యథావిధిగా కొనసాగుతాయి.

◆ కొత్త జడ్పీలకు కేటాయించిన పోస్టుల్లోకి పాత జడ్పీల నుంచి పంపే ఉద్యోగులంతా 'ఆర్డర్ టు సర్వ్' ఉత్తర్వుల కింద తాత్కాలిక ప్రాతిపదికన పని చేయాలి. ఉద్యోగులు కొత్త వాటికి వెళ్లేందుకు వీలుగా వారి వరకు మాత్రమే బదిలీలపై నిషేధాన్ని సడలిస్తారు. కొత్త జడ్పీలకు నియమితులైన వారందరికీ వారి పాత జడ్పీల్లో అమలైన జిల్లా, జోనల్, మల్టీ జోనల్, సీనియారిటీ, పదోన్నతులు, ఇతర సర్వీసు అంశాలన్నీ అలాగే కొనసాగుతాయి.

◆ పాత జడ్పీలోని జిల్లా కలెక్టరు.. కొత్త జడ్పీల జిల్లాల కలెక్టర్లతో సంప్రదించి.. ఆయా ఉద్యోగుల స్థానికత, సీనియారిటీ తదితరాల ఆధారంగా పంపిణీ చేస్తారు. పోస్టుల పంపిణీకి ఆయా కొత్త జడ్పీల పరిధిలోని మండలాల సంఖ్య ప్రాతిపదిక అవుతుంది.

### కొత్త ఫర్నిచర్‌కు రూ.1.40 కోట్లు విడుదల

నూతన 23 జడ్పీలకు కొత్త ఫర్నిచర్ కొనుగోలుకు పంచాయతీరాజ్ శాఖ రూ.1.40 కోట్లను మంజూరు చేసింది. దీనినుంచి ఒక్కో జడ్పీకి కుర్చీలు, బల్లలు, మైకులు, స్పీకర్లకు రూ.6.14 లక్షల చొప్పున అందుతాయి. ఛైర్‌పర్సన్, సీఈవోల కుర్చీలకు రూ.15 వేల వరకు ఖర్చు పెట్టేందుకు పీఆర్‌శాఖ అనుమతించింది. సమావేశ మందిరంలోని సభ్యుల కుర్చీలకు ఒక్కోదానికి రూ.1,500 చొప్పున ఖర్చు పెట్టవచ్చు. పాత జడ్పీల్లోని ఫర్నిచర్, వాహనాలను, ఆస్తులను, అప్పులను కూడా కొత్తవాటిలోని మండలాల సంఖ్యకు అనుగుణంగా పంపిణీ చేస్తారు. ఇవికాక కార్యాలయ నిర్వహణ కోసం ఒక్కో జడ్పీకి రూ.10 లక్షలు, రవాణా ఖర్చుల కోసం రూ.50 వేలు చొప్పున అందజేస్తారు. కొత్త వాహనాల కొనుగోలును మార్గదర్శకాల్లో ప్రస్తావించలేదు.

Eenadu epaper

# ఈనాడు

## ప్ర'జల స్వామ్యం'!

'చెరువు పూడు ఊరు పాడు' వంటి సార్వకాలీన సామెతలు ఊరికే పుట్టలేదు. కూర్చున్న కొమ్మను తెగనరుక్కొనే పెడ ధోరణులతో ఒకవంక ప్రకృతి విధ్వంసం, ప్రాణప్రదంగా పరిరక్షించుకోవాల్సిన పరిమిత జల వనరుల వినియోగంలో మరోపక్క అలవిమాలిన అలక్ష్యం- జమిలిగా తీవ్ర జల సంక్షోభానికి అంటుకట్టాయిప్పుడు! రెండో దఫా ప్రధానమంత్రిత్వం చేపట్టాక మొట్టమొదటి మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ జల సంరక్షణ ఆవశ్యకతను ఉద్బోధించారు. దేశవ్యాప్తంగా 91 ప్రధాన జలాశయాల్లో నీళ్లు అడుగంటి, జూన్ తొలివారానికే పలకరించాల్సిన తొలకరి మొహం చాటేయడంతో సాధారణ వర్షపాతానికీ గండిపడి, పట్టణాలూ పల్లెల్లో నీటి ఇక్కట్లు ఏ స్థాయిలో ముమ్మరించాయో చెప్పనలవి కాదు. 2015 నవంబరు, డిసెంబరు నెలల్లో అతివృష్టి సృష్టించిన భయానక వరదల్లో చిక్కి 'కావవే వరదా...' అంటూ కన్నీటి పర్యంతమైన చెన్నై మహానగరం నేడు చినుకు జాడ కరవైన అనావృష్టి పరిస్థితుల్లో తాగునీటి అవసరాలూ తీరక అలమటిస్తోంది. చెన్నైలో గ్రాము బంగారం కంటే, ప్రైవేటు ట్యాంకర్ నీటి ఖరీదే ఎక్కువ అన్న మాన్య ఎంపీల ఆక్రోశం సాక్షిగా తమిళనాడు నెత్తిన జల సంక్షోభం ఉరుముతోంది. తరతమ భేదాలతో తక్కిన రాష్ట్రాలదీ అదే పరిస్థితి! ఏటా కురిసిపోయే వర్షాల్లో కేవలం ఎనిమిది శాతాన్నే పొదివి పట్టుకోగలుగుతున్నామన్న ప్రధాని మోదీ- జాగృత జన అక్షౌహిణులు అపర భగీరథులై జల సంరక్షణోద్యమానికి పూనుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తున్నారు. జల సంరక్షణ ఆవశ్యకతపై ప్రజలందరిలో అవగాహన పెంచాలని, సంప్రదాయ పద్ధతుల్లోని విజ్ఞాన సారాన్ని అందరికీ పంచాలనీ, నీటి పరిరక్షణపై పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థల సమాచారాన్నీ అందించాలని ప్రధాని మోదీ సూచిస్తున్నారు. 'నుయ్యి ఎండిపోయినప్పుడే తెలుస్తుంది నీటి విలువ' అన్నట్లు ఏటా ఏదో ఒక సమయంలో తాగునీటి కటకట ఎదుర్కొంటున్న జనావళిలో కేవలం అవగాహన పెంచడం కాదు; జల సంరక్షణ జాతి సంస్కృతిగా పాదుకొనే బహుముఖ పటిష్ఠ కార్యాచరణను పట్టాలకెక్కించేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి!

ఏటికేడు ఎదిగే జనసంఖ్య అవసరాలకు దీటుగా ప్రకృతి ప్రసాదిత వనరులా... పెరిగేవి కావు. దేశీయంగా దాదాపు 450 నదులు ప్రవహిస్తున్నా వాటిలో సగానికిపైగా తాగునీటి అవసరాలకు పనికిరావు! స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి 6,042 ఘనపు మీటర్లుగా ఉన్న తలసరి నీటి లభ్యత 2021 నాటికి 1,340 ఘ.మీటర్లకు కుదించుకుపోనుందని సర్కారీ గణాంకాలే చాటుతున్నాయి. నిరుడీ రోజుల్లో నీతి ఆయోగ్ కళ్లకు కట్టిన భారతావని జల దృశ్యం- ఏకాయెకి 60 కోట్ల జనావళి తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతోందని, 2030నాటికి నీటి లభ్యతకంటే గిరాకీ (అవసరాలు) రెండింతలు అధికం కానుందనీ భయానక వాస్తవాల్ని వెల్లడించింది. గ్రామీణ భారతంలో 84 శాతం జనావళికి కుళాయి నీళ్లు అందుబాటులో లేవని, 70శాతం జలాలు కలుషితమైపోవడంతో ఏటా రెండు లక్షలమంది అర్ధాయుష్కులవుతున్నారనీ నీతి ఆయోగ్ నివేదించింది. ఎక్కువకాలం గుక్క తడవకపోతే ప్రాణం పోతుంది. అలాంటిది గొంతులోకి జారే నీరే గరళమై ప్రాణాల్ని తోడేయడాన్ని మించిన విషాదం ఏముంది? తాగునీరు పొందడాన్ని ఈ దేశ పౌరుల జీవన హక్కుగా సుప్రీంకోర్టు స్పష్టీకరించినా, జీవనదులైన గంగా యమునలు ప్రాణమున్న చట్టబద్ధ జీవులని, ఓ మనిషికి ఉండే చట్టబద్ధ హక్కులన్నీ వాటికీ ఉంటాయని ఉత్తరాఖండ్ హైకోర్టు వినూత్న తీర్పు ఇచ్చినా- వాస్తవంలో ఏం ఒరిగింది? వచ్చే ఏడాదికల్లా 21 ప్రధాన నగరాలు దాహార్తితో అలమటించే దుర్భర స్థితి దాపురించనుందన్న నీతి ఆయోగ్ హెచ్చరికల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం- జలశక్తి మంత్రిత్వశాఖను కేంద్రంలో కొత్తగా కొలువుతీర్చింది. దానివల్ల ప్రయోజనం పరిమితమే. తమ వంశాంకురాలు క్షామం బారినపడకుండా క్షేమంగా ఎదగాలంటే తక్షణం నీటి సంరక్షణకు తాను నడుం కట్టాల్సిందేనన్న నవ చేతన ప్రతి ఒక్కరిలో పురివిప్పేలా- నిశ్చయంగా సాగాల్సింది భగీరథయత్నమే!

'దేశంలో నీటికి కొరత లేదు... ఆ అమూల్య వనరును వినియోగించుకోవడంలో లోటుపాట్ల కారణంగానే తీవ్ర అవస్థల పాలవుతు'న్నామన్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు అక్షర సత్యం. ఏటా వంద రోజుల్లోనే కురిసిపోతున్న 70శాతం వానల మూలాన వరదలు పోటెత్తి అపార జలరాశి వృథాగా ఉప్పు సముద్రం పాలవుతూనే ఉంది. అవసరమైనప్పుడల్లా భూగర్భాన్ని నీటికోసం తొలిచేస్తుండటం, ఆ వెలితిని పూరించకుండా నిర్లక్ష్యం వహిస్తుండటంతో- దేశవ్యాప్తంగా 160 జిల్లాల్లో భూగర్భ వనరు ఉప్పు నీటిమయమై పోగా, 230 జిల్లాల్లో ఫ్లోరైడ్ భూతం జడలు విరబోసుకొంది. మానవాళి చరిత్రలోనే అతిపెద్ద సామూహిక విష ప్రయోగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్న కలుషిత జలవాడకం ఇండియాలో యథేచ్ఛగా సాగుతోంది! ఈ దుర్భర దురవస్థ ఇంకానా? ఈ అవ్యవస్థను రూపుమాపే రాజ్యాంగ విహిత బాధ్యత ప్రభుత్వాలది కాదా? 'ప్రతి నీటి బొట్టుకు మరింత ఉత్పాదన' (పర్ డ్రాప్ మోర్ క్రాప్) వంటి నినాదాలు కాదు కావాల్సింది; బిందు సేద్య పరిజ్ఞానం, పనిముట్లు రైతులకు అందుబాటులోకి రావాలి. పరిమిత నీటితోనే పనులు చక్కబెట్టుకోగల ఉపకరణాల్ని ప్రజలకు చేరువ చెయ్యాలి. 'బతుకు కోసం-భవిత కోసం' జల సంరక్షణ యజ్ఞం వ్యక్తి స్థాయిలో నిష్ఠగా, సామాజిక స్ఫూర్తితో సమష్టిగా సాగేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటునందివ్వాలి. ప్రజాస్వామ్యం ప్ర'జలస్వామ్యం'గా పరిఢవిల్లే సంస్కృతికి అన్ని చోట్లా బీజావాపనం జరగాలి!

# కబళిస్తున్న కల్తీ


పరిటాల పురుషోత్తం



తినే తిండి శుచిగా, రుచిగా ఉంటేనే బతుకు బండి సాఫీగా సాగుతుంది. హరిత విప్లవ నేపథ్యంలో ధాన్య సమృద్ధి, పౌష్టికాహార అవసరాల ప్రాతిపదికన దేశం చెప్పుకోదగిన ముందడుగులే వేసింది. దేశంలో ప్రజావళి పౌష్టికాహార, రక్షితాహార అవసరాలకు భరోసాగా 2006లో సురక్షిత ఆహారం-ప్రమాణాల చట్టం తీసుకువచ్చారు. అదే క్రమంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)నూ ఏర్పాటు చేశారు. ప్రజలందరికీ రక్షిత ఆహారాన్ని సమకూర్చేందుకు ప్రభుత్వాల స్థాయిలో జరుగుతున్న కృషి క్షేత్రస్థాయికి విస్తరించడం లేదు. దేశంలో ఏటా పదికోట్లకుపైగా ఆహార సంబంధ వ్యాధులు విస్తరిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2030నాటికి ఈ సంఖ్య 15 కోట్లనుంచి 17.7 కోట్లకు పెరుగుతుందన్న అంచనాలు భయాందోళనలు రాజేస్తున్నాయి. మరో పదకొండేళ్లలో సగటున ప్రతి పదిమంది భారతీయుల్లో ఒకరు అరక్షిత ఆహారం కారణంగా వ్యాధుల బారినపడే ప్రమాదం పొంచి ఉంది. కలుషిత ఆహారం కారణంగా వ్యాధులు విస్తరించడం దేశ ఆర్థికానికి తూట్లు పొడుస్తోందని, ఆ రకంగా ఏటా లక్షా 78,100 కోట్ల రూపాయల మేర (జీడీపీలో 0.5శాతం) నష్టం వాటిల్లుతోందని ప్రపంచ బ్యాంకు అధ్యయనం వెల్లడించింది.

ఆహారంలో కలుషితాలకు బ్యాక్టీరియా (66 శాతం), రసాయనాలు (26 శాతం), వైరస్ (నాలుగు శాతం), పరాన్నజీవు (నాలుగు శాతం)లు కారణమవుతున్నాయి. పాలు, పాల ఉత్పత్తులైన ఖీర్ వంటివి; మాంసం, చేపలు, మజ్జిగ, మిఠాయిలు, రొయ్యలవంటి సముద్ర ఉత్పత్తులు ఎక్కువగా కాలుష్యం బారినపడుతున్నాయి. వండిన అన్నం, చింతపండు, కూరగాయలు సైతం బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల కలుషితాహారంగా రూపాంతరం చెందుతున్నాయి.

### నిర్దేశిత ప్రమాణాలకు దూరంగా ఉత్పత్తులు

దేశంలో అత్యధికంగా కలుషితమవుతున్న ఆహారం పాలు! ప్యాకేజింగ్ సందర్భంగా, పాలను నింపే క్యాన్లను డిటర్జెంట్లతో కడగడంవల్ల పాలలో కలుషితాలు చేరుతున్నాయని వివిధ సర్వేలు పేర్కొంటున్నాయి. మరోవంక పాలు చిక్కగా కనిపించడం కోసం, ఎక్కువ కాలం విరిగిపోకుండా ఉండటం కోసం యూరియా, గంజి పౌడరు, గ్లూకోజ్, ఫార్మాలిన్‌లను కలుపుతున్నారు. దేశంలో విక్రయిస్తున్న పాలు, సంబంధిత ఉత్పత్తుల్లో 68.7శాతం భారత రక్షిత ఆహార ప్రమాణాల సంస్థ నిర్దేశాలకు దూరంగా ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా పాలు, సంబంధిత ఉత్పత్తుల్లో చోటుచేసుకుంటున్న కల్తీకి అడ్డుకట్ట వేయని పక్షంలో 2025 నాటికి 87 శాతం పౌరులు క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధుల పాలబడే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల హెచ్చరించింది. పాల తరవాత వంటనూనెల్లో అత్యధిక కల్తీ జరుగుతోంది. దేశంలోని 15 రాష్ట్రాల్లో విక్రయిస్తున్న 85 శాతం నూనెల్లో దారుణమైన కల్తీ జరుగుతున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయి. భారత్‌లో ఆహార సంబంధ వ్యాధుల విస్తృతిని గుర్తించే యంత్రాంగమే లేదు. ఆరోగ్య సంక్షోభం ముమ్మరించిన తరవాతో లేక తీవ్ర ఆర్థిక నష్టాలు వాటిల్లినప్పుడో మాత్రమే సమస్య తీవ్రత విధానకర్తల తలకెక్కుతోంది. దేశంలో ఈ వ్యాధుల విస్తరణ తీరుతెన్నులను పరిశీలించి, విశ్లేషించే వ్యవస్థల అవసరం ఉంది. ప్రపంచ వాణిజ్య సంస్థతో ఒప్పందం మేరకు పారిశుద్ధ్య నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించడంతోపాటు ఎప్పటికప్పుడు ఏయే ఆహార పదార్థాలు విష కలుషితమవుతున్నాయి, ఏ స్థాయిలో ఆ కల్తీ జరుగుతోంది అన్న సమాచారాన్ని 'డబ్ల్యూటీఓ'కు అందజేయాల్సి ఉంటుంది. ఆహార కాలుష్యంపై సూక్ష్మ వివరాలు సేకరిస్తే తప్ప సమర్థ పరిష్కారాలను అన్వేషించడం సాధ్యం కాదు.

### ప్రభుత్వాల ప్రేక్షక పాత్ర

ప్రపంచ సురక్షిత ఆహార సూచీ-2018 నివేదికలో పేర్కొన్న 113 దేశాల్లో ఐర్లాండ్ తొలిస్థానంలో, అమెరికా ఆ తరవాత నిలుస్తుండగా- భారత్ 50వ స్థానంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి ఆహార వ్యవసాయ సంస్థ, వరల్డ్ బ్యాంకు అందించిన గణాంకాల ఆధారంగా ఈ సూచీని రూపొందించారు. సురక్షిత ఆహార ప్రమాణాల పరంగా సింగపూర్ అగ్రస్థానంలో నిలుస్తోంది. ప్రమాణాల పర్యవేక్షణ వ్యవస్థలతోపాటు చురుగ్గా వ్యవహరించే స్వతంత్ర తనిఖీ బృందాలు ఉండటం ఆ దేశంలో ఆహార కల్తీకి ముకుతాడు వేస్తోంది. వ్యవసాయదారుడి నుంచి విక్రేత వరకూ ఆహారోత్పత్తులను ప్రతి దశలోనూ నిశితంగా తనిఖీ చేసే యంత్రాంగాలు ఆ దేశంలో ఉన్నాయి. అరక్షిత ఆహారాన్ని విక్రయిస్తున్న వారిపై న్యాయవ్యవస్థలో కేసులు నమోదు చేసేందుకూ అక్కడి చట్టాలు వీలు కల్పిస్తున్నాయి. భారత్ పరిస్థితి ఇందుకు భిన్నం. 2050నాటికి మన దేశ జనాభా 170 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ పరిస్థితుల్లో తలసరి నీటి లభ్యత దారుణంగా పడిపోతుంది. అది ఆహార నాణ్యతపై ప్రతికూల ప్రభావం కనబరుస్తుంది. దానివల్ల దేశంలోని నాలుగింట మూడొంతు ప్రజల పౌష్టికాహార అందుబాటుపై ప్రభావం పడుతుంది. దాంతో ప్రజారోగ్యమూ కుంగుబాటు పడుతుంది. నగరీకరణ పెరుగుతుండటం, స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధి కారణంగా 2030 నాటికి సంపన్న కుటుంబాల్లో మూడింట ఒకరు ఆహార సంబంధ వ్యాధుల పాలబడే అవకాశాలున్నాయి. ధనిక కుటుంబాలు మాంసం, పళ్లు, కూరగాయలను అధికంగా ఉపయోగించడమే ఇందుకు కారణం. సురక్షిత ఆహార ప్రమాణాలను నిర్దుష్టంగా అమలు చేయాలంటే వ్యవస్థలు బలంగా ఉండాలి. అందుకోసం ప్రభుత్వ స్థాయిలో పెద్దయెత్తున నిధుల కేటాయింపు జరగాలి. ఆహార నాణ్యత ప్రమాణాలపై దేశవ్యాప్తంగా అవగాహన పెరుగుతున్నప్పటికీ- నిధుల కేటాయింపులో మాత్రం అందుకు తగిన ప్రాధాన్యం దక్కకపోవడం బాధాకరం. ఆహార నాణ్యత ప్రమాణాల పరిరక్షణకు ప్రభుత్వాలు నిధులు పెంచాలి. దాని వల్ల భారత ఆర్థిక వ్యవస్థపైనా సానుకూల ప్రభావం ఉంటుంది. ప్రభుత్వాలు సురక్షిత ఆహార విధానాలు రూపొందించి, వాటి అమలుకు సంసిద్ధమైతే- ఆ మేరకు ప్రమాణాల పర్యవేక్షణ కోసం నైపుణ్య మానవ వనరులకు ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. తద్వారా దేశంలో సేవల రంగం ఊపందుకొని ఆర్థిక వ్యవస్థ జవసత్వాలు పుంజుకొంటుంది.

### సింగపూర్ విధానం ఆదర్శనీయం

దేశంలో ఆహార ఉత్పత్తులు వినియోగానికి అనుకూలంగా, సురక్షితంగా ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. ఆ మేరకు ఆహార పదార్థాల నిర్దిష్ట ప్రమాణాలను అమలయ్యేట్లు ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. నాణ్యత ప్రమాణాలను నిర్ధారించేందుకు అవసరమైన మౌలిక వసతులను విస్తరించాలి. అందుకోసం సుశిక్షిత మానవ వనరులను పెంచాలి. రైతు మొదలు విక్రేత వరకూ వివిధ దశల్లో ఆహార నాణ్యతను ధ్రువీకరించే వ్యవస్థలుండాలి. వ్యవసాయదారులు, విక్రేతలు, ప్రభుత్వం మధ్య మెరుగైన సమన్వయం ఏర్పడాలి. ప్రభుత్వ, ప్రైవేటు అన్న తేడా లేకుండా కలుషిత ఆహారాన్ని అందించే ప్రతి ఒక్కరిపైనా చట్టబద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలి. దేశవ్యాప్తంగా ఆహార ప్రమాణాలను పరీక్షించే ప్రయోగశాలల సంఖ్యను పెంచాల్సి ఉంది. 130కోట్లకు పైబడిన ప్రజల ఆహార అవసరాలను నెరవేర్చడం ఎంత ముఖ్యమో- నాణ్యమైన ఆహారాన్ని అందించడం అంతకంటే కీలకం! ఆ మేరకు సింగపూర్ తరహా పారదర్శక, జవాబుదారీ, సమర్థ వ్యవస్థలను నెలకొల్పి ప్రమాణాల పర్యవేక్షణకు పూనుకోవాలి. కలుషిత ఆహారం వల్ల దేశవ్యాప్తంగా ఆరోగ్య సమస్యలు ప్రబలుతున్నాయి. ఆహార పదార్థాలను సరిగ్గా నిల్వ చేయకపోయినా, వండకపోయినా, అపారిశుద్ధ్య వాతావరణంలో ఉంచినా బ్యాక్టీరియా, వైరస్, ప్రమాదకర రసాయనాలు అందులో చేరిపోతాయి. ఆహారంలో చేరిన ఈ బ్యాక్టీరియాను దాని రుచి, రంగును బట్టి గుర్తించడం సాధ్యమయ్యే పనికాదు. జాతి ఆరోగ్యానికి పెను సవాలుగా నిలుస్తున్న ఈ సమస్యను ఎదుర్కోవడం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ వ్యవస్థలూ ఈ క్రమంలో ప్రభుత్వానికి తోడ్పాటుగా నిలవాలి. ప్రపంచ జనాభాలో 10శాతం లేదా 60 కోట్లమంది ప్రజలు కలుషిత ఆహారం కారణంగా ఏటా అనారోగ్యం పాలవుతున్నారు. వీరిలో సుమారు నాలుగు లక్షలమంది మరణిస్తున్నారు. 'సమితి' సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు జనావళికి నాణ్యమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచడం అత్యావశ్యకం. ప్రణాళికాబద్ధంగా ముందుకు కదిలితే తప్ప జాతి భవితకు పెను ప్రమాదంగా పరిణమిస్తున్న ఈ సమస్యను ఎదుర్కోవడం సాధ్యం కాదు!

(రచయిత- సామాజిక ఆర్థిక విశ్లేషకులు)

### మారుతున్న ఆహార అలవాట్లు



ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆహార అలవాట్లు నెమ్మదిగానైనా గుణాత్మకంగా రూపాంతరం చెందుతున్నాయి. పోషక విలువలు కొరవడిన రోజువారీ ఆహారం నుంచి ప్రజలు క్రమంగా మాంసం, పళ్లు, కూరగాయలు వంటి పౌష్టికాహారాల వైపు మరలుతున్నారు. పౌష్టిక విలువలు సమృద్ధిగా ఉండే ఈ ఆహారంలో నాణ్యత ప్రమాణాలు వేగంగా కొడిగడుతున్నాయి. ప్రమాణాలకు సంబంధించి ఈ పతనాన్ని తక్షణం నిలవరించకపోతే పౌష్టిక విలువలు కలిగిన ఈ ఆహారాన్ని స్వీకరించడానికి ప్రజలు విముఖత చూపుతారు. అది ఒకరకంగా ప్రజల ఆహార హక్కును హరించడమే అవుతుంది. నగరీకరణపైన, ఆర్థిక వృద్ధిపైన ఈ పరిణామం పెను ప్రభావం కనబరుస్తుందనడంలో మరోమాట లేదు.

# అరాచక శక్తులకు అడ్డేదీ?

మేధోవికాసం, సాంకేతిక ప్రగతిలో ముందడుగు వేస్తున్న భారత్ మానవీయ విలువల పరిరక్షణలో విఫలమవుతోంది. దేశవ్యాప్తంగా వెలుగుచూస్తున్న వ్యక్తుల అపహరణ, అదృశ్య ఘటనలు ఇందుకు నిదర్శనలుగా నిలుస్తున్నాయి. సాక్షాత్తూ దేశ రాజధాని నగరమైన దిల్లీలో గత మూడేళ్లలో అయిదు వేలకు పైగా చిన్నారులు అదృశ్యమయ్యారు. వారి జాడ ఇప్పటికీ తెలియలేదు. గత ఏడాది కేరళలో 12,453 మంది అదృశ్యమైనట్లు నమోదైన సంఘటనల్లో ఇంకా 692 మంది ఆచూకీ దొరకలేదు. ఆంధ్రప్రదేశ్‌లో నిరుటి నుంచి ఇప్పటివరకు 661 మంది పిల్లలు కనపడకుండాపోయారు. వారిలో ఇంకా 245 మంది జాడ తెలియాల్సి ఉంది. తెలంగాణలో జూన్ మొదటి తొమ్మిది రోజుల్లోనే 545 అదృశ్య కేసులు నమోదవడం ఆందోళన కలిగించే పరిణామం. కనిపించకుండా పోతున్నవారిలో విద్యార్థులు, ప్రేమికులు, చిన్నపిల్లలతోపాటు వృద్ధులూ ఉన్నారు.

పరీక్షల ఫలితాలొచ్చే సమయంలో విద్యార్థుల అదృశ్య ఘటనలు నమోదవుతున్నాయి. ర్యాంకులు, మార్కుల మోజులో కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను సతాయిస్తున్నారు. దీంతో పిల్లలు భయంతో బాహ్య ప్రపంచంలోకి వెళుతున్నారు. పెద్దల ఆవేశం సద్దుమణిగాక కొంతమంది తిరిగొస్తున్నారు. సహజ ప్రతిభను తొక్కిపడేస్తున్న బట్టీ చదువులు వారి భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారాయి. ఈ వాస్తవాలు కళ్లెదుటే కనిపిస్తున్నా తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ పెద్దల మార్గదర్శకత్వం, ఆత్మీయత కొరవడటంతో తమను ఊరడించేవారు లేక పిల్లలు ఆందోళన చెందుతున్నారు. ఉద్వేగాల నియంత్రణ, వ్యవహార దక్షత, ఇతరుల హక్కులను, అభిప్రాయాలను గౌరవించడం, ఓర్పు వంటి లక్షణాలను పిల్లలకు నేర్పడంలో కుటుంబాలు విఫలమవుతున్నాయన్నది చేదు నిజం.

వికటించిన యువతీ యువకుల ప్రేమ వ్యవహారాలూ అదృశ్య ఘటనలకు కారణమవుతున్నాయి. ఆకర్షణకు, అసలైన ప్రేమకు మధ్య గల వ్యత్యాసాన్ని పిల్లలకు వివరించాల్సిన బాధ్యతను నేటి పెద్దలు విస్మరిస్తున్నారు. ఫలితంగా అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. కౌమార దశ నుంచి కలిగే శారీరక, మానసిక మార్పులు, స్త్రీపురుష వైవిధ్యాలు, విశిష్టతలను బిడ్డలకు వివరించాల్సిన బాధ్యతను ఈనాటి తల్లిదండ్రులు గుర్తించడం లేదు. దీంతో యుక్త వయస్కులు దారి తప్పుతున్నారు. కన్నవారి మనసులను కష్ట పెడుతున్నారు.

కన్నబిడ్డల నిర్లక్ష్యానికి గురై, ఆత్మాభిమానం దెబ్బతిన్న కొంతమంది వృద్ధ తల్లిదండ్రులు సైతం ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నారు. 32 శాతం మాత్రమే వృద్ధుల సంరక్షణపట్ల బాధ్యతగా ఉంటున్నారు. మిగిలిన వారు అలక్ష్యంగా, అవమానకరంగా వ్యవహరిస్తున్నారని దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. అప్పులు, తప్పులు చేసినవాళ్లు సమస్యలను ఎదుర్కోలేక, అపరాధభావంతో తోటివారికి ముఖం చూపలేక ఇల్లొదిలి వెళ్లిపోతున్నారు. ఫలితంగా వారి కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. అదృశ్య సంఘటనలకు ముఖ్యమైన మరో కారణం అపహరణ ముఠాల కిరాతకం. వాళ్లను కట్టడి చేయడంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శను తోసిపుచ్చలేం. పోలీసులు వీరిని ఉక్కుపాదంతో అణచి వేయాల్సి ఉంది. నేరస్తుల పీచమణచి ప్రజల్లో విశ్వాసాన్ని కలగజేయడంలో పోలీసు వ్యవస్థ ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచలేకపోతోంది. ఫిర్యాదుదారులపట్ల నిర్లక్ష్య ధోరణి, తారతమ్యాలు చూపడం వంటి ఆమోదయోగ్యం కాని ధోరణుల వల్ల పోలీస్ శాఖ విశ్వసనీయతను కోల్పోతోంది. సామాన్యుల కోసం పని చేసినప్పుడే అది ప్రజల మన్ననలను చూరగొంటుంది. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని పోలీసులు కోరడం సమంజసమే. అలా సహకరించేవారికి పోలీసుల అండ ఉంటుందా అన్న అనుమానం కలుగకమానదు. ఇటీవల హైదరాబాద్‌లో ఒక యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న రౌడీషీటర్‌ను ఎదురొడ్డి నిలిచిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇలాంటి సంఘటనలు మళ్ళీ మళ్ళీ జరిగినప్పుడు బాధితుల తరఫున మాట్లాడేందుకు మరొకరు ముందుకు రాలేరు. అదృశ్య, అపహరణ సంఘటనలను నామరూపాల్లేకుండా చేయడంలో పోలీసు శాఖ మాత్రమే కాక ప్రభుత్వాలు, సామాజిక వ్యవస్థలు, వ్యక్తులు భాగస్వాములు కావాల్సిన అవసరముంది. ఎవరో అదృశ్యమైతే నాకేంటనే నిర్లిప్తత తగదు.


కలవరపెడుతున్న అదృశ్యం కేసులు

ప్రేమ, తోడ్పాటు, గుర్తింపు, సంతోషం లభించే క్షేత్రాలుగా ఇళ్లు, కుటుంబాలు మారితే అదృశ్య ఘటనలకు అసలు తావే ఉండదు. ఈ విషయంలో చొరవ చూపాల్సింది కుటుంబ పెద్దలే. కఠినమైన ఆంక్షలతో కాకుండా సానుకూల ఆలోచనా ధోరణులతోనే పిల్లల్లో మార్పు తీసుకురాగలమన్న వాస్తవాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. భావిపౌరులను తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర తిరుగులేనిది. విద్యాలయాలు వారికి సామాజిక బాధ్యతలపట్ల అవగాహన కలిగించాలి. ఉపాధ్యాయులు నైతిక విలువల ప్రాధాన్యాన్ని తెలియజేయాలి. అపహరణ ముఠాలు, నేరస్తులపై కఠిన చర్యలు అవసరం. తద్వారా పరిస్థితిని కొంతవరకైనా నియంత్రించవచ్చు. అదృశ్య కేసులలో బాధితుల జాడను పసిగట్టి, వారిని ఇంటికి చేర్చినప్పుడే అసలైన న్యాయం జరుగుతుంది. తమవాళ్లు దూరమైనప్పుడు వారి కుటుంబ సభ్యులు అనుభవించే బాధ వర్ణనాతీతం. అరాచక శక్తులపై అనుక్షణం ఓ కన్నేసి ఉంచాలి. అపహరణ, వ్యక్తుల అదృశ్యం వంటి ఘటనలను నియంత్రించడంలో అందరూ కలసి పనిచేయాలి. ఆ బాధ్యత పోలీసులదో, ప్రభుత్వానిదో అని భావించరాదు. ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు సమకూరతాయి!

- వంగీపురం శ్రీనివాసాచారి

(రచయిత - జీవన నైపుణ్యాల నిపుణులు, విశ్లేషకులు)

## ఈనాడు లేఖలు

### సామాన్యుడికి 'రాజకీయ శరాఘాతం'

పశ్చిమ బంగలో చోటు చేసుకున్న రాజకీయ దుమారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం నెలకొన్న ఉద్రిక్తతలు ఇంకా సద్దుమణగలేదు. ఓ గ్రామంలో మొదలైన ఘర్షణలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. ఎన్నికల్లో 18 లోక్‌సభ స్థానాలు సాధించిన భాజపా, అసెంబ్లీ ఎన్నికల్లోనూ పట్టు బిగించేందుకు- హిందుత్వ అజెండాతో ముందుకు సాగుతోంది. భాజపాను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుండటంతో కోల్‌కతా రణరంగంగా మారుతోంది. ఈ రాజకీయ వికృత క్రీడలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంయమనం పాటించాలి.

- మాలోతు సురేష్, గుండ్లపహాడ్, సూర్యాపేటజిల్లా

### అధికారులూ భాగస్వాములు కావాలి

తెలంగాణలో నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామపంచాయతీల్లో సర్పంచి, ఉప సర్పంచులకు సంయుక్తంగా చెక్‌పవర్ కల్పించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఇది ఏ మేరకు సత్ఫలితాలను ఇస్తుందనేదీ చర్చనీయాంశమే. ఎందుకంటే వీరిరువురూ ఒకే పార్టీకి చెందినవారు కాకపోతే, వారి మధ్య ఆధిపత్యపోరు తలెత్తే అవకాశం ఉంది. ఒకే పార్టీవారైనా సమన్వయం లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరవేయడంలో గ్రామపంచాయతీల పాత్ర కీలకం. అందుకే సర్పంచి, ఉప సర్పంచులకు సంయుక్తంగా చెక్ పవర్ కల్పించడంపై కొన్ని జిల్లాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులనే కాకుండా, అధికారులనూ ఇందులో భాగస్వాములుగా చేయాలని కోరుతున్నారు. గతంలో మాదిరే సర్పంచి, కార్యదర్శులకే చెక్‌పవర్ కల్పించడం సబబన్న వాదన ఉంది. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

- బోడ నవీన్, రాజాపూర్, మహబూబ్‌నగర్

## సగుణోపాసన

హైందవ సంప్రదాయంలో ఉపాసనా విధానాలు రెండు. ఒకటి నిర్గుణోపాసన, రెండోది సగుణోపాసన. నామ, రూపరహిత దైవాన్ని ఉపాసించడం నిర్గుణోపాసన. భగవంతుడిని ఒక పేరుతో పిలుచుకొని, మూర్తిని పూజామందిరంలో ప్రతిష్ఠాపన చేసి, ఆవాహనచేసి, అందులోనే భగవంతుణ్ని చూసుకుంటూ షోడశోపచారాలు నిర్వర్తిస్తూ నామస్మరణం చేయడం సగుణోపాసన. విగ్రహారాధన, లేదా మూర్తి పూజ సగుణోపాసనకు చెందినది. నిర్గుణోపాసన అనేది పరమహంసలకు, పరమయోగులకే సాధ్యం. నిర్గుణోపాసన చేయాలంటే మొదట సగుణోపాసన అనే మెట్టు ఎక్కాలి.

మనిషి సహజంగా చంచల మనస్కుడు. తానొక చోట కూర్చుంటాడు. మనసు ప్రపంచమంతా తిరుగుతూనే ఉంటుంది. మనసుకు ఏకాగ్రత అవసరం. ఒక మూర్తిమీద దృష్టి కేంద్రీకరించి, ఏకాగ్రతతో పూజిస్తేకాని ఆ మనసుకు నిలకడ ఉండదు. అందుకే విగ్రహారాధన మీదనే ఎక్కువ మంది సాధకులు ఆధారపడతారు. దాన్నే విశ్వసిస్తారు.

భక్తి నవవిధాలుగా ఉన్నట్లే, సగుణోపాసనలోను షోడశోపచార విధానాలు, అంటే పదహారు శాస్త్రీయ ఉపాసనా విధానాలూ ఉన్నాయి. ధ్యానం, ఆవాహనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పాక్షతలు, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, నీరాజనం, మంత్రపుష్ప ఆత్మప్రదక్షిణ నమస్కారాలనే పదహారు- సగుణోపాసనలోని అంతర్భాగాలు.

సగుణోపాసకులు తమతమ విశ్వాసాలను అనుసరించి పరమాత్మను అనేక నామాలతో పిలుస్తారు. అనేక రూపాల్లో కొలుస్తారు. అందరి గమ్యమూ ఒక్కటే... దారులు వేరు, అంతే!

పరమభక్తుడు అన్నమయ్య 'బ్రహ్మమొక్కటే' అనగలిగాడు, శ్రీవేంకట రమణుడి దర్శనం పొందగలిగాడు. అది ఆయనకే సాధ్యమైంది. ప్రహ్లాదుడు, మీరా, కబీరు వంటి వారికి అది సాధ్యమైంది. మరి సామాన్యుల మాటేమిటి? అందుకే ఈ సగుణోపాసన.

విగ్రహారాధన మూఢాచారం కాదని, అది సాధకుడికి మొదటి పరీక్ష లాంటిదని విజ్ఞులు చెబుతారు. సేవా తత్పరత, ఏకాగ్రత, ఆత్మ సమర్పణ భావన సగుణోపాసనలో ప్రాథమికంగా ఉండవలసినవి. విగ్రహారాధన అనాదిగా ఉన్నదే. అన్ని దేశాల్లోనూ ఉన్నదే. పురాతన తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలు, శిల్పాలవల్ల ఈ సత్యం వెల్లడైంది.



అంతర్యామి

నారద, తుంబురుల గానం, వ్యాస వాల్మీకాది మహర్షుల జపం, త్యాగరాజు, రామదాసు, తుకారం వంటి వారి నాదోపాసన, శివకోటి, రామకోటి వంటివి రాయడం, పురాణ పఠనం, ప్రవచనం, తీర్థయాత్రలు... ఇలాంటివన్నీ సగుణోపాసనకు చెందినవే. చెట్టు, పుట్ట, గుట్ట, నది ఇలాంటి ప్రకృతికి సంబంధించినవన్నీ మనకు ఆరాధ్యాలు. భూమిని, ఆకాశాన్ని, వాయువును, అగ్నిని, నీటిని... ఈ పంచభూతాల్నీ మనం అర్చిస్తాం. వీటిలోనే మనం నమ్ముకున్న దేవుణ్ని దర్శిస్తాం.

ఒక్కో దేశానికి ఒక్కో జెండా ప్రతీక. అది వారి ప్రేమను, భక్తిని అందుకుంటోంది. అలాగే ఒక్కో వ్యక్తికి ఒక్కో దేవుడంటే నమ్మకం. దాన్నెవరూ కాదనలేరు. దేనికైనా మూలం భక్తి, విశ్వాసమే! అభిషేకం, జపం, యాగం, ప్రదక్షిణ, మొక్కుబడులు, వ్రతాలు, నోములు మొదలైన ప్రక్రియలు సగుణోపాసనకు సంబంధించినవే. విగ్రహారాధనలో దేహశుభ్రత, శుచికి, మనోనైర్మల్యానికి ప్రాధాన్యం ఉంటుంది. నేత్రాల ద్వారా విగ్రహాలలో భగవంతుణ్ని దర్శించడం, సంభావించడం అలవాటు చేసుకుంటే, ఆధ్యాత్మిక అనుభూతి పొందగలిగితే, అదే భగవంతుడి దగ్గరికి మనల్ని చేరుస్తుంది!

- చిమ్మపూడి శ్రీరామమూర్తి

Eenadu epaper



పోడు భూముల్లో మొక్కలు నాటడంలో నిమగ్నమైన అటవీ, పోలీసు సిబ్బంది

## కొత్తసార్సాల పోడు భూముల్లో మొక్కల పెంపకం

### భారీగా తరలివచ్చి నాటిన అటవీ అధికారులు, పోలీసులు

**కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కుమురం భీం జిల్లా కొత్తసార్సాలలో అటవీ అధికారిణిపై దాడిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, పోలీసు, అటవీ అధికారులు సోమవారం కంపార్ట్‌మెంట్ 133, 136లలోని పోడు భూముల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఆదివారం ఉదయమే ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి 500 మంది అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు, పోలీసు ఉన్నతాధికారులు 50కిపైగా వాహనాల్లో కొత్తసార్సాల గ్రామానికి తరలివచ్చారు. 22 వేల మొక్కలు లక్ష్యంగా నిర్ణయించుకొని మొదటి రోజు ఆరు వేల మొక్కలు నాటారు. కుమురం భీం ఎస్పీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు 133, 136 కంపార్ట్‌మెంట్లను తమ ఆధీనంలోకి తీసుకుని పటిష్ఠ భద్రత కల్పించారు.

## మీరంతా ఇలాగే చెప్పాలి..!

- అటవీ అధికారులదే తప్పు అని చెప్పాలని ఆదివాసీలకు ఎమ్మెల్యే కోనప్ప సూచించినట్లు వీడియో చక్కర్లు

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:** కుమురం భీం జిల్లాలో అటవీ అధికారులపై దాడి జరిగిన తర్వాత సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్ప.. రైతులు, ఆదివాసీలతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడినట్లుగా ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. "అటవీ అధికారులదే తప్పు అని చెప్పాలి. వారే ముందుగా దాడికి పాల్పడ్డారని చెప్పాలి. తరచూ అటవీ అధికారులు బెదిరిస్తున్నారని.. మీ భూముల్లో కందకాల తవ్వకాలు చేపట్టారని పేర్కొనాలి. 15 రోజుల క్రితం ఒకసారి, ఆదివారం కూడా దాడి చేశారని చెప్పాలి. విలేకరులకూ ఇదే విషయాన్ని వెల్లడించాలి" అని కోనప్ప చెబుతున్నట్లుగా వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

## చట్ట వ్యతిరేక చర్యలను ఉపేక్షించం: జావడేకర్

**ఈనాడు, దిల్లీ:** అటవీ అధికారులపై దాడులు వంటి చట్ట వ్యతిరేక చర్యలను ఉపేక్షించేది లేదని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ స్పష్టంచేశారు. తెలంగాణలో పర్యావరణ చట్టాలను అమలు చేస్తున్న అధికారిణిపై స్థానికులు దాడి చేశారని.. చట్టాలు అమలు చేసే సమయంలో ఇలాంటి ఘటనలు ఎదురైతే ఎలాంటి చర్యలు చేపడతారు? సదరు అధికారులకు ఎలాంటి హామీ ఇస్తారని సోమవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో భాజపా సభ్యుడు రాజీవ్ చంద్రశేఖర్ ప్రశ్నించారు. దీనిపై జావడేకర్ స్పందిస్తూ.. తెలంగాణలో అటవీ అధికారిణిపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలు ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నియంత్రణ సంస్థగా ఏ చర్యలు తీసుకోవాలో అవి తీసుకుంటామని తెలిపారు.

## పోలీసులను లోకువగా చూడొద్దు

- సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర వీడియోలు వద్దు
- హెచ్చరించిన రాచకొండ, సైబరాబాద్ సీపీలు

**నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే:** సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర వీడియోలు, సందేశాలకు ప్రచారం కల్పిస్తే చర్యలు తప్పవని రాచకొండ, సైబరాబాద్ సీపీలు మహేశ్ భగవత్, సజ్జనార్ హెచ్చరించారు. పోలీసులను తక్కువచేసి చూపించే వీడియోలు ఉండటంపైనా స్పందించారు. ఈ మేరకు సోమవారం వారు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. "11 నెలల కిందట ఆంధ్రప్రదేశ్‌లో కొందరు వ్యక్తులు మద్యం మత్తులో అటవీశాఖ అధికారులపై దాడి చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అయితే ఫేస్‌బుక్ ఖాతాదారుడొకరు ఓ అభ్యంతరకర వీడియోను పోస్ట్ చేశాడు. 'పోలీసులంటే విలువ లేకుండా పోయింది. ఒక ఎమ్మెల్సీ కొడుకు అంట. కాళ్లు పట్టుకుంటేనే ఎస్ఐ గారిని వదిలేస్తాడంట. పాపం ఎలా కొట్టారో చూడండి' అని దానికి తప్పుడు వ్యాఖ్యలు రాశాడు. మరికొందరు ఎక్కడో జరిగిన సంఘటనలను ఇక్కడ జరిగినట్టు పేర్కొంటున్నారు. పిల్లల్ని ఎత్తుకుపోయే ముఠాలు తిరుగుతున్నాయని కొందరు వాట్సాప్‌లో నకిలీ వీడియోలను షేర్ చేశారు. వీటిలో నిజాలు లేవు. అసత్యాలను ప్రచారం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు. చట్టాలను చేతుల్లోకి తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులపై దాడిచేస్తే ఉపేక్షించేది లేదు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తే రాచకొండ పోలీసు వాట్సాప్ నంబరు 94906 17111, సైబరాబాద్ పోలీసు వాట్సాప్ నంబరు 94906 17444లో ఫిర్యాదు చేయవచ్చు" అని సీపీలు సూచించారు.

## మాకూ ఆయుధాలు ఇవ్వండి

### అటవీశాఖ సిబ్బంది డిమాండ్

**ఈనాడు, హైదరాబాద్:** సంచలనం సృష్టించిన ఆసిఫాబాద్ జిల్లా ఉదంతం నేపథ్యంలో అటవీశాఖ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలన్న ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. తమను తాము రక్షించుకునేందుకైనా ఆయుధాలు ఇవ్వాల్సిందేనని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అటవీశాఖ సిబ్బందికి పరిమితస్థాయిలో ఆయుధాలు ఉండేవి. రాష్ట్ర విభజన అనంతరం వాటిని ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో అటవీశాఖ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వకూడదన్నది విధానంగా పెట్టుకున్నారు. గతంలో అటవీశాఖ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లోకి పోలీసులకు ప్రవేశం లేదు. దీన్ని సవరించిన ప్రభుత్వం అక్రమాలను అడ్డుకునేందుకు అటవీశాఖతో కలిసి పని చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. పోలీసులకు ఆయుధాలు ఉంటాయి కాబట్టి అటవీశాఖకు అవసరం లేదని భావించారు. కానీ తాజా ఘటన నేపథ్యంలో గతంలో ఉన్న ప్రతిపాదనకు ఆమోదం తెలపాలని, రేంజర్ ఆపై స్థాయి అధికారులకు ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రతిపాదనను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం ఆమోదం తెలిపితే ఇకమీదట అటవీశాఖ సిబ్బందికి ఆయుధాలు అందజేస్తారు.

## బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను నియమించాలి

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో చిన్నారుల సంరక్షణ కోసం వెంటనే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను నియమించాలని, పూర్తిస్థాయిలో సిబ్బంది, నిధులు ఇవ్వాలని బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రధాన సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి సమీర్ మాథుర్ కోరారు. బాలల సంక్షేమ కమిటీలు, బాలల న్యాయ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. బచ్‌పన్ బచావో ఆందోళన్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు బాలల న్యాయ చట్టం, సముర్నా బెహూరా తీర్పుపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. రాష్ట్రస్థాయి సదస్సులో ప్రస్తావనకు వచ్చిన అంశాల ఆధారంగా ప్రభుత్వానికి ఈ కమిటీ పలు సూచనలు చేసింది. సోమవారమిక్కడ బచ్‌పన్ బచావో ఆందోళన్ సలహాదారు సమీర్ మాథుర్, రాష్ట్ర సమన్వయకర్త చందన, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కూడిన కమిటీ మహిళాశిశు సంక్షేమ, న్యాయశాఖ అధికారులతో చర్చించి నివేదిక రూపొందించింది. ఈ నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే. జోషికి అందజేసింది.

# పోలీసులూ.. మౌనమేల!

- మహిళా అధికారి హాహాకారాలు చేస్తున్నా పట్టని సిబ్బంది
- అడ్డగోలుగా దాడి చేస్తున్నా అడ్డుకోలేని దైన్యం
- కాగజ్‌నగర్ ఘటనలో పోలీసు పాత్రపై విమర్శలు
- బదిలీలు, పోస్టింగుల్లో నేతల పాత్ర వల్లనేనని ఆరోపణలు

ఈనాడు - హైదరాబాద్

**చే**తిలో లాఠీలు, భుజాలకు ఆయుధాలు ఉన్నాయి. కళ్లెదుటే ఆందోళనకారులు అటవీశాఖ అధికారులపై దాడులకు తెగబడుతున్నా పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించ లేదు. దెబ్బలకు తాళలేక మహిళా సిబ్బంది హాహాకారాలు పెడుతున్నా వారు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. హక్కుల కోసం ఎలుగెత్తే ఆందోళనకారులపై ఎడాపెడా లాఠీలు ఝుళిపించే వాళ్లు మహిళా అధికారి, ఇతర సిబ్బందిపై దాడికి దిగిన వారిని కనీసం చెదరగొట్టడానికీ ముందుకు రాలేదు. దాడి దృశ్యాలు, అక్కడ పోలీసులు పోషించిన పాత్ర తదితరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకిలా ప్రవర్తించారన్నదీ చర్చనీయాంశమైంది. ఈ ఘటనకు సంబంధించి డీఎస్పీ, సీఐలపై సస్పెన్షన్ వేటు పడినా, అక్కడ పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరుపై లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందనే వాదన బలంగా వినిపిస్తోంది.

చట్టవిరుద్ధమైన పనులు ఏమి జరిగినా అడ్డుకోవడం, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం పోలీసుల ప్రాథమిక విధి. తమను తాము రక్షించుకునేందుకు, అవసరమైతే సామాన్యులకు రక్షణ కల్పించేందుకే ప్రభుత్వం వారికి లాఠీలు సహా ఆయుధాలు ఇచ్చింది. కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాల గ్రామంలో ఆదివారం జరిగిన ఘటనలో మాత్రం వారు వాటిలో ఏదీ ఉపయోగించలేదు. "పోడు వ్యవసాయాన్ని ఆపేందుకు అక్కడికి వెళ్లిన అటవీశాఖ సిబ్బంది రక్షణగా పోలీసులనూ వెంట తీసుకెళ్లారు. ఒకవేళ అనూహ్య పరిణామాలు తలెత్తితే అడ్డుకుంటారని, పరిస్థితి అదుపులోకి తెస్తారని ఊహించాం. అందుకు భిన్నంగా వారు వ్యవహరించడం మమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇలాగైతే స్మగ్లింగ్, కలప అక్రమ రవాణా వంటివి అడ్డుకోవడం ఎలా సాధ్యం" అని అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రశ్నిస్తున్నారు.

### ఎటు చూసినా వైఫల్యమే

గత కొంతకాలంగా పోడు వ్యవసాయంపై అక్కడ సమస్య రగులుతూనే ఉంది. ఈ స్థాయిలో కాకపోయినా స్థానికుల నుంచి వ్యతిరేకత ఉంటుందనే విషయం అందరికీ తెలుసు. పోలీసు సిబ్బంది తమ నిఘా వ్యవస్థ ద్వారా పరిస్థితిని అంచనా వేసి ఉంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడమో? ప్రజలతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడమో జరిగేది. ఈ దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. పోనీ ముందుగా అంచనా వేయలేకపోయారనుకుందాం. స్థానికులు అటవీశాఖ సిబ్బందిపై దాడులకు దిగిన వెంటనే లాఠీఛార్జి మొదలుపెట్టి ఉంటే పరిస్థితి ఇంత తీవ్రరూపం దాల్చేది కాదు. అదీ జరగలేదు.

### ఫ్రెండ్లీ పోలీసింగ్ కూడానా?

దురుసు ప్రవర్తన కారణంగా పోలీసుశాఖ పరువు పోతుందనే ఉద్దేశంతో గత కొంతకాలంగా 'ఫ్రెండ్లీ పోలీసింగ్' పేరుతో ప్రయోగాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలతో దురుసుగా ప్రవర్తించవద్దని, స్టేషన్‌కు వచ్చిన వారితో స్నేహపూర్వకంగా మెలగాలనేది దీని సిద్ధాంతం. ఆందోళనలు వంటివి జరిగినప్పుడు కూడా సాధ్యమైనంత వరకూ సామరస్యంగానే ఉండాలని అధికారులు పదేపదే చెబుతున్నారు. దీని వల్ల కూడా పోలీసులు సంయమనం పాటిస్తున్నారనే విమర్శలున్నాయి. "ఒకవేళ లాఠీ ఝుళిపిస్తే ఎవరో ఒకరు దాన్ని సెల్‌ఫోన్లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో ప్రసారం చేస్తున్నారు. దాని ఆధారంగా అధికారులు తమపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారు" అని కిందిస్థాయి సిబ్బంది వాపోతున్నారు.

ఏదేమైనా బదిలీలలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నివారించాలని, నిజాయతీ ఆధారంగానే పోస్టింగులు ఇచ్చినప్పుడే ఇలాంటి సమస్యలు తలెత్తవని నిపుణులు సూచిస్తున్నారు.

### రాజకీయ ప్రమేయమే కారణమా?

**పో**లీసుశాఖ బదిలీలలో రాజకీయ ప్రమేయం ఉందనేది కాదనలేని వాస్తవం. స్థానిక ప్రజాప్రతినిధులు లేఖలు ఇచ్చిన వారికే పోస్టింగులు ఇచ్చే సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతోందనేది నిష్ఠుర సత్యం. అలా ప్రజాప్రతినిధుల సిఫార్సుతో వస్తున్న పోలీసులు వారికి అనుకూలంగానే వ్యవహరించడం సహజం. కాగజ్‌నగర్ ఉదంతంలో సస్పెండయిన ఓ పోలీసు అధికారి స్థానిక శాసన సభ్యునితో సన్నిహితంగా ఉంటారనే ఆరోపణలున్నాయి. ఆ శాసనసభ్యుడి తమ్ముడే స్వయంగా రంగంలోకి దిగి వీరంగం వేయడంతో పోలీసులు ఏమీ చేయలేకపోయారనే విమర్శ వినిపిస్తోంది.

## ఎమ్మెల్యే వనమాపై కేసు

- ఆయన తనయుడితోపాటు మరో ముగ్గురిపైనా
- అటవీ శాఖ నిర్మాణ పనులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు నేపథ్యంలో



**లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే:** కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతోపాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. అటవీ శాఖ చేపడుతున్న నిర్మాణ పనులను అడ్డుకొని తమ విధులకు ఆటంకం కలిగించారంటూ కొత్తగూడెం డిప్యూటీ రేంజి అధికారి ఎం.రామకృష్ణ పిచ్చేశ్వర్(ఎం.ఆర్.పి.రావు) ఇచ్చిన ఫిర్యాదు మేరకు వనమా, ఆయన కుమారుడు రాఘవేందర్‌రావుతోపాటు మరో ముగ్గురిపై లక్ష్మీదేవిపల్లి ఎస్సై కొండపర్తి నరేశ్ సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణ పరిధిలోని ఇల్లెందు అడ్డరోడ్డు సమీపంలో అటవీ భూముల్లో ఆ శాఖ అధికారులు కిలోమీటరు మేర రక్షిత ప్రహరీ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ పనులను మొదట లక్ష్మీదేవిపల్లి మాజీ ఎంపీటీసీ పూనెం శ్రీను, ఖానాముద్దీన్, లింబ తదితరులు 90 మంది గిరిజనులను వెంటపెట్టుకొని వెళ్లి అడ్డుకొన్నారు. ఆ భూములు తమవేనని.. పట్టాలున్నాయని వాదించారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన డివిజనల్ ఫారెస్టు అధికారి సుతాన్.. హక్కు పత్రాలుంటే కార్యాలయానికి వచ్చి చూపాలని, పనులను నిలిపివేయొద్దని చెప్పి వెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఆయన తనయుడు రాఘవేందర్‌రావు అక్కడికివచ్చి పనులను నిలిపివేయాలని అటవీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్మాణ పనుల కోసం తీసిన గుంతలను వారు దగ్గరుండి గిరిజనులతో పూడ్చివేయించే ప్రయత్నం చేశారు. అనంతరం అటవీ సిబ్బంది మొత్తం వెళ్లిపోవాలని, అక్కడ ఎలాంటి పనులు చేయించొద్దని ఎమ్మెల్యే ఫోన్‌లో అటవీ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో అటవీ భూముల్లోకి ప్రవేశించి నిర్మాణ పనులను అడ్డుకొని తమ విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా తమపై దాడులు చేయాలని గిరిజనులను ప్రోత్సహించారంటూ ఎమ్మెల్యేతోపాటు నలుగురిపై డీఆర్వో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నేనెవరినీ బెదిరించలేదు: వనమా

అటవీ శాఖాధికారులను తాను బెదిరించలేదని కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గిరిజనులకు అన్యాయం జరుగుతుందని తెలిసి వెళ్లానని, అక్కడ అటవీ శాఖ అధికారులు ఎవరూ లేరన్నారు. స్థానికులు గుంతలు పూడ్చారే తప్ప తనకు సంబంధం లేదన్నారు. ఎవరివిధులకూ ఆటంకం కలిగించలేదన్నారు. గిరిజన ప్రజల కోసం జైలుకెళ్లేందుకైనా సిద్ధమే అన్నారు.

## నా ప్రాణాలకు రక్షణ కల్పించండి

- దాడికి గురైన అటవీ అధికారిణి అనిత నివేదన

**బన్సీలాల్‌పేట్, న్యూస్‌టుడే:** మళ్లీ విధుల్లో చేరిన తర్వాత తన ప్రాణాలకు రక్షణ ఉండదని.. ప్రభుత్వం రక్షణ కల్పించాలని దాడికి గురైన అటవీ అధికారిణి అనిత కోరారు. దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజధానిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. విధుల్లో భాగంగానే మొక్కలు నాటేందుకు సిబ్బందితో సార్సాల గ్రామంలోని అటవీ ప్రాంతానికి వెళ్లామన్నారు. అక్కడికి గ్రామస్థులు చేరుకొని పనులు అడ్డుకునే క్రమంలో పోలీసులు వారిని తీసుకెళ్లేందుకు ప్రయత్నించారని వివరించారు. అటుగా ఎమ్మెల్యే తమ్ముడు కృష్ణ వచ్చి పోలీసులను నెట్టేసి జీబులో ఎక్కించిన వారితోపాటు, మరికొందరు గ్రామస్థులతో వచ్చి తమపై కర్రలతో దాడి చేయడం ప్రారంభించారని తెలిపారు. ఆయన తనను టార్గెట్ చేసి కొట్టిన తర్వాత.. గ్రామస్థులూ కొట్టడం ప్రారంభించారన్నారు. కొట్టొద్దని వేడుకున్నా.. మహిళనని కూడా చూడకుండా దాడిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

### సీఎం బాధ్యత వహించాలి: ఆకుల విజయ

ఎమ్మెల్యేతో ప్రాణహాని ఉందని.. తన భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని అటవీశాఖ అధికారిణే కన్నీళ్లు పెట్టుకుంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ ప్రశ్నించారు. ఆమెకు ఏం జరిగినా.. సీఎం కేసీఆరే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన అనితను ఆమె పరామర్శించారు.



అనితను పరామర్శిస్తున్న ఆకుల విజయ

### ఆదివాసుల హక్కును గుర్తించాలి: కోదండరాం

అటవీ అధికారులపై జరిగిన దాడిని తెజస అధ్యక్షుడు కోదండరాం ఖండించారు. ఇప్పటికైనా అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి పోడు భూములపై ఆదివాసులకు ఉన్న హక్కును గుర్తించాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించి, పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. అటవీ అధికారులపై ఎమ్మెల్యే సోదరుడు, ఆయన అనుచరులు దాడి చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఖండించారు. కాగజ్‌నగర్ మండలంలో అధికారిణిపై దాడికి సంబంధించి వీలైనంత తొందరగా తమకు నివేదిక పంపాలని డీజీపీ మహేందర్‌రెడ్డికి జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖాశర్మ లేఖ రాశారు.

# అడవిని రక్షిస్తాం.. మమ్మల్ని మీరు కాపాడండి

- దాడులకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించండి
- ప్రభుత్వానికి అటవీ అధికారుల సంఘాల ప్రతినిధుల వినతి
- అధికారిణిపై దాడిని ఖండించిన నాయకులు



సచివాలయంలో సీఎస్‌ను కలిసిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న స్టేట్ ఫారెస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** అటవీ భూముల రక్షణకు తాము ముందుంటామని.. అదే సమయంలో తగిన రక్షణ కల్పించడంతోపాటు పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు ప్రభుత్వం సహకరించాలని అటవీ అధికారుల సంఘాల ప్రతినిధులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని 'అరణ్య భవన్'లో సమావేశమైన సంఘాల ప్రతినిధులు.. కాగజ్‌నగర్ మండలంలో విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడిని ఖండించారు. దాడి చేసిన వారితోపాటు దాని వెనకున్న పెద్దలపై విచారణ చేసి, కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వం తక్షణం స్పందించడాన్ని స్వాగతించారు. అయితే, అటవీ భూములను ఆక్రమించడమే కాకుండా అధికారులు, సిబ్బందిపై దాడులకు దిగుతున్నవారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. రాజకీయ జోక్యంతో సిబ్బందిపై దాడులు పెరుగుతున్న విషయాన్ని సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పి.రఘువీర్, ఉపాధ్యక్షుడు మునీంద్ర, కార్యదర్శి లోకేష్ జైస్వాల్, సంయుక్త కార్యదర్శి స్వర్గం శ్రీనివాస్, స్టేట్ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల అసోసియేషన్, జాయింట్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బాధ్యులపై పీడీ యాక్ట్ పెట్టండి

విధి నిర్వహణలో ఉన్న అటవీ శాఖ అధికారిణిపై అధికార పార్టీ ఎమ్మెల్యే తమ్ముడు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని స్టేట్ ఫారెస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇందుకు కారణమైన వారందరినీ అరెస్ట్ చేసి, పీడీ చట్టం కింద కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో సీఎస్ ఎస్‌కే జోషిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

### రెవెన్యూ, ఇంజినీర్ల సంఘాల నిరసన..

కుమురం భీం జిల్లా కొత్తసార్సాల గ్రామంలో ఎఫ్ఆర్వో అనితతోపాటు సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం రెవెన్యూ, ఇంజినీరింగ్ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో మధ్యాహ్న విరామ సమయంలో రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని జలసౌధ ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో హైదరాబాద్ ఇంజినీర్ల సంఘం, తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజినీర్ల సంఘం, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సంఘాల ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఘటనపై ప్రభుత్వానికి నివేదిక

కొత్తసార్సాల గ్రామంలో అటవీ సిబ్బందిపై దాడి ఘటనపై అటవీ శాఖ సోమవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఎఫ్ఆర్వో అనిత, ఇతర సిబ్బందిపై ఎమ్మెల్యే కోనప్ప సోదరుడు కృష్ణారావు, ఆయన అనుచరులు చేసిన దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ప్రశాంత్ కుమార్ ఇచ్చిన నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. మరోవైపు కొమురం భీం జిల్లాలో అటవీ సిబ్బందికి తగిన రక్షణ కల్పించేలా జిల్లా కలెక్టర్, ఎస్పీని ఆదేశించాలని అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాకు నివేదిక పంపినట్లు సమాచారం.

## తెరాస నేతలు గతంలోనూ ఇలా దాడులు చేశారు: తెదేపా

**ఈనాడు, హైదరాబాద్:** అటవీ శాఖ సిబ్బందిపై తెరాస నేతల దాడిని ఖండిస్తున్నట్లు తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తెరాస నేతలు గతంలోనూ అనేక మంది అధికారులపై ఇలాంటి దాడులకు పాల్పడ్డ ఘటనలున్నాయని పేర్కొన్నారు. పోడు భూముల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

## జాతీయ రహదారులుగా గెజిట్ విడుదల చేయండి: ఎంపీ కోమటిరెడ్డి

**ఈనాడు, దిల్లీ:** సూత్రప్రాయంగా ఆమోదించిన మార్గాలను వెంటనే జాతీయ రహదారులుగా పేర్కొంటూ గెజిట్ విడుదల చేయాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని సోమవారం ఆయన కలిశారు. తెలంగాణ వ్యాప్తంగా 3,155 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా పేర్కొన్నారని. . కానీ ఇప్పటివరకు 1388 కిలోమీటర్ల మేర మాత్రమే నోటిఫై చేశారని తెలిపారు. మిగిలిన 1767 కి.మీ. మేర 5 మార్గాలను వెంటనే జాతీయ రహదారులుగా ప్రకటించాలని కోరారు. అనంతరం కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. అటవీ శాఖ అధికారిణిపై దాడిని చూస్తే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా.. లేదా అనే అనుమానం కలుగుతోందన్నారు.

## కాగజ్‌నగర్ ఘటనపై కాంగ్రెస్ నిజ నిర్ధారణ కమిటీ

- నలుగురు ఎమ్మెల్యేలతో నియామకం
- బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావడానికి సీఎం కేసీఆర్ కారణం: భట్టివిక్రమార్క

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** సిర్పూర్ కాగజ్‌నగర్ అటవీ శాఖ అధికారి అనితపై ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు కృష్ణ, తెరాస నేతలు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఘటన పూర్వాపరాలు పరిశీలించేందుకు పార్టీ తరఫున నలుగురు ఎమ్మెల్యే(డి.శ్రీధర్‌బాబు, పొదెం వీరయ్య, సీతక్క, జగ్గారెడ్డి)లతో నిజ నిర్ధారణ కమిటి వేసింది. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. "ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావడానికి కారణమైన ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నాం. గిరిజనుల తిరుగుబాటుకు ప్రభుత్వ విధానాలే కారణం. క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకుని వారంరోజుల్లో సమగ్ర నివేదిక అందజేయాలని కమిటీని ఆదేశించాం" అని చెప్పారు.

### పోడు భూముల సమస్య పరిష్కరించాలి

అధికారాన్ని అడ్డంపెట్టుకుని తెరాస నాయకులు ఆటవికంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్కలు మండిపడ్డారు. పోడు భూముల సమస్యను పరిష్కరిస్తానన్న సీఎం కేసీఆర్.. ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జనం నుంచి తిరుగుబాటు రాకముందే సర్కారు మేల్కొని పరిష్కారం చూపాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాజధానిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అటవీశాఖ అధికారిణి అనితను ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు పరామర్శించారు.

**- శ్రీధర్‌బాబు, సీతక్క**

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అధికారులు విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తెరాస నాయకులు ఇలా దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**- ఎంపీ కోమటిరెడ్డి**

## మిషన్ భగీరథకు రూ.990 కోట్లు

- నాబార్డు నిర్ణయం
- ఆర్ఐడీఎఫ్ నిధులు కోరిన వివిధ శాఖలు

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో మిషన్ భగీరథకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.990 కోట్ల రుణం ఇవ్వాలని నాబార్డ్ నిర్ణయించింది. 2019-20 సంవత్సరానికి గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమం (ఆర్ఐడీఎఫ్) ద్వారా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పనకు వివిధ శాఖలకు తోడ్పాటును అందించేందుకు నాబార్డ్ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు ఇందులో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులకు నిధులివ్వాలని వైద్య ఆరోగ్యశాఖ కోరింది. ఆర్ఐడీఎఫ్ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధిక మొత్తం నిధులను మిషన్ భగీరథకు ఇవ్వనున్నట్లు నాబార్డ్ అధికారులు తెలిపారు. భగీరథ మిగిలిన పనులకు 85 శాతం నిధుల (రూ.990 కోట్లు)ను నాబార్డ్ ఇవ్వనుండగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.175 కోట్లను అందజేయనుంది. అదేవిధంగా రాష్ట్రంలో గిడ్డంగుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మార్కెటింగ్ శాఖ విజ్ఞప్తి చేసింది.

Eenadu epaper

## రైతులకు సాయం మంజూరుపై అఫిడవిట్ దాఖలు చేయండి: హైకోర్టు

### విచారణకు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి హాజరు



**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు రూ.22.34 కోట్ల మేర సాయం మంజూరు చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఆదిలాబాద్ జిల్లాలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోవడాన్ని సవాలుచేస్తూ ఆ జిల్లాకు చెందిన ఓ రైతు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. కోర్టు ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి విచారణకు హాజరయ్యారు. 2018, ఆగస్టు 11 నుంచి 23 వరకూ కురిసిన అకాల వర్షాలకు 12 జిల్లాల్లో 28,200 హెక్టార్ల మేర పంట దెబ్బతిందనీ... 51,000 మందికిపైగా రైతులు నష్టపోయారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.శరత్‌కుమార్ కోర్టుకు తెలిపారు. ఆదిలాబాద్‌లో 16,691 హెక్టార్ల పంట దెబ్బతినగా, రూ.12.13 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. పెట్టుబడి రాయితీ కింద రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రూ.22.34 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వీటికి సంబంధించి జీవోలు విడుదలయ్యాయనీ, ఆర్థికశాఖ కూడా ఆమోదించిందన్నారు. ఈ వివరాలన్నింటినీ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది.

## వారి బతుకులను బద్నాం చేస్తారా!

- మద్యం తాగి వాహనం నడిపారని కార్యాలయాలకు సమాచారమివ్వడం చట్ట విరుద్ధం
- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం

**ఈనాడు, హైదరాబాద్:** 'డ్రంక్ అండ్ డ్రైవ్' కేసుల్లో పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా... జరిమానా చెల్లించి, శిక్ష అనుభవించిన వారి వివరాలను కార్యాలయాలకు తెలియజేయడాన్ని ఆక్షేపిస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న వి.పృథ్వీకృష్ణ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం సోమవారం దీనిపై విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ- "మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ పోలీసులకు చిక్కిన వ్యక్తులు జరిమానా చెల్లిస్తున్నారు. జైలుశిక్ష కూడా అనుభవిస్తున్నారు. వారి వాహనాలను స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు లేదు. పైపెచ్చు ఈ విషయాన్ని సదరు వ్యక్తులు పనిచేస్తున్న సంస్థలకు తెలియజేస్తున్నారు. దీంతో యాజమాన్యాలు వారిని ఉద్యోగాలనుంచి తొలగిస్తున్నాయి. ఫలితంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పోలీసుల చర్య రాజ్యాంగ విరుద్ధం. చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేయడం కూడా" అని పేర్కొన్నారు. వాదనలను విన్న ధర్మాసనం.. హోంశాఖకు, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది.

## పరువు హత్యల నివారణకు తీసుకున్న చర్యలేంటి?

### తెలంగాణ సర్కారుకు హైకోర్టు నోటీసులు

**ఈనాడు, హైదరాబాద్:** పరువు హత్యల దర్యాప్తు నిమిత్తం సిట్ ఏర్పాటు విషయమై తెలంగాణ సర్కారుకు సోమవారం హైకోర్టు నోటీసులిచ్చింది. ఈ హత్యల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. గత రెండేళ్లలో జరిగిన పరువు హత్యలపై విచారణ నిమిత్తం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటుచేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ... హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త యు.సాంబశివరావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రఘునాథ్ వాదనలు వినిపించారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారిని పరువు పేరుతో కిరాతకంగా హత్య చేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇలాంటి దంపతులకు రక్షణ ఉండటం లేదనీ, హత్యలపై దర్యాప్తు కూడా సరిగా జరగడం లేదన్నారు. గత రెండేళ్లలో జరిగిన 36 పరువు హత్యలపై సిట్‌తో దర్యాప్తు చేయించి, హైకోర్టుకు నివేదిక సమర్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం... హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలతోపాటు రాచకొండ, వరంగల్, రంగారెడ్డి నగర పోలీసు కమిషనర్లు, ఘట్‌కేసర్, వరంగల్ జిల్లా పాలకుర్తి ఎస్‌హెచ్‌వోలకు నోటీసులు జారీచేసింది. పూర్తివివరాలతో 3వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 22కి వాయిదా వేసింది.

## రైల్వే కొత్త కాలపట్టిక విడుదల

**ఈనాడు, హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే రైళ్లకు సంబంధించి నూతన కాలపట్టిక (టైంటేబుల్)ను జీఎం గజానన్ మల్యా సోమవారం విడుదల చేశారు. ఈ కాలపట్టిక జులై 1నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. ఇతర జోన్ల నుంచి దక్షిణ మధ్య రైల్వే మీదుగా నడిచే రైళ్ల సవరణ సమయాన్ని సైతం ఇందులో పొందుపరిచారు. ఈ సందర్భంగా పలురైళ్ల వేగాన్ని పెంచుతూ సమయంలో మార్పులు చేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల వేగాన్ని పెంచుతూ ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు ప్రయత్నించినట్లు రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమంలో అదనపు జీఎం జాన్ థామస్, సీపీఆర్వో రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలల్లో మిగిలిన సీట్లకు నేడు స్పాట్ కౌన్సెలింగ్

రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో మిగిలిన సీట్లకు మంగళవారం (జులై 2) సరూర్‌నగర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో స్పాట్ కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రాంతీయ సమన్వయకర్త కె.శారద తెలిపారు. ఉదయం 8.30 గంటల సమయానికి అభ్యర్థులు చేరుకుని, 10 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గురుకుల కళాశాలల్లో ప్రవేశపరీక్షకు హాజరైన అభ్యర్థులు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు.

### భూపాలపల్లి కాకతీయ గని-2లో బొగ్గు తవ్వకంపై...

## ఎన్జీటీ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

**ఈనాడు, దిల్లీ:** తెలంగాణలోని భూపాలపల్లి కాకతీయ గని-2లో ఉపరితల బొగ్గు తవ్వకం పేరిట నివాసాలకు 500 మీటర్ల లోపు మైనింగ్, బ్లాస్టింగ్ చేయొద్దని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఎన్జీటీ ఆదేశాలను సవాలు చేస్తూ సింగరేణి కాలరీస్ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ హేమంత్‌గుప్తాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నివాసాలకు 500 మీటర్లకు దూరంగా మైనింగ్, బ్లాస్టింగ్ చేయడంపై కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనలు సడలించిందని, ఆ ప్రాంతంలోనూ తవ్వకం చేపట్టవచ్చని సింగరేణి తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఆత్మారాం నడకర్ణి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనల సడలింపు కారణంగానే మైనింగ్, బ్లాస్టింగ్ చేస్తున్నామని తెలిపారు. 500 మీటర్ల లోపు భూసేకరణ చేయాలంటే రూ.వందల కోట్లలో ఖర్చవుతుందన్నారు. ప్రజల మీద ప్రభావం చూపుతోందని ప్రతివాది అంటున్నారుగా అని జస్టిస్ లావు నాగేశ్వరరావు ప్రశ్నించారు. ప్రతివాదికి నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు. నిబంధనలు అమలు చేయాలనే తాము కోరుతున్నామని ప్రతివాది నాగవెల్లి రాజలింగం తరఫున న్యాయవాది శ్రావణ్‌కుమార్ కోర్టుకు తెలిపారు. 500 మీటర్ల లోపు బ్లాస్టింగ్, మైనింగ్ కొనసాగుతోంది కదా అని ప్రశ్నించిన న్యాయమూర్తి... ప్రతివాది తన స్పందనను ఆగస్టు 18 లోగా తెలియజేయాలని ఆదేశించారు. ఎన్జీటీ ఆదేశాలపై స్టే విధిస్తున్నట్లు ఆర్డర్ కాపీలో పేర్కొన్నారు.




**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**మార్కెటింగ్ విభాగం**

**ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

తేదీ: 01-07-2019

మార్కెటింగ్ విభాగం వారిచే దిగువ పేర్కొన్న ఐటమ్ సేకరణ నిమిత్తం ఈ- టెండర్లు కోరడమైనది.

| క్రమ సంఖ్య | ఐటమ్ పేరు | కాలం | ధరావతు (డి.డి) రూ॥లు | షెడ్యూలు డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేదీ |
|---|---|---|---|---|
| 1. | అగ్‌మార్క్‌తో కూడిన 8,500 టిన్నుల (ప్రతి టిన్నుకు 15కేజీల చొప్పున) గ్రేడ్-1 నువ్వుల నూనె | 6 నెలలు | 2,53,000/- | 01-07-2019 08-07-2019 |

వివరాలకు గాను లాగాన్ అవ్వవలసిన వెబ్‌సైట్: **http://www.tirumala.org** మరియు **https://tender.apeprocurement.gov.in** కరెంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి ఆపై "మోర్" మరియు "తిరుమల తిరుపతి దేవస్థానములు- మార్కెటింగ్"ను ఎంపిక చేసుకోవాలి. తదుపరి వివరాలకు గాను సంప్రదించవలసిన ఫోన్: 0877-2264070, 2264555. ఫ్యాక్స్ నెం.0877-2264554.

టెక్నికల్ బిడ్ తెరుచు తేదీ: 08-07-2019, మ॥ 3.30 గంటలకు

Roc.No.PR4/13908/Adv.No.144/PRO/2019, Dated: 01.07.2019

**కార్యనిర్వహణాధికారి**


# 7 నుంచి ఐచ్ఛికాల ఎంపిక!

- రెండో వారంలోపు కళాశాలల్లో చేరికకు తుది గడువు
- వేగంగా తొలివిడత వైద్యసీట్ల భర్తీ

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈనెల 5వ తేదీతో తొలివిడత ప్రవేశాల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తవుతుంది. వీటిలో పొరపాట్లు ఉంటే సర్దుకోవడానికి ఒకరోజు సమయమిస్తారు. 7వ తేదీ నుంచి 4 రోజుల పాటు వైద్యకళాశాలల ఐచ్ఛికాల ఎంపికకు గడువిస్తారు. 10న మధ్యాహ్నం వరకే వెబ్‌ఆప్షన్ల ఎంపికకు గడువిచ్చి, అదేరోజు రాత్రి తొలివిడత ప్రవేశాల ఫలితాలను విడుదల చేసే అవకాశాలున్నాయి. ఈనెల 11 నుంచి 14 వరకూ కేటాయించిన కళాశాలల్లో అభ్యర్థులు చేరడానికి గడువుగా ప్రకటించనున్నట్లు కాళోజీ ఆరోగ్య వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఈ నెల రెండోవారంలోగా తొలివిడత ప్రవేశ ప్రక్రియను పూర్తిచేసి, కన్వీనర్ కోటాలో రెండోవిడత ప్రవేశాలను ఈనెల 15 నుంచి నిర్వహించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈనెలాఖరులోగా కన్వీనర్ కోటాలో కనీసం రెండు విడతల ప్రవేశ ప్రక్రియలను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు కాళోజీ వర్సిటీ వర్గాలు తెలిపాయి.

### ప్రైవేటులో ఈడబ్ల్యూఎస్‌పై..

అగ్రవర్ణాల పేదలకు ఆర్థికంగా బలహీనవర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటా కింద వైద్యసీట్లను కేటాయించడానికి కూడా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కరుణాకరరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేటు వైద్యకళాశాలలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎన్ని సీట్లు కేటాయిస్తారనే విషయంలో స్పష్టత వస్తే.. సీట్ల కేటాయింపు సులభమవుతుందన్నారు. రాష్ట్రం నుంచి 10 వైద్యకళాశాలలు మాత్రమే ఈడబ్ల్యూఎస్ కోటాకు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ కళాశాలల్లోని మొత్తం సీట్లకు ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేస్తారా? కేవలం కన్వీనర్ కోటాకు ఇచ్చిన 50% సీట్ల మేరకే పరిమితం చేస్తారా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. పైగా ఈడబ్ల్యూఎస్ కోటా అమలుకు అంగీకరించిన కళాశాలలు తమ సీట్లలో 15 శాతాన్ని అఖిల భారత కోటాకు చేర్చాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రైవేటు వైద్యకళాశాలలు తమ మొత్తం సీట్లలో 50 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద ప్రభుత్వానికి ఇచ్చి ఉండటంతో.. ఆ కోటా నుంచే అఖిల భారత కోటాకు 15 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంటుందని వైద్యవర్గాలు భావిస్తున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని.. ప్రైవేటు కళాశాలల్లోని మొత్తం సీట్ల ప్రాతిపదికన ఈడబ్ల్యూఎస్ సీట్లను అదనంగా పెంచే అవకాశాలున్నట్లు వైద్యఆరోగ్యశాఖ వర్గాల అంచనా. అయితే ఎన్ని సీట్లను కేటాయిస్తే.. అన్ని సీట్ల మేరకే ఆయా కళాశాలల్లోనే ఈడబ్ల్యూఎస్ విధానాన్ని అమలు చేస్తారు. అఖిల భారత వైద్యవిద్య కోటాలోనూ ఇప్పటికే తొలివిడత ప్రక్రియ ప్రారంభమై ఉండటంతో.. ప్రైవేటు నుంచి అఖిల భారత కోటాలోకి చేరే సీట్లను రెండోవిడత ప్రవేశాలకు జతపరచనున్నట్లు తెలిసింది. ఒకట్రెండు రోజుల్లోనే ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లపై ఎంసీఐ నుంచి ఆదేశాలు వెలువడే అవకాశాలున్నాయి.

### నేడు యాజమాన్య కోటా ప్రవేశ ప్రకటన

రాష్ట్రంలోని ప్రైవేటు వైద్యకళాశాలల్లో యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను భర్తీ చేయడానికి ప్రవేశ ప్రకటనను మంగళవారం విడుదల చేసే అవకాశాలున్నాయి. నీట్ ర్యాంకుల ప్రాతిపదికనే ఈ సీట్లను భర్తీ చేస్తారు. యాజమాన్య కోటా సీట్లకు అఖిల భారత స్థాయిలో ప్రవేశాలను ఆహ్వానిస్తారు. ఈనెల 3 నుంచి సుమారు 10వ తేదీ వరకూ అభ్యర్థుల నుంచి నమోదును స్వీకరిస్తారు. 11-13 తేదీల మధ్యన అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడించే అవకాశాలున్నాయి. కళాశాలల్లో చేరడానికి కనీసం మూడు రోజుల సమయం ఇస్తారు. కన్వీనర్ కోటాలో తొలివిడత ప్రవేశాల్లో కళాశాలల్లో చేరికకు తుదిగడువు ముగిసిపోయిన అనంతరమే.. యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాల్లో సీట్లు పొందిన అభ్యర్థులు కళాశాలల్లో చేరికకు గడువు ఉండే విధంగా కాళోజీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాలో రుసుములు పెంచాలని కోరుతూ ప్రయివేటు కళాశాలల ప్రతినిధులు ఇటీవల ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఇది పరిశీలనలో ఉంది. ఒకటి రెండు రోజుల్లో దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి.

# ముఖం చూసి అనుమతి!

- శంషాబాద్ విమానాశ్రయంలో 'ఫేస్ రికగ్నిషన్' యంత్రం
- దేశంలో తొలిసారిగా అందుబాటులోకి




'ఫేస్ రికగ్నిషన్' యంత్రంలో వివరాలను నమోదు చేసుకుంటున్న ప్రయాణికుడు

**శంషాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే:** శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త అధ్యాయం సృష్టించింది! దేశంలోని మరే విమానాశ్రయంలోనూ లేని విధంగా, ఫేస్ రికగ్నిషన్ యంత్రాన్ని తొలిసారిగా అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికుల తాకిడి పెరుగుతుండటంతో... ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు చేసేందుకు భద్రతా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు విమానాశ్రయ అధికారులు ముఖ కవళికలను గుర్తించే ఫేస్ రికగ్నిషన్ యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. దేశీయ ప్రయాణికుల నిమిత్తం సోమవారం ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత ఫిబ్రవరి నుంచే ఉద్యోగులు, ఎయిర్‌లైన్స్ సిబ్బందిని గుర్తించేందుకు ఈ యంత్రాన్ని ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తూ వచ్చారు. సత్ఫలితాలు ఇవ్వడంతో ఇప్పుడు ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఈ సేవలు కేవలం చేతిసంచితో వచ్చే దేశీయ ప్రయాణికుల కోసం మాత్రమేనని, దశలవారీగా బ్యాగేజీ ప్రయాణికులకూ అందుబాటులోకి తెస్తామని విమానాశ్రయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

### ఒకసారి నమోదు చేసుకుంటే చాలు...

చేతిసంచితో వచ్చే దేశీయ ప్రయాణికులు విమానాశ్రయంలోని మూడో ద్వారం వద్ద ఏర్పాటుచేసిన ఫేస్ రికగ్నిషన్ యంత్రంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. వివరాలు ఇచ్చే క్రమంలోనే వారి ముఖ కవళికలు అందులో నిక్షిప్తమవుతాయి. ఒకసారి వివరాలు నమోదైతే చాలు! ఆ తర్వాత భవిష్యత్తులో ఎన్నిసార్లు వచ్చినా... యంత్రం క్షణాల్లో గుర్తించి లోనికి అనుమతిస్తుంది. తద్వారా తనిఖీల కోసం ప్రయాణికులకు నిరీక్షణ తప్పుతుంది.

## 5, 6 తేదీల్లో టీఎస్‌సెట్ పరీక్షలు

- తొలిసారిగా ఆన్‌లైన్ విధానం
- ఓయూ వీసీ రామచంద్రం వెల్లడి

**ఈనాడు, హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే:** టీఎస్‌సెట్ పరీక్షలను ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.రామచంద్రం తెలిపారు. ఓయూలో సోమవారం విలేకరుల సమావేశంలో టీఎస్ సెట్ వివరాలను ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఎస్‌సెట్ నిర్వహించడం ఇది మూడోసారి అని, ప్రయోగాత్మకంగా ఈ సారి ఆన్‌లైన్ విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది నగరాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 29 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తుండగా.. మొత్తం 44,648 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కనీసం గంట ముందు పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దివ్యాంగులకు సహాయం చేసేందుకు పరీక్ష కేంద్రాల్లోనే సహాయకులను అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య గోపాల్‌రెడ్డి, ఓఎస్డీ ఆచార్య కృష్ణారావు, టీఎస్‌సెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య యాదవరాజు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథకు సత్వర అనుమతులపై యూపీ బృందం ఆరా

**ఈనాడు, హైదరాబాద్:** మిషన్ భగీరథ ప్రాజెక్టుకు వివిధ శాఖల అనుమతులు వేగంగా రావటంపై ఉత్తర్‌ప్రదేశ్ అధికారుల బృందం ఆసక్తి చూపింది. పైపులైన్ల నిర్మాణానికి రైల్వే, అటవీ, జాతీయ రహదారులు తదితర శాఖల నుంచి అనుమతులు పొందిన విధానాన్ని ఇక్కడి అధికారులను అడిగి తెలుసుకొంది. భగీరథ పనితీరును తెలుసుకొనేందుకు ఉత్తర్‌ప్రదేశ్ తాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేంద్ర రామ్ నేతృత్వంలో ఇంజినీర్ల బృందం సోమవారం హైదరాబాద్ వచ్చింది. ఈ బృందం మరో రెండ్రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. నిరంతర సమన్వయం, సీఎం చొరవ కారణంగానే వివిధ శాఖల నుంచి అనుమతులు వేగంగా లభించాయని భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి వారికి వివరించారు.

## కాళేశ్వరం పై నిర్దేశిత నమూనాలో వినతి రాలేదు

**ఈనాడు, దిల్లీ:** కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి నిర్దేశిత నమూనాలో ఎలాంటి వినతి అందలేదని కేంద్ర జల్ శక్తి శాఖ సహాయ మంత్రి రతన్‌లాల్ కటారియా తెలిపారు. సోమవారం రాజ్యసభ సభ్యుడు ఎం.ఏ.ఖాన్ ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ లేఖ మాత్రం రాశారని తెలిపారు. 2020-21 నాటికి దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎంపీ బడుగుల లింగయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి కటారియా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. బడుగుల లింగయ్య అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి గడ్కరీ సమాధానమిస్తూ మెదక్-బాన్స్‌వాడ-రుద్రూర్, బాసర-భైంసా రహదారులను జాతీయ రహదారులుగా ఆమోదించలేదని తెలిపారు.

## నేటితో ముగియనున్న జోసా తొలి రౌండ్ ప్రవేశాల రిపోర్టింగ్

**వరంగల్(నిట్ క్యాంపస్), న్యూస్‌టుడే:** దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం జోసా కౌన్సెలింగ్ మొదటవిడతలో సీటు లభించిన విద్యార్థుల ప్రవేశాల రిపోర్టింగ్ గడువు మంగళవారంతో ముగియనుంది. తొలి రౌండ్‌లో సీటు లభించిన విద్యార్థులు సోమవారం వరకు 1056 మంది వరంగల్ నిట్‌లో రిపోర్టు చేశారు. తొలిరౌండ్ ప్రవేశాల రిపోర్టింగ్ గడువు మంగళవారం ముగుస్తుందని ప్రవేశాల అధికారులు తెలిపారు. రెండో రౌండ్‌లో సీటు లభించిన విద్యార్థుల వివరాలు జులై 3వ తేదీ సాయంత్రం జోసా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. సీటు లభించిన విద్యార్థులు 4, 5 తేదీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

# గురుకుల నియామకాలకు తొలగిన అడ్డంకి

- కొత్త జోనల్ విధానం మేరకు పోస్టుల ఖరారు
- త్వరలోనే ఉత్తర్వులు జారీచేయనున్న సర్కారు

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో నియామకాల ప్రక్రియ ప్రారంభించేందుకు మార్గం సుగమం అయింది. రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని నూతన జోన్ల ప్రకారం పోస్టులు, కేడర్ ఖరారు ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. గురుకుల నియామక బోర్డు, గురుకులాల సొసైటీలకు నూతన సర్వీసు నిబంధనలు పంపించనుంది. దీంతో గురుకుల నియామకాల ప్రక్రియకు ప్రతిబంధకాలు తొలగిపోయినట్లు అయింది. గురుకులాల్లో పోస్టులకు ప్రభుత్వం ప్రత్యేక బోర్డును నియమించి నియామకాలు చేపడుతోంది. ఇప్పటికే టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు ప్రకటనలు విడుదల చేసి, నియామకాలు పూర్తిచేసింది. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. తదుపరి ఉద్యోగ ప్రకటనలు జారీ చేయాలని భావించిన సమయంలో జిల్లా స్థానికత రిజర్వేషన్‌లో మార్పులు, జోన్ల పునర్విభజన చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో గురుకులాల్లో దాదాపు 4వేలకు పైగా పోస్టుల నియామక ప్రక్రియపై ప్రభావం పడింది. గురుకుల సొసైటీలు రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి వస్తాయా? లేదా? ప్రశ్నకు సరైన సమాధానాలు రాలేదు. ఈ క్రమంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లా, జోనల్, మల్టీజోనల్ పరిధిలోకి ఏయే పోస్టులు వస్తాయి? సర్వీసు నిబంధనలు, తదితర విషయాలతో దస్త్రం సిద్ధం చేసి సొసైటీలన్నీ సంయుక్తంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. మల్టీజోనల్ కింద డిగ్రీ లెక్చరర్, ప్రిన్సిపల్ పోస్టులు, జోనల్ విధానం కింద జేఎల్, పీజీటీ, టీజీటీ తదితర పోస్టులు, గ్రూప్-4 కింద జూనియర్ అసిస్టెంట్ అంతకు దిగువస్థాయి ఉద్యోగాలను పేర్కొంది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం తెలిపింది.

### దాదాపు 4 వేలకు పైగా పోస్టులు?

గురుకులాల్లో నియామకాలకు ప్రభుత్వం ఆమోదించిన పోస్టులు 4వేలకు పైగా ఉన్నాయి. ఏడాది క్రితమే ఆమోదించిన ఉద్యోగాలకు కొన్ని సాంకేతిక కారణాలతో ప్రకటనలు ఇవ్వలేదు. ఇవి దాదాపు 500 వరకు ఉండే అవకాశాలున్నాయి. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన గురుకులాల్లో 3689 ఉద్యోగాలను ఇప్పటికే మంజూరు చేసింది. వీటితో పాటు మరో 2వేల వరకు పోస్టుల భర్తీ ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. సర్వీసు నిబంధనల ఉత్తర్వులు వెలువడిన తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మళ్లీ మొదలుకానుంది. తొలుత బీసీ గురుకులాల్లో మంజూరైన పోస్టులను భర్తీ చేసే అవకాశాలున్నాయి.

## పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా.. సునీల్‌శర్మకు అదనపు బాధ్యతలు

**ఈనాడు, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా సునీల్‌శర్మకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న అకున్ సబర్వాల్ పది రోజులపాటు సెలవుపై వెళ్లటంతో రహదారులు-భవనాల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సునీల్‌శర్మకు ఆ బాధ్యతలు కేటాయించింది.

# మూడు భాషల్లో పాలమూరు జిల్లా వెబ్‌సైట్

- తెలుగు, ఆంగ్లంతోపాటు ఉర్దూలో రూపకల్పన

**మహబూబ్‌నగర్ అర్బన్, న్యూస్‌టుడే:** దేశంలోనే మొదటిసారిగా ఓ జిల్లా వెబ్‌సైట్‌ను మూడు భాషల్లో రూపొందించారు. మహబూబ్‌నగర్ జిల్లా వెబ్‌సైట్ ఇప్పటివరకు తెలుగు, ఆంగ్లంలోనే అందుబాటులో ఉండగా సోమవారం ఉర్దూలోనూ ప్రారంభించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ రెవెన్యూ సమావేశ మందిరంలో https://mahabubnagar.telangana.gov.in వెబ్‌సైట్‌ను కలెక్టర్ రొనాల్డ్‌రోస్ ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) అంతర్జాల వెబ్‌సైట్ ఆయా ప్రాంతాలవారీగా కేవలం రెండు భాషల్లో మాత్రమే ఉంటుందన్నారు. ముస్లింలకు జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాల వివరాలు తెలియజేయడానికి మహబూబ్‌నగర్ వెబ్‌సైట్‌ను ఉర్దూలో కూడా చూసేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

# తిరుమల జేఈవో శ్రీనివాసరాజు బదిలీ

- త్వరలో ధర్మారెడ్డి నియామకం!
- తిరుపతి జేఈవోగా బసంత్‌కుమార్



బసంత్ కుమార్



ధర్మారెడ్డి

**తిరుమల, అమరావతి, న్యూస్‌టుడే:** తితిదే తిరుమల సంయుక్త కార్యనిర్వహణాధికారి (జేఈవో) కె.ఎస్.శ్రీనివాసరాజును ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకుండా ఖాళీగా ఉంచుతూ తిరుపతి జేఈవోగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనరు పట్నాల బసంత్ కుమార్‌ను నియమించింది. తిరుపతి జేఈవోగా పని చేస్తున్న బి.లక్ష్మీకాంతం శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టును బసంత్ కుమార్‌తో భర్తీ చేయడంతోపాటు తిరుమల జేఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. మరోవైపు తిరుమల జేఈవోగా ఎ.వి.ధర్మారెడ్డి త్వరలోనే నియమితులు కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. కేంద్ర హోంశాఖలో సంయుక్త కార్యదర్శిగా పని చేస్తున్న ధర్మారెడ్డిని డిప్యుటేషన్‌పై తిరుమల జేఈవోగా నియమించేందుకు అనుమతించాల్సిందిగా ఏపీ సీఎం జగన్ ఇటీవల ప్రధానికి లేఖ రాశారు. దీనిపై సంప్రదింపులు సాగుతున్నాయి.

# కర్ణాటకలో రాజీనామాల కలకలం

- వైదొలగిన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- వారి బాటలో మరి కొందరు?
- అమెరికా పర్యటనలో సీఎం కుమారస్వామి

**ఈనాడు డిజిటల్, బెంగళూరు:** ముఖ్యమంత్రి కుమారస్వామి అమెరికా పర్యటనలో ఉన్న వేళ కర్ణాటకలో రాజకీయ కలకలం రేగింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామాలతో ఇబ్బందికర పరిస్థితులను సృష్టించారు. విజయపుర- హొసపేటె ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్ సోమవారం స్పీకరు, గవర్నరులకు రాజీనామా సమర్పించారు. ఎప్పటి నుంచో రాజీనామా చేస్తానని ప్రకటిస్తున్న గోకాక్ ఎమ్మెల్యే రమేశ్ జార్ఖిహోళి ముంబయి నుంచి ఫ్యాక్స్ ద్వారా తన రాజీనామాను స్పీకర్‌కు పంపారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్- జనతాదళ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కాంగ్రెస్ పార్టీ తనను నిర్లక్ష్యం చేస్తోందని ప్రకటించిన రమేశ్ జార్ఖిహోళి- 'నేనొక్కడినే కాదు.. నాతోపాటు ఐదుగురు రాజీనామా చేస్తారు' అని ప్రకటించారు. ఇద్దరి రాజీనామాలతో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, మంత్రి డి.కె.శివకుమార్ అత్యవసరంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వం పతనం కావాలంటే కనీసం 15 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి. కేవలం ఒకరిద్దరితో సమస్య ఉండదని పీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు ప్రతిస్పందించారు. భాజపాకు వ్యతిరేకంగా అవసరమైతే 'రివర్స్ ఆపరేషన్' చేస్తామని ఆయన హెచ్చరించారు.

### కాంగ్రెస్‌లో అంతర్మథనం

లోక్‌సభ ఎన్నికల్లో కేవలం ఒక్కో స్థానానికే పరిమితమైన కాంగ్రెస్, జేడీఎస్ మిత్రపక్షాలు పొత్తును కొనసాగించడంపై మల్లగుల్లాలు పడుతున్నాయి. కాంగ్రెస్‌లో కీలక నేతలంతా పొత్తుతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని మదనపడుతూ ఇటీవల ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలిసి చెప్పారు. అవసరమైతే మధ్యంతర ఎన్నికలకూ వెళ్దామన్న అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో నెలకొంది. మరోవైపు రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు ఎటువంటి షరతులు లేకుండా తమ వద్దకు రావాలని తాజాగా భాజపా నేతలు ఆంక్షలు విధించినట్లు సమాచారం. రాజీనామా పరిణామాలను అమెరికా నుంచి గమనిస్తున్న ముఖ్యమంత్రి కుమారస్వామి అసంతృప్తులతో ఫోన్‌ద్వారా మాట్లాడుతున్నారు.

# తప్పులు పునరావృతం కావొద్దు

- బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారు?
- ఇంటర్ బోర్డు అధికారులతో గవర్నర్ నరసింహన్

**ఈనాడు, హైదరాబాద్:** ఇంటర్‌మీడియట్ మూల్యాంకనం, ఫలితాల విడుదలలో ఇకనుంచి తప్పులు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గవర్నర్ నరసింహన్ ఇంటర్‌బోర్డు అధికారులను ఆదేశించారు. తప్పులకు బాధ్యులైన వారిని గుర్తించారా? ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇంటర్ బోర్డు విశ్వసనీయత దెబ్బతినే పరిస్థితి తీసుకురావొద్దని వ్యాఖ్యానించినట్లు సమాచారం. విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సోమవారం దాదాపు గంటపాటు సమావేశమై సమీక్షించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఇంటర్‌లో ఎందుకు వేలాది మందికి సున్నా మార్కులు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇంటర్‌బోర్డు పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇక ముందు ఎలాంటి తప్పులు జరగకుండా సిబ్బందిలో నైపుణ్యత పెంచాలని, అందుకు శిక్షణ ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా తాము తీసుకుంటున్న చర్యలను ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్ గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. గతంలోనూ కొన్ని చిన్న తప్పులు జరిగాయని, ఈసారి గోరంతను కొండంత చేశారని, హైకోర్టు సైతం క్లీన్‌చిట్ ఇచ్చిందని చెప్పినట్లు తెలిసింది. మొత్తానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితిని బాగా అభివృద్ధి చేయాలని గవర్నర్ ఆదేశించారు. ఇంటర్, డిగ్రీ తదితర కళాశాలలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఉన్నత విద్యలో యూజీసీ గుర్తింపు పొందిన కోర్సులనే అందించాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు ఆచార్య ఆర్.లింబాద్రి, వెంకటరమణ, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిత్తల్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూతానికి భుజంగాసనం

ప్రస్తుతం వాయు కాలుష్యంతో పాటు శ్వాస సమస్యలూ పెరిగిపోతున్నాయి. వీటికి భుజంగాసనంతో కళ్లెం వేసుకోవచ్చు. ఎందుకంటే ఇది ఛాతీని, ఊపిరితిత్తులను బలోపేతం చేస్తుంది. అంతేకాదు, గుండెకూ బలాన్ని చేకూరుస్తుంది. పొట్టలోని కొవ్వును కరిగిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. అయితే ఈ ఆసనాన్ని అల్సర్లు, హెర్నియా గలవారు, గర్భిణులు వేయకూడదు.

**ఎలా చేయాలి?**

బోర్లా పడుకొని శరీరం మొత్తాన్ని పూర్తిగా సాగదీయాలి. రెండు పాదాల వేళ్లు, మడమలు తాకేలా చూసుకోవాలి. అరచేతులను ఛాతీ పక్కలకు తీసుకొచ్చి, నేలకు ఆనించాలి. శ్వాసను తీసుకుంటూ నెమ్మదిగా తల, ఛాతీని పైకి లేపాలి. మోచేతులు నేలకు ఆని ఉండేలా చూసుకోవాలి. కొద్దిసేపయ్యాక శ్వాసను వదులుతూ తిరిగి మామూలు స్థితికి రావాలి.

ఇది అలవడిన తర్వాత మరింత ముందుకు సాగొచ్చు. ఈ దశలో ఛాతీకి దగ్గరగా అరచేతులను నేలకు ఆనించాలి. బలాన్ని చేతులపై మోపుతూ.. శ్వాసను తీసుకుంటూ తల, ఛాతీ, కడుపు భాగాన్ని పైకి లేపాలి. కొద్దిసేపు అలాగే ఉండి శ్వాసను వదులుతూ తిరిగి మామూలు స్థితికి రావాలి.





## మన కాంతి - మన ఆరోగ్యం

# కిరణజన్య ఆరోగ్యక్రియ!

**చీకటిని జయించామని గొప్పలకు పోతున్నాం. రాత్రుళ్లనూ పగళ్లుగా మార్చేసుకున్నామని పొంగి పోతున్నాం. పట్ట పగటి వేళలోనూ తలుపులు, కిటికీలు బిగించుకొని మిరుమిట్లు గొలిపే బల్బుల కాంతిధారల కింద తడిసి ముద్దయిపోతున్నాం. అంతేనా? రేయనకా పగలనకా డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబెట్లు, స్మార్ట్‌ఫోన్లు ముందేసుకొని నీలి కాంతిధారులైపోతున్నాం. కానీ కృత్రిమ వెలుగుల మాయలో పడిపోయి సహజకాంతికి దూరమవుతున్నామనే విషయాన్ని మరచిపోతున్నాం. ఇదేమంత మంచి పరిణామం కాదని శాస్త్రవేత్తలు చాలాకాలంగా చెబుతూనే ఉన్నారు. దీంతో శారీరకంగా, మానసికంగా ఎన్నెన్నో సమస్యలు చుట్టుముడుతున్నాయనీ ఘోషిస్తున్నారు. పగటి వెలుగు, సహజకాంతి ప్రాముఖ్యాన్నీ, రాత్రి చీకటి అవసరాన్నీ గుర్తించాలని ఉద్బోధిస్తున్నారు. మన జీవన చక్రానికి, మనుగడకు మూలమైన 'మన కాంతి'ని ఒడిసిపట్టుకొని ఆరోగ్యాన్ని పుంజుకోవాలని సూచిస్తున్నారు.**

మన జీవన గమనం వేగం పుంజుకుంది. పొద్దున లేచింది మొదలు ఉరుకులు, పరుగులు. ఉంటే ఇంట్లో.. లేదంటే ఆఫీసులో. రోజంతా నీడపట్టుననే. బల్బుల ధగద్ధగల కిందే. దీంతో ఎంతోమంది అమూల్యమైన సహజకాంతికి, ఎండకు దూరమైపోతున్నారు. రోజులో చాలా సేపు.. రాత్రిపూట అయితే మరింత ఎక్కువగా కృత్రిమకాంతుల మధ్యలోనే జీవితాలు గడిపేస్తున్నారు. కంప్యూటర్లు, టీవీలు, మొబైల్ ఫోన్ల నుంచి వెలువడే నీలం కాంతి దీనికి మరింత ఆజ్యం పోస్తోంది. ఇది మన జీవన గమనాన్ని శాసించే ఒంట్లోని జీవగడియారాన్ని, నిద్ర తీరుతెన్నులను అస్తవ్యస్తం చేసేస్తోంది. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ఎన్నెన్నో జీవనశైలి సమస్యలకు ఇదే మూలమవుతోందన్నా అతిశయోక్తి కాదు. అనాదిగా మన జీవన గమనానికి వెలుగు, చీకటి.. రాత్రి, పగళ్లే ఆధారం. ఉదయం పూట ఆహారాన్వేషణ, పనులు.. రాత్రి పూట నిద్ర, విశ్రాంతికి మూలం ఇవే. ఆకలిదప్పులు, ఆరోగ్యం అన్నీ వీటితోనే ముడిపడుతూ వచ్చాయి. విద్యుత్ అందుబాటులోకి రావటంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. బుడ్డి దీపాల స్థానంలో మిరుమిట్లు గొలిపే కాంతి సందోహం మొదలైంది. ఫ్లోరోసెంట్, ఎల్ఈడీల వంటి కొత్తరకం బల్బుల రాకతో మరింత ఊపందుకుంది. పరిశ్రమలు, పట్టణీకరణ, కొత్తరకం ఉద్యోగాల పుణ్యమాని నీడ పట్టున ఉండటం, కృత్రిమ కాంతుల మధ్య గడపడటం పెరిగిపోయింది. ఎంతోమందికి చర్మానికి ఎండ తగలటమే గగనమైపోయింది. ఎండ సమక్షంలోనే మన చర్మం విటమిన్ డిని తయారుచేసుకుంటుంది. ఇది లోపిస్తే రోగ నిరోధకవ్యవస్థ క్షీణిస్తుంది. గుండె, రక్తనాళాల పనితీరు దెబ్బతింటుంది. మధుమేహం వంటి ఎన్నో సమస్యలు ముంచుకొస్తాయి. అదృష్టమేంటంటే- సహజకాంతిలో గడిపే సమయాన్ని కాస్త పెంచుకున్నా నిద్ర, మానసిక స్థితి (మూడ్) మెరుగుపడటం. తీవ్రమైన జబ్బుల నుంచీ త్వరగా కోలుకునే వీలుండటం. మరి ఇంతటి అమూల్యమైన సహజకాంతిని, ఎండను దూరం చేసుకోవటమెందుకు? ఎవరికి వారు ప్రశ్నించుకోవాల్సిన ప్రశ్న ఇది. కళ్లు తెరవాల్సిన తరుణమిది. బయటి ప్రదేశాల్లో ఏటా 2% కృత్రిమకాంతి పెరిగిపోతున్నట్టు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్న నేపథ్యంలో ఇది మరింత అవసరం.

### సత్వర ఉపశమనం

జబ్బులు, చికిత్సల నుంచి త్వరగా కోలుకోవటానికీ సహజకాంతి తోడ్పడుతుంది. కాంతి ప్రకాశాన్ని లక్స్‌లలో కొలుస్తారు. పగటి వెలుగు ప్రతి 100 లక్స్‌లు పెరిగినకొద్దీ గుండె శస్త్రచికిత్సల నుంచి కోలుకునే వ్యవధి 7.3 గంటల మేరకు తగ్గుతుండటం విశేషం. దీనికి కారణం సహజకాంతి సమక్షంలో గుండెకు చేరుకునే రోగనిరోధక కణాల సంఖ్య, వాటి రకాలు పెరగటమే. ఇది ఎలుకలపై చేసిన అధ్యయనంలో స్పష్టంగా బయటపడింది. కాంతి సరిగా పడని బోనుల్లో పెట్టిన ఎలుకల గుండె కండరం మరింత ఎక్కువగా దెబ్బతింటున్నట్టు, అవి త్వరగా చనిపోతున్నట్టు తేలింది.

### జీవగడియారం అస్తవ్యస్తం

మన కంటి వెనకాల రాడ్, కోన్ కణాలుంటాయి. దృశ్యాలను ఏర్పరచుకోవటంలో మెదడుకు సాయం చేసేవి ఇవే. వీటికి తోడు కాంతికి ప్రతిస్పందించే రెటీనల్ గాంగ్లియాన్ (ఐపీఆర్‌జీసీ) కణాలూ ఉంటాయి. ఇవి ప్రకాశవంతమైన ఎలాంటి కాంతికైనా ఉత్తేజితమవుతాయి గానీ వర్ణపటంలోని నీలి భాగానికి మరింత ఎక్కువగా ప్రతిస్పందిస్తాయి. మన మెదడులో చురుకుదనాన్ని నియంత్రించే భాగానికి ఎప్పటికప్పుడు సంకేతాలు పంపుతాయి. గంట సేపు స్వల్ప తీవ్రతతో కూడిన నీలికాంతి ప్రభావానికి గురైనవారిలో ప్రతిస్పందనల వేగం రెండు కప్పుల కాఫీ తాగినంత సమానంగా ఉంటోందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇది మంచిదేగా అనిపించొచ్చు. కానీ రెటీనల్ గాంగ్లియాన్ కణాలు మెదడులోని ప్రధాన జీవగడియారానికీ (సుప్రఖియాస్మాటిక్ న్యూక్లియస్) సంకేతాలు పంపుతాయి. ఇక్కడే మొదలవుతుంది అసలు సమస్య. సాయంత్రం వేళల్లో ప్రకాశవంతమైన కాంతులకు గురైతే జీవగడియారం పనితీరూ అస్తవ్యస్తమవుతుంది. ఇది నిద్రను దెబ్బతీస్తుంది. ఎల్ఈడీ బల్బులు.. టీవీలు, డెస్క్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, స్మార్ట్‌ఫోన్ల తెరల నుంచి వెలువడేది నీలం కాంతే. చీకటివేళల్లో ప్రకాశవంతమైన కాంతి మూలంగా నిద్రను ప్రేరేపించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో నిద్ర పట్టటం ఆలస్యమవుతుంది. నిద్ర పట్టినా అరకొరగానే పడుతుంది. హాయిగా నిద్రపోయామనే భావన ఉండదు. పగటిపూట మరింత అలసటకూ లోనవుతుంటారు. నిద్రలేమితో మధుమేహం, ఊబకాయం, కుంగుబాటు వంటి ఎన్నెన్నో సమస్యలెన్నో చుట్టుముడతాయి.

● పగటి కాంతిలో ఎక్కువగా గడిపేవారు రాత్రిపూట గాఢంగా నిద్రపోతున్నారని, ఉదయం లేచాక మరింతగా హాయి భావన పొందుతున్నారని డచ్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. ఒకవేళ అర్ధరాత్రి లేవాల్సి వచ్చినా మర్నాడు అంత మగతగా ఏమీ ఉండటం లేదనీ వెల్లడైంది. బయటి వెలుగు పడే కిటికీ పక్కన కూచోవటం, ఆరుబయట మధ్యాహ్న భోజనం చేసే ఉద్యోగులు త్వరగా, మరింత ఎక్కువసేపు నిద్రపోతున్నట్టూ పరిశోధకులు గుర్తించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు బయటి వెలుగులో గడిపినవారు సగటున 18 నిమిషాల్లోనే నిద్రపోతుండగా.. తక్కువ వెలుతురులో గడిపినవారికి 45 నిమిషాలైనా కంటి మీద కునుకే రావటం లేదు.

### తెరలకు దగ్గరైనకొద్దీ..

డిజిటల్ పరికరాల తెర పరిమాణం పెరుగుతున్నకొద్దీ నీలం-తెలుపు కాంతీ విడుదలా పెరుగుతుంది. మెలటోనిన్ ఉత్పత్తి అస్తవ్యస్తం కావటానికి ఇలాంటి కాంతి గంటకు 85 లక్స్‌లు తాకితే (యుక్తవయసు పిల్లలకైతే 71 లక్స్‌లు) చాలు. ఫోన్ల వంటి చిన్న పరికరాలతో ఎక్కువసేపు గడిపినా ఇలాంటి ప్రమాదమే పొంచి ఉంటుంది. అయితే టీవీని 2 మీటర్లు, అంతకన్నా ఎక్కువ దూరం నుంచి చూస్తే పెద్ద ఇబ్బందేమీ ఉండటం లేదని పరిశోధకులు చెబుతున్నారు. అంటే పరికరాల తెరలకు ఎంత దగ్గరగా ఉంటే అంత ఎక్కువ ప్రమాదం పొంచి ఉంటోందన్నమాట.

### మనసుంటే మార్గముంది!

ప్రతి ఒక్కరూ ఆరుబయట నడవలేకపోవచ్చు. ఆఫీసుకు సైకిళ్ల మీద వెళ్లలేకపోవచ్చు. వెలుగు బాగా వచ్చే పెద్ద పెద్ద కిటికీల పక్కన కూచునే అవకాశం లేకపోవచ్చు. కానీ నీడ పట్టునా కొన్ని మార్పులతో మంచి ప్రయోజనం పొందొచ్చు.

**పగటిపూట..**

- రోజూ పెందలాడే నిద్రలేవటం, లేచిన వెంటనే కిటికీల తెరలను పక్కకు తీయటం మంచిది.
- ఇంట్లో ఎండ, బాగా వెలుగు పడే చోట అల్పాహారం తినటం మేలు. వీలైతే బయట, మేడ మీదా తినొచ్చు. సహజకాంతిని ఆస్వాదిస్తూ కాఫీ, టీ వంటివి సేవిస్తే ఆ మజానే వేరు.
- వీలైనప్పుడల్లా బయటకు వెళ్లి నాలుగడుగులు వేయాలి. సైకిల్ తొక్కినా మంచిదే.
- ఆఫీసులో కిటికీ పక్కన కూచోవచ్చు. బాగా వెలుగు పడేలా ఏర్పాట్లు చేసుకోవచ్చు.
- నీడ పట్టున చేసే వ్యాయామాలను ఆరుబయటకు మార్చుకోవచ్చు.

**సాయంత్రాన..**

- సహజకాంతిని పోలిన, తక్కువ వెలుగునిచ్చే బల్బులు వాడుకోవాలి.
- చదువుకోవటం వంటి పనులు చేసేటప్పుడు గోడ, కప్పులకు అమర్చే లైట్ల కన్నా టేబుల్ లైట్ ఉపయోగించటం మంచిది.
- శరీరం ఇచ్చే సంకేతాలను గమనిస్తూ.. నిద్ర వస్తున్నట్టు అనిపించగానే పడకగదికి చేరుకోవాలి.
- వీధి దీపాల కాంతి పడకగదిలోకి ప్రవేశించకుండా కిటికీలకు మందమైన తెరలు వాడుకోవాలి.

### పగటి వెలుగు ఎంత కావాలి?

మనకు ఎంత వెలుగు అవసరం? రోజులో ఎప్పుడు అవసరం? ఎంత తరచుగా అవసరం? అనేది ప్రస్తుతానికి కచ్చితంగా తెలియదు. అయినప్పటికీ పగటిపూట ఎక్కువ వెలుగు, రాత్రిపూట ఎక్కువ చీకటిగా ఉండేలా చూసుకోవటం తప్పనిసరి. మనం 24 గంటల కాలచక్రంలో పగలు, రాత్రి.. వెలుగు, చీకటి చట్రంలోనే పరిణామం చెందుతూ వచ్చాం. ఈ క్రమాన్ని దెబ్బతీసుకోకుండా చూసుకోవటం, ఎక్కడైనా తప్పటడుగు వేస్తే సరిదిద్దుకోవటం నేటి తక్షణావసరం. పగటి వెలుగు ఎంత కావాలనేది ఆయా అవసరాలను బట్టి ఆధారపడి ఉంటుంది. జీవగడియార వ్యవస్థ సరిదిద్దుకోవటానికి ఉదయం పూట అరగంట సేపు సహజకాంతి తగిలేలా చూసుకుంటే చాలు. అదే చురుకుగా ఉండాలంటే మాత్రం రోజంతా పగటి వెలుగు కావాలి.

### ఎన్నెన్నో ప్రయోజనాలు

● **మధుమేహ, క్యాన్సర్ల నివారణ:** రోజులో సరైన సమయానికి ఒంటికి సహజకాంతి తగలకపోతే జీవగడియారం అస్తవ్యస్తమై నిద్ర దెబ్బతింటుంది. ఇది దీర్ఘకాలం కొనసాగితే మధుమేహం, క్యాన్సర్ల వంటి ఎన్నో సమస్యలు చుట్టుముడతాయి.

● **ఇన్‌ఫెక్షన్లు తగ్గుముఖం:** గాలి, వెలుతురు ధారాళంగా వస్తుంటే హానికర సూక్ష్మక్రిములు వ్యాపించటం తగ్గుతుంది. దీంతో జలుబు వంటి ఇన్‌ఫెక్షన్లూ తగ్గుముఖం పడతాయి.

● **కుంగుబాటు దూరం:** తగినంత ఎండ తగలకపోతే మెదడులో సెరటోనిన్ స్థాయులు తగ్గిపోతాయి. ఇది కుంగుబాటుకు దారితీస్తుంది. ఆయా కాలాల్లో.. ముఖ్యంగా చలికాలంలో కొందరికి కుంగుబాటు రావటానికి ఒంటికి ఎండ తగలకపోవటమే ప్రధాన కారణమని భావిస్తున్నారు. సహజకాంతి మన కణాల్లోని జీవగడియారాలు సమర్థంగా పనిచేసేలా చేస్తుంది. ఇది కుంగుబాటు తగ్గటానికి తోడ్పడుతుంది. కాంతికి స్పందించే రెటీనల్ గాంగ్లియాన్ కణాలు మెదడులోని ప్రధాన జీవగడియారంతోనే కాదు, మూడ్‌ను నియంత్రించే థలమస్‌నూ ప్రేరేపిస్తాయి. అంటే సహజకాంతి జీవగడియారాల మీదే కాదు, మూడ్ మీదా ప్రత్యక్ష ప్రభావం చూపుతోందన్నమాట. ఇలా ఇది మానసిక స్థితిని, ఉత్సాహాన్ని ఇనుమడింపజేస్తూ.. విచారం, ఆందోళన వంటివి దరిజేరకుండా కాపాడుతుందన్నమాట.

● **ఉత్సాహం, చురుకుదనం:** ఎండ, ప్రకాశవంతమైన కాంతితో చురుకుదనమూ పుంజుకుంటుంది. ఉదయం వేళల్లో ఒంటికి, కంటికి ప్రకాశవంతమైన కాంతి తగిలినవారిలో ప్రతిస్పందన వేగం అధికంగా ఉంటుంది. ఇది రోజంతా కొనసాగుతుండటమే కాదు.. పడుకోవటానికి ముందు నీలంకాంతి ప్రభావానికి గురైనా జీవగడియారం అస్తవ్యస్తం కావటాన్నీ నివారిస్తుండటం విశేషం. అంటే రాత్రి వెలుగుల దుష్ప్రభావాల తీవ్రత ఉదయం పూట తగిలే కాంతి మీదా ఆధారపడి ఉంటుందన్నమాట. ఫ్లోరోసెంట్ వంటి బల్బులు వర్ణపటంలోని పాక్షిక కాంతి తరంగాలనే వెలువరిస్తాయి. దీంతో త్వరగా అలసట ముంచుకొస్తుంది. సహజకాంతితోనైతే ఇలాంటి ఇబ్బందేమీ ఉండదు.

● **కంటి చూపు మెరుగు:** సంతోషాన్ని ఇనుమడింపజేసే డోపమైన్ కంటి ఎదుగుదలలోనూ పాలు పంచుకుంటుంది. తగినంత సహజకాంతి తగిలేలా చూసుకుంటే డోపమైన్ ఉత్పత్తీ పుంజుకుంటుంది. అందువల్ల ఇది పిల్లలకు మరింత మేలు చేస్తుంది.

● **రక్తపోటు తగ్గుతుంది:** చర్మానికి ఎండ తగిలినపుడు రక్తనాళాలు విప్పారతాయి. దీంతో రక్తపోటు తగ్గుముఖం పడుతుంది. ఫలితంగా గుండెజబ్బుల ముప్పూ తగ్గుతుంది.

## సమస్య - సలహా

### ప్లీహం పెద్దగా అయ్యిందెందుకు?

**సమస్య:** ఇటీవల మా స్నేహితుడు ప్లేట్‌లెట్లు తగ్గాయని ఆసుపత్రికి వెళ్లాడు. డాక్టర్‌కు అనుమానం వచ్చి అల్ట్రాసౌండ్ పరీక్ష చేయించారు. అందులో ప్లీహం పెద్దగా (15 సెం.మీ.) అయినట్టు తేలింది ఇదేం సమస్య? ఇలా ఎందుకు జరుగుతుంది? దీనికి పరిష్కారమేంటి?

– జి.లక్ష్మణ్, హైదరాబాద్

**సలహా:** దీన్ని స్ప్లీనోమెగాలే అంటారు. అంటే ప్లీహం (స్ప్లీన్) పెద్దగా అవటం. నిజానికి ఇదొక లక్షణమే. అసలు సమస్య ఇతర అవయాల్లో ఉంటుందని గుర్తించాలి. ప్లీహం మన లింఫ్ వ్యవస్థలో భాగం. ఇది రక్తం ఆరోగ్యంగా ఉండటానికి, ఇన్‌ఫెక్షన్లతో పోరాడటానికి తోడ్పడుతుంది. తనలోంచి రక్తం ప్రవహించే సమయంలో రక్తంలోని బ్యాక్టీరియా, మృత కణజాలం వంటి వాటినిది తినేస్తుంది. తెల్ల



రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఆరోగ్యంగా ఉండటానికీ దోహదం చేస్తుంది. మామూలుగా ప్లీహం పిడికెడంతే ఉంటుంది. కొందరిలో దీని సైజు పెరిగి పెద్దగా అవుతుంటుంది. ఇందుకు రకరకాల అంశాలు దోహదం చేయొచ్చు. కాలేయ జబ్బు, కాలేయం గట్టిపడటం (సిరోసిస్), కాలేయానికి రక్తాన్ని తీసుకెళ్లే సిరలో రక్తం గడ్డకట్టటం వంటి సమస్యలెన్నో ప్లీహం పెద్దగా అవటానికి దారితీయొచ్చు. మలేరియా వంటి ఇన్‌ఫెక్షన్లు, రక్తకణాలు చిట్లిపోయేలా చేసే రక్త సమస్యల్లోనూ ఇలా జరగొచ్చు. కొందరికి లింఫ్ వ్యవస్థలో క్యాన్సర్ (లింఫోమా) మూలంగానూ ప్లీహం పెరగొచ్చు. కాబట్టి ముందు కారణాలేంటన్నది నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుంది. కాలేయ సామర్థ్య పరీక్ష, అల్ట్రాసౌండ్ చేయాల్సి ఉంటుంది. వీటి ఫలితాలు నార్మల్‌గా ఉంటే రక్త సమస్యలేవైనా ఉన్నాయేమో పరీక్షించాల్సి ఉంటుంది. రక్తకణాల సంఖ్య, రక్తం చిట్లిపోవటం వంటివి ఉంటే ఇందులో బయటపడతాయి. ఇవన్నీ నార్మల్‌గా ఉంటే గతంలో వచ్చిన ఇన్‌ఫెక్షన్లు కారణమవుతున్నాయేమో పరిశీలిస్తారు. ఇలా కారణాలన్నీ విశ్లేషించిన తర్వాతే తగు చికిత్స చేయాల్సి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లతో ముడిపడిందైతే జనరల్ ఫిజిషియన్, కాలేయంతో ముడిపడిందైతే గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, రక్త సమస్యలైతే హెమటాలజిస్టు, లింఫోమా కారణమైతే క్యాన్సర్ నిపుణులు చికిత్స చేస్తారు.



– డా॥ కె.జగన్మోహనరావు
గ్యాస్ట్రోఎంటెరాలజిస్టు

### అర్ధరాత్రి దాటాక భోజనం.. పరగడుపు మాత్రలు వేసుకోవచ్చా?

**సమస్య:** ఎప్పుడైనా అర్ధరాత్రి దాటిన తర్వాత భోజనం చేస్తే.. మర్నాడు పరగడుపున వేసుకోవాల్సిన మాత్రలు వేసుకోవచ్చా?

–విఘ్నేశ్, హైదరాబాద్



**సలహా:** అర్ధరాత్రి దాటాక భోజనం చేసినవారిలో చాలామందికి ఇలాంటి సందేహం వస్తుంటుంది. సాధారణంగా మనం తిన్న ఆహారం 45 నిమిషాల్లో జీర్ణాశయంలోంచి చిన్న పేగుల్లోకి వెళ్లటం ఆరంభిస్తుంది. మధుమేహం, నాడీ సమస్యలు గలవారిలోనైతే ఇంకాస్త ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని మాత్రలు జీర్ణాశయంలోనే విచ్ఛిన్నమవుతాయి, కొన్ని చిన్న పేగుల్లో విడిపోతాయి. ఏదేమైనా పరగడుపున వేసుకునే మాత్రలకు భోజనం చేసిన తర్వాత 2-4 గంటల సమయం ఉంటే సరిపోతుంది. అప్పుడు ఖాళీ కడుపుతో వేసుకోవాల్సిన మాత్రలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఒకవేళ పరగడుపున మాత్ర వేసుకోవటం మరచిపోతే వీలైనంత త్వరగా వేసుకోవచ్చు. ఒకవేళ అల్పాహారం లేదా భోజనం చేస్తే.. ఆ తర్వాత 2 గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి.



– డా॥ ఎం.వి.రావు
జనరల్ ఫిజిషియన్

## పిల్లలకెంత వ్యాయామం?

వ్యాయామం, శారీరకశ్రమను చాలామంది పెద్దల వ్యవహారంగానే చూస్తుంటారు. పిల్లలకూ వ్యాయామం అత్యవసరం. ఎదిగే వయసులో కండరాలు, ఎముకలు బలపడటానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. ఆరేళ్లు, అంతకన్నా ఎక్కువ వయసు పిల్లలు రోజుకు కనీసం గంట సేపు వ్యాయామం, శారీరకశ్రమ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు ఆటలంటే చాలా ఇష్టం. ఇవీ వ్యాయామాలుగా ఉపకరిస్తాయి. రక్తంలో ఆక్సిజన్ స్థాయులను పెంచే నడక, పరుగు, ఈత, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, డ్యాన్స్.. ఇలాంటివేవైనా ఎంచుకోవచ్చు. అలాగే కాస్త కష్టమైన వ్యాయామాలను వారానికి కనీసం మూడు రోజుల పాటైనా చేసేలా చూసుకోవాలి. 3-5 ఏళ్ల పిల్లలనైతే రోజంతా చురుకుగా కదిలేలా, రకరకాల ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఎక్కువసేపు ఒకేదగ్గర కూర్చోకుండా చూసుకోవటం ముఖ్యం. చిన్నప్పుడే వ్యాయామం చేయటం అలవడితే అది జీవితాంతం కొనసాగటానికి అవకాశం ఉంటుంది. కాబట్టి చిన్నప్పట్నుంచే వ్యాయామం పట్ల మక్కువను పెంచితే, దాన్ని క్రమం తప్పకుండా కొనసాగించేలా చేస్తే ముమ్ముందు మంచి ఆరోగ్యానికి బాటలు వేసినట్టే.





**వ్యాయామ లాభాలు..**

- వయసుకు తగ్గ ఎదుగుదల పుంజుకుంటుంది
- కండరాలు, ఎముకలు బలోపేతమవుతాయి
- అధికబరువు ముప్పు తగ్గుతుంది
- శరీర సౌష్ఠవం మెరుగవుతుంది
- పెద్దయ్యాక మధుమేహం వచ్చే అవకాశం తగ్గుతుంది
- రక్తపోటు, రక్తంలో కొలెస్ట్రాల్ తక్కువవుతాయి
- చురుకుదనం, ఉత్సాహం ఇనుమడిస్తాయి
- ఆశావహ దృక్పథం, ఆత్మ విశ్వాసం పెంపొందుతాయి
- ఏకాగ్రత, చదువుల్లో నైపుణ్యం పెరుగుతాయి

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా
సమస్య – సలహా సుఖీభవ ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in

Eenadu epaper

# ఈనాడు సినిమా

## విజయాల కొరత
# తీర్చింది కుర్రకారే


'118'


'మజిలీ'

సినిమాల్లో చిన్న పెద్ద అనే తేడా ఏమీ ఉండదని... విజయవంతమైతే ప్రతిదీ పెద్దదే అనేది సినీ పండితులు చెప్పే మాట. అయితే సినిమాకి పెట్టే వ్యయం... అందులో నటులు.. అంచనాల్ని బట్టి పరిశ్రమ వర్గాలు చిన్న పెద్ద అని విడదీస్తుంటాయి. అగ్ర తారలు నటించే చిత్రాలు నెలకి ఒకట్రెండుకి మించి రావు. పరిమిత వ్యయంతో తెరకెక్కే చిత్రాలు మాత్రం వారానికి రెండు మూడు చొప్పున విడుదలవుతుంటాయి. చిత్రసీమ ఎప్పుడూ సందడిగా ఉండేది వాటితోనే. అందులో ఒక్క సినిమా విజయవంతమైనా ఆ స్ఫూర్తితో మరిన్ని సినిమాలు కొబ్బరికాయ కొట్టుకుంటాయి. అందుకే చిన్న సినిమాల ఫలితాల గురించి కొండంత ఆశతో ఎదురు చూస్తుంటుంది చిత్రసీమ. గడిచిన ఆర్నెళ్ల కాలంలో స్టార్ కథానాయకుల చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చినవి కొన్నే. అందులో విజయ తీరాలకి చేరినవెన్నో వేళ్లమీద లెక్క పెట్టొచ్చు. పరిమిత వ్యయంతో తెరకెక్కిన చిన్న చిత్రాలు మాత్రం బాక్సాఫీసు ముందుకు వరుస కట్టాయి. గత రెండు వారాల్లోనే పది సినిమాలొచ్చాయంటే ఆ ఉద్ధృతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆర్నెళ్లలో మంచి వసూళ్లు రాబట్టింది... బాక్సాఫీసుకి విజయాల రుచి చూపించింది కూడా పరిమిత, మధ్యస్థ వ్యయంతో తెరకెక్కిన చిత్రాలే.

తొలి ఆర్నెళ్లు తెలుగు చిత్రసీమకి కీలకం. సంక్రాంతి, వేసవిలాంటి బలమైన సీజన్లు ఈ ఆర్నెళ్లలోనే వస్తాయి కాబట్టి అగ్ర కథానాయకుల చిత్రాలు పెద్దయెత్తున ముస్తాబవుతుంటాయి. క్రికెట్‌లో ఓపెనర్లుగా స్టార్ బ్యాట్స్‌మెన్లు ఎలా దిగుతారో... అలా సంక్రాంతికి స్టార్ కథానాయకుల చిత్రాలు విడుదలవుతుంటాయి. ఆ సినిమాలు బాగున్నాయంటే కొత్త రికార్డులు నమోదు అవుతుంటాయి. బాక్సాఫీసు దగ్గర వసూళ్ల ప్రభంజనం కనిపిస్తుంటుంది. అయితే ఈసారి సంక్రాంతి నిరాశపరిచింది. 'ఎఫ్2' మినహా మిగిలిన చిత్రాలేవీ ఆకట్టుకోలేదు. రామ్ చరణ్, బాలకృష్ణ, రజనీకాంత్ లాంటి అగ్ర తారల చిత్రాలొచ్చినా ప్రభావం చూపించలేకపోయాయి. దాంతో వేసవి సీజనే ఆధారమైంది. ఈసారి వేసవిలో విడుదలైన చిత్రాలు ఎక్కువగా యువ కథానాయకులు నటించినవే. క్రికెట్‌లో ఓపెనర్లు నిరాశపరిచినా.. నాలుగైదు స్థానాల్లో వచ్చే ఆటగాళ్లు నిలదొక్కుకుని మెరుపులు మెరిపిస్తే ఎలా ఉంటుందో అలా వేసవిలో వచ్చిన యువ కథానాయకులు అదరగొట్టారు. కళ తప్పిన బాక్సాఫీసుకి ఊరట కలిగించారు.


'జెర్సీ'

**ఆ రెండు నెలలు:** సంక్రాంతికొచ్చిన 'ఎఫ్2' తర్వాత లాభాల్ని రుచి చూసిన చిత్రం 'యాత్ర'. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవితం ఆధారంగా, పరిమిత వ్యయంతోనే తెరకెక్కిన ఆ చిత్రం మంచి వసూళ్లని రాబట్టింది. ఆ తర్వాత వేసవి సీజన్‌ని '118'తో విజయవంతంగా ఆరంభించాడు కల్యాణ్ రామ్. థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఆ చిత్రం నిర్మాతకి రూపాయికి రెండు రూపాయలు లాభాల్ని తెచ్చిపెట్టింది. మధ్యలో కొన్ని వారాలు ఏ సినిమా కూడా నిలబడలేకపోయింది. 'సూర్యకాంతం', 'లక్ష్మీస్ ఎన్టీఆర్' విడుదలైనా అవి ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయాయి. వేసవి సెలవులు మొదలైన ఏప్రిల్‌లో మాత్రం సినీ ప్రేమికులు చక్కటి వినోదాన్ని ఆస్వాదించారు. నాగచైతన్య 'మజిలీ', సాయిధరమ్ తేజ్ 'చిత్రలహరి', నాని 'జెర్సీ' చిత్రాలు వరుసగా ప్రేక్షకుల ముందుకొచ్చి మెప్పించాయి. ఆయా కథల్లో నవ్యత, కథానాయకుల నటన, దర్శకుల ప్రతిభ గురించి ప్రేక్షకులు ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ ఇప్పుడు గాడిన పడిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మే నెల మొత్తం మహేష్ 'మహర్షి' హంగామానే సాగింది. ఏప్రిల్ తరహాలో మళ్లీ వరుస విజయాల పరంపర కొనసాగింది మాత్రం జూన్‌లోనే. 'ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ', 'మల్లేశం', 'బ్రోచేవారెవరురా' విజయం సాధించాయి. 'మల్లేశం' మంచి సినిమాగా పేరు తెచ్చుకోగా, 'ఏజంట్..', 'బ్రోచేవారెవరురా' చక్కటి వసూళ్లు సాధిస్తున్నాయి. ఈ మూడూ పరిమిత వ్యయంతో తెరకెక్కినవే. యువతరం నటులు ప్రధాన పాత్రధారులుగా కొత్త తరం దర్శకులు తెరకెక్కించిన ఈ చిత్రాలు ప్రస్తుతం మంచి వసూళ్లు రాబట్టుకొంటున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో విడుదలైన 'ఫలక్‌నుమా దాస్', 'గేమ్ ఓవర్' కూడా ఆకట్టుకున్నాయి. 'ఎఫ్2', 'మహర్షి' చిత్రాలు రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టినా... 'కల్కి' బీ, సీ సెంటర్లలో సందడి చేస్తున్నా... తొలి ఆర్నెళ్లలో పరిమిత వ్యయంతో రూపొందిన యువ కథానాయకుల చిత్రాలే విజయాల కొరతని తీర్చాయి. వచ్చే ఆర్నెళ్లలో స్టార్ హీరోల సందడి ఎక్కువగా ఉండబోతోంది. ప్రభాస్ 'సాహో', చిరంజీవి 'సైరా..', నాగార్జున 'మన్మథుడు2', వెంకటేష్ - నాగచైతన్యల 'వెంకీమామ' చిత్రాలు రాబోతున్నాయి. అవి అంచనాలకి తగ్గట్టు విజయవంతమైతే ద్వితీయార్థం సుఖాంతమైనట్టే.


'చిత్రలహరి'


'బ్రోచేవారెవరురా'


'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'


'మల్లేశం'


'యాత్ర'

## కేరళలో ఏం జరిగింది?


సాయిపల్లవి

సాయిపల్లవి కథా నాయికగా నటించిన మలయాళ చిత్రం 'అథిరన్'. వివేక్ దర్శకుడు. ఈ చిత్రాన్ని తెలుగులోనూ విడుదల చేస్తున్నారు. ఏకే కుమార్, జి.రవికుమార్ నిర్మాతలు. అనువాద కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాతలు మాట్లాడుతూ "కేరళలో 1970ల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమిది. సైకలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగుతుంది. ప్రకాష్‌రాజ్, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో కనిపిస్తారు. సాయి పల్లవి నటన ఆకట్టుకుంటుంది. త్వరలోనే తెలుగు టైటిల్‌ని ప్రకటిస్తామ"న్నారు. సంగీతం: జిబ్రాన్.

## 'దొరసాని' ప్రేమకథ


శివాత్మిక, సుకుమార్, ఆనంద్ దేవరకొండ, మధుర శ్రీధర్ రెడ్డి, కె.వి.ఆర్. మహేంద్ర

ఆనంద్ దేవరకొండ, శివాత్మిక జంటగా నటించిన చిత్రం 'దొరసాని'. కె.వి.ఆర్. మహేంద్ర దర్శకుడు. మధుర శ్రీధర్ రెడ్డి, యష్ రంగినేని నిర్మాతలు. సోమవారం హైదరాబాద్‌లో దర్శకుడు సుకుమార్ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ప్రచార చిత్రం చూడగానే ప్రేక్షకులకి నచ్చుతుందనిపించింది. నిజాయతీ ఉన్న ఈ ప్రేమకథను వాస్తవికతతో తెరకెక్కించారు దర్శకుడు. నాయకానాయికలూ అంతే సహజంగా చేశార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ కథ నన్ను ఆరేళ్లు నిద్రపోనివ్వలేదు. 1980 కాలం నాటి ప్రేమకథ ఇది. అప్పటి వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ప్రేక్షకులకి నచ్చేలా చూపించే ప్రయత్నం చేశా" అన్నారు. "సహజమైన ప్రేమకథని దర్శకుడు అంతే సహజత్వంతో చూపార"న్నారు జీవితా రాజశేఖర్. "అభినయానికి ఆస్కారమున్న దొరసాని పాత్రలో నటించే అవకాశమిచ్చిన దర్శకనిర్మాతలకి ధన్యవాదాలు" అంది శివాత్మిక. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ "ప్రత్యేకమైన చిత్రమిది. అంచనాలు లేకుండా థియేటర్‌కి రండి. ఆస్వాదించండ"న్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "మహేంద్ర నిజాయతీతో చేసిన ప్రయత్నమిది. 12న విడుదల చేస్తున్నామ"న్నారు. దొరస్వామి, సంగీతదర్శకుడు ప్రశాంత్ విహారి, ఛాయాగ్రాహకుడు సన్నీ, వెంకట్ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఎర్రచీర'లో శ్రీకాంత్


శ్రీకాంత్

సత్య సుమన్ బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎర్రచీర'. శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో శ్రీకాంత్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "హారర్ నేపథ్యంలో సాగే చిత్రమిది. యాక్షన్ అంశాలకు పెద్ద పీట వేశాం. శ్రీకాంత్ పాత్రకు ప్రాధాన్యం ఉంది. శ్రీరాం, అలీల నటన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆగస్టు చివరి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.

## నటన తన రక్తంలోనే ఉంది


బాబి, మేఘాంశ్, ఎమ్.ఎల్.వి.సత్యనారాయణ, సాయి కిరణ్, శాంతి, అర్జున్, నక్షత్ర

శ్రీహరి తనయుడు మేఘాంశ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'రాజ్‌దూత్'. నక్షత్ర, ప్రియాంక వర్మ కథానాయికలు. అర్జున్ - కార్తీక్ దర్శకత్వం వహించారు. ఎమ్.ఎల్.వి.సత్యనారాయణ నిర్మాత. హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. శాంతి శ్రీహరి మాట్లాడుతూ "మా అబ్బాయి మేఘాంశ్ చిన్నప్పుడే 'భైరవ' చిత్రంలో నటించాడు. పాఠాలు సరిగా చదివేవాడు కాదు. సినిమా డైలాగులు మాత్రం బాగా గుర్తు పెట్టుకునేవాడు. నటన తన రక్తంలోనే ఉందని అప్పుడే అర్థమైంది. ప్రచార చిత్రం చూశాక శ్రీహరిగారి పేరు నిలబెడతాడన్న నమ్మకం కలిగింద"న్నారు. "నాన్న లేకపోవడంతో మమ్మల్ని పెంచడానికి అమ్మ చాలా కష్టపడింది. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. చాలా తక్కువ సమయంలో పూర్తి చేయగలిగాం. ఈ నెల 5న విడుదల చేస్తున్నామ"న్నారు మేఘాంశ్. "శ్రీహరి నటించిన 'భద్రాద్రి'తో రచయితగా నా ప్రస్థానం ప్రారంభమైంది. ఆయనలో నాకు దేవుడు కనిపించేవారు. ఆయన పిల్లలకూ అంతా మంచే జరగాల"న్నారు దర్శకుడు బాబి. "కథ చెప్పగానే మూడు రోజుల్లోనే సినిమా ఓకే అయిపోయింది. మమ్మల్ని నమ్మి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతల"న్నారు దర్శకులు. కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్, రవికుమార్ చౌదరి, దేవి ప్రసాద్, ఇ.సత్తిబాబు, విజయ్, అభిషేక్ నామా, సాయికిరణ్ యాదవ్, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అమ్మాయిలూ జాగ్రత్త


షేర్

"అబ్బాయిల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అమ్మాయిల్ని హెచ్చరించే చిత్రమే మా 'కె.ఎస్.100'" అంటున్నారు షేర్. ఆయన దర్శకత్వం వహించిన చిత్రమిది. సమీర్‌ఖాన్, అజీమ్, సునీతపాండే, శైలజా తివారి, ఆషీరాయ్, శ్రద్ధాశర్మ, అక్షతా మాధవ్ ప్రధాన పాత్రధారులు. వెంకట్రామ్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో షేర్ మాట్లాడుతూ "ఇదివరకు 'షాలిని' అనే చిత్రం చేశా. వందరోజులు ఆడింది. 'కె.ఎస్.100' కూడా హారర్ చిత్రమే. కె అంటే కుమార్, ఎస్ అంటే స్వామి. వీళ్లిద్దరూ మిత్రులు. అమ్మాయిలతో వీళ్లకి ఉన్న సంబంధాలేంటి? అనేదే కథ" అన్నారు. "హైదరాబాద్‌లో నా చదువు అవగానే అమెరికా వెళ్లా. ఓ ఫిలిమ్ అకాడమీలో చేరా. 'మిషన్ ఇంపాజబుల్' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేశా. అక్కడి నుంచి తిరిగొచ్చాక 'పార్శిల్', 'ఆమ్లెట్', 'వి', 'అనగనగా ఓ రాజకుమారుడు' సినిమాల్లో కథానాయకుడుగా నటించా. 'అనగనగా ఓ రాజకుమారుడు'కి సంగీతాన్ని కూడా సమకూర్చా. 'ఇంకా ఏమీ అనుకోలేదు' చిత్రంలో విలన్‌గా నటించా. తమిళంలో మూడు చిత్రాల్లో కథానాయకుడుగా చేశా. ఈ చిత్రానికి దర్శకత్వంతోపాటు కథ, మాటలు, స్క్రీన్‌ప్లేని అందించా. దర్శకుడిగా అవకాశాలు వస్తున్నాయి. త్వరలోనే మరో చిత్రం పట్టాలెక్కుతుంద"న్నారు.

## బసంతితో హోలీ


హృతిక్ రోషన్
మృనాల్ ఠాకూర్

హృతిక్ రోషన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'సూపర్ 30'. ప్రముఖ ఐఐటీ శిక్షకుడు ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా రూపొందుతోంది. 'క్వీన్' దర్శకుడు వికాస్ భల్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని 'బసంతి నో డ్యాన్స్' అనే వీడియో గీతాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్రంలో నటించిన మృనాల్ ఠాకూర్‌తో కలసి హృతిక్ పాల్గొన్నారు. 'షోలే'లోని ఫేమస్ డైలాగ్‌తో హోలీ నేపథ్యంలో విద్యార్థులతో కలసి హృతిక్ స్ఫూర్తిని రగిలించేలా పాడే ఈ గీతం ఆకట్టుకుంటోంది. మారుమూల ప్రాంతాల విద్యార్థులు ఆంగ్ల భాష అంటే భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెబుతూ ఈ పాట సాగింది. ఈ నెల 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.


శ్రీపద్మ

## నువ్వు లేక నేను లేను

హర్షిత్, వంశీకృష్ణ, శ్రీపద్మ, మాధవి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'నేను లేను'. రామ్ కుమార్ దర్శకుడు. సుక్రి నిర్మాత. ఈ నెల 12న విడుదల అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇదో సైకలాజికల్ థ్రిల్లర్. ఓ అందమైన ప్రేమకథ కూడా ఉంటుంది. ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తోంద"న్నారు. "భారతీయ సినిమాల్లో ఇప్పటి వరకూ ఇలాంటి కథాంశం రాలేదు. ప్రేమ, రొమాన్స్, ఉత్కంఠ అన్నీ కలగలిసి ఉన్నాయ"న్నారు నిర్మాత.

## ప్రేమలో కొత్త కోణం


అనిరుధ్ కస్తూరి, దివ్య

అనిరుధ్ కస్తూరి, దివ్య జంటగా నటించిన చిత్రం 'సంశయం'. మహేష్ చెంగారెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమించడానికీ, ప్రేమించానని చెప్పడానికీ చాలా తేడా ఉంది. అదేంటో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ప్రేమ అనేది సినిమా కథకు పురాతన వస్తువు. అయితే ఎప్పుడు ప్రేమలో కొత్త కోణం ఆవిష్కరించినా ప్రేక్షకులు ఆదరిస్తూనే ఉన్నారు. 'సంశయం' కూడా అలాంటి చిత్రమే. త్వరలోనే మోషన్ పోస్టర్‌ని విడుదల చేస్తామ"న్నారు.

Eenadu epaper

# వసుంధర

జీ20 సదస్సు... ప్రపంచంపై అత్యంత ప్రభావం చూపే దేశాలకు వేదిక... ప్రపంచంలోని అగ్ర నేతలందరికీ ఆతిథ్యం అందే సదస్సూ అదే. ఇటీవల జపాన్‌లో నిర్వహించిన ఈ సదస్సుకు వరల్డ్ ఈటాలజీ ఫోరం ద్వారా హాజరయ్యారు తెలుగు తేజం షర్మిలా నిసుధాన్. భారత్ నుంచి ఆ అవకాశం అందుకున్న ఒకే ఒక్క మహిళ ఆమె కావడం విశేషం. అక్కడ 'ప్రపంచ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు- ఆహారోత్పత్తి, వినియోగం' అనే అంశంపై మాట్లాడిన ఆమె... ఆ వివరాలను వసుంధరతో పంచుకున్నారిలా...





## జీ20లో హైదరాబాదీ

షర్మిల స్వస్థలం హైదరాబాద్‌లోని మణికొండ. తండ్రి సుధాకర్ రావు వైద్యుడు. హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ విద్య పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌లోనూ పోషకవిలువలపై అధ్యయనం చేశారు. హోటల్ మేనేజ్‌మెంట్ మీద ఆసక్తితో ఇంగ్లాండ్‌లో మాస్టర్స్ చదివారు. కొన్నాళ్లు బెంగళూరులోని ఐటీసీ హోటల్‌లో పని చేశారు. 2002లో దిల్లీలోని రాయ్ విశ్వవిద్యాలయంలో హాస్పిటాలిటీ అండ్ టూరిజం కాలేజీలో అధ్యాపకురాలిగా చేరారు. చాలా తక్కువ సమయంలోనే ఆ కళాశాల డీన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత అదే విశ్వవిద్యాలయం గుడ్‌గావ్ క్యాంపస్‌కు అసోసియేట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లోని వీఎం టెక్నాలజీస్‌లో ప్రాజెక్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

**సదస్సుకు ఇలా...** వరల్డ్ ఈటాలజీ ఫోరంను జపాన్‌కు చెందిన గంగ్వి లివ్ అనే వ్యక్తి ప్రారంభించారు. ప్రపంచంలోని ఆహార ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఇది పనిచేస్తుంది. ప్రతి ఒక్కరికీ తినడానికి ఆహారం ఉండాలి. ఈ ఆహార హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రతి దేశానిది. అందరికీ పోషకాహారం అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఫోరం పనిచేస్తోంది. ఈ ఫోరంని యూఎన్ సస్టెయినబుల్ కౌన్సిల్‌లోనూ భాగం చేశారు. ఆ ఐరాస కౌన్సిల్ ద్వారానే ఈఫోరం జీ20లో పాల్గొంది. పోషకాహారంపై పరిశోధనలు చేసిన వారిని ఈ సదస్సు ఆహ్వానించింది. అలా భారత దేశం నుంచి షర్మిలకు అవకాశం వచ్చింది. ఆమె ఆహార రంగంలో అనేక పరిశోధనలు చేశారు. దేశంలోని అంగన్‌వాడీల వల్ల మహిళలు, పిల్లలకు కలిగిన మేలును వివరిస్తూ 'ఏ గైడ్ టు విమెన్ అండ్ ఛైల్డ్ డెవలప్‌మెంట్' అనే పుస్తకం రాశారు. ఇది అంగన్‌వాడీ కేంద్రాల్లో శిక్షణ ఇచ్చే వారికి మార్గదర్శకంగా ఉంటుంది. పిల్లల పెంపకం, వారి ప్రవర్తనను సైతం ఇందులో చర్చించారు. రాయ్ విశ్వవిద్యాలయంలో పని చేసేప్పుడు వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలకు ఏడాదికోసారి పోషకాహారం గురించి అవగాహన కల్పించేవారు. అలాంటి కార్యక్రమాల్లో కీలకంగా పని చేశారు షర్మిల. గతంలోనూ హిందూస్థాన్ టైమ్స్, ఎకనామిక్ టైమ్స్ సదస్సులకు హాజరయ్యారామె. ఇందులో ఒక సదస్సుకు అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ సైతం పాల్గొన్నారు.

### అక్కడ ఏం మాట్లాడారంటే...

షర్మిల ప్రపంచ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-ఆహారోత్పత్తి వినియోగంపై ఆ సదస్సులో మాట్లాడారు. 'మన హైదరాబాద్‌లో మొత్తం జనాభా తొమ్మిది మిలియన్లు దాటి పోయింది. దిల్లీలో ఇది 25 మిలియన్లు. నాణ్యమైన విద్య, ఉపాధి కోసం చాలా మంది పట్టణాల బాట పడుతున్నారు. ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఉంది. ఇలా జనాభా ఒకే చోట కేంద్రీకృతం కావడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. అందుకే గ్రామాలు, సెమీ అర్బన్ ప్రాంతాలు, బీ2 నగరాల మీద దృష్టి సారించాలి. గ్రామాల్లో డిజిటలైజేషన్, సంప్రదాయ వృత్తులు, వ్యవసాయ రంగం వంటి వాటిపై దృష్టి సారించాలి. వ్యవసాయ రంగానికి సరిపడ వసతులు కల్పించాలి. ఈ ప్రదేశాల్లోనే మంచి విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు నెలకొల్పాలి. ఇలా చేయడం వల్ల ప్రజలు వారి ప్రాంతాలకే పరిమితం అవుతారు. అన్నిచోట్లా అభివృద్ధి జరుగుతుంది.

పట్టణీకరణ పెరిగేకొద్దీ ప్రజల జీవిన శైలి మారిపోయింది. ఆహార అలవాట్లు మారుతున్నాయి. ఒకప్పుడు అందరూ ఇంట్లో తయారు చేసిన ఆహారం తీసుకునేవారు. ఇప్పుడు హడావుడిలో క్షణాల్లో తయారు చేసిన ఆహారం ఎంచుకుంటున్నారు. జంక్ ఫుడ్‌కు అలవాటై పోయారు. శారీరక శ్రమ తగ్గిపోయింది. వీటన్నింటితో అధిక బరువు సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా ఇంట్లో తయారు చేసిన ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, పండ్లు వంటివి చాలా తక్కువ ధరల్లో లభ్యం అవుతాయి. వాటిని ఎంచుకోవచ్చు. భారత్ వంటి దేశంలో చాలా మంది అప్పటికప్పుడే వండుకొని తింటారు. కానీ పశ్చిమ దేశాల్లో ఈ సంస్కృతి లేదు. దేన్నైన రెండు మూడు రోజులు ఫ్రిజ్‌లో పెట్టుకొని తీసుకుంటారు. ఇది అనారోగ్యాలకు దారి తీస్తుంది. సరైన పోషకాహారం అందాలంటే స్థానికంగా ఉండే రైతులను ప్రోత్సహించాలి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో కిసాన్ బజార్, రైతు బజార్ రూపంలో వ్యవసాయదారులు సాగు చేసిన కూరగాయలు, పండ్లను వెంటనే మార్కెట్లలోకి పంపి వారే విక్రయిస్తున్నారు. దీనివల్ల రైతులకు ఆదాయం లభిస్తోంది. వినియోగదారులకూ ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలు లభ్యమవుతున్నాయి. ఇటువంటి సంస్కృతి ప్రపంచ వ్యాప్తంగా ఉండాలి...' అంటూ ఆమె చేసిన ప్రసంగానికి ప్రశంసలు వచ్చాయి. ఇప్పటి వరకు ఆమెకు రెండు పురస్కారాలు వచ్చాయి. లండన్‌లోని లైఫ్ ఇనిషియేట్ సిటీ అండ్ గిల్డ్ ఇనిస్టిట్యూట్ నుంచి ఎల్‌సీజీఐ పురస్కారం తీసుకున్నారు. అమెరికన్ హోటల్ అండ్ లాజిస్టిక్స్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ నుంచి ఉత్తమ ఫ్యాకల్టీ అవార్డు అందుకున్నారామె.

---

మన దగ్గర ఎన్ని రకాల దుస్తులు ఉన్నా... క్యాజువల్ వేర్‌గా కుర్తీకి ఉన్న ప్రత్యేకతే వేరు. సౌకర్యాన్ని, స్టైల్‌ని కలబోసే వీటిల్లో ఎన్నో రకాలు ఉన్నాయి. కాలేజీకయినా, ఆఫీసుకైనా కులాసాగా ఎంచుకోవచ్చు. ఇంతకీ వీటిల్లో ట్రెండ్స్ ఏంటో... ఏవి ఎవరికి నప్పుతాయో చూద్దామా...

## ట్యూనిక్ మ్యాజిక్



ఏ లైన్ రకం ట్యూనిక్ ఎలాంటి శరీరాకృతిగలవారికైనా చక్కగా నప్పుతుంది. అమ్మాయిల హాట్‌ఫేవరెట్ ఇది. నడుము దగ్గర నుంచి వెడల్పు మొదలై ఆంగ్ల అక్షరం ఏ ఆకృతిలో కనిపిస్తుంది. లావుగా ఉండేవారు, సౌకర్యాన్ని కోరుకునేవారికి ఇది చక్కని ఎంపిక. త్రిభుజాకారం తిరగేసినట్లు ఉండే ఆకృతి కలవారికి ఇది అంతగా నప్పదు. ఈ కుర్తీ మీదకు పలాజోలు, లెగ్గింగ్‌లు బాగుంటాయి. ఇందులో కాలర్ నెక్‌తో ఉన్న టాప్ ఉద్యోగినులకు సరిపోతుంది. స్టడ్స్, సిల్వర్ జుంకాలు, లెదర్ వాచీతో నిండుదనం వస్తుంది.

■ **లాంగ్ స్ట్రెయిట్ :** ఇప్పుడు దీనికి ఆదరణ ఎక్కువ. ఎత్తు తక్కువ ఉన్నవారు దీన్ని ఎంచుకుంటే కాస్త పొడుగ్గా, ప్రొఫెషనల్ లుక్‌లో కనిపించొచ్చు. లెగ్గింగ్‌లు, స్ట్రెయిట్ ప్యాంటు, స్కిన్నీ జీన్స్, పలాజో, పటియాలా, టైట్స్, ధోతీ ప్యాంట్‌లు, జాకెట్‌లను ఎంచుకోవచ్చు. కాటన్, రేయాన్, పాలిస్టర్, జార్జెట్, క్రేప్, విస్కోస్ వంటి ఏ వస్త్ర రకం అయినా... ఈ డిజైనులో బాగుంటుంది.



■ **స్లిట్:** కుర్తీకి ముందు లేదా పక్కన చీలికతో ఉండే క్రేజీ ఫ్యాషన్ ఇది. దీనికి జతగా పలాజో, స్కర్టు, ఎంబ్రాయిడరీ చేసిన సిగరెట్ ప్యాంట్‌లు ఎంచుకోవచ్చు. కాలేజీ పార్టీలకు, రోజువారీ విధులకు, విహారయాత్రలకూ ఇది నప్పుతుంది. అన్నిరకాల శరీరాకృతుల వారూ దీన్ని వేసుకోవచ్చు.

■ **అసిమెట్రికల్ హెమ్‌లైన్:** కాస్త ఎత్తు తక్కువగా ఉండేవారికి బాగుంటాయివి. షిఫాన్, జార్జెట్‌లలో కుట్టించుకుంటే ట్రెండీగా కనిపిస్తారు. ఖాదీ, కాటన్ రకాల్లోనూ ప్రయత్నించొచ్చు. సాయంత్రపు పార్టీలకు, గెట్‌టు గెదర్‌లకు ఈ డిజైను సరైన ఎంపిక. జతగా లెగ్గింగ్, జెగ్గింగ్, స్కిన్నీ జీన్స్ వేసుకోవచ్చు. పియర్, అవర్‌గ్లాస్ శరీరాకృతి గలవారికి నప్పుతుంది. శాండిల్స్, యాంకిల్ స్ట్రాప్ హీల్స్, స్టడ్స్, కఫ్ బ్రేస్‌లెట్‌లను యాక్సెసరీలుగా ప్రయత్నిస్తే కొత్తలుక్ సొంతమైనట్లే.





■ **అనార్కలీ:** ఇది అన్నిరకాల శరీరాకృతుల వారికీ చక్కగా నప్పుతుంది. లావుగా ఉన్నవారు లేయర్డ్ డిజైన్లను ఎంచుకోకూడదు. వీటిని ఫార్మల్‌గా, క్యాజువల్‌గానే కాదు... పార్టీవేర్‌గానూ వేసుకోవచ్చు. లెగ్గింగ్‌లు, చుడీదార్‌లు, పలాజోలు, పటియాలా, లాంగ్‌ఫ్లేర్డ్ స్కర్ట్ వీటికి సరైన ఎంపిక. జుంకీలు, లోలాకులు, రెండుమూడు వరుసల్లో ఉండే గొలుసులు వీటికి మ్యాచింగ్‌గా జత చేసుకోవచ్చు.



■ **ధోతీ స్టైల్:** ఈ ప్యాంట్ అచ్చం ధోతీ తరహాలో ఉంటుంది. కుర్తీ చిన్నగా ఉంటుంది. ఆధునిక, సంప్రదాయ డిజైను మేళవింపు ఇది. ఈ సెట్‌ని పార్టీవేర్‌గానూ ఎంచుకోవచ్చు. డబుల్‌స్టడెడ్, ఇయర్‌కఫ్స్ వంటి నగలు, పట్టీలు పెట్టుకుంటే నిండుదనం వస్తుంది. ఎత్తు చెప్పులు, పీప్‌టోస్, శాండల్స్ బాగుంటాయి. త్రిభుజాకారం, పియర్, యాపిల్ వంటి ఆకృతుల్లో ఉండేవారికి నప్పుతాయి.

---

### నజరానా

ముఖంపై ముడతలు కనిపిస్తున్నాయా... గుడ్డు తెల్లసొనలో కాస్తంత చక్కెర కలిపి ఆ మిశ్రమాన్ని ముఖం, మెడకు పట్టించి మృదువుగా రుద్దాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే ముడతల ప్రభావం తగ్గుతుంది.

### బంగారం-వెండి

Iన ముగింపు-క్రితం

| | ముగింపు | క్రితం |
|---|---|---|
| **హైదరాబాద్** | | |
| బంగారం (24క్యా) | 34,800 | 35,110 |
| ఆర్నమెంట్ | 32,480 | 32,800 |
| వెండి (కిలో) | 38,650 | 38,400 |
| **విజయవాడ** | | |
| బంగారం (24క్యా) | 34,760 | 35,090 |
| ఆర్నమెంట్ | 32,200 | 32,500 |
| వెండి (కిలో) | 38,800 | 38,900 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24క్యా) | 33,750 | 33,900 |
| ఆర్నమెంట్ | 31,300 | 31,320 |
| వెండి (కిలో) | 38,500 | 38,700 |
| **రాజమహేంద్రవరం** | | |
| బంగారం (24క్యా) | 34,770 | 35,110 |
| ఆర్నమెంట్ | 32,160 | 32,450 |
| వెండి (కిలో) | 38,700 | 38,700 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24క్యా) | 34,530 | 34,980 |
| ఆర్నమెంట్ | 32,120 | 32,540 |
| వెండి (కిలో) | 39,500 | 39,500 |
| **తమిళనాడు** | | |
| బంగారం ఆర్నమెంట్ (గ్రా) | 3,216 | 3,252 |
| వెండి (గ్రా) | 40.70 | 40.80 |

(రూ. లలో)

---

## విదేశాలకు వెళ్లి బెదిరిస్తున్నాడు... బుద్ధి చెప్పేదెలా?

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

? మూడేళ్ల క్రితం మా అమ్మాయికి పెళ్లిచేశాం. అతడు బాగా చదువుకున్నాడు. బిజినెస్ చేయాలనుందని, అది సాధ్యం కాకపోతే ఉద్యోగం వెతుక్కుంటానని ముందే చెప్పాడు. ఎన్నాళ్లైనా ఏ ప్రయత్నం చేయలేదు. మా అమ్మాయినీ మానసికంగా హింసించడం మొదలు పెట్టాడు. మేం ప్రశ్నించేసరికి అమ్మాయితో కలిసి కెనడాలో స్థిరపడతానని అన్నాడు. ఇద్దరికీ వీసా వచ్చినా... అతడికి ఉద్యోగం లేకపోవడం, ప్రవర్తన నచ్చకపోవడంతో ఆమె వెళ్లడానికి ఇష్టపడలేదు. మేమూ పంపించేందుకు భయపడ్డాం. చివరకు ఒక్కడే వెళ్లాడు. రెండేళ్లుగా అతడి నుంచి ఎలాంటి సమాచారం లేదు. ఇప్పుడు మెయిల్ ద్వారా మా అమ్మాయిని వేధిస్తున్నాడు. అతడిని తిరిగి ఇండియా రప్పించలేమా? మా అల్లుడికి బుద్ధి చెప్పే మార్గం లేదా? - ఓ సోదరి

✔ ఎన్ఆర్ఐ పెళ్లిళ్ల బాధితులు ఈ మధ్య ఎక్కువయ్యారు. కొందరు పెళ్లి చేసుకున్నా తమతో తీసుకెళ్లరు. మరికొందరు తీసుకెళ్లినా అక్కడ బాధలు పెట్టడం, ఇండియాకు పంపించకపోవడం, విదేశాల్లో ఉండగానే విడాకులు కేసులు వేయడం వంటివి చేస్తున్నారు. ఇంకొందరు భార్యకు ఆధారం చూపించకుండానే విడాకులు ఇచ్చేయడం, ఆమెను తిరిగి మనదేశానికి పంపించడం, విలువైన డాక్యుమెంట్లు, పిల్లల్ని అడ్డం పెట్టుకుని సాధించడం... వంటి ఇబ్బందులు పెడుతున్నారు. ఇలాంటి బాధితుల కోసమే భారత విదేశీ వ్యవహారాల శాఖ ఒక బుక్‌లెట్‌ని ముద్రించింది. వారు తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, న్యాయ సలహాలు, ఇటువంటి ఇబ్బందులు ఎదురైనప్పుడు సంప్రదించాల్సిన వివరాలు అందులో ఉంటాయి. ఈ బుక్‌లెట్ ఇంటర్నెట్‌లోనూ దొరుకుతుంది. ఒకవేళ ఎన్ఆర్ఐ భర్తలు వారి భార్యలను ఇక్కడే వదిలి విదేశాలకు వెళ్లిపోతే... వారి చిరునామా అందించేందుకు, తమ భర్తలను కలుసుకునేందుకు విదేశీ వ్యవహారాల శాఖ సాయం చేస్తుంది. లేదంటే జాతీయ మహిళా కమిషన్‌కి ఫిర్యాదు చేయొచ్చు. మీరు ఓ తల్లిగా మీ కూతురుని అక్కడికి పంపేందుకు భయపడుతున్నారేమోనని అనిపిస్తోంది. మీ అమ్మాయికీ కెనడా వీసా ఉందంటున్నారు. అతడితో మాట్లాడిన తరువాత పంపొచ్చేమో ఆలోచించండి. ఒకవేళ మీ అమ్మాయికి ఇప్పటికీ కలిసే ఉద్దేశం లేకపోతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతడి మీద సెక్షన్ 156(2)సీఆర్‌పీసీ ప్రకారం ఫిర్యాదు చేయండి. పోలీసులు కేసు రిజిస్టర్ చేయకపోతే క్రిమినల్ కోర్టులో సెక్షన్ 156(3) సీఆర్‌పీసీ ప్రకారం ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేయొచ్చు. కోర్టులో అతని చిరునామా కచ్చితంగా ఇవ్వాలి. నోటీస్ వెళ్లిన తరువాత అతను కోర్టుకి హాజరు కాకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ ఇస్తారు. అప్పుడే పాస్‌పోర్టు అథారిటీకి అతని పాస్‌పోర్టు ఇంపౌండ్ చేయమని దరఖాస్తు చేసుకోవచ్చు. అతని మీద క్రిమినల్ కేసు నిరూపణ అయితే మీరు అతని వీసా రద్దు చేయమని కెనడియన్ ఎంబసీకి దరఖాస్తు చేసుకోవచ్చు. అతని చిరునామా సంపాదించడానికి వాళ్ల తల్లిదండ్రులను ప్రతివాదులుగా చేర్చి గృహహింస చట్టం కింద కేసు పెట్టండి. కోర్టు అతని చిరునామా తెలుసుకునేలా ఒత్తిడి తెస్తుంది. లేదా కోర్టులో సెక్షన్ 82 సీఆర్‌పీసీ కింద ముప్పై రోజుల్లో హాజరవ్వమని ప్రొక్లమేషన్ ఇస్తారు. అయినప్పటికీ అతను కోర్టుకి రాకపోతే... ప్రొక్లమేషన్ అఫెండర్ కింద అతనికి సంబంధించిన ఆస్తులను అటాచ్ చేసే అధికారం సెక్షన్ 83 సీఆర్‌పీసీ కింద కోర్టుకి ఉంది. మీ అల్లుడిని ముందు కౌన్సెలింగ్ ద్వారా మార్చడానికి ప్రయత్నించండి. ఆలోచించాకే ఓ నిర్ణయానికి రండి.



మీ ప్రశ్నలు ఇకపై vasulegal@eenadu.net కు పంపించగలరు.

---

## చిరునవ్వు... చెదరనివ్వకు!



పెదాలపై చిరునవ్వు మోముకు అందాన్ని తీసుకువస్తుంది. ఆ నవ్వులు చెదిరిపోకుండా ఉండాలంటే నోటి శుభ్రతపై అవగాహన ఉండాలి. ఇందుకు కొన్ని చిట్కాలు...

- రోజుకు రెండు సార్లు బ్రష్ చేయాలి. భోజనం చేసిన ఇరవై నిమిషాలు లేదా అరగంట తరువాత దంతాల మధ్యలో ఇరుక్కున్న వ్యర్థ పదార్థాలు బయటకు పోయేలా పళ్లు తోముకోవాలి.
- దంతాలను సహజంగా శుభ్రపరిచే గుణం ఉన్న పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి. యాపిల్, స్ట్రాబెర్రీల్లో ఉండే మాలిక్ అనే ఎంజైము పళ్లను తెల్లగా ఉంచుతుంది. వీటిని తరచూ తీసుకోవాలి.
- వంట సోడా, నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని పళ్లపై నిమిషం పాటు నెమ్మదిగా రుద్దితే పసుపు రంగు మచ్చలు పోతాయి. వారానికోసారి ఇలా చేస్తే ఫలితం కనపడుతుంది.
- టీ, కాఫీలు అతిగా తీసుకుంటే వాటి ప్రభావం పళ్లపై పడుతుంది. వాటిని రోజులో ఒకటికన్నా ఎక్కువసార్లు తీసుకోకపోవడమే మంచిది. దంత క్షయం ఉన్నవారు టీ, కాఫీలకు దూరంగా ఉండాలి.
- కాయగూరలు, పండ్లను క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకుంటే పళ్లపై పేరుకుపోయిన బ్యాక్టీరియాను నిర్మూలించవచ్చు.


కవిత్వంలోనూ 'సెల్ఫీ'లు!..
తెలుగువెలుగుకి సాంకేతిక సొబగులు

రామోజీ ఫౌండేషన్

- ఆదిమజాతిలో భాషోత్పత్తి వికాసం... మధునాపంతుల కవితాస్వరూపం
- తీన్మార్ పాటకారుడి అంతరంగం.. సాహిత్యంలో తాంబూలసేవనం
- రాళ్లపల్లికి తనికెళ్లభరణి అక్షర నీరాజనం.. జాతీయాలపై వ్యాఖ్యానం



అన్ని పుస్తక విక్రయ కేంద్రాలలో 'తెలుగువెలుగు' మాసపత్రిక లభిస్తుంది. పేజీలు100 (రంగుల్లో) ధర రూ.20/- మీ ప్రతి కోసం ఈనాడు ఏజెంటును సంప్రదించండి. లేదా 08415 246888, 8008001656 నంబరుకు ఫోన్ చెయ్యండి. ఇప్పుడు మీ అభిమాన తెలుగువెలుగు అంతర్జాలంలోనూ అందుబాటులోకి వచ్చింది. రండి www.teluguvelugu.inను సందర్శించండి.

సంగీత సాహిత్యాల సమ్మేళనం
తెలుగు వెలుగు


Eenadu epaper

సీఎస్ఈ.. ఐటీ.. ఈసీఈ.. ఎక్కువమంది ఈ బ్రాంచీల వైపే చూస్తున్నారు. ఎందుకు? అంతా ఆలోచించే నిర్ణయించుకుంటున్నారా.. పక్కవాళ్లని ఫాలో అయిపోతున్నారా? ఏమో! కానీ ఎంచుకున్న బ్రాంచి గురించి ఎంతోకొంత తెలుసుకొని అడుగేయడం అవసరం. కోర్సులో ఏముంటుంది? ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి? ఉన్నత విద్యకు ఉన్న మార్గాలేమిటి? ఇవన్నీ తెలుసుకొని.. మనకు తగినదో కాదో తేల్చుకొని తీసుకోవడం మంచిది.



# అవకాశాలు ఆకాశమంత!




సాఫ్ట్‌వేర్ విస్తరించని రంగమూ, ఐటీ చొచ్చుకురాని చోటూ కనిపించడం లేదు. ఎలక్ట్రానిక్స్ రంగానికీ ఇదే జోరు. ఆర్థికంగా స్థిరపడే కొద్దీ గృహోపకరణాల కొనుగోలు అధికమవుతోంది. గృహోపకరణాలంటే ఇప్పుడు అంతా టీవీ, ఫ్రిజ్, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు...ఇలా లెక్కలేనన్ని వస్తువులు. అవన్నీ సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్స్ ఆధారంగా రూపొందించేవే. వాటి వినియోగం పెరుగుతుందంటే ఆ రంగంలో మానవ వనరుల అవసరం పెరుగుతున్నట్లే లెక్క. ఆటోమేషన్ కూడా మానవ జీవితాల్లోకి వేగంగా వస్తోంది. సమీప భవిష్యత్తులోనే ఊహించని మార్పులు చూస్తామని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. అందుకే ఈ రెండు రంగాలకూ విపరీతమైన గిరాకీ కనిపిస్తోంది. ఆ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే పలు అంశాలను తెలుసుకొని అందుకనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని సీఎస్ఈ ఆచార్యులు ఎం.సురేష్‌బాబు, ఈసీఈలో సహ ఆచార్యులు టి.మాధవికుమారి సూచిస్తున్నారు.

## డిమాండ్ తగ్గని సీఎస్ఈ

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌ను సీఎస్ఈగా పిలుస్తుంటారు. రెండు దశాబ్దాలుగా సీఎస్ఈకి మంచి డిమాండ్ ఉంది. అమెరికాలో ఆర్థిక మాంద్యం తలెత్తిన 2008 ప్రాంతంలో ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు తగ్గినా మళ్లీ రెండు మూడు సంవత్సరాల్లోనే బాగా ఈ రంగం పుంజుకుంది. సాఫ్ట్‌వేర్ రంగాన్ని నమ్ముకుంటే మునిగిపోతామన్న భయం కొందరిలో ఉన్నా... బీటెక్‌లో సీఎస్ఈకి డిమాండ్ మాత్రం తగ్గలేదు.

బీటెక్‌లో సెమిస్టర్ విధానం అమలు చేస్తారు. మొత్తం ఎనిమిది సెమిస్టర్లు... ఏడాదికి రెండు సార్లు పరీక్షలుంటాయి. సెమిస్టర్ పరీక్షలతోపాటు ఇంటర్నల్ పరీక్షలకు కూడా 25 శాతం మార్కులుంటాయి. ఇంజినీరింగ్‌లో సాధారణంగా మొదటి సంవత్సరం అన్ని బ్రాంచీల వారికి ఉమ్మడి సబ్జెక్టులే ఉంటాయి. ఏ బ్రాంచీ వారైనా అవి చదవాల్సిందే. ఇంటర్‌మీడియట్‌లో మాదిరిగా ఆంగ్లం, గణితం, భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం సబ్జెక్టులే ఉన్నా ఇక్కడ అప్లికేషన్ ఓరియంటెడ్ తరహాలో ఉంటుంది. అంటే ఇంటర్‌లో చదువుకున్నదాన్ని అప్లై చేయడం ఎలా? అనేది నేర్చుకుంటారు. దాంతోపాటు డేటా స్ట్రక్చర్స్ కూడా ఉంటుంది. రెండో ఏడాది నుంచి ఏ బ్రాంచి పాఠ్యాంశాలు ఆ బ్రాంచికి ఉంటాయి. అంటే ఆ బ్రాంచికి సంబంధించిన ప్రధాన సబ్జెక్టులను చదువుతారు. సీఎస్ఈలో కంప్యూటర్ ఆర్గనైజేషన్, సీ ప్రోగ్రామింగ్, పైథాన్, జావా, డేటా బేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, కంప్యూటర్ నెట్ వర్క్, ఆపరేటింగ్ సిస్టమ్, అల్గారిథమ్స్ లాంటివి, కొన్ని ఎలక్ట్రానిక్స్, మేనేజ్‌మెంట్ సబ్జెక్టులు కూడా బోధిస్తారు.



నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో ప్రాంగణ నియామకాలు మొదలవుతాయి. అంటే మొదటి మూడు సంవత్సరాల్లో మీ ప్రగతిని కూడా కంపెనీలు చూస్తాయి. మూడో సంవత్సరం మొదటి, రెండు సెమిస్టర్ల మధ్య సమయంలో మినీ ప్రాజెక్టు ఉంటుంది. విద్యార్థులు ఏదో ఒక కంపెనీకి వెళ్లి ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలి. నాలుగో ఏడాది రెండో సెమిస్టర్‌లో తరగతులు ఉండవు. ప్రాజెక్టుతోపాటు రెండు ఎలెక్టివ్ సబ్జెక్టులను ఎంచుకోవాలి. ప్రాజెక్టును సొంతంగా చేస్తే కెరియర్‌లోనూ ప్రయోజనం పొందుతారు.

## ఐరోపా, ఐర్లాండ్‌ల్లోనూ ఐటీకి గిరాకీ..



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఐటీగా పిలుస్తారు. సీఎస్ఈ నుంచి విడిపోయి ఐటీ బ్రాంచీగా మారింది. ఈ బ్రాంచీ ఏర్పాటైన కొత్తలో భారీ డిమాండ్ ఉన్నా 2008-2010 ప్రాంతంలో పలు కళాశాలలు ఈ బ్రాంచీని నిలిపేశాయి. వాస్తవానికి పరిశ్రమలకు దగ్గరగా ఉండేది ఐటీ బ్రాంచీ మాత్రమే. పరిశోధన చేయాలంటే సీఎస్ఈ బ్రాంచీ ఉపయోగం. సీఎస్ఈ, ఐటీకి మధ్య పెద్దగా వ్యత్యాసం ఏమీ లేదు. ప్రధాన సబ్జెక్టులు (కోర్) రెండిట్లో ఒకటే. మొత్తం మీద 20-25 శాతం సిలబస్ మాత్రం తేడా ఉంటుంది. ఐటీలో నెట్ వర్క్ మేనేజ్‌మెంట్, వెబ్ టెక్నాలజీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ లాంటి వాటిపై అధిక దృష్టి ఉంటుంది. ఇప్పుడు విద్యార్థులు సైతం అర్థం చేసుకొని సీఎస్ఈ బ్రాంచీ దొరకకున్నా.. ఐటీలో చేరుతున్నారు. ఇప్పుడు కొన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు మాత్రమే ఐటీ కోర్సును అందిస్తున్నాయి. సీట్లూ తక్కువే.

ఈ బ్రాంచిలో ఇంజినీరింగ్ చేసినవారికి ఉద్యోగ అవకాశాలు బాగున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమల్లో కొలువులు లభిస్తున్నాయి. యూరప్‌లోనూ ఐర్లాండ్ లాంటి దేశాలు ఐటీకి పెద్దపీట వేస్తున్నాయి. ఎంటెక్, పీహెచ్‌డీ వైపు ఎక్కువ మంది దృష్టి సారించడం లేదు. అందుకు కారణం బీటెక్‌తోనే ఉద్యోగాలు దొరుకుతుండటమే. కళాశాలలకే కంపెనీలు వచ్చి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నాయి.

ఐటీలోని సర్వీసు కంపెనీలు ఆయా సంస్థలకు అవసరమైన సేవలు అందిస్తాయి. వాటిల్లో భారీ సంఖ్యలో ఉద్యోగావకాశాలు ఉంటాయి. అందుకే ప్రారంభ వేతనం నెలకు రూ.25 వేల నుంచి ఉంటుంది. అదే ప్రొడక్ట్ కంపెనీ అయితే సొంతంగా సాఫ్ట్‌వేర్ తయారు చేస్తాయి. అందుకు ప్రతిభావంతులైన వారు కావాలి. ఈ పరిశ్రమలు తక్కువ మందిని నియమించుకుంటాయి. కాకపోతే ప్రారంభ వేతనం రూ.50 వేలకుపైగానే ఉంటుంది. ప్రొడక్ట్ కంపెనీలకు ఉదాహరణ మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఒరాకిల్, యాపిల్ లాంటివి.

ఎంటెక్, పీహెచ్‌డీ చేసి ఇంజినీరింగ్ కళాశాలల్లో అధ్యాపకుడిగా చేరవచ్చు. నిత్యం సాంకేతికత మారుతుంటుంది. అందువల్ల పరిశోధనలకూ అవకాశం ఉంది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్‌లో కొత్త సబ్జెక్టులు తెరపైకి వచ్చాయి. డేటా సైన్స్, బిగ్ డేటా ఎనలిటిక్స్, కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, రోబోటిక్స్ లాంటివి. వాటిపై పీహెచ్‌డీ చేయవచ్చు. అలాంటి వారికి సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ కంపెనీల్లోని పరిశోధన- అభివృద్ధి (ఆర్అండ్‌డీ) విభాగాల్లో అత్యధిక వేతనాలతో ఉద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా వివిధ పరిశోధనశాలల్లో కూడా చేరవచ్చు. ప్రభుత్వ ఉద్యోగాలు తక్కువగా ఉన్నాయి. బీమా, బ్యాంకింగ్ రంగాల్లో మాత్రం అవకాశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా డేటా ప్రొటెక్షన్‌లో ప్రస్తుతం 16 లక్షల మంది నిపుణుల అవసరం ఉందని అంచనా వేశారు.

## అటైనా.. ఇటైనా.. ఈసీఈకి ఈజీయే!



ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌ను ఈసీఈగా పిలుస్తారు. సీఎస్ఈ పూర్తిచేస్తే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ రంగంలోకి రావడానికి వీలుకాదు. అదే ఈసీఈ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలోనూ స్థిరపడవచ్చు. నాలుగేళ్ల బీటెక్‌లో ఒక్కో సెమిస్టర్‌లో 6 సబ్జెక్టులు నేర్చుకుంటారు. ఎలక్ట్రానిక్స్ డివైజెస్ అండ్ సర్క్యూట్స్ (ఈడీసీ), పల్స్ అండ్ డిజిటల్ సర్క్యూట్స్ (పీడీసీ), లాజిక్ డిజైన్, ఎలక్ట్రో మాగ్నటిక్ థియరీ, మైక్రో వేవ్స్ ఇంజినీరింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, సిగ్నల్ ప్రాసెసింగ్, మైక్రో ప్రాసెసర్, మైక్రో కంట్రోలర్‌తోపాటు వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్‌కు సంబంధించినవి నేర్చుకుంటారు.

ఎంటెక్‌లోనూ పలు స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ), ఎంబెడెడ్ సిస్టమ్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మైక్రో వేవ్ ఇంజినీరింగ్, సిస్టమ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ తదితర స్పెషలైజేషన్లను ఎంచుకోవచ్చు. వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్‌లో ఎంటెక్ చేయడానికి కేవలం ఈసీఈ విద్యార్థులే అర్హులు.

పీహెచ్‌డీ చేస్తే మంచి అవకాశాలు ఉన్నాయి. బోధనా రంగంతోపాటు పరిశోధనశాలల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువే. రక్షణ రంగానికి చెందిన ప్రయోగశాలలు, రైల్వేశాఖ, కమ్యూనికేషన్‌కు సంబంధించిన సంస్థల్లో కొలువులు పొందవచ్చు. ఇక బీహెచ్ఈఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జెన్‌కో, ట్రాన్స్‌కో లాంటి ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలు లభిస్తాయి. ఇంజినీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (ఈఎస్ఈ) ద్వారా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో చేరవచ్చు. అందుకు నాలుగు ఇంజినీరింగ్ బ్రాంచీల్లో యూపీఎస్‌సీ పరీక్ష నిర్వహిస్తుంది. అందులో ఈసీఈ బ్రాంచి ఒకటి.

- **పెమ్మసాని బాపనయ్య,** ఈనాడు, హైదరాబాద్

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**సెయిల్, రూర్కెలా**

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)కి చెందిన ఒడిషాలోని రూర్కెలా స్టీల్ ప్లాంట్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

❑ ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

**మొత్తం ఖాళీలు:** 205

**పోస్టులు-ఖాళీలు:** ఎగ్జిక్యూటివ్ (డిప్యూటీ మేనేజర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ, జూనియర్ మేనేజర్)-26, నాన్ ఎగ్జిక్యూటివ్ (ఫైర్ సర్వీసెస్, బాయిలర్ ఆపరేటర్, ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ), అటెండర్ కమ్ టెక్నీషియన్ (ట్రైనీ))-179. **అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత, అనుభవం, నిర్దిష్ట శారీరక ప్రమాణాలు. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్/ ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జులై 10 నుంచి 31 వరకు.

**వెబ్‌సైట్:** https://www./sailcareers.com/

**హైకోర్ట్ ఆఫ్ మద్రాస్**

తమిళనాడులోని హైకోర్ట్ ఆఫ్ మద్రాస్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**మొత్తం ఖాళీలు:** 573 **పోస్టులు-ఖాళీలు:** కంప్యూటర్ ఆపరేటర్-76, టైపిస్ట్-229, అసిస్టెంట్-119, రీడర్/ ఎగ్జామినర్-142, జిరాక్స్ ఆపరేటర్-07. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, కంప్యూటర్ కోర్స్ సర్టిఫికెట్ ఉత్తీర్ణత. **వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.

**ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జులై 01 నుంచి 31 వరకు.

**వెబ్‌సైట్:** https://www.mhc.tn.gov.in/

**డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్**

గుంటూరు (ఏపీ)లోని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టులు-ఖాళీలు:** జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్-07, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (టెక్నికల్)-20.

**అర్హత:** ఎంబీబీఎస్, బీడీఎస్, సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ ఉత్తీర్ణత, అనుభవం.

**ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా. **ఇంటర్వ్యూ తేదీ:** జులై 9, 10. **వేదిక:** డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్, చుట్టుగుంట, గుంటూరు.

**దరఖాస్తు:** ఈమెయిల్ ద్వారా. **వెబ్‌సైట్:** http://www.ysraarogyasri.ap.gov.in/

### వాక్-ఇన్స్

**సీఆర్‌పీఎఫ్‌లో మెడికల్ ఆఫీసర్లు**

సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి వాక్ఇన్ నిర్వహిస్తోంది.

**పోస్టులు-ఖాళీలు:** స్పెషలిస్టు మెడికల్ ఆఫీసర్లు-07, డెంటల్ సర్జన్-01, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు-84. **మొత్తం ఖాళీలు:** 92

**అర్హత:** ఎంబీబీఎస్(ఇంటర్న్‌షిప్), సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ ఉత్తీర్ణత, అనుభవం.

**వాక్ఇన్‌తేదీ:** జులై 30. **వేదిక:** కంపోజిట్ హాస్పిటల్, సీఆర్‌పీఎఫ్, బిలాస్‌పూర్, రాంచి, నాగపూర్, గువహటి, ఇంఫాల్, శ్రీనగర్, జమ్మూ కేంద్రాలలో. **వెబ్‌సైట్:** https://www.crpf.gov.in/

**నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే**

మాలేగావ్ (అసోం) ప్రధాన కేంద్రంగా ఉన్న నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి వాక్ఇన్ నిర్వహిస్తోంది. ❑ పారామెడికల్ పోస్టులు **మొత్తం ఖాళీలు:** 14

**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణత, అనుభవం. **వాక్ఇన్‌తేదీ:** జులై 15. **వేదిక:** సీఎంఎస్ ఆఫీస్, అలీపుర్‌దార్ జంక్షన్ రైల్వే హాస్పిటల్. https://nfr.indianrailways.gov.in/

# బాలల సృజనకు భలే పోటీ!

**చురుకైన చిన్నారుల మదిలో ఏ సమస్యకు ఎలాంటి పరిష్కారం ఉందో? సమాజానికి మేలు చేసే ఆలోచనలను అందిస్తారేమో? అందుకే ప్రభుత్వం హైస్కూలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం చేస్తోంది. కొత్తదనాన్ని ప్రోత్సహించి ఆవిష్కరణల దిశగా వారిని నడిపిస్తోంది. దీని కోసం ఇన్‌స్పైర్ మనాక్ పేరుతో పోటీలను నిర్వహిస్తోంది. వీటిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ), నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) పర్యవేక్షిస్తున్నాయి.**



ఆరు నుంచి పదో తరగతి చదువుతోన్న 10 నుంచి 15 ఏళ్ల వయసు విద్యార్థుల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ పరంగా ఉండే ప్రతిభను వెలికి తీయడానికి మనాక్ చక్కని వేదికగా ఉపయోగపడుతుంది. సమాజానికి ఉపయోగపడే అంశాల్లో సొంత ఆలోచనలను ప్రోత్సహించి వాటిలో మేటిగా ఉన్నవాటిని కార్యరూపం దాల్చేలా చూడడమే ఈ పోటీల లక్ష్యం. దేశవ్యాప్తంగా ఏ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులైనా పోటీలో పాల్గొనవచ్చు.

### లక్ష ఆలోచనలు

ముందుగా దేశవ్యాప్తంగా అన్ని హైస్కూళ్ల విద్యార్థుల్లోనూ ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారు. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు. అనంతరం ఆయా పాఠశాలల పరిధిలో అంతర్గత పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థుల సొంత ఆలోచనలతో తమ ప్రతిపాదనలు తెలుపుతారు. వీటిలో బాగా ఉన్న రెండు లేదా మూడింటిని ఆయా పాఠశాలలు ఎంపిక చేస్తాయి. ఇలా ఎంపికైనవాటిని పాఠశాల ప్రధానాచార్యులు ఇన్‌స్పైర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. దేశవ్యాప్తంగా ఆయా పాఠశాలలవారీ వచ్చిన ఆలోచనలు క్రోడీకరిస్తారు. దాదాపు పది లక్షల వరకు ప్రాజెక్టులు/ ఆలోచనలు దేశవ్యాప్తంగా నమోదవుతాయి. వీటిని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ పరిశీలించి అందులోంచి లక్ష ఆలోచనలు ఎంపిక చేస్తుంది.

ఈ వడపోతలో ఎంపికైన ఆలోచనలకు సంబంధించిన విద్యార్థుల బ్యాంకు అకౌంట్లలో నేరుగా రూ.పదివేలు జమ చేస్తారు. ఈ లక్ష ఆలోచనల జాబితాను ఆయా జిల్లాలవారీ విడదీస్తారు. ఆ జిల్లా పరిధిలోని వారంతా జిల్లా స్థాయి ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారు. అన్ని జిల్లాల నుంచి కలిపి పదివేల ప్రతిపాదనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు ఈ ఎంపికలను నిర్వహిస్తాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న పదివేల మంది నుంచి అత్యుత్తమమైన వెయ్యి ఆలోచనలను జాతీయస్థాయి పరిశీలనకు తీసుకుంటారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఈ ఎంపికలు చేపడుతుంది. ఈ దశలో ఎన్ఐఎఫ్ విద్యార్థులకు మెంటర్‌గా వ్యవహరిస్తుంది. ప్రఖ్యాత విద్యాసంస్థలు, సాంకేతిక కేంద్రాల ద్వారా విద్యార్థులకు అవసరమైన తోడ్పాటునూ అందిస్తుంది.

కొత్తదనం, సామాజిక అనువర్తనం, పర్యావరణహితం, సులువుగా ఉపయోగించగలగడం, ప్రస్తుతం అదే విభాగంలో ఉపయోగిస్తోన్న సాంకేతికత కంటే మెరుగ్గా, మరింత ఉపయుక్తంగా ఉండడం...తదితర అంశాలకు జాతీయస్థాయి పోటీల్లో ప్రాధాన్యమిస్తారు. దీని ప్రకారం వెయ్యి ఆలోచనల నుంచి 60 ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైనవారికి జాతీయ అవార్డు ప్రదానం చేస్తారు. దీంతోపాటు ఆ ఆలోచనల భవిష్యత్తుకు బాటలు వేస్తారు. ఇలా ఎంపికైనవాటిని ఎన్ఐఎఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ)కి చెందిన అదే తరహా ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తారు. ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ వార్షిక వేడుకల్లో వీటిని ప్రదర్శిస్తారు. అవసరమైన ప్రోత్సాహకాలు లభిస్తాయి. నిపుణులు మరింత మెరుగులు దిద్దుతారు. అవసరమైన సాంకేతికత, ఇతర అభివృద్ధి చేపడతారు. వినూత్న ఆలోచనలకు పేటెంట్ కోసమూ దరఖాస్తు చేస్తారు.

**గడువు తేదీ:** జులై 31

**వెబ్‌సైట్:** www.inspireawards-dst.gov.in

# లోయలోకి దూసుకెళ్లిన బస్సు

- 35 మంది మృతి
- జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం

**జమ్మూ:** సామర్థ్యానికి మించిన సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్న చిన్న బస్సు (మినీ బస్సు) లోయలోకి దూసుకెళ్లడంతో 35 మంది ప్రయాణికులు మరణించారు. 17 మంది గాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని కేశ్వాన్ నుంచి బయలుదేరిన ఈ చిన్న బస్సు కిష్టావర్ వెళుతుండగా ఉదయం 7.30 గంటల సమయంలో లోయలోకి దూసుకెళ్లిందని అధికారులు తెలిపారు. 28 సీట్లున్న ఈ బస్సు 52 మందితో వెళుతోందని కిష్టావర్ ఉప కమిషనర్ ఏఎస్ రాణా తెలిపారు. ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన గవర్నర్ సత్యపాల్ మాలిక్.. మరణించిన ప్రయాణికుల కుటుంబసభ్యులకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. బస్సు ప్రమాదంపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాలు విచారం వ్యక్తంచేశారు.

**శిమ్లాలో ముగ్గురు..**

**శిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లోని శిమ్లాలో సోమవారం బస్సు 450 అడుగుల లోయలోకి దూసుకెళ్లడంతో డ్రైవర్, ఇద్దరు విద్యార్థులు మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. ఉదయం 7.35 గంటలకు ఝినిఝూరి వద్ద ఈ ప్రమాదం సంభవించింది.



గాయపడ్డ చిన్నారిని జమ్మూలోని ఆస్పత్రికి తీసుకొస్తున్న స్థానికుడు

## హైదరాబాద్‌లో కాలుష్య స్థాయి ఫర్వాలేదు

### కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో

**ఈనాడు, దిల్లీ:** హైదరాబాద్‌లో కాలుష్య స్థాయి ఫర్వాలేదని కేంద్ర పర్యావరణశాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో తెలిపారు. దేశంలో అత్యంత కాలుష్య నగరాలపై రాజ్యసభ సభ్యుడు రితబ్రత బెనర్జీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2018లో హైదరాబాద్‌లో క్యూబిక్ మీటర్ గాలిలో సూక్ష్మ ధూళి కణాలు (పీఎం 10) 170 రోజులు పాటు 101-200 మధ్య (ఫర్వాలేదు...) ఉన్నట్లు పేర్కొన్నారు. 156 రోజుల పాటు 51-100 మధ్య (సంతృప్తికర స్థాయి), 38 రోజులు 0-50 మధ్య (బాగు) ఉన్నట్లు తెలిపారు.

# వేర్పాటువాదాన్ని సహించం

- దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే యత్నాలకు తగిన జవాబిస్తాం
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టీకరణ
- జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపునకు రాజ్యసభ ఆమోదం

**దిల్లీ:** దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే ఎలాంటి యత్నాలకైనా తగిన జవాబు ఇస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాద ఉద్యమం, ఉగ్రవాదాన్ని సహించేది లేదన్నారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో భాగమని, ఎవ్వరూ విడదీయలేరన్నారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే, మన సరిహద్దుల్ని గౌరవించని వారితో కాదన్నారు. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపుపై సోమవారం రాజ్యసభలో చేపట్టిన చర్చ సందర్భంగా అమిత్‌షా మాట్లాడారు. మోదీ సర్కారు ఉగ్రవాదాన్ని ఎంతమాత్రం సహించదన్నారు. ఎన్ఐఏ, పన్నుల విభాగం వంటి కేంద్ర సంస్థలు జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదుల ఆర్థిక వనరుల్ని నిలిపి వేసేందుకు కృషి చేస్తున్నాయన్నారు. కశ్మీర్ సమస్యపై గత 70 ఏళ్లుగా అనుసరిస్తున్న విధానం ఎలాంటి ఫలితాల్ని ఇవ్వని నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి సరికొత్త ఆలోచనా విధానం అవసరమని అభిప్రాయ పడ్డారు. అభివృద్ధితో తాము కశ్మీరీ ప్రజల మనసుల్ని గెలుచుకుంటామన్నారు.

కశ్మీర్ సమస్యకు సంబంధించి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై విమర్శలు గుప్పించారు. నెహ్రూ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితికి ఎందుకు వెళ్లిందని, ప్లెబిసైట్‌కు ఎందుకు అంగీకరించిందని ప్రశ్నించారు. చారిత్రక తప్పిదాలు ఎల్లప్పుడూ చర్చనీయాంశాలే అని పేర్కొన్నారు. జాతీయ పౌరసత్వ రిజిస్టర్(ఎన్ఆర్‌సీ)పై విపక్ష నేతలు చేసిన విమర్శల్ని ప్రస్తావిస్తూ.. చొరబాట్లకు అడ్డుకట్ట వేయాలని, చొరబాటుదార్లను గుర్తించి, పంపించి వేయాలనేది మోదీ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పొరుగు దేశాల నుంచి భారత్‌కు వచ్చే హిందువులకు భారతీయ పౌరసత్వాన్ని సిటిజన్‌షిప్ బిల్లు కల్పిస్తుందన్నారు. పరోక్ష పాలనను కొనసాగించేందుకు భాజపా రాష్ట్రపతి పాలనను ఉపయోగించుకుంటోందంటూ విపక్షాలు చేసిన ఆరోపణల్ని కొట్టిపారేశారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో 16 చోట్ల అధికారంలో ఉన్న తమ పార్టీ అధికార కాంక్షతో లేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పంచాయతీ, పురపాలక ఎన్నికల్ని ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కేవలం మూడు కుటుంబాలకే ఎందుకు పరిమితం చేశారన్నారు. లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు భాజపా సిద్ధమని, ఈ ప్రతిపాదనకు విపక్షాలు అంగీకరిస్తే రేపే బిల్లు తెచ్చేందుకు సిద్ధమన్నారు. 'కశ్మీర్ పండిట్లను, సూఫీ సంప్రదాయాలను రాష్ట్రం నుంచి ఎవరు తరిమేశారు, అవి కశ్మీరీ సంప్రదాయంలో భాగం కాదా' అని ప్రశ్నించారు. ప్రజల భద్రత కోసమే రహదారుల్ని మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. పౌరులందరి రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరికీ భయం అక్కర్లేదన్నారు. భారత్‌ను ముక్కలు చేస్తామని చెప్పేవారికి అదే భాషలో జవాబిస్తామన్నారు. రాష్ట్రపతి పాలన సమయంలో 2 వేల మందికి కల్పించిన భద్రతను సమీక్షించి, 919 మందికి ఉపసంహరించామన్నారు. ఇందులో 8 మంది వేర్పాటువాదులు కూడా ఉన్నారని తెలిపారు.

**తీర్మానం ఆమోదం**

జమ్మూ కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని, సోమవారం రాజ్యసభ ఆమోదించింది. దీనితోపాటు రాష్ట్రంలోని మూడు సరిహద్దు జిల్లా ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రిజర్వేషన్లు కల్పించే .. జమ్మూకశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు,2019కు ఆమోదం తెలిపింది. దీనితో ఈ రెండు అంశాల్లో పార్లమెంటరీ ప్రక్రియ పూర్తయినట్లయింది.



రాజ్యసభలో మాట్లాడుతున్న అమిత్ షా. చిత్రంలో హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

### హిమలింగాన్ని దర్శించుకున్న 8 వేల మంది భక్తులు

**శ్రీనగర్/జమ్మూ:** కట్టుదిట్టమైన భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రసిద్ధ అమర్‌నాథ్ యాత్ర సోమవారం ప్రారంభమయింది. తొలి రోజు 8వేల మంది భక్తులు హిమలింగాన్ని దర్శించుకున్నారు. యాత్ర ప్రారంభానికి ముందు నిర్వహించిన 'ప్రథమపూజ'లో జమ్మూ-కశ్మీర్ గవర్నరు సత్యపాల్ మాలిక్ పాల్గొన్నారు. పహల్గామ్, బల్తాల్ బేస్ క్యాంపుల నుంచి ఆయా జిల్లాల ఉన్నతాధికారులు జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. 45 రోజులపాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 15వ తేదీన ముగుస్తుంది.



సాయుధ సిబ్బంది భద్రత నడుమ గండేర్బల్ జిల్లాలో సాగుతున్న అమర్‌నాథ్ యాత్ర

# మీరే సారథ్యం వహించండి

- రాహుల్‌కు కాంగ్రెస్ సీఎంల విజ్ఞప్తి
- దిల్లీలో సమావేశమైన నేతలు

**దిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ కొనసాగాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సోమవారం ఆయనను కలిసి అభ్యర్థించారు. తమ అభ్యర్థనపై రాహుల్ సానుకూలంగా స్పందిస్తారని, సరైన నిర్ణయం తీసుకుంటారని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ చవిచూసిన ఘోర పరాజయంపై వారు చర్చించారు. సోమవారం దిల్లీలో కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. సుదీర్ఘంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రులతోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా రాహుల్‌గాంధీ పార్టీ సారథ్య బాధ్యతలు స్వీకరించాలని బలంగా కోరుకుంటున్న విషయాన్ని తాము రాహుల్ గాంధీకి వివరించామని గహ్లోత్ తెలిపారు. అయితే తాను ఈ పదవిలో కొనసాగబోనని ఇప్పటికే సీడబ్ల్యూసీకి తెలిపానని, ఆ నిర్ణయంలో మార్పు ఉండదని రాహుల్‌గాంధీ వారికి వివరించినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి కాంగ్రెస్ ముఖ్యమంత్రులంతా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేసేందుకు కూడా సిద్ధపడ్డట్లు తెలిసింది. అయితే అధికారికంగా ఈ విషయాన్ని పార్టీ నాయకులు ధ్రువీకరించలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు కమల్‌నాథ్, భూపేశ్ బఘేల్, వి.నారాయణస్వామి, అమరీందర్ సింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఉపసభాపతి పదవి భాజపాకే!

**ఈనాడు, దిల్లీ:** లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని తామే తీసుకోవాలని భాజపా అధిష్ఠానం అభిప్రాయపడుతోంది. ఈ మేరకు స్థిరనిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఎన్డీయే ప్రభుత్వంలోని భాగస్వామ్యపక్షాలకు లేదా మద్దతుగా ఉన్న మిత్రపక్షాలకు ఈ పదవి ఇవ్వవచ్చనే ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో జేడీయూ, శివసేన, బీజేడీ లేదా వైకాపాలకు ఈ పదవి దక్కవచ్చని ప్రచారం సాగింది. అయితే భాజపాకు తగినంత సంఖ్యాబలం ఉన్నందున ఈ పదవిని తమ ఎంపీకే ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలిసింది.

## సీఏలు, వైద్యుల సేవలు శ్లాఘనీయం: ప్రధాని మోదీ

**దిల్లీ:** సమాజంలో నిజాయతీ, నిబద్ధతలు పరిఢవిల్లడానికి చార్టర్డ్ అకౌంటెంట్ల కృషి దోహదపడుతోందంటూ ప్రధాని మోదీ సోమవారం శ్లాఘించారు. ఆర్థిక ప్రగతిసాధనలో వారిపాత్ర ప్రధానమన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. అలాగే సమాజ ఆరోగ్యభాగ్య ప్రదాతలుగా వైద్యుల పాత్ర ప్రశంసనీయమన్నారు. వైద్యుల నిర్విరామ సేవలు సమాజాన్ని ఆరోగ్యంతో కళకళలాడేలా చేస్తున్నాయన్నారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన వారి సేవలను కొనియాడారు.

## ప్రపంచంలోనే అత్యంత తక్కువ దూరానికి ఎమిరేట్స్ సేవలు!

**దుబాయ్:** ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ సేవల్లో కొత్త అధ్యాయం! దుబాయ్-దోహా మధ్య ప్రపంచంలోనే అత్యంత తక్కువ దూరానికి విమాన సేవలను అందిస్తూ వచ్చిన ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్... తాజాగా తన రికార్డును తానే అధిగమించింది. సోమవారం దుబాయ్-మస్కట్ మధ్య కేవలం 40 నిమిషాల్లో ప్రయాణాన్ని పూర్తిచేసే ఎ380 విమాన సేవలను ప్రారంభించింది. విశేషమేమంటే... ఈ విమానాన్ని 42 మంది సిబ్బంది కలిసి శుభ్రం చేయడానికి 35 నిమిషాలు పడుతుంది. దుబాయ్-మస్కట్ మధ్య దూరం 340 కిలోమీటర్లు కాగా, ఈ విమానంలో తీగల పొడవు 500 కిలోమీటర్లు!



**చుక్క నీరైనా చిక్కాలని!**

దేశ రాజధాని దిల్లీలో తాగునీటి కొరతకు తార్కాణం ఈ చిత్రం. మున్సిపల్ ట్యాంకర్ వీధిలోకి రావడంతో ఒక్కసారిగా జనం నీటిని తోడుకునేందుకు ఇలా పోటీపడ్డారు.

## విశ్వవిద్యాలయం యూనిట్‌గా అధ్యాపకులకు రిజర్వేషన్లు

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**దిల్లీ:** విశ్వవిద్యాలయాలు, కళాశాలల అధ్యాపకుల నియామకంలో రిజర్వేషన్లకు ఉద్దేశించిన బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. రిజర్వేషన్లను వర్తింపచేయడానికి విభాగం/సబ్జెక్టును ప్రాతిపదికగా తీసుకోకుండా, మొత్తం సంస్థనే ఒక యూనిట్‌గా పరిగణించాలంటూ కేంద్రప్రభుత్వం ఈ బిల్లులో ప్రతిపాదించింది. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడం కూడా ఈ బిల్లులో ప్రధాన అంశం. దీనిపై ఇంతకుముందే ప్రభుత్వం అత్యవసర ఆదేశాలు (ఆర్డినెన్స్) జారీ చేయగా, దాన్ని చట్టం రూపంలో తెచ్చేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టింది. కేంద్ర విద్యాసంస్థల (టీచర్స్ కేడర్‌లో రిజర్వేషన్లు) బిల్లు-2019 పేరుతో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ దీనిని సభ ముందు ఉంచారు. 41 కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న దాదాపు 8,000 పోస్టుల భర్తీకి ఇది వీలు కలిగిస్తుంది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ బిల్లును సమగ్రంగా పరిశీలించడానికి సెలెక్ట్ కమిటీకి పంపించాలని కోరారు.

# ఆగస్టు 12 నుంచి ముందస్తు జనగణన

- 2021 జనాభా లెక్కింపునకు పూర్వపరీక్షగా నిర్వహణ

**దిల్లీ:** దేశవ్యాప్తంగా 2021లో నిర్వహించే జనగణనకు సంబంధించి పూర్వపరీక్ష జనాభా లెక్కింపును ఈ ఏడాది ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ వివేక్ జోషి ప్రకటించారు. ఈ లెక్కింపును అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. భారత్‌కు సంబంధించి 140 ఏళ్ల జనాభా లెక్కింపు చరిత్రలో తొలిసారిగా సమాచారాన్ని మొబైల్ యాప్ ద్వారా సేకరించాలని ప్రతిపాదించారు. జనగణకుల్ని సొంత ఫోన్లను ఉపయోగించేలా ప్రోత్సహించనున్నారు. 2021 జనాభా లెక్కింపు ప్రపంచంలోనే అతి పెద్ద గణన కార్యక్రమంగా నిలిచిపోనుందని ఓ అధికారి పేర్కొన్నారు. 33 లక్షల మంది జనగణకుల్ని సమాచార సేకరణ కోసం మోహరించనున్నారు. జనగణన అనేది కేవలం జనాభా సంఖ్యను లెక్కించే కార్యక్రమమే కాదని, ఇది ఎంతో విలువైన సామాజిక ఆర్థిక సమాచారాన్ని అందజేస్తుందని, విధాన నిర్ణయాలు, వనరుల కేటాయింపునకు విశ్వసనీయ ఆధారంగా పని చేస్తుందని కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గౌబ తెలిపారు.

**జనగణన ఇలా..**

2021 జనగణన కార్యక్రమాన్ని రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో గృహాల జాబితా రూపొందించే కార్యక్రమం సాగుతుంది. 2020 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య ఏవైనా రెండు నెలల్లో దీనిని నిర్వహిస్తారు. రెండో దశలో వాస్తవిక జనాభా లెక్కింపును చేపడతారు. 2021 ఫిబ్రవరి 9-28 వరకు జనాభా లెక్కింపును నిర్వహిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన జరుగుతుంది. జమ్మూకశ్మీర్‌తోపాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని మంచు ప్రాంతాల్లో 2020 సెప్టెంబర్ 11 నుంచి 30 వరకు జనగణనను, అక్టోబర్ 1 నుంచి 5 వరకు పునఃపరిశీలనను చేపడతారు. 2021 జనగణనకు రిఫరెన్స్ తేదీని ఆ ఏడాది మార్చి 1గా నిర్ణయించగా, జమ్మూకశ్మీర్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని మంచు ప్రాంతాలకు 2020 అక్టోబర్ 1గా నిర్ణయించారు.

## ముంచెత్తిన వర్షాలతో ముంభయం!



ముంబయిలో సోమవారం భారీ వర్షంతో జలమయమైన ఓ రహదారి

**ముంబయి:** దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం అనేక నివాస ప్రాంతాలు జలమయం అయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. 12 చోట్ల గోడలు కూలాయి. పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. మరోవైపు, థానే, పాల్ఘర్ ప్రాంతాల్లో ఈ నెల 2, 4, 5 తేదీల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ విభాగం తాజా ప్రకటన ముంబయి వాసులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గత రెండు రోజుల్లో నగరంలో 540 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ముంబయి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ పరదేశీ చెప్పారు. ఈ దశాబ్దంలోనే ఇది గరిష్ఠమని ఆయన వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లు రద్దవడంతో థానే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లలేకపోయారు.

## తాలిబన్ల దాడిలో 50 మంది చిన్నారులకు గాయాలు

**కాబుల్:** అఫ్గానిస్థాన్‌లో తాలిబన్లు మరోసారి ఘాతుకానికి తెగబడ్డారు. సోమవారం కాబుల్ నగరంలో శక్తిమంతమైన కారుబాంబును పేల్చారు. ఈ ఘటనలో 50 మంది చిన్నారులు గాయపడ్డారు. మరో వంద మంది ప్రజలు క్షతగాత్రులయ్యారు. రక్షణ మంత్రిత్వశాఖ భవనాన్ని లక్ష్యంగా చేసుకొని బాంబుదాడి చేపట్టినట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి సుమారు రెండు కిలోమీటర్లదాకా ఉన్న భవనాలు కంపించాయి. కారుబాంబు పేలుడు అనంతరం కొంతమంది సాయుధులు సమీపంలోని ఓ భవనంలోకి చొచ్చుకెళ్లి, అక్కణ్నుంచి ప్రత్యేక దళాలపైకి కాల్పులకు దిగారు. దాడికి పాల్పడిన ఐదుగురూ హతమయ్యారని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనల్లో ఒక చిన్నారితోపాటు ముగ్గురు మరణించారని ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. గాయపడ్డ చిన్నారులంతా బడిదుస్తుల్లో ఉన్నారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై 16న విచారణ

**ఈనాడు, దిల్లీ:** ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాల్జేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఈ నెల 16 నుంచి వాదనలు వినాలని సోమవారం సుప్రీంకోర్టు నిర్ణయించింది. జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ల ధర్మాసనం దీన్ని విచారించనుంది. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఈ పిటిషన్లు దాఖలు చేశారు.

## వ్యవ'సాయం' కోసం ఉన్నత స్థాయి కమిటీ

**ఈనాడు, దిల్లీ:** భారతీయ వ్యవసాయ రూపాంతరీకరణ (ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ ఇండియన్ అగ్రికల్చర్) కోసం నీతి ఆయోగ్ 9మంది సభ్యుల ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సభ్యులుగా సీఎంలు కుమారస్వామి (కర్ణాటక), మనోహర్‌లాల్ కట్టర్ (హరియాణా), పెమా ఖండూ (అరుణాచల్‌ప్రదేశ్), విజయ్ రూపాణి (గుజరాత్), యోగి ఆదిత్యనాథ్ (ఉత్తర్‌ప్రదేశ్), కమల్‌నాథ్ (మధ్యప్రదేశ్), కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, నీతి ఆయోగ్‌లో వ్యవసాయ సంబంధ విషయాలు చూసే రమేష్‌చంద్ నియమితులయ్యారు. కేంద్రం రూపొందించిన వ్యవసాయ ఉత్పత్తులు, పశుసంపద మార్కెటింగ్ చట్టం- 2017; వ్యవసాయోత్పత్తులు, పశుసంపద- ఒప్పంద సేద్యం, సేవలు చట్టం-2018లను నిర్దిష్ట గడువులోగా రాష్ట్రాలు అమలు చేయడంపై ఈ కమిటీ దృష్టిసారిస్తుంది. రెండునెలల్లో నివేదిక సమర్పిస్తుంది.

## గీత దాటిన ఇరాన్

### పరిమితికి మించి యురేనియం నిల్వలు

**టెహ్రాన్:** అగ్రరాజ్యాలతో 2015లో కుదిరిన అణు ఒప్పందంలోని కీలక షరతును పక్కనపెట్టేశామని ఇరాన్ సోమవారం పేర్కొంది. ఇరాన్.. 300 కిలోలకు మించి శుద్ధి చేసిన యురేనియం నిల్వలను ఉంచకోరాదని అంతర్జాతీయ ఒప్పందం స్పష్టం చేస్తుండగా ఇప్పుడు ఆ పరిమితిని దాటేశామని ఆ దేశం తెలిపింది. అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిబంధనను ఉల్లంఘించింది. ఇప్పటికే ఇరాన్ చమురు ఎగుమతులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర రంగాలు లక్ష్యంగా అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ 300 కిలోల యురేనియం నిల్వల పరిమితిని ఉల్లంఘించినట్లు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) కూడా నిర్ధరించింది. ఆంక్షలను తట్టుకునేలా సాయం చేయకుంటే ఒప్పందం కింద ఇచ్చిన పలు ఇతర హామీలకు తిలోదకాలిస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది.

## సర్వర్ మొరాయింపు.. 29 విమానాలు ఆలస్యం

**బెంగళూరు:** సాంకేతిక కారణాల రీత్యా బెంగళూరు విమానాశ్రయంలో ఇండిగో సర్వర్ మొరాయించడంతో ఆ సంస్థకు చెందిన 29 విమానాలు దాదాపు 30 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరాయి. సర్వర్ పనిచేయకపోవడంతో సోమవారం ఉదయం 4.29గంటల నుంచి ఇండిగో రిజర్వేషన్ల వ్యవస్థ మొరాయించింది. వెంటనే రంగంలోకి దిగిన సిబ్బంది 5.07 గంటలకు సమస్యను పరిష్కరించారు.

## తల్లి సంపాదిస్తోంది కాబట్టి పిల్లల సంరక్షణకు డబ్బు ఇవ్వలేనంటే కుదరదు!

### విడాకుల కేసులో తండ్రికి దిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

**దిల్లీ:** విడాకుల నేపథ్యంలో తల్లి సంపాదనాపరురాలనే సాకు చూపి పిల్లల సంరక్షణ ఖర్చు బాధ్యత నుంచి తండ్రి తప్పుకోవడానికి కుదరదంటూ దిల్లీ హైకోర్టు సోమవారం స్పష్టం చేసింది. ఈ కేసులో ముగ్గురు బాలికల తండ్రి అయిన ఓ వ్యక్తి... తన మాజీ భార్య ఓ వ్యాపార సంస్థను నిర్వహిస్తోందని, తనవద్ద చిల్లిగవ్వలేదని హైకోర్టుకు తెలిపారు. కాబట్టి పిల్లల ఆలనాపాలన ఖర్చుల నిమిత్తం కింది కోర్టు ఆదేశించినట్లు రూ.60 వేలను కట్టలేనంటూ హైకోర్టుకు చెప్పారు. అతడి విజ్ఞప్తిని హైకోర్టు కొట్టేసింది. పిల్లలకయ్యే ఖర్చులను తల్లిదండ్రులిద్దరూ చెరిసమానంగా భరించాలనడం సమర్థనీయం కాదని అభిప్రాయపడింది. కిందికోర్టు ఆదేశించినట్లు రూ. 60వేలను నెలకు పిల్లల ఖర్చుల కోసం ఇవ్వాలని, ఆరువారాల్లోగా బకాయిలతో సహా చెల్లించాలని హైకోర్టు చెప్పింది. ప్రత్యేక వివాహ చట్టం కింద 2004లో వివాహం చేసుకున్న ఈ దంపతులు 2015లో వేరుపడ్డారు.

## సుత్తితో కొట్టి.. విచక్షణారహితంగా పొడిచి..

### గురుగ్రామ్‌లో భార్యాబిడ్డలను కిరాతకంగా హతమార్చిన వ్యక్తి

**గురుగ్రామ్:** భార్యను, కన్నబిడ్డలను అత్యంత దారుణంగా హత్య చేసి.. .. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్న ఓ ఫార్మా సంస్థ సీనియర్ ఉద్యోగి ఉదంతం సోమవారం వెలుగు చూసింది. గురుగ్రామ్‌లోని ఉప్పల్ సౌత్ ఎండ్‌హోంలో నివసించే ప్రకాశ్‌సింగ్(55) తన భార్య సోనూసింగ్(50), కుమార్తె అదితి(22), కుమారుడు ఆదిత్య(13)లను ఆదివారం రాత్రి హత్య చేసిన తీరు చూస్తే... పకడ్బందీగా.. పథకం ప్రకారమే చేసినట్లు స్పష్టమవుతోంది. పోలీసుల పేర్కొన్న ప్రకారం.. ప్రకాశ్‌సింగ్ ముందుగా ఇంటిలోపలి గడియలన్నిటినీ తాళం పెట్టేశాడు. సుత్తితో కుటుంబసభ్యులపై దాడికి దిగాడు. భార్య, కుమార్తె, కుమారుడిని పట్టుకుని కత్తులతో విచక్షణారహితంగా పొడిచి, గొంతులు కోశాడు. హత్యల అనంతరం ప్రకాశ్‌సింగ్ తన పెంపుడు కుక్కలతో గంటసేపు ఆడుకున్నాడు. వాటికి తిండి పెట్టాడు. తర్వాత ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖరాశాడు. కుటుంబసభ్యుల హత్యలకు తానే కారణమని అందులో పేర్కొన్నాడు. ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. టీవీల్లో వచ్చే క్రైమ్ వార్తలను చూసి అతడు ప్రభావితమై ఉండవచ్చన్నది పోలీసుల విశ్లేషణగా ఉంది.

## పీవోకే, గిల్గిత్‌లను లోక్‌సభ సీట్లుగా ప్రకటించాలన్న వ్యాజ్యం తిరస్కరణ

**దిల్లీ:** పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే), గిల్గిత్‌లను లోక్‌సభ స్థానాలుగా ప్రకటించేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. వ్యాజ్యాన్ని దాఖలు చేసిన గూఢచర్య సంస్థ.. 'రా' మాజీ అధికారి రాంకుమార్ యాదవ్‌పై రూ.50 వేలు జరిమానా విధించింది. సదరు వ్యాజ్యం అంగీకారయోగ్యం కాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం ప్రకటించింది. 'ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యమా, మీరు దిల్లీ నివసిస్తూ, పీవోకేతో మీకేం పని' అని వ్యాఖ్యానించింది.

## ఎస్సీ జాబితాలో 17 ఎంబీసీ కులాలు

### యోగి సర్కారు నిర్ణయంపై విమర్శలు

**లఖ్‌నవూ:** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓబీసీ వర్గంలోని 17 కులాలను ఎస్సీ జాబితాలో చేర్చుతూ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఆదేశాలివ్వడం వివాదాస్పదమైంది. త్వరలో 12 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకొందన్న విమర్శలు వస్తున్నాయి. అత్యంత వెనుకబడిన వర్గాల (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్-ఎంబీసీ) విభాగంలోకి వచ్చే 17 కులాల వారికి ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు ఉత్తర్వులు పంపారు. ఈ కులాలను ఎస్సీ జాబితాలో చేర్పించడానికి 2005లోనే అప్పటి సీఎం ములాయం యత్నించారు. కోర్టుల్లో వ్యాజ్యాలుండటంతో అమలు సాధ్యం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి తప్పుపట్టారు. ఎస్సీ రిజర్వేషన్ కోటాను పెంచకుండా 17 కులాలను చేర్చడం పెద్ద మోసమన్నారు. ఎస్సీ జాబితాలో మార్పులు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు.

## మరో ఆర్నెల్లు నాగాలాండ్ కల్లోల ప్రాంతం: కేంద్రం

**దిల్లీ:** నాగాలాండ్ రాష్ట్రాన్ని మరో ఆర్నెల్లు 'కల్లోల ప్రాంతం'గా కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ.. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్పీఏ) కింద నోటిఫికేషన్ జారీచేసింది.

## ఉప్పుతో పొట్టలో ఉబ్బరం!

**వాషింగ్టన్:** ఉప్పు ఎక్కువగా తింటే పేగుల్లో వాయువులు పేరుకుపోయే జీర్ణకోశ సంబంధ సమస్యలు తలెత్తుతాయని పరిశోధకులు గుర్తించారు. ఉప్పు ఎక్కువ వేసిన ఆహారాన్ని తీసుకున్నప్పుడు పొట్టలో ఉబ్బరం వంటి సమస్యలు అధికంగా ఉంటున్నట్లు అమెరికాలోని జాన్ హాప్కిన్స్ బ్లూంబర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. పీచు అధికంగా ఉండే ఆహారం తీసుకునే వారిలో ఇలాంటి సమస్య ఎక్కువగా ఉన్నట్లు ఫిర్యాదులు ఉన్నా, ఉప్పును తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన పీచు విషయంలో రాజీపడాల్సిన అవసరం లేదని తమ అధ్యయనం స్పష్టం చేస్తోందని పరిశోధకులు నోయెల్ ముయెల్లెర్ పేర్కొన్నారు.

Eenadu epaper

**సెన్సెక్స్** ▲ 292 **39687** | **నిఫ్టీ** ▲ 77 **11866** | **డోజోన్స్** 26653 ▲ 53 | **నాస్‌డాక్** 8078 ▲ 72 | **రూపాయి** 68.94 ▲ 09 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | **ముడి చమురు** 64.80 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

# ఈనాడు బిజినెస్

**ఘనం (+)**

| నిఫ్టీ | 1న | మార్పు% |
|---|---|---|
| ZEE ENTERTAINMENT | 358.35 | 5.82 |
| DR. REDDYS LAB | 2654.85 | 4.09 |
| TATA MOTORS | 168.00 | 3.35 |
| BAJAJ AUTO | 2911.95 | 3.00 |
| EICHER MOTORS | 19625.30 | 2.54 |
| HDFC | 2245.90 | 2.45 |
| INDIABULLS HSG | 621.95 | 2.34 |

**గ్రహణం (-)**

| నిఫ్టీ | 1న | మార్పు% |
|---|---|---|
| BPCL | 376.20 | -4.14 |
| ONGC | 161.00 | -4.02 |
| INDIAN OIL CORP | 151.65 | -2.73 |
| COAL INDIA | 249.25 | -1.79 |
| HCL TECH | 1049.10 | -1.46 |
| TITAN COMPANY | 1323.20 | -0.86 |
| ULTRATECH CEM | 4526.65 | -0.64 |




## ఐసీఐసీఐ బ్యాంక్ రుణ రేట్లు తగ్గింపు

ముంబయి: ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లను 0.10 శాతం మేర తగ్గించింది. ఫలితంగా అన్ని రకాల రుణాలు చౌక కానున్నాయి. ఫిబ్రవరి నుంచి రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రేట్లను 0.75 శాతం మేర కోత విధించింది. వినియోగదారులకు రేట్ల కోత ప్రయోజనాలను బదలాయించాలని ఆర్‌బీఐ ఒత్తిడి చేయడంతో బ్యాంక్ రుణ రేట్లను తగ్గించింది. అన్ని కాలవ్యవధులపై నిధులపై వ్యయానికి అనుగుణంగా రుణాలకు వడ్డీ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను 0.10 శాతం తగ్గిస్తున్నట్లు, కొత్త రేట్లు వెంటనే అమల్లోకి వచ్చాయని బ్యాంక్ తెలిపింది. ఏడాది కాలవ్యవధి కలిగిన రుణాలపై వడ్డీ రేట్లను 0.1 శాతం తగ్గించి 8.65 శాతంగా చేసింది.



## నకిలీ ఐటీసీ క్లెయిములు
# రూ.2565 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2565 కోట్ల విలువైన మోసపూరిత ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్(ఐటీసీ) క్లెయిములను గుర్తించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ విషయంలో మొత్తం 535 కేసులను నమోదు చేసి ఇప్పటిదాకా 40 మందిని జీఎస్‌టీ అధికారులు అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. 2018-19లో మొత్తం 1620 కేసుల్లో నకిలీ ఇన్‌వాయిస్‌లు నమోదయ్యాయి. ఈ మోసపూరిత ఐటీసీ క్లెయిము విలువ రూ.11,251 కోట్లుగా ఉండగా.. 154 మందిని అరెస్టు చేశారు. జీఎస్‌టీ అమలు చేసిన తొలి ఏడాది(జులై 2017-మార్చి 2018) అయిదు కేసుల్లో ఇద్దరిని అరెస్టు చేయగా.. ఐటీసీ విలువ రూ.12.67 కోట్లుగా ఉన్నట్లు సోమవారం లోక్‌సభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో ఆమె తెలిపారు.

వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ)ను ఎగవేయడానికి నకిలీ ఇన్‌వాయిస్‌లను సృష్టిస్తే వ్యాపారులపై తీవ్ర చర్యలుంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా ఎదురయ్యే నష్టాలను అరికట్టాల్సిన అవసరం ఉందని జీఎస్‌టీ అమలుకు రెండేళ్లయిన సందర్భంగా ఆర్థిక సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు.



## రుణ రికవరీకి బౌన్సర్లా?
### బ్యాంకులకు ఆ అధికారం లేదు

దిల్లీ: వినియోగదారుల నుంచి రుణాలను వసూలు చేయడం కోసం బౌన్సర్లను నియమించుకోవడానికి ఏ బ్యాంకుకు కూడా అధికారం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం.. కేవలం రికవరీ ఏజెంట్లను నియమించుకోవడానికి మాత్రమే బ్యాంకులకు అధికారం ఉంటుందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. అది కూడా పోలీసులు సరైన తనిఖీ జరిపిన అనంతరం, ఇతర నిబంధనలను పాటించిన తర్వాత మాత్రమే వారిని నియమించాల్సి ఉంటుందని లోక్‌సభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో ఆయన వివరించారు. 'రుణాలను బలవంతంగా రాబట్టుకోవడం కోసం బౌన్సర్లను నియమించుకోవడానికి ఎవరికీ అధికారం లేద'ని ఠాకూర్ స్పష్టం చేశారు. ఆర్‌బీఐ జారీ చేసిన 'గైడ్‌లైన్స్ ఆన్ ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్ ఫర్ లెండర్స్'ను బ్యాంకులు అనుసరించాలని అన్నారు. 'బకాయి వసూలు కోసం వేధింపులకు పాల్పడడం, సమయం కాని సమయంలో వెళ్లడం, రుణ వసూలుకు బౌన్సర్లను ఉపయోగించుకోవడం వంటివి బ్యాంకులు చేయరాదని ఆర్‌బీఐ సర్క్యులర్‌లో ఉంద'ని ఆయన వివరించారు.



## ఎవరూ పట్టించుకోని డిపాజిట్లు
# రూ.14,578 కోట్లు

దిల్లీ: బ్యాంకింగ్ వ్యవస్థలో గతేడాదిలో క్లెయిము చేయని డిపాజిట్ల విలువ 26.8% మేర పెరిగి రూ.14,578 కోట్లకు చేరింది. వీటి విలువ 2017లో రూ.11,494 కోట్లు; 2016లో రూ.8,928 కోట్లు చొప్పున ఉన్నట్లు లోక్‌సభకిచ్చిన సమాచారంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఒక్క ఎస్‌బీఐలోనే గతేడాది చివరకు క్లెయిము చేయని డిపాజిట్ల విలువ రూ.2,156.33 కోట్లుగా ఉందని ఆమె పేర్కొన్నారు. 'బీమా రంగం విషయానికొస్తే సెప్టెంబరు 2018 చివరి నాటికి జీవిత బీమా రంగంలో రూ.16,887.66 కోట్లు; జీవితేతర బీమాలో రూ.989.62 కోట్లు చొప్పున క్లెయిము చేయని డిపాజిట్లు ఉన్నాయి. ఆర్‌బీఐ బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం-1949లో సెక్షన్ 26ఏ ప్రకారం.. డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్(డీఈఏఎఫ్) పథకం కింద ఇలా పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం క్లెయిము చేయకుండా ఉన్న డిపాజిట్లు, వాటి వడ్డీలతో కలిపి డీఈఏఎఫ్‌కు బదిలీ చేస్తార'ని సీతారామన్ తెలిపారు.

## ఎన్‌బీఎఫ్‌సీల నియంత్రణకు ఆర్‌బీఐకి మరిన్ని అధికారాలు!

దిల్లీ: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల్ని (ఎన్‌బీఎఫ్‌సీ) నియంత్రించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు మరిన్ని నియంత్రణ, పర్యవేక్షక అధికారాల్ని ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలియజేశారు. ఎన్‌బీఎఫ్‌సీలకు ద్రవ్యలభ్యత అంశాన్ని ఆర్‌బీఐ దగ్గరగా పర్యవేక్షిస్తోందని, ఈ చర్యలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని, ఆ రంగం పని తీరును, అలాగే దానికి అనుబంధంగా ఉన్న రంగాలను కూడా ఆర్‌బీఐ పరిశీలిస్తుంటుందని ఆమె ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీలను బలోపేతం చేయడమే కాకుండా ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ఆర్‌బీఐ అవసరమైన నియంత్రణ, పర్యవేక్షక చర్యలు కొనసాగిస్తుందని వెల్లడించారు. 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం-1934లో ఆర్‌బీఐకి అప్పగించిన నియంత్రణ, పర్యవేక్షక అధికారాల్ని బలోపేతం చేయమని ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదన వచ్చింది. దీన్ని పరిశీలిస్తున్నామ'ని సీతారామన్ పేర్కొన్నారు.

## మేలో మెప్పించిన మౌలికం

దిల్లీ: ఉక్కు, విద్యుత్తు రంగాల్లో కనబరిచిన ఆరోగ్యకరమైన వృద్ధితో కీలక రంగాలు మెప్పించాయి. మేలో 5.1 శాతం వృద్ధి నమోదైంది. ఎనిమిది కీలక రంగాల (బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంటు, విద్యుత్తు) వృద్ధి గతేడాది మేలో 4.1 శాతంగా నమోదైంది. పారిశ్రామికోత్పత్తిలో మౌలిక రంగానికి 41 శాతం వాటా ఉండటం గమనార్హం. వాణిజ్య, పరిశ్రమల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

- ✦ మేలో ఉక్కు, విద్యుత్తు రంగాల వృద్ధి వరుసగా 19.9 శాతం, 7.2 శాతం చొప్పున నమోదైంది. ముడిచమురు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల రంగాలు మాత్రం క్షీణించాయి.
- ✦ ఏప్రిల్-మే నెలల్లో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 5.7 శాతం నమోదు కాగా, గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో 4.4 శాతంగా ఉంది.

## రూ.లక్ష కోట్ల దిగువకు జీఎస్‌టీ వసూళ్లు

దిల్లీ: వరుసగా రెండో నెలా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు నెమ్మదించాయి. జూన్‌లో జీఎస్‌టీ వసూళ్లు రూ.99,939 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో కేంద్ర జీఎస్‌టీ రూ.18,366 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ రూ.25,243 కోట్లు, సమ్మిళిత జీఎస్‌టీ రూ.47,772 కోట్లు, సెస్ రూ.8,457 కోట్ల మేర ఉన్నాయని ఆర్థిక శాఖ వెల్లడించింది. మేలో వసూలైన రూ.1,00,289 కోట్లతో పోలిస్తే ఈసారి మరింత తగ్గాయి. ఏడాది క్రితం జూన్‌లో వసూలైన రూ.95,610 కోట్లతో పోలిస్తే పెరగడం గమనార్హం.

## ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎన్ఎస్ విశ్వనాథన్ పునర్నియామకం

దిల్లీ: రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా ఎన్ఎస్ విశ్వనాథన్ మళ్లీ నియమితులయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కేబినెట్ నియామకాల కమిటీ విశ్వనాథన్ పునర్నియామకానికి ఆమోదం తెలిపింది. జులై నుంచి ఇది అమల్లోకి రానుందని వ్యక్తిగత వ్యవహారాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. విశ్వనాథన్ ప్రస్తుత పదవీ కాలం జులై 3తో ముగియనుంది. ఆర్‌బీఐ ముగ్గురు డిప్యూటీ గవర్నర్లుగా ఎన్ఎస్ విశ్వనాథన్, బీపీ కనుంగో, ఎంకే జైన్‌లు వ్యవహరిస్తున్నారు. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా విరాల్ ఆచార్య ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# వాహన విలాపం

- జూన్‌లో నిరాశపరచిన విక్రయాలు
- మారుతీ సుజుకీ క్షీణత



దిల్లీ: వాహన విక్రయాల క్షీణత కొనసాగింది. గత నెల అమ్మకాల్లో మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ సహా దిగ్గజ సంస్థలన్నీ నిరాశపరిచాయి. ఆర్థిక వ్యవస్థ మందగమనం ప్రభావం అమ్మకాలపై చూపాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మహీంద్రా దేశీయ విక్రయాలు స్వల్పంగా పెరిగాయి. మారుతీ సుజుకీ అమ్మకాలు 1,44,981 నుంచి 14 శాతం తగ్గి 1,24,708కు చేరాయి. గత నెలలో ఆల్టో, వ్యాగన్‌ఆర్‌లతో కూడిన మారుతీ చిన్నకార్ల విభాగం విక్రయాలు ఏకంగా 36.2 శాతం తగ్గి 18,733గా నమోదయ్యాయి. గతేడాది జూన్‌లో ఇవి 29,381గా ఉన్నాయి. స్విఫ్ట్, సెలెరియో, బాలెనో, డిజైర్ మోడళ్లతో కూడిన కాంపాక్ట్ విభాగం అమ్మకాలు 12.1 శాతం తగ్గి 62,897కు చేరాయి. విటారా బ్రెజా, ఎస్- క్రాస్, ఎర్టిగా వంటి యుటిలిటీ వాహన విక్రయాలు 7.9 శాతం తగ్గి 17,797కు చేరాయి. హ్యుందాయ్ అమ్మకాలు 7.3 శాతం క్షీణించి 45,314 నుంచి 42,007కు తగ్గాయి. ఇక ద్విచక్రవాహనాల కొస్తే.. టీవీఎస్ మోటార్ అమ్మకాలు 11 శాతం చొప్పున తగ్గాయి. సుజుకీ మోటార్ సైకిల్ అమ్మకాలు 29 శాతం పెరిగాయి. వివిధ కంపెనీల విక్రయ గణాంకాలు పట్టికలో..

**జూన్‌లో వాహన విక్రయాలు**

| కంపెనీ | 2019 | 2018 | వృద్ధి/(క్షీణత)%లో |
|---|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,24,708 | 1,44,981 | (14) |
| హ్యుందాయ్ | 58,807 | 60,772 | (3.2) |
| మహీంద్రా | 42,547 | 45,155 | (6) |
| టాటా మోటార్స్ | 49,073 | 56,773 | (14) |
| టయోటా కిర్లోస్కర్ | 11,365 | 14,102 | (19) |
| **వాణిజ్య** | | | |
| అశోక్ లేలాండ్ | 12,810 | 15,792 | (19) |
| మహీంద్రా (ట్రాక్టర్స్) | 33,094 | 40,529 | (18) |
| ఎస్కార్ట్స్ | 8,960 | 9,983 | (10.2) |
| **ద్విచక్ర** | | | |
| హీరో మోటోకార్ప్ | 6,16,256 | 7,04,562 | (12.49) |
| బజాజ్ ఆటో | 4,04,624 | 4,04,429 | (0.01) |
| టీవీఎస్ మోటార్ | 2,79,102 | 3,13,614 | (11) |
| సుజుకీ మోటార్‌సైకిల్ | 67,491 | 52,217 | 29.25 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 58,339 | 74,477 | (22) |

# అంకురాలకు ఆర్థిక తోడ్పాటు

- ఎస్‌బీఐ ఇన్‌క్యూబ్ స్టార్టప్ లాంజ్

హైదరాబాద్ (గచ్చిబౌలి), న్యూస్‌టుడే: అంకుర సంస్థలకు అవసరమైన ఆర్థిక సహకారం అందించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'ఎస్‌బీఐ ఇన్‌క్యూబ్ స్టార్టప్ లాంజ్'ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో దీన్ని సోమవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓం ప్రకాశ్ మిశ్రా మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు అంకురాలు పరిష్కారం చూపిస్తున్నాయనీ, వాటికి అవసరమైన ఆర్థిక సహకారం అందించేందుకు ఎస్‌బీఐ ముందుకు వస్తోందని తెలిపారు. దీనికోసం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌తో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సహాయం కోసం అంకుర సంస్థల నిర్వాహకులు బ్యాంకుల వద్దకు వెళ్లకుండా వారి చెంతకే బ్యాంకర్‌ను తీసుకొచ్చే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఫిన్‌టెక్ విభాగంలో అంకుర సంస్థలకు పెట్టుబడులు అందించేందుకు ఎస్‌బీఐ రూ.200 కోట్లు కేటాయించిందన్నారు. బెంగళూరులో మొదటి ఎస్‌బీఐ ఇన్‌క్యూబ్ ఏర్పాటు చేయగా రెండోది హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు వెల్లడించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ పి.జె.నారాయణన్ మాట్లాడుతూ కృత్రిమ మేధ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి వివిధ రంగాల్లో పరిశోధనలకు ట్రిపుల్‌ఐటీ పెద్దపీట వేస్తోందన్నారు. విభిన్న ఆలోచనలతో అంకుర సంస్థలను ఏర్పాటు చేసి, ఔత్సాహిక వ్యాపారులుగా మారేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. అంకుర సంస్థలను నిజమైన ప్రపంచంలోకి తీసుకెళ్లేందుకు ఆర్థిక భాగస్వాములు ఎంతో అవసరమన్నారు. ఇందులో భాగంగా ఎస్‌బీఐ ముందుకు రావడం హర్షణీయమన్నారు.

## మూడేళ్లలో 1,000 ఉద్యోగాలు
### విస్తరణ దిశగా క్వెస్ట్ గ్లోబల్

ఈనాడు, హైదరాబాద్: వినియోగదారులు లక్ష్యంగా ఇంజినీరింగ్, లైఫ్ సైకిల్ సేవలను అందిస్తోన్న క్వెస్ట్ గ్లోబల్ తన హైదరాబాద్ కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా రానున్న మూడేళ్ల కాలంలో కొత్తగా 1,000 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఈ కేంద్రంలో 150 మంది పనిచేస్తున్నారు. కంట్రోల్ ఇంజినీరింగ్, ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ టెక్నాలజీల్లో నైపుణ్యం ఉన్న ఇంజినీర్లను తీసుకోవడం ద్వారా అంతర్జాతీయ వినియోగదారులకు అవసరమైన సేవలను అందించేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. క్వాలిటీ అస్యూరెన్స్, ఆటోమేషన్, మెషిన్ లెర్నింగ్ తదితర సాంకేతికతలను హైదరాబాద్ కేంద్రంలో అభివృద్ధి చేసేందుకు వీలుగా సెంటర్ ఆఫ్ కాంపిటెన్సీని ప్రారంభించనుంది. సంస్థ అభివృద్ధిలో హైదరాబాద్ కేంద్రం పాత్ర ఎంతో ఉందనీ.. విస్తరణ ద్వారా దాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని క్వెస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అజయ్ ప్రభు పేర్కొన్నారు. ఇక్కడ మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు.

## 12, 18% శ్లాబుల విలీన అవకాశం!

దిల్లీ: ఆదాయం మరింత పెరిగితే వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)లో 12, 18 శాతం శ్లాబుల్ని విలీనం చేసి రెండంచెల ఒకే పన్నును తీసుకొచ్చే అవకాశం ఉందని మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. జీఎస్‌టీని ప్రవేశపెట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జైట్లీ ఫేస్‌బుక్ వేదికగా తన అభిప్రాయాల్ని పంచుకున్నారు. మోదీ 2.0 ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టలేనని, ఆరోగ్య కారణాల రీత్యా తనను మంత్రి వర్గంలోకి తీసుకోవద్దంటూ ఆయన మోదీని కోరిన సంగతి తెలిసిందే.

# వాణిజ్య భయాలు తగ్గడంతో..

- సూచీలకు కొనుగోళ్ల మద్దతు • సంస్కరణల బడ్జెట్‌పై ఆశలు

**సమీక్ష**

అంతర్జాతీయ సంకేతాలు దన్నుగా నిలవడంతో దేశీయ సూచీలు పరుగులు తీశాయి. అమెరికా- చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు శాంతించడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. శుక్రవారం ప్రవేశపెట్టనున్న సాధారణ బడ్జెట్‌లో ప్రభుత్వం సంస్కరణలు ప్రకటించొచ్చన్న ఆశలు ఇందుకు తోడయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 9 పైసలు బలపడి 68.94 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా.. ఐరోపా సూచీలు లాభాల్లోనే ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 39,543.73 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం కొనుగోళ్ల మద్దతుతో అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 39,764.82 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 291.86 పాయింట్ల లాభంతో 39,686.50 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 76.75 పాయింట్లు పెరిగి 11,865.60 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,830.80- 11,884.65 పాయింట్ల మధ్య కదలాడింది.

- ✦ కంపెనీ ఆడిటర్‌గా ప్రైస్ వాటర్‌హౌస్ వైదొలగడంతో ఎవరెడీ ఇండస్ట్రీస్ షేరు కుదేలైంది. 5 శాతం కోల్పోయిన షేరు రూ.76 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకింది. చివరకు అక్కడే ముగిసింది.
- ✦ క్యూఐబీలకు ఈక్విటీ షేర్లను జారీ చేయడం ద్వారా రూ.2100 కోట్లు సమీకరించడంతో గోద్రేజ్ ప్రోపర్టీస్ రాణించింది. ఇంట్రాడేలో రూ.1118 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకిన షేరు.. చివరకు 9.38 శాతం లాభంతో రూ.1097.40 వద్ద ముగిసింది.
- ✦ జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన కొన్ని ఆస్తులకు టాటా గ్రూప్ బిడ్ దాఖలు చేయొచ్చన్న వార్తల నేపథ్యంలో కంపెనీ షేరు 4.96 శాతం లాభంతో రూ.70.95 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభాలతో ముగిశాయి. టాటా మోటార్స్ 3.23%, బజాజ్ ఆటో 2.92%, హెచ్‌డీఎఫ్‌సీ 2.50%, ఇండస్ఇండ్ బ్యాంక్ 1.64%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.60%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.32%, హీరో మోటోకార్ప్ 1.30%, సన్‌ఫార్మా 1.02%, ఎన్‌టీపీసీ 0.88% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ, హెచ్‌సీఎల్ టెక్, హిందుస్థాన్ యునిలీవర్, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ 3.99% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి, వాహన, విద్యుత్, ఆరోగ్య సంరక్షణ, ఫైనాన్స్ 2.59 శాతం వరకు రాణించాయి.

## వరల్డ్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఏపీఎన్ ఛైర్మన్‌గా రఘుపతి



ఈనాడు, హైదరాబాద్: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.రఘుపతి వరల్డ్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ - ఏసియా పసిఫిక్ నెట్‌వర్క్ (ఏపీఎన్) ఛైర్మన్‌గా రెండోసారి ఎంపికయ్యారు. ఈయన ఈ పదవిలో జూన్ 30, 2023 వరకూ కొనసాగుతారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్‌కు ఇన్‌ఛార్జిగా కూడా ఈయన వ్యవహరిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా హరిత భవనాలను ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తున్న ఏపీఎన్‌లో 15 దేశాలకు పైగా సభ్యత్వం ఉంది.

**1న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)**



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 421 | వరంగల్ | 424 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 4.80 | విశాఖపట్నం | 442 |
| బెంగళూరు | 445 | చెన్నై | 470 |
| 2వ తేదీకి... | | చిత్తూరు | 463 |
| విజయవాడ/గోదావరి | 422 | నమక్కల్ | 460 |

**ఎన్ఎస్ఈ**

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

**నిఫ్టీ 50**

ADANI PORT & 413.25 (410.20) 1457022
ASIAN PAINTS 1353.85 (1358.15) 739182
AXIS BANK LT 810.45 (808.55) 5896530
BAJAJ AUTO L 2911.95 (2827.05) 628760
BAJAJ FINANC 3699.00 (3681.10) 913884
BAJAJ FINSER 8521.05 (8524.65) 102735
BHARTI AIRTE 348.50 (346.65) 3405198
BHARTI INFRA 265.65 (267.05) 1697283
BPCL 376.20 (392.45) 5133734
BRITANNIA 2737.55 (2743.70) 282998
CIPLA 555.80 (553.45) 565463
COAL INDIA L 249.25 (253.80) 4839632
DR. REDDYS 2654.85 (2550.45) 1118522
EICHER MOTOR 19625.30 (19138.80) 102153
GAIL 312.70 (311.95) 4567296
GRASIM IND 920.00 (914.10) 832301
HCL TECH 1049.10 (1064.65) 1233848
HDFC 2245.90 (2192.10) 2090173
HDFC BANK 2485.55 (2443.75) 2131040
HERO MOTOCOR 2616.50 (2581.50) 728762
HINDALCO IND 208.90 (207.05) 6353325
HINDUSTAN UN 1780.20 (1787.60) 553283
ICICI BANK 439.00 (437.10) 6871979
INDIABULLS H 621.95 (607.70) 10218339
INDIAN OIL 151.65 (155.90) 12534939
INDUSINDBANK 1433.60 (1410.50) 3446607
INFOSYS LTD 731.30 (732.00) 3224968
ITC 274.95 (273.85) 5042447
JSW STEEL LT 275.75 (276.60) 3935030
KOTAK MAHIND 1481.20 (1477.10) 1904359
LARSEN & TOU 1556.65 (1553.20) 1537022
M&M 660.00 (655.35) 3547891
MARUTI SUZIK 6507.85 (6534.65) 754667
NTPC LTD 142.55 (141.35) 31289422
ONGC 161.00 (167.75) 15160240
POWER GRID C 207.05 (206.90) 6306647
RELIANCE IND 1268.85 (1253.10) 6162080
SBI 361.55 (361.25) 12348793
SUN PHARMA 405.35 (400.95) 2254468
TATA CONSULT 2239.55 (2227.20) 2769940
TATA MOTORS 168.00 (162.55) 23990900
TATA STEEL L 506.95 (504.40) 8544375
TECH MAHINDR 704.65 (706.60) 2073961
TITAN IND 1323.20 (1334.70) 1554897
ULTRATECH 4526.65 (4555.85) 262438
UPL LIMITED 948.20 (937.45) 2692425
VEDANTA LIMI 174.05 (174.35) 6528994
WIPRO 282.00 (280.50) 1735921
YES BANK LTD 109.15 (108.75) 42545442
ZEE ENTERTAI 358.35 (338.65) 13803574

**నిఫ్టీ నెక్స్ట్ 50**

ABB 1601.35 (1602.45) 155524
ACC 1562.70 (1562.15) 325337
AMBUJA CEMEN 212.95 (212.85) 2294542
ASHOK LEYLAN 87.10 (87.25) 14004525
AUROBIND PHA 615.35 (608.05) 1325880
AVENUE SUPER 1426.05 (1397.90) 515766
BAJAJ HOLDIN 3642.55 (3598.25) 12823
BANDHAN BANK 545.50 (538.75) 352885
BANK OFBAROD 121.25 (121.60) 17877613
BHEL 73.05 (73.15) 6618565
BIOCON LTD 252.20 (250.55) 1285096
BOSCH LTD 16588.05 (16338.65) 11772
CADILA HEALT 240.35 (241.70) 1465009
COLGATE PALM 1130.70 (1127.70) 315828
CONTAINER 578.10 (570.05) 1163755
DABUR INDIA 401.75 (400.50) 1475814
DIVIS LAB 1610.20 (1596.95) 273406
DLF LIMITED 190.80 (188.55) 5467507
GENERAL INS 228.00 (218.35) 343863
GODREJ CONSU 664.80 (663.10) 423618
HAVELLS INDI 787.05 (786.15) 1283928
HDFC AMC LIM 2080.95 (2061.60) 243299
HDFC STAND L 469.50 (464.05) 2471465
HINDUSTAN ZI 244.55 (244.10) 1489925
HPCL 282.55 (290.05) 5994596
ICICI LOMBAR 1103.55 (1112.55) 290926
ICICI PRU LI 390.75 (388.65) 1938543
IDEA CELLULR 12.00 (12.15) 33179163
INTERGLOBE A 1581.10 (1557.95) 743254
L&TFIN.HOLD 117.35 (115.15) 3532412
LUPIN 772.15 (754.75) 1233570
MARICO LIMIT 370.25 (370.55) 1186927
MCDOWELL 588.20 (584.95) 1217743
MOTHERSON 126.00 (121.95) 8964847
MRF 56758.85 (56609.60) 3293
NHPC LTD 24.90 (24.80) 771383
NMDC LTD 114.90 (112.95) 4012742
ORACLE FIN S 3160.60 (3170.65) 21309
P&G HYG&HEAL 10771.60 (10714.85) 1751
PAGE INDUSTR 20861.60 (20581.70) 9801
PETRONET LNG 248.10 (245.10) 5863453
PIDILITE IND 1206.45 (1214.45) 385209
PIRAMAL ENTE 1965.00 (1946.40) 595599
SAIL 51.10 (50.75) 18877756
SBI LIFE INS 735.90 (723.70) 610864
SHREE CEMENT 21469.05 (21820.80) 20072
SHRIRAM TRAN 1054.65 (1080.45) 1443356
SIEMENS 1330.45 (1311.35) 618081
THE NEW INDI 148.70 (149.35) 123363

**బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు**

ADITYA SPIN 3.70 (3.70) 540
ALPHAGEO 414.80 (415.65) 1124
AMAR RAJA BA 631 (620.15) 34292
ANDHRA BANK 23.55 (23.60) 44671
ANDHRA CEMEN 3.89 (3.97) 31504
ANDHRA PAPER 427.65 (427.45) 3351
ANDHRA PETRO 53.35 (53.90) 12020
ANDHRA SUGAR 320.25 (318.80) 1104
ASTRA MICROW 87.50 (84.30) 19924
AUROBINDO PH 615.55 (608.10) 37460
AVANTEL SOFT 242 (235.80) 735
AVANTI FEEDS 349.20 (351.80) 16773
BALAJI AMIN 371.50 (377.80) 4308
BARTRONICS 3.89 (3.83) 6107
BHAGIRA CHEM 466.85 (486.55) 1815
BHAGYA NAG 24.15 (24.50) 1158
BKV INDUSTRS 2.73 (2.87) 11
BN RATHI SEC 20 (20) 82
BRILLIANT SE 0.85 (0.89) 70884
CAMBRIDGE TE 36.20 (35.20) 683
CIL SECURI 13.70 (13.30) 2
COMBAT DRUGS 24.10 (25.35) 11
CONT COFFEE 256.85 (255.85) 436
COROMAN FERT 416.55 (416) 3149
CUBEX TUB 11.91 (11.95) 1252
CYBERMATE 1.86 (1.89) 17761
CYIENT LIMIT 534.90 (542.70) 4448
DECCAN CEMEN 396 (392) 94
DIVI'S LAB 1609.90 (1596.85) 5687
DIVYA GRANIT 76 (76) 102
DR REDDY 2655.10 (2549.80) 54982
ESSEN SUPPLE 21.40 (21.40) 1
FOUR SOFT 27.80 (27.45) 3
GATI CORPN 72.90 (72.55) 46940
GAYATRI PROJ 159.40 (157.75) 421
GMR INFRASTR 15.08 (14.90) 525129
GOLDST INFRA 207.90 (201.45) 12442
GOLDSTONE EN 10.44 (9.30) 26
GRANULES (I) 97.30 (96.70) 23564
GSS AMERICA 68.30 (68.40) 30609
GVK POWER 5.96 (5.95) 357438
HBL NIFE POW 22.70 (22.60) 52044
HERITAGE FOO 412.45 (405.85) 2439
HIL LTD 1602.60 (1619.15) 224
HIND FLUROCA 10.98 (10.50) 1655
IDL INDUSTRS 266.10 (273.90) 891
ILFS ENGINEE 6 (6.10) 4738
INCAP 31.40 (33) 196
IVRCL INFRAS 0.68 (0.70) 78811
JEEVAN SCIEN 26.10 (26.80) 1478
KAKATIYA CEM 191.35 (190.05) 513
KAKATIYA TEX 3.55 (3.50) 200
KALLAM SPG 13.10 (12.95) 1641
KARAN WOO-SN 2.59 (2.72) 2
KAVERI SEED 467.90 (460.25) 4749
KCP LTD 83.20 (83.70) 831
KERNEX MICRO 26.20 (26.95) 3669
KNR CONSTRUC 285.20 (279.95) 3166
KREBS BIO 81.45 (80.95) 105
LANCO INDUS 176.10 (168.50) 1757
LAURUS LABS 347.60 (336.75) 1916
LOKESH MACH 46.60 (47.25) 943
MADHUCON PRO 6.11 (6.22) 5518
MEDINOVA DIA 14.35 (15.10) 299
MEGA SOFT 7.69 (7.33) 15492
MIC ELECTRON 0.72 (0.75) 10158
MOLD-TEK.TEC 53.80 (53.80) 201
MOLDTK PLA 270.30 (270.20) 9447
MSR INDIA LT 10.20 (10.15) 55
NAGARJAGRICH 29.95 (30.10) 1442
NATCO PHARMA 536.60 (534.30) 1789
NAVA BH VENT 96.40 (94.15) 32248
NCC 95.15 (97.60) 935676
NCL IND 131.50 (132.80) 5329
NEHA INTER 1.82 (1.75) 4430
NETTLINX 34.65 (33.95) 5029
NEULAND LAB 536.55 (522.85) 356
NIHAR INFO 9.39 (9.88) 1110
NILE 259.05 (253.90) 559
NORTHGATE TE 0.35 (0.36) 736
OIL COUNTRY 7.14 (6.83) 5163
PENNER IND 32.90 (32.95) 7384
PHYTOCHEM I 24.50 (24.70) 235
PIONEER DIST 126.60 (130.95) 410
PITTI LAMIN 47.50 (48) 1687
POKARNA 142.30 (123) 31864
PRAJAY ENGS 7.40 (7.51) 4634
PREMIER EXPL 202.70 (196.50) 491
PRISM CEMENT 91.30 (90.50) 19285
PRUDENTL PHA 3.80 (3.86) 47155
RAASI REFRAC 5.30 (5.05) 7421
RAGSAN PETRO 87.05 (86.20) 120
RAIN INDUSTR 101.65 (100.30) 61637
RAJVIR INDUS 12.08 (12.71) 50
RAM INFORMAT 36.95 (37) 805
SAGAR CEM 666.60 (660.50) 68
SAMKRG PIST 128.90 (129.55) 1420
SATVAH. ISPA 6.28 (6.03) 4850
SMS PHARMA 53.45 (54) 266
SREE RAYAL A 30 (30.15) 21667
SRINIVASA SH 28.40 (27.05) 20
STARCHIK SP 48.50 (48.30) 355
STEEL EXCHAN 12.25 (12.10) 3166
SUJANA UNIVE 0.22 (0.23) 12694
SURANA TELE 3.82 (3.81) 210
SURYALAKSH.C 23.30 (25) 100
SURYALATA SP 146.40 (153.50) 1056
SUVEN PHARMA 271.50 (271) 12946
TAJ GVK HOTE 189.90 (188.40) 212
TANLA 71.90 (74) 36252
TERA SOFTWAR 34.80 (35.35) 700
TRANS BIOTEK 3.15 (3.19) 4928
TRENDY KNIT 0.20 (0.20) 21020
VAMSHI RUBB 20.15 (20.90) 325
VBC FERRO 31.40 (33.05) 746
VICEROY HOTE 1.59 (1.65) 28582
VIJAY TEXTIL 18.55 (18.50) 39138
VIMTA LABS 174.50 (172.85) 86
VISAKA IND 371.80 (375.35) 731
VISTA PHARMA 13.70 (13.65) 808
VIVIMED LABS 15.90 (16.10) 39888
VJIL CONSULT 40 (40) 2800
YBRANT DIGIT 4.20 (4.31) 42753
ZENOTECH LAB 15.05 (15.80) 5988
ZENTECH 73.55 (73.10) 4632

Eenadu epaper



# రూ.25,000 కోట్ల భూరి విరాళం

**బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్‌కు బఫెట్ మరింత చేయూత**

న్యూయార్క్: ప్రముఖ బిలియనీర్ వారెన్ బఫెట్ భూరి విరాళం ప్రకటించారు. బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్, నాలుగు ఇతర స్వచ్ఛంద సంస్థలకు 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25000 కోట్లు) విలువైన బెర్క్‌షైర్ హాత్‌వే షేర్లను విరాళంగా ఇచ్చారు. గేట్స్ ఫౌండేషన్‌తో పాటు సుసాన్ థామ్సన్ బఫెట్ ఫౌండేషన్, ది షెర్వుడ్ ఫౌండేషన్, ది హోవార్డ్ జి బఫెట్ ఫౌండేషన్, నోవో ఫౌండేషన్‌లు ఈ విరాళాన్ని అందుకోనున్నాయి. 2006 నుంచి ఇప్పటి వరకు ఈ అయిదు స్వచ్ఛంద సంస్థలకు సుమారు 34 బిలియన్ డాలర్లు విరాళంగా అందించారు.

# అమ్మకానికి.. లేదంటే లీజుకు

- ముంబయిలో ప్రధాన భవనంపై అనిల్ రిలయన్స్ గ్రూపు కసరత్తు
- బ్లాక్‌స్టోన్‌తో పాటు మరో పీఈ సంస్థతో చర్చలు



దిల్లీ: అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూపు ఆర్థిక కష్టాల నుంచి బయటపడేందుకు ఉన్న అన్ని మార్గాల్నీ అన్వేషిస్తోంది. ముంబయిలోని తూర్పు శాంతాక్రజ్‌లో ఉన్న రిలయన్స్ సెంటర్ కార్యాలయం ద్వారా డబ్బులు ఆర్జించాలని చూస్తోంది. ఇందుకోసం ఆ భవనాన్ని లీజు ప్రాతిపదికన అప్పగించడం లేదంటే మంచి బేరం వస్తే విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు బీఎస్ఈకి సమాచారమిచ్చింది. దీర్ఘకాలిక లీజు కింద భవనాన్ని అప్పగించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని రుణ భారం తగ్గించుకునేందుకు వినియోగించుకోనుంది. 2020 నాటికి రుణ రహిత సంస్థగా మారేందుకు రిలయన్స్ ఇన్‌ఫ్రా లక్ష్యం నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న రూ.6,000 కోట్ల రుణాన్ని సగానికి తగ్గించుకోవాలని భావిస్తోంది. రిలయన్స్ సెంటర్ కార్యాలయ లీజు/విక్రయంతో రూ.3,000 కోట్లు వస్తాయని కంపెనీ భావిస్తోంది. అయితే దీని ద్వారా రూ.1,500-2,000 కోట్లు మాత్రమే సమకూరే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ ప్రోపర్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్‌ను సలహాదారుగా నియమించుకొంది. బ్లాక్‌స్టోన్‌తో పాటు అమెరికాకు చెందిన మరో ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడుల సంస్థతో చర్చలు కొనసాగిస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం పూర్తయితే శాంతాక్రూజ్ నుంచి దక్షిణ ముంబయిలోని బెల్లార్డ్ ఎస్టేట్‌కు ప్రస్తుత కార్యాలయాన్ని మారుస్తారు. అలాగే ముంబయిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న రిలయన్స్ గ్రూపు కార్యాలయాలకు ఉద్యోగులను తరలిస్తారు. ఇదిలా ఉంటే అవసరమైతే ఆస్తులను విక్రయించైనా సరే రుణాలు తిరిగి చెల్లిస్తానని ఇటీవల అనిల్ అంబానీ ప్రకటించిన సంగతి విదితమే. ఇందులో భాగంగానే రిలయన్స్ గ్రూపు వేగంగా పావులు కదుపుతున్నట్లు పలువురు భావిస్తున్నారు.

### రిలయన్స్ సెంటర్ కార్యాలయ భవనం ప్రత్యేకతలు

- 6.95 లక్షల చదరపు అడుగుల స్థలం
- 425 కార్లు పార్కింగ్ చేసుకునే వెసులుబాటు
- ముంబయి వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేకు పక్కనే ఉండటం
- ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 15 నిమిషాల ప్రయాణ దూరం
- దేశీయ విమానాశ్రయ టెర్మినల్‌కు 10 నిమిషాల్లో చేరుకోవచ్చు
- బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌కు 20 నిమిషాల ప్రయాణం
- త్వరలో రాబోతున్న శాంతాక్రజ్ మెట్రో స్టేషన్‌కు నడక దూరం
- దిల్లీ ఆగ్రా టోల్ రహదారిని క్యూబ్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు విక్రయించనున్నట్లు ఇటీవల రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రకటించింది. ఆగస్టు చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి, రూ.3,600 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇదిలా ఉంటే, గత ఏడాది ముంబయిలో ఉన్న ఇంధన వ్యాపారాన్ని రూ.18,800 కోట్లకు అదానీ ట్రాన్స్‌మిషన్‌కు విక్రయించింది. దీంతో రుణ భారాన్ని రూ.22,000 కోట్ల నుంచి తగ్గించుకుంది. ప్రస్తుతం ఉన్న రుణం రూ.6,000 కోట్లను కూడా 2020 నాటికి పూర్తిగా చెల్లించి రుణ రహిత సంస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- మరోవైపు, రిలయన్స్ గ్రూపునకు చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) కూడా దివాలా బాటలో ఉంది. దివాలా ప్రక్రియ జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్‌కు (ఎన్‌సీఎల్‌టీ) చేరింది. ఇప్పటికే రూ.57,500 కోట్ల క్లెయిమ్‌లు వచ్చాయి. ఇందులో సొంత గ్రూపు సంస్థలు కూడా తమకు రూ.7,000 కోట్లు ఆర్‌కామ్ నుంచి రావాలని క్లెయిమ్ చేశాయి.







# కావాలి.. 2.0

జీఎస్‌టీ రెండేళ్లు– సమీక్ష

సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

జూన్ 30, 2017 అర్ధరాత్రి పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ)ను అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆ పరోక్ష పన్నుల వ్యవస్థ ఎన్నో మార్పులకు గురవుతూ వచ్చింది. అమలు జరిగి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మనం ఏం సాధించామన్నది చర్చించుకోవడం కంటే.. భవిష్యత్‌లో ఇంకా ఏం చేయాలన్నదానిపై దృష్టి సారించడం మేలు. దార్శనికులు మాత్రమే భవిష్యత్‌పై దృష్టి సారించి.. సాధించలేని.. ఊహించలేని విజయాలను దక్కించుకుంటారన్న సంగతి మీకు తెలిసిందే కదా.

మోదీ 2.0 ప్రభుత్వం ఇటీవలే కొలువుదీరింది. భారత్‌తో పాటు.. ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రభుత్వంపై ఎన్నో అంచనాలున్నాయి. అందుకు వ్యాపార వర్గాలు కూడా మినహాయింపు కాదు. జీఎస్‌టీలో పలు మార్పులను వీరు అంచనా వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో జీఎస్‌టీని అమలు చేసి దాని సామర్థ్యాలను పెంచడానికి మోదీ 2.0 ప్రభుత్వం ఏం చేయాలన్నదానిపై ఈ వ్యాసంలో చర్చిద్దాం.

క్షేత్ర స్థాయిలో అమలు చేసే సంస్కరణల వల్ల జీఎస్‌టీ వసూళ్లు కచ్చితంగా పెరుగుతాయి. అదే సమయంలో జీఎస్‌టీ తప్ప మిగతా అన్ని పన్నులను తొలగించే రోజు కూడా ఎంతో దూరంలో లేదు. అందుకు చేపట్టాల్సిన సంస్కరణలు ఏమిటంటే..

### ఆన్‌లైన్ ఇన్‌వాయిసింగ్ తప్పనిసరి చేయాలి

వ్యాపారం నుంచి వ్యాపారం(బీ2బీ) లావాదేవీల విషయంలో తప్పనిసరిగా ఆన్‌లైన్ రశీదు ప్రక్రియను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పద్ధతిలో జీఎస్‌టీ పోర్టల్ ద్వారా వస్తువులు లేదా సేవల సరఫరాదారు నుంచి రశీదులు(ఇన్‌వాయిస్‌లు) ఉత్పత్తి అవుతాయి. బీ2బీ లావాదేవీలన్నీ నమోదు అవుతాయి కాబట్టి ఆదాయ లీకేజీని అరికట్టవచ్చని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది.

వాస్తవ పరిస్థితులకు వస్తే.. వ్యాపారం నుంచి వినియోగదారు(బీ2సీ)లావాదేవీల్లోనే అవకతవకలు జరుగుతుంటాయి. వీటిపై పర్యవేక్షణ ఉండకపోవడం ఇందుకు నేపథ్యం. బీ2సీ లావాదేవీల్లో సూపర్ మార్కెట్లు, మాల్స్, మల్టీప్లెక్సులు, జనరల్, కిరాణా స్టోర్లలో ప్రతీ ఇన్‌వాయిస్‌ను జీఎస్‌టీ పోర్టల్ నుంచి ఉత్పత్తి చేయడం తప్పనిసరి చేయాలి. ఒక బాధ్యత గల పౌరుడిగా మనం కూడా ఏవైనా కొన్నపుడు కచ్చితంగా రశీదును కోరాలి.

### వృత్తిపరమైన సేవలకు రివర్స్ ఛార్జీ విధించాలి

చాలా వరకు వృత్తినిపుణులు అందించే సేవలన్నీ ఫార్వర్డ్ ఛార్జీ కింద ఉన్నాయి. అంటే సరఫరాదారు పన్నును వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లిస్తారన్నమాట. నాకు తెలిసినంతవరకు చాలా మంది వృత్తినిపుణులు తమ మినహాయింపు పరిమితికి మించి టర్నోవరు పెరగకుండా 'మేనేజ్' చేస్తుంటారు. ఇది ప్రభుత్వానికి ఆదాయ నష్టాన్ని కలిగిస్తుంది. న్యాయవాదుల సేవలు, చార్టర్డ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కాస్ట్ అకౌంటెంట్లు, ఇంజినీర్లు, వాల్యూయర్లు, అకౌంటెంట్లు.. ఇలా అన్ని వృత్తిపరమైన సేవలను రివర్స్ ఛార్జీ కిందకు తీసుకురావాలి. అపుడే ప్రభుత్వానికి జీఎస్‌టీ పన్ను వసూళ్లు పెరుగుతాయి.

### ఆ గీత చెరిపేయాలి

ప్రస్తుతం జీఎస్‌టీలో రెండు విధాల (రాష్ట్రంలోపల, రాష్ట్రాల మధ్య) లావాదేవీలున్నాయి. ఈ విభజన వల్ల కంపెనీలకు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను సర్దుబాటు చేసుకుని తమ నిర్వహణ మూలధన అవసరాలను పెంచుకోవడానికి సమస్యలు ఎదురవుతున్నాయి. సాధారణ ఎగుమతులు, ఎస్ఈజడ్‌లకు చేసే ఎగుమతులు, దిగుమతులు, సరఫరాలను మాత్రమే ఐజీఎస్‌టీ కింద ఉంచాలి. మిగతా అన్నీ సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కిందకు తీసుకువస్తే.. ఐటీసీ సర్దుబాటులో ఉన్న సంక్లిష్టతను తగ్గించవచ్చు. కొన్ని సందర్భాల్లో ఒక అంశం కింద చూపే క్రెడిట్‌ను మరో అంశం కింద సర్దుబాటు చేయలేం. దీంతో నిధులను నిలిపిఉంచాల్సి వస్తుంది. అది కాస్తా ఎక్కువ నిర్వహణ మూలధనం అవసరమయ్యేందుకు దారితీస్తోంది. ప్రభుత్వం జీఎస్‌టీలో సంక్లిష్టతను తగ్గించడానికి ప్రయత్నించాలి. దీని కోసం ఒక సాధ్యాసాధ్యాల సర్వేను చేపట్టాలి. అపుడే వ్యాపార వర్గాలు తమ సామర్థ్యాలను విస్తృతం చేసుకుని తక్కువ నిర్వహణ మూలధనంతో పనిచేయడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

### రశీదులను సరిపోల్చాలి

ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను అదనంగా క్లెయిము చేసుకోకుండా ఉండడం కోసం వ్యాపారులు తమ అన్ని వ్యాపార లావాదేవీలను నివేదించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అపుడు రశీదులను సరిపోల్చవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. అయితే ఈ రశీదుల సరిపోల్చే ప్రక్రియను సాంకేతిక, ఇతర కారణాల వల్ల రెండేళ్లుగా వాయిదా వేస్తూ వచ్చారు. జులై 2019 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించారు కానీ.. ఇటీవలి జీఎస్‌టీ మండలి సమావేశంలో జనవరి 2020కు వాయిదా వేశారు. మళ్లీ వాయిదా వేస్తే మాత్రం జీఎస్‌టీ వసూళ్లు తగ్గడంతో పాటు, వ్యాపారాల్లో అవకతవకలు కొనసాగుతాయి. కొద్ది రోజుల కిందటే గుజరాత్‌లో అతిపెద్ద ఇన్‌వాయిస్ ట్రేడింగ్ రాకెట్ బయటపడ్డ విషయం మీకు గుర్తుండే ఉంటుంది. దీని వల్ల ప్రభుత్వానికి రూ.910 కోట్ల నష్టం వచ్చింది. రశీదు స్థాయిలో సరిపోల్చడాన్ని అమలు చేసి ఉంటే ఈ ఆదాయ నష్టం ప్రభుత్వానికి కలిగి ఉండేది కాదు.

### జీఎస్‌టీపై అవగాహన పెంచాలి

జీఎస్‌టీ అమలై రెండేళ్లు అవుతున్నా.. వ్యాపార వర్గాలు ఇంకా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ప్రయోజనాలను అర్థం చేసుకోవడం లేదు. సరఫరాదార్లు రశీదు(ఇన్‌వాయిస్)ను జారీ చేసే సమయంలో వస్తు, సేవలను పొందే వ్యక్తి నుంచి జీఎస్‌టీఐఎన్‌ను గట్టిగా అడగలేకపోతున్నారు. దీంతో సరఫరాదారు బీ2సీ రశీదును ఇస్తున్నారు. ఇది కాస్తా పన్ను చెల్లింపును తప్పించుకోవడానికి దారి తీస్తోంది. ప్రభుత్వం, వ్యాపార వర్గాలు జీఎస్‌టీపై అవగాహనను పెంచేందుకు కృషి చేయాలి. జీఎస్‌టీఐఎన్‌తో రశీదు జారీ కోసం పట్టుపట్టేలా చూడాలి. అపుడే పన్ను వసూళ్లు పెరిగి.. జీడీపీ వృద్ధికి ఊతం లభిస్తుంది.



### టెలికాం కంపెనీలు పన్ను రశీదు ఇవ్వడం లేదు

నాకు తెలిసినంత వరకు ఏ టెలికమ్యూనికేషన్ సేవల అందజేతదారు కూడా రూ.200కు పైన ప్రీ పెయిడ్ ఓచర్లకు పన్ను రశీదును జారీ చేయడం లేదు. ప్రీపెయిడ్ ఇన్‌వాయిస్‌లూ ఇవ్వడం లేదు. ఇన్‌వాయిస్‌లను జారీ చేయకపోవడం వల్ల నేరుగా ప్రభుత్వానికి ఆదాయ నష్టం ఏమీ ఉండదు కానీ.. దీని వల్ల పన్ను ఎగవేతకు ఆస్కారం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం, టెలీ కమ్యూనికేషన్ సేవల అందజేతదార్లు కలిసి ప్రీపెయిడ్, పోస్ట్‌పోయిడ్‌ల పన్ను రశీదులను జారీ చేయకపోవడంపై ఒక పరిష్కారాన్ని కనుగొనాలి.

### స్వయంగా పాటించాలి

జీఎస్‌టీ అనేది స్వయంగా పర్యవేక్షించడానికి రూపొందించిన విధానం. అంటే ప్రతి ఒక్క వ్యాపారి, పౌరుడు అది అమలయ్యేలా తమ వైపు నుంచి కూడా చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. అయితే ఇలా ఎవరూ చేయడం లేదు. ఇలా ప్రతి ఒక్కరూ చేస్తే కుంభకోణాలేవీ కనిపించవు. ఎవరూ ఇలా చేయకపోవడంతో పాటు వ్యాపార వర్గాల అత్యాశ జత కావడంతో ఈ కుంభకోణాలు జరుగుతున్నాయి.

**ముగింపు:** జీఎస్‌టీ అనేది భారత్‌లో ఒక గొప్ప మార్పునకు సంకేతం. అయితే దీనిని మరింత మెరుగ్గా అమలు చేస్తేనే భారత ఆర్థిక వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావొచ్చు.

### క్షమాభిక్ష పథకం ప్రవేశపెట్టాలి

ప్రపంచంలోనే భారత జీఎస్‌టీ అత్యంత సంక్లిష్టమైన జీఎస్‌టీ అని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఇక మన చట్టాల్లో ఉన్న సంక్లిష్టతలను అడ్డుగా పెట్టుకుని రిటర్నుల ఫైలింగ్, వాస్తవ లావాదేవీల వెల్లడి, టర్నోవరు వెల్లడి ఇలా పలు విషయాల్లో వ్యాపారులు తప్పులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌వాయిస్ స్థాయిలో సరిపోల్చడానికి అమలు చేసే ముందు ఒకేసారి చేపట్టే చర్యలో భాగంగా ప్రభుత్వం ఒక క్షమాభిక్ష పథకాన్ని ప్రకటించాలి. ఇలా ఒక్కసారి మాత్రమే కల్పించే అవకాశం వల్ల ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుంది. వ్యాపార వర్గాలు కూడా ప్రక్షాళనకు గురి అయినట్లు అవుతుంది. గతంలో చేసిన తప్పులను గుర్తించడానికి ఈ పథకం ఉపయోగపడుతుంది. జీఎస్‌టీ అమలు ఎలా ఒక పెను మార్పునకు దారితీసిందో.. ఈ పథకం వల్ల జీఎస్‌టీలో పెను మార్పు కనిపిస్తుంది.

### స్థిరాస్తుల విషయంలో..

గమ్యం ఆధారంగా జీఎస్‌టీని రూపొందించారు. అంటే వస్తువులను ఎక్కడకు సరఫరా చేసారన్నదానిపైనే దృష్టి సారిస్తారు. అయితే స్థిరాస్తుల విషయంలో వస్తువుల, సేవల సరఫరా విషయంలో ఈ గమ్యం ఆధారిత సూత్రాన్ని పాటించడం లేదు. ఇది కాస్తా వ్యాపారులకు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను కోల్పోయేలా చేస్తోంది. దీనిపై వ్యాపార వర్గాలు ఎప్పటి నుంచో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చట్టాన్ని సవరించి.. స్థిరాస్తుల విషయంలోనూ గమ్యం ఆధారిత సూత్రాన్ని పాటించేలా అమలు చేయాలి.

### వ్యాపార గుర్తింపు సంఖ్య

మెరుగైన ఆర్థిక వ్యవస్థ, మెరుగైన సమాజం కోసం మరో సంస్కరణనూ నేను ప్రతిపాదిస్తున్నా. ప్రతీ పౌరుడికీ ఆధార్ రూపంలో ఒక విశిష్ట సంఖ్య ఉంది. అయితే ప్రతీ ఒక వ్యాపారుడికీ ఒక విశిష్ట సంఖ్య అంటూ లేదు. ఈ నేపథ్యంలో ఒక వ్యాపార గుర్తింపు సంఖ్య(బీఐఎన్)ను ప్రభుత్వం ఉచితంగా కేటాయించాలి. టర్నోవరు, వ్యాపార తీరుతో సంబంధం లేకుండా దీనిని తప్పనిసరి చేస్తే.. ఆర్థిక వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావచ్చు.

**మీ సందేహాలు పంపండి**

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

# రేసు గుర్రం

**కాలం ఎపుడూ ఒకలా ఉండదు. నిరంతరం మార్పు చెందుతూనే ఉంటుంది. దాంతో పాటే మనుషుల అభిరుచులూ. అయితే ఇవి అంత త్వరగా బయటకు తెలియవు. వాటిని తెలుసుకుంటేనే ఏ కంపెనీ అయినా అందుకు తగ్గ ఉత్పత్తులు తీసుకురాగలిగేది.. మనగలిగేది. అపుడే భవిష్యత్‌కు ఢోకా ఉండదు. ఇపుడు హిందుస్థాన్ యునిలీవర్ కూడా అదే పనిలో ఉంది. సాంకేతికతను ఉపయోగించి వినియోగదార్ల అభిరుచులకు గత కొన్నేళ్లుగా సునిశితంగా గమనిస్తోంది. ఆ ఫలితాలకు తగ్గట్లుగానే నిర్ణయాలు తీసుకోనుంది. ఈ పరిణామం ఈ కంపెనీని వృద్ధి బాటలో పయనించేలా చేస్తుందని విశ్లేషకులు గట్టిగా చెబుతున్నారు. అదే నిజమైతే మరిన్ని కంపెనీలూ అదే బాటలో పయనించినా ఆశ్చర్యం లేదు.**

ఎఫ్ఎంసీజీ రంగం

హెచ్‌యూఎల్

## కలిసిరానున్న డేటా అనలిటిక్స్ వ్యూహం

- ప్రీమియం బ్రాండ్లవైపు చూపు
- 2020-21 కల్లా రూ.50,000 కోట్ల విక్రయాలు





వ్యక్తుల ఆదాయాలు పెరుగుతున్నాయి. అందరి చూపూ 'ప్రీమియం' బ్రాండ్ల వైపే ఉంటోంది. ఈ నేపథ్యంలో హెచ్‌యూఎల్ కూడా అందుకు తగ్గట్లుగానే ప్రీమియం ఉత్పత్తులను తీసుకొచ్చే దిశగా ఆలోచిస్తోంది. సర్ఫ్ డిటర్జంట్ తయారు చేసే ఈ కంపెనీ ఒకప్పుడు చిన్న, తక్కువ ధర ఉత్పత్తులను విక్రయించేది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల కోసం వాటిని తయారు చేసేది. కంపెనీకి సగం ఆదాయం వాటి ద్వారానే వచ్చేది కూడా.

అయితే ఇపుడు పరిస్థితులు మారాయి. ఇ-కామర్స్ వెబ్‌సైట్లు వచ్చి.. మారుమూల ప్రాంతాల్లోకీ 'బ్రాండ్'లకున్న శక్తిని విస్తరిస్తున్నాయి. ప్రతీ చోట బ్రాండెడ్ వస్తువుల వాడకం పెరిగింది. అందులోనూ ప్రీమియం బ్రాండ్లపై ప్రత్యేక ఆసక్తి కనబడుతోంది. వినియోగదార్ల గిరాకీ, ఆసక్తులను గమనించేందుకు గత కొన్నేళ్లుగా డేటా అనలిటిక్స్‌ను హెచ్‌యూఎల్ ఉపయోగించుకుంటోంది. వాటి ఫలితాల ద్వారానే నిర్ణయాలు తీసుకోనుంది.

### గిరాకీ ప్రభావం

ప్రస్తుతం ఎఫ్ఎంసీజీ రంగంలో గిరాకీ స్తబ్దుగా ఉంది. అందుకు తగ్గట్లుగానే ఎఫ్ఎంసీజీ దిగ్గజమైన హెచ్‌యూఎల్ కూడా ఇటీవలి ఫలితాలను వెలువరించింది. మార్చి త్రైమాసిక నికర లాభంలో 13 శాతం వృద్ధిని కనబరచినప్పటికీ.. విక్రయ పరిమాణం 7 శాతం తగ్గింది. చాలా త్రైమాసికాలుగా రెండంకెల వృద్ధిని నమోదు చేస్తున్న ఈ కంపెనీ ఈ సారి డీలా పడింది. ఈ కంపెనీ ఎఫ్ఎంసీజీ రంగ మొత్తానికి ప్రామాణికంగా పరిగణించవచ్చు. వినియోగదారు గిరాకీ, సెంటిమెంటును ఈ ఫలితాలు ప్రతిఫలిస్తున్నాయని చెప్పవచ్చు.

### ఇతర కంపెనీలపైనా..

2019లో ఎఫ్ఎంసీజీ రంగం 13-14 శాతం వృద్ధి చెందుతున్న తన అంచనాలను.. 11-12 శాతంగా నీల్సన్ సవరించింది. గిరాకీ తగ్గుతుందన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. అందుకు తగ్గట్లుగానే నాలుగో త్రైమాసికంలో బ్రిటానియా విక్రయాల పరిమాణం కేవలం 7% పెరగ్గా.. డాబర్ నికర లాభం 6.5 శాతం తగ్గింది. రైతులకు సరైన ఆదాయం లేకపోవడం ఇందుకు కారణం.(పట్టిక చూడండి.)

**దిగ్గజ ఎఫ్ఎంసీజీ కంపెనీల విక్రయ పరిమాణాల వృద్ధి 2018-19**

| కంపెనీ | ఏప్రిల్-జూన్ | జులై-సెప్టెం | అక్టో-డిసెం | జన-మార్చి |
|---|---|---|---|---|
| బజాజ్ కన్జూమర్ | 11.2 | 3.8 | 9.4 | 7.2 |
| బ్రిటానియా | 12.5 | 11.0 | 8.0 | 7.0 |
| డాబర్ | 21.0 | 8.1 | 12.4 | 4.3 |
| హెచ్‌యూఎల్ | 12.0 | 10.0 | 10.0 | 7 |
| మారికో | 12.4 | 6.0 | 5.0 | 8 |

**అన్నిటికంటే మిన్నగా..** (రూ.కోట్లలో)

| కంపెనీ | మార్కెట్ విలువ | విక్రయాలు | నికర లాభం | ఆస్తులు |
|---|---|---|---|---|
| హెచ్‌యూఎల్ | 401,029.39 | 38,224.00 | 6,036.00 | 7,659.00 |
| డాబర్ | 72,294.30 | 6,273.19 | 1,264.29 | 4,103.59 |
| గోద్రెజ్ కన్జూమర్ | 70,723.67 | 5,679.31 | 1,754.98 | 4,926.16 |
| మారికో | 48,717.22 | 5,971.00 | 1,132.00 | 3,639.00 |
| పీ అండ్ జీ | 35,526.33 | 2,455.29 | 374.59 | 805.50 |
| కోల్గేట్ | 31,391.22 | 4,462.43 | 775.57 | 1,524.46 |

**హెచ్‌యూఎల్ రానున్న కాలంలో వృద్ధి బాట పట్టడానికి చాలా కారణాలే ఉన్నాయి.**

### కంపెనీకి సానుకూలతలు

- **హార్లిక్స్:** గ్లాక్సో స్మిత్‌క్లైన్ కన్జూమర్ హెల్త్‌కేర్‌కు చెందిన హార్లిక్స్ బ్రాండ్ కొనుగోలు వల్ల కంపెనీకి ప్రయోజనం కలగనుంది. ఆపరేటింగ్ లాభాల మార్జిన్లకు హార్లిక్స్ బలాన్ని చేకూర్చనుందని విశ్లేషకులు అంటున్నారు. 2021 కల్లా రూ.50,000 కోట్ల ఆదాయాలను అధిగమిస్తుందని అంతర్జాతీయ బ్రోకరేజీలే చెబుతున్నాయి.
- **కొత్త ప్రభుత్వ చర్యలు:** కొత్త ప్రభుత్వం గద్దెనెక్కాక.. తీసుకునే చర్యలు జులై నుంచి ఎఫ్ఎంసీజీ కంపెనీలు రాణించడానికి కారణమవుతాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రైతుల కోసం ప్రకటించిన పీఎమ్ కిసాన్ సమ్మాన్ పథకం వల్ల గ్రామీణ ఆదాయాలు పెరుగుతాయి. సహజంగానే ఇది గిరాకీ పెంచేలా చేస్తుంది.
- **వానలు:** రుతు పవనాల ఆగమనంతో సెంటిమెంటు మెరుగవుతుంది. ఈ నేపథ్యంలో వచ్చే త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ కంపెనీలు రాణిస్తాయని.. ముఖ్యంగా హెచ్‌యూఎల్‌పై ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుందని పలువురు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
- **మధ్యతరగతి ఆదాయం:** వచ్చే దశాబ్ద కాలంలో 7 శాతం పైన జీడీపీ వృద్ధి నమోదవుతుందన్న అంచనాల మధ్య మధ్య తరగతి, పై స్థాయి మధ్య తరగతి వర్గాల ఆదాయాలు పెరగనున్నాయి. సహజంగానే మార్కెట్ వాటా ఎక్కువగా ఉండే హెచ్‌యూఎల్‌కు ఇది సానుకూలాంశమే.
- **రెండంకెల వృద్ధి:** 2019-21 సంవత్సరాల్లో హెచ్‌యూఎల్ 13 శాతం సమ్మిళిత వృద్ధితో కొనసాగుతుందని; విక్రయాల్లో 45 శాతం వాటా ఉన్న ప్రధాన ఉత్పత్తులు రెండంకెల వృద్ధిని సాధిస్తాయన్న అంచనాలున్నాయి.

వీటన్నిటికి తోడు.. తాజాగా కంపెనీ సాంకేతికతను ఉపయోగించి.. భారీ స్థాయిలో గణాంకాలను సేకరించడం ద్వారా గిరాకీ తెలుసుకుని.. ఉత్పత్తుల తయారీని చేపడుతుండడం అన్నిటి కంటే కలిసివచ్చే అంశంగా భావించవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే ప్రస్తుతం సాధారణ కొనుగోళ్లతో పోలిస్తే ఇ-కామర్స్ కొనుగోళ్లు పెరుగుతూ వస్తున్నాయి. అందులోనూ ప్రీమియం ఉత్పత్తులదే రాజ్యంగా ఉంది. ఆ దిశగా కంపెనీ వేస్తున్న అడుగులు సానుకూలతలనే తీసుకొస్తాయని భావిస్తున్నారు.




## ధోనీకి కోహ్లి మద్దతు

లండన్: ఇంగ్లాండ్‌తో మ్యాచ్ ఆఖరి ఓవర్లలో షాట్లు ఆడే ప్రయత్నమే చేయని ధోనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నప్పటికీ.. కోహ్లి మాత్రం అతడికి మద్దతుగా నిలిచాడు. "బౌండరీ కోసం ధోని గట్టిగానే ప్రయత్నించాడు. కానీ కుదర్లేదు. వాళ్లు సరైన ప్రదేశాల్లో బంతులేశారు. బంతి ఆగి వస్తోంది. దీంతో బ్యాటింగ్ చేయడం కష్టమైంది" అని అతనన్నాడు. మ్యాచ్ సందర్భంగా వ్యాఖ్యాత గంగూలీ.. ధోని ఆటతీరును తప్పుబట్టాడు. "ఈ సింగిల్స్ ఎందుకో తెలియట్లేదు. భారత బ్యాట్స్‌మెన్‌ను బంతుల లెంగ్త్, బౌన్స్ బోల్తా కొట్టించాయి. అయినా బౌండరీలకు ప్రయత్నించాల్సింది. 5 వికెట్లు ఉండి విజయం కోసం ప్రయత్నం చేయకపోవడం ఆశ్చర్యకరం" అన్నాడు.

"ప్రతిసారీ ధోని సమర్థతపై ప్రశ్నలు వస్తుండటం ఆశ్చర్యకరం. అతను జట్టు కోసం ఆడుతున్నాడు. ధోని బ్యాటింగ్ పట్ల జట్టు సంతృప్తికరంగా ఉంది. అఫ్గాన్‌తో (52 బంతుల్లో 28) మినహా మిగతా అన్ని మ్యాచ్‌ల్లో సత్తాచాటాడు. బంగ్లాతో మ్యాచ్‌లో హార్దిక్‌తో పాటు మరో ముగ్గురు పేసర్లతో బరిలో దిగొచ్చు. జడేజా పేరూ పరిశీలనలో ఉంది"

– సంజయ్ బంగర్, టీమ్‌ఇండియా సహాయ కోచ్

ఛాంపియన్




అజేయంగా ఉన్న టీమ్‌ఇండియా అనూహ్యంగా.. ఇంగ్లాండ్ చేతిలో ఓడింది..! సెమీస్‌కు అడుగు దూరంలో ఉన్న భారత జట్టు మంగళవారం బంగ్లాదేశ్‌ను ఢీకొనబోతోంది! ఇంగ్లాండ్ కంటే పెద్ద జట్టేం కాదు.. కానీ ఆ జట్టు కంటే పెద్ద సవాల్ విసరగల సత్తా కలిగిన జట్టు..! తొలి మ్యాచ్‌లోనే దక్షిణాఫ్రికాకు షాకిచ్చి.. వెస్టిండీస్‌ను మట్టికరిపించి సెమీస్ రేసులో ఇంకా నేనున్నానంటూ పోరాడుతోంది! మరి ఈ సవాల్‌ను కోహ్లీసేన కాచుకోగలదా..!

## బంగ్లాదేశ్‌తో భారత్ పోరు నేడు

# బంగ్లాతో బహుపరాక్

- గెలిస్తే సెమీస్‌లో చోటు
- జట్టులో రెండు మార్పులకు అవకాశం

మధ్యాహ్నం 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో





### నాలుగో స్థానానికి పంత్ సరైనోడు

"ఇంగ్లాండ్‌తో రిషబ్ పంత్ తొలి మ్యాచ్ ఆడాడు. ఇప్పుడే అతని నుంచి అతిగా ఆశించడం సరికాదు. ఈ సమయంలో పంత్ ఆటను ఆస్వాదించాలి. నాలుగో స్థానంలో పంత్ రావడం సరైన నిర్ణయం. అతడి బ్యాటింగ్‌పై జట్టుకు నమ్మకముంది"

– రోహిత్

ఆటగాళ్లు ఒకరి తర్వాత ఒకరు గాయాలతో నిష్క్రమిస్తున్న వేళ.. మేం భారం మోయలేమంటూ మిడిలార్డర్ నేల చూపులు చూస్తున్న తరుణాన.. సరైన ఆరంభాలు లభించక బ్యాటింగ్‌లో ఒకరిద్దరి మెరుపులపైనే పూర్తిగా ఆధారపడుతున్న టీమ్‌ఇండియా.. బంగ్లాదేశ్‌ను ఓడించి.. సెమీఫైనల్లో అడుగు పెడుతుందా..? నాకౌట్‌కు ముందు మరో మ్యాచ్ మాత్రమే ఉన్న నేపథ్యంలో.. ఈ మ్యాచ్‌లో గెలిచి సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవడంతో పాటు.. లోపాల్ని సరిదిద్దుకుని పక్కాగా సిద్ధమవడమే ఇప్పుడు టీమ్‌ఇండియా లక్ష్యాలు!

బర్మింగ్‌హామ్

ప్రపంచకప్‌లో సమీకరణాలపై ఆధారపడకుండా నేరుగా సెమీఫైనల్ బెర్తు సాధించడమే లక్ష్యంగా భారత్ కీలక పోరుకు సిద్ధమైంది. మంగళవారం జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను భారత్ ఢీకొట్టనుంది. ఆదివారం ఇంగ్లాండ్‌తో ఆడిన వేదికలోనే.. అదే పిచ్‌పై బంగ్లాతో టీమ్‌ఇండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 13 పాయింట్లతో కోహ్లీసేన నేరుగా సెమీస్‌కు దూసుకెళ్తుంది. ఇది ఓడితే శ్రీలంకతో చివరి మ్యాచ్ కోసం ఎదురు చూడాలి. సెమీస్ బెర్తు సాధించడంతో పాటు పట్టికలో ఏ స్థానంలో నిలుస్తారన్నది కూడా కీలకం కావడంతో మిగిలిన రెండు మ్యాచ్‌లూ గెలవాలని టీమ్ ఇండియా పట్టుదలతో ఉంది. బంగ్లాదేశ్‌కు ఇది చావోరేవో మ్యాచ్. సెమీస్ రేసులో నిలవాలంటే కచ్చితంగా నెగ్గాలి. చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించాలి. అదే సమయంలో న్యూజిలాండ్ చేతిలో ఇంగ్లాండ్ ఓడిపోతే బంగ్లాకు సెమీస్ బెర్తు ఖాయమవుతుంది. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లను అలవోకగా ఓడించిన బంగ్లా.. కీలక మ్యాచ్‌లో భారత్‌కు అంత తేలిగ్గా తలొగ్గుతుందని అనుకోలేం. కాబట్టి మ్యాచ్ ఆసక్తికరంగా సాగొచ్చు.

**'పవర్' లేదు:** కొన్నేళ్లుగా బ్యాటింగ్‌లో టాపార్డరే భారత్‌కు ప్రధాన బలం. అయితే ధావన్ గాయం ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా ప్రణాళికల్ని.. బ్యాటింగ్ కూర్పును దెబ్బతీసింది. నాలుగో స్థానంలో రాణించిన కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా అంచనాల్ని అందుకోలేకపోతున్నాడు. రోహిత్ ఆరంభంలో ఎప్పుడూ నెమ్మదిగానే ఆడతాడు. రాహుల్.. ధావన్ లాగా ధాటిగా ఆడి స్కోరు వేగం పెంచాలి. కానీ అతను నెమ్మదిగా ఆడుతుండటంతో పవర్ ప్లేలో ఊపు ఉండట్లేదు. బంగ్లాపై ఓపెనర్ల ఆట మారుతుందేమో చూడాలి. మరోవైపు మిడిలార్డర్.. ఆందోళనను అంతకంతకూ పెంచుతోంది. ఇంగ్లాండ్‌పై ఓటమికి వాళ్లదే బాధ్యత. చివర్లో ధోని, జాదవ్‌ల బ్యాటింగ్ అనేక ప్రశ్నలకు తావిచ్చింది. బంగ్లాపై ధోని బ్యాటింగ్ మారకపోతే కష్టం. పంత్ తనపై ఉన్న అంచనాల్ని ఈ మ్యాచ్‌లో అయినా అందుకుంటాడేమో చూడాలి. ధోని తడబడుతున్న నేపథ్యంలో 'ఫినిషర్' పాత్ర పోషించాల్సింది పాండ్యనే.

### ఆ ఓటమి గుర్తుందా?

ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ మ్యాచ్ అనగానే 2007 నాటి పరాభవమే గుర్తుకొస్తుంది. అప్పటికి పసికూన అయిన బంగ్లా.. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియాకు దిమ్మదిరిగే షాకిచ్చి గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించేలా చేసింది. అయితే ప్రపంచకప్‌లో బంగ్లాతో ఆడిన మిగతా రెండు మ్యాచ్‌ల్లో భారత్ ఘనవిజయం సాధించింది. 2011లో గ్రూప్ దశలో ఆ జట్టును చిత్తు చేసిన టీమ్‌ఇండియా.. గత టోర్నీలో క్వార్టర్స్‌లో మట్టికరిపించింది. గతంతో పోలిస్తే మెరుగ్గా ఉన్న బంగ్లాతో అప్రమత్తంగా ఉండాల్సిందే.

### విరాట్.. సెంచరీ ప్లీజ్

ప్రపంచ నం.1 బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లి ప్రపంచకప్‌లోనూ అదరగొడుతున్నాడు. భిన్నమైన వికెట్లపై.. మేటి బౌలర్లను ఎదుర్కొంటూ వరుసగా అయిదు అర్ధ శతకాలు (82, 77, 67, 72, 66) సాధించాడు. అయితే ఇప్పటిదాకా 6 మ్యాచ్‌లాడిన కోహ్లి సెంచరీ బాకీ పడ్డాడు. ఆస్ట్రేలియాపై 82 పరుగులతో సెంచరీకి చేరువైనా మూడంకెల స్కోరును అందుకోలేకపోయాడు. చక్కటి లయతో ఆడుతున్న కోహ్లి.. బంగ్లాపై అయినా సెంచరీ కొట్టాలని అభిమానుల ఆకాంక్ష.

### ఓడిన పిచ్‌పైనే మళ్లీ

ఆదివారం భారత్, ఇంగ్లాండ్ ఆడిన పిచ్ మీదే మంగళవారం మ్యాచ్ జరుగనుంది. ఇది బ్యాటింగ్ వికెట్. తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు భారీ స్కోరు సాధించొచ్చు. మ్యాచ్ సమయంలో ఎండ ఉంటుంది. వర్షం పడే అవకాశం లేదు.

### జాదవ్, చాహల్‌లపై వేటు?



ఇంగ్లాండ్‌పై విఫలమైన జాదవ్, చాహల్‌లను బంగ్లాతో మ్యాచ్‌కు పక్కన పెట్టనున్నట్లు సమాచారం. వీరి స్థానంలో జడేజా, భువనేశ్వర్‌లకు చోటు దక్కనున్నట్లు జట్టు వర్గాలు చెబుతున్నాయి. భారత్‌తో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఓ స్పిన్నర్‌ను తగ్గించి పేసర్‌ను పెంచుకుంది. మైదానంలో ఓవైపు బౌండరీ దూరం 59 మీటర్లే. చాహల్, కుల్దీప్‌ల బౌలింగ్‌లో రాయ్, బెయిర్‌స్టో, స్టోక్స్ అటువైపు బాగా పరుగులు రాబట్టారు. భారత్ బ్యాటింగ్‌కు వచ్చేసరికి బౌండరీ దూరంగా ఉన్న వైపు ఫీల్డర్లను మోగించి అటువైపే బంతులు సంధించారు. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమై ఓ స్పిన్నర్‌ను తగ్గించుకోనున్నట్లు సమాచారం. తమీమ్, షకిబ్, ముష్ఫికర్ లాంటి హిట్టర్లను అడ్డుకోడానికి ప్రధానంగా పేసర్లనే ప్రయోగించనున్నారు.

### షకిబ్‌ను ఆపాలి

6 మ్యాచ్‌ల్లో 476 పరుగులు.. 95.20 సగటు.. 2 శతకాలు.. 3 అర్ధశతకాలు.. ఇంకా 10 వికెట్లు కూడా! బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్‌హసన్ ప్రదర్శన ఇది. ఈ ప్రపంచకప్‌లో మేటి ఆల్‌రౌండర్ అతడే అని చెప్పడానికి ఈ గణాంకాలు చాలు. టోర్నీలో బంగ్లా సెమీస్ రేసులో ఉండటానికి షకిబే కారణం. ప్రపంచకప్‌లో అతడు విఫలమైన మ్యాచే లేదు. దక్షిణాఫ్రికా (75, 1/50), న్యూజిలాండ్ (64, 2/47), ఇంగ్లాండ్ (0/71, 121), వెస్టిండీస్ (2/54, 124 నాటౌట్), ఆస్ట్రేలియా (0/50, 41), అఫ్గానిస్థాన్ (51, 5/29)లపై షకిబ్ నిలకడగా రాణించాడు. మంగళవారం మ్యాచ్‌లో టీమ్‌ఇండియాకు అతడితోనే ప్రమాదం. భాగస్వామ్యాలు నిర్మించడంలో దిట్ట అయిన షకిబ్‌ను త్వరగా ఔట్ చేయడం కీలకం. అతడిని పడగొడితే బంగ్లాను సగం కట్టడి చేసినట్లే.

బుమ్రా ఇంకో ఐదుగురిని ఔట్ చేస్తే వన్డేల్లో 100 వికెట్ల క్లబ్‌లో చేరతాడు.

100

- గాయంతో విజయ్ శంకర్ కూడా ఔట్
- భారత జట్టులోకి మయాంక్ అగర్వాల్

బర్మింగ్‌హామ్



ప్రపంచకప్‌లో భారత జట్టును గాయాల బెడద వదలట్లేదు. ఇప్పటికే ఓపెనర్ శిఖర్ ధావన్ ఆరంభ దశలోనే టోర్నీకి దూరం కాగా.. ఇప్పుడు మరో ఆటగాడు జట్టును వీడాడు. కాలి బొటన వేలి గాయంతో ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ ప్రపంచకప్ నుంచి వైదొలిగాడు. కొన్ని రోజుల కిందట ప్రాక్టీస్ సందర్భంగా బుమ్రా విసిరిన బంతి శంకర్ పాదానికి బలంగా తాకింది. నొప్పితో అతను ఒకట్రెండు రోజులు ప్రాక్టీస్‌కు కూడా దూరంగా ఉన్నాడు. అయినా అఫ్గానిస్థాన్, వెస్టిండీస్‌లతో మ్యాచ్‌లు ఆడాడు. ఇంగ్లాండ్‌తో గత మ్యాచ్‌కు శంకర్‌ను దూరం పెట్టిన సంగతి తెలిసిందే. గాయం తీవ్రత దృష్ట్యా అతనిక టోర్నీలో ఆడే అవకాశం లేదని తేలిపోయింది. శంకర్ స్థానంలో సెలక్టర్లు కర్ణాటక ఓపెనర్ మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేశారు. "సౌథాంప్టన్‌లో జూన్ 19న ప్రాక్టీస్ సందర్భంగా శంకర్ ఎడమ కాలి బొటన వేలికి గాయమైంది. అఫ్గానిస్థాన్, వెస్టిండీస్‌లతో మ్యాచ్‌లో ఆడే పరిస్థితుల్లో ఉండటంతో జట్టులో కొనసాగాడు. విండీస్‌తో మ్యాచ్ తర్వాత వేలిగాయం తీవ్రత పెరిగింది. స్కాన్ చేయగా.. వేలిలో చీలిక ఉన్నట్లు తేలింది. గాయం మానడానికి కనీసం మూడు వారాలు పడుతుంది. అందుకే అతను ప్రపంచకప్ నుంచి వైదొలిగాడు" అని ఓ ప్రకటనలో బీసీసీఐ తెలిపింది. మయాంక్ ఎంపికకు ఐసీసీ ఆమోదం తెలిపింది. అతను ఒకట్రెండు రోజుల్లో జట్టుతో కలుస్తాడు. ఇప్పటికే టెస్టుల్లో సత్తా చాటిన మయాంక్.. ఇంకా వన్డేల్లో అరంగేట్రం చేయలేదు. నాలుగో స్థానంలో పంత్‌ను ఆడిస్తుండటం, దినేశ్ కార్తీక్ కూడా తుది జట్టులో చోటు కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో మయాంక్‌కు ఎన్ని అవకాశాలు దొరుకుతాయో చూడాలి. ఇక ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ బ్యాటింగ్‌లో విఫలమైన శంకర్ ప్రపంచకప్ నుంచి వైదొలగడం పట్ల పెద్దగా ఆందోళనేమీ వ్యక్తం కావట్లేదు. శంకర్ స్థానంలో ఇంగ్లాండ్ మ్యాచ్ ఆడిన పంత్.. అతడి కంటే మెరుగ్గానే కనిపించాడు.

## ధోని తప్పు లేదు

జెఫ్ థాంప్సన్

ఇంగ్లాండ్‌పై ఛేదనలో భారత్ బ్యాటింగ్‌పై క్రికెట్ ప్రపంచం అభిప్రాయం రెండుగా చీలిపోయింది. ముఖ్యంగా ధోని ఆటతీరుపై దుమారం రేగుతోంది. ఈ విషయంపై తర్వాత మాట్లాడతా. ముందు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. భారత క్రికెటర్ల సమస్యేంటంటే.. వాళ్లు ప్రత్యర్థినే కాదు.. కొన్నిసార్లు తర్కానికి అందని ప్రజల భారీ అంచనాలను కూడా ఎదుర్కోవాల్సివుంటుంది. క్రికెటర్లు కూడా మానవమాత్రులేనని మనం అర్థం చేసుకోవాలి. తప్పులు చేయడం మానవ సహజం. తొలి 10 ఓవర్లలో భారత్ లెక్క తప్పిందన్నది నా ఉద్దేశం. వికెట్లు కోల్పోవద్దన్న ఉద్దేశంతో బ్యాట్స్‌మెన్ పరుగులు చేయకుండా చాలా ఎక్కువ బంతులను వదిలేశారు. 330పై లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు తొలి 10 ఓవర్లలో కనీసం 50 పరుగులు చేయాలి. కానీ భారత్ 28 పరుగులే చేసింది. చివరికి ఎన్ని పరుగుల తేడాతో భారత్ ఓడిందో చూడండి. కేవలం 31..! ఎక్కడ తేడా జరిగిందో దీన్ని బట్టే అర్థమవుతోంది. అయితే భారత్ అప్పుడే భయపడాల్సిందేమీ లేదు. ఓడింది ఒక్క మ్యాచే. కేదార్ స్థానంలో జడేజాను ఆడిస్తే బాగుంటుంది. నాలుగో స్థానంలో రిషబ్ పంత్‌ను కొనసాగించాలి. ఇక ఇంగ్లాడ్‌పై ధోని బ్యాటింగ్ విషయానికొద్దాం. అతడు తెలివైన పనే చేశాడు. రెచ్చిపోవడానికి ప్రయత్నించి ఉంటే భారత్ ఆలౌటయ్యేది. అప్పుడు నెట్ రన్‌రేట్ దెబ్బతినేది. విమర్శించడం తేలికే. దేశాన్ని ఎన్నో మ్యాచ్‌ల్లో గెలిపించిన ధోని.. ఏదైనా ఆలోచించే చేస్తాడు.






## గెలిస్తే లోపాలు వెతకరు

హర్ష భోగ్లే

విజయం.. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. జట్టు బలంగా ఉందనేలా చేస్తుంది. అభిమానులు కూడా జట్టు ఏ విషయంలో బాగుందన్నదే చూస్తారు. లోపాలు వెతకరు. కానీ ఒక్క ఓటమితో అంతా మారిపోతుంది. ఇది నోట్‌బుక్‌పై అందమైన కవర్‌ను తీసేయడంలాంటిది. రోహిత్, కోహ్లీలను దాటితే భారత బ్యాటింగ్‌లో ఉన్న కాస్త దుర్బలత్వం గురించి భారత్‌తో ఆడే జట్లకు తెలిసే ఉంటుంది. ఇంగ్లాండ్‌పై ఓటమితో అది కనిపించింది. అలాగే భారత మణికట్టు స్పిన్నర్లపై త్వరగా ఎదురుదాడికి దిగితే బౌలింగ్ కూడా బలహీనంగా కనిపిస్తుంది. అందుకే క్రీడలో దృష్టి కోణం, ఆత్మవిశ్వాసం కీలక పాత్ర పోషిస్తాయి. ఒక జట్టులో ఉన్న ఆత్మవిశ్వాసం, ఆ జట్టును ప్రత్యర్థి ఎలా చూస్తుందన్నది ముఖ్యం. ఇక తర్వాతి మ్యాచ్‌లో భారత్ ప్రత్యర్థి బంగ్లాదేశ్ దుర్బలంగా ఉండడమే కాదు.. ఒత్తిడినీ ఎదుర్కొంటోంది. బంగ్లాదేశ్‌కు ఇప్పుడు రెండు విజయాలు కావాలి. ఓడితే ప్రపంచకప్ నుంచి నిష్క్రమించనున్న నేపథ్యంలో బంగ్లా భావోద్వేగంతో ఆడే అవకాశముంది.

FRANKLIN TEMPLETON
మ్యాచ్ గెలిచేందుకు 500 మంచి స్కోరు
మరియు డెట్ ఫండ్స్‌లో SIP కూడా ప్రారంభించండి
9010340000కి మిస్డ్ కాల్ ఇచ్చి, iPhone X మరియు ఇతర ఉత్తేజభరితమైన కానుకలు గెలుచుకునే అవకాశాన్ని పొందండి*


అవిష్క ఫెర్నాండో (104)

శ్రీలంకతో ప్రపంచకప్ నామ మాత్రపు మ్యాచ్...వెస్టిండీస్ లక్ష్యం 339 పరుగులు.. 199 పరుగులకే 6 వికెట్లు పడిపోయాయి.. ఈ స్థితిలో అసాధారణంగా ఆడిన నికోలాస్ పూరన్ (118; 103 బంతుల్లో 11×4, 4×6) దాదాపు విండీస్‌ను గెలిపించినంత పని చేశాడు.. కానీ అతను కీలక సమయంలో వెనుదిరగడంతో లంక చేతిలో కరీబియన్ జట్టుకు పరాజయం తప్పలేదు. ఈ టోర్నీలో విండీస్‌కు ఎనిమిది మ్యాచ్‌ల్లో ఇది ఆరో పరాజయం కాగా.. లంకకు ఎనిమిది మ్యాచ్‌ల్లో మూడో విజయం. ఇప్పటికే విండీస్, లంక సెమీస్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

## పాయింట్ల పట్టిక

| జట్టు | మ్యా | గె | ఓ | టై/ర | పా | నె.రేట్ |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | 14 | +1.000 |
| భారత్ | 7 | 5 | 1 | 1 | 11 | +0.854 |
| న్యూజిలాండ్ | 8 | 5 | 2 | 1 | 11 | +0.572 |
| ఇంగ్లాండ్ | 8 | 5 | 3 | 0 | 10 | +1.000 |
| పాకిస్థాన్ | 8 | 4 | 3 | 1 | 9 | -0.792 |
| శ్రీలంక | 8 | 3 | 3 | 2 | 8 | -0.934 |
| బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | 7 | -0.133 |
| దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | 5 | -0.080 |
| వెస్టిండీస్ | 8 | 1 | 6 | 1 | 3 | -0.335 |
| అఫ్గానిస్థాన్ | 8 | 0 | 8 | 0 | 0 | -1.418 |

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, నె: నెట్ రన్‌రేట్

# పూరన్ బాదినా.. లంకే గెలిచింది

**● పోరాడి ఓడిన విండీస్ ● ఫెర్నాండో శతకం**

చెస్టర్‌లీ స్ట్రీట్

ప్రపంచకప్‌లో సమీకరణాలతో సంబంధం లేని వెస్టిండీస్-శ్రీలంక మ్యాచ్ ఆసక్తి రేపింది. ఫలితాన్ని పక్కనపెడితే భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్ అభిమానులను అలరించింది. సోమవారం మొదట బ్యాటింగ్ చేసిన లంక 6 వికెట్లకు 338 పరుగులు చేసింది. అవిష్క ఫెర్నాండో (104; 103 బంతుల్లో 9×4, 2×6) శతకం సాధించాడు. ఛేదనలో పూరన్ మెరుపు సెంచరీతో ఆఖరి వరకు పోరాడినా విండీస్ 9 వికెట్లకు 315 పరుగులే చేయగలిగింది.

**పూరన్ అదరగొట్టాడు:** 339 పరుగుల ఛేదనలో వెస్టిండీస్ 10 ఓవర్లకు 2 వికెట్లకు 37 పరుగులు మాత్రమే చేసింది. ఈ స్థితిలో గేల్ (35), హెట్‌మయర్ (29) కాస్త ధాటిగా ఆడేందుకు ప్రయత్నించినా.. కీలక సమయంలో వెనుదిరగడంతో వెండీస్ 84/4తో కష్టాల్లో పడింది. అయితే పూరన్, హోల్డర్ (26)తో కలిసి పోరాటం కొనసాగించాడు. కీలక సమయంలో హోల్డర్, బ్రాత్‌వైట్ (8) ఔట్ కావడంతో విండీస్ ఓటమి దిశగా సాగింది. కానీ పూరన్ పట్టువదల్లేదు. వీలు చిక్కినప్పుడల్లా అతను సిక్స్‌లు, ఫోర్లు దంచి సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులో ఉంచాడు. అతనికి తోడు అలెన్ (51; 32 బంతుల్లో 7×4, 1×6) కూడా ధాటిగా ఆడడంతో విండీస్ విజయం దిశగా సాగింది. అలెన్ ఔటైనా.. లక్ష్యం (18 బంతుల్లో 31) చేరువగా ఉండడంతో విండీస్ గెలుస్తుందనిపించింది. అయితే


పూరన్ (118)

మాథ్యూస్ వేసిన 48 ఓవర్ తొలి బంతికి పూరన్ వెనుదిరగడంతో విండీస్ పనైపోయింది. అంతకుముందు ఫెర్నాండోతో పాటు కుశాల్ పెరీరా (64), కరుణరత్నె (32), కుశాల్ మెండిస్ (39), తిరిమానె (45 నాటౌట్) రాణించడంతో లంక భారీ స్కోరు చేసింది.

**శ్రీలంక ఇన్నింగ్స్:** కరుణరత్నె (సి) హోప్ (బి) హోల్డర్ 32; కుశాల్ పెరీరా రనౌట్ 64; అవిష్క ఫెర్నాండో (సి) అలెన్ (బి) కాట్రెల్ 104; కుశాల్ మెండిస్ (సి) అండ్ (బి) అలెన్ 39; మాథ్యూస్ (బి) హోల్డర్ 26; తిరిమానె నాటౌట్ 45; ఉదాన (సి) హోల్డర్ (బి) థామస్ 3; ధనంజయ డిసిల్వా నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం:** (50 ఓవర్లలో 6 వికెట్లకు) **338; వికెట్ల పతనం:** 1-93, 2-104, 3-189, 4-247, 5-314, 6-327; **బౌలింగ్:** కాట్రెల్ 10-0-69-1; ఒషాన్ థామస్ 10-1-58-1; గాబ్రియెల్ 5-0-46-0; హోల్డర్ 10-0-59-2; బ్రాత్‌వైట్ 7-0-53-0; అలెన్ 8-0-44-1

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** గేల్ (సి) వాండర్సె (బి) రజిత 35; ఆంబ్రిస్ (సి) కుశాల్ పెరీరా (బి) మలింగ 5; హోప్ (బి) మలింగ 5; హెట్‌మయర్ రనౌట్ 29; పూరన్ (సి) కుశాల్ పెరీరా (బి) మాథ్యూస్ 118; హోల్డర్ (సి) జీవన్ (బి) వాండర్సె 26; బ్రాత్‌వైట్ రనౌట్ 8; అలెన్ రనౌట్ 51; కాట్రెల్ నాటౌట్ 7; థామస్ ఎల్బీ (బి) మలింగ 1; గాబ్రియెల్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 27; **మొత్తం:** (50 ఓవర్లలో 9 వికెట్లకు) **315; వికెట్ల పతనం:** 1-12, 2-22, 3-71, 4-84, 5-145, 6-199, 7-282, 8-308, 9-311; **బౌలింగ్:** మలింగ 10-0-55-3; ధనంజయ 10-0-49-0; ఉదాన 10-0-67-0; రజిత 10-0-76-1; వాండర్సె 7-0-50-1; కరుణరత్నె 1-0-7-0; మాథ్యూస్ 2-0-6-1

## స్నూకర్ ప్రపంచకప్ ఫైనల్లో భారత్

**దోహా:** భారత్ ఐబీఎస్ఎఫ్ స్నూకర్ ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టింది. సెమీఫైనల్లో పంకజ్ ఆడ్వాణీ, లక్ష్మణ్ రావత్‌లతో కూడిన భారత జట్టు 3-2తో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. ఫైనల్లో పాకిస్థాన్‌తో తలపడుతుంది. మరో సెమీస్‌లో పాక్ 3-1తో కతార్‌ను ఓడించింది.

## మీరు మీలా ఆడలేదు!



**లండన్:** ఇంగ్లాండ్‌పై భారత్ గెలిస్తే.. పాకిస్థాన్ సెమీస్ అవకాశాలు మెరుగ్గా ఉండేవి. కానీ కోహ్లీసేన ఓటమితో వారి అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. దీంతో పాకిస్థానీల్లో అసహనం కట్టలు తెంచుకుంటోంది. పాక్‌ను సెమీస్ రానివ్వకుండా అడ్డుకునేందుకు భారత్ కావాలనే ఈ మ్యాచ్ ఓడిందంటూ ఆ దేశ అభిమానులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. స్వయంగా పాకిస్థాన్ దిగ్గజ బౌలర్ వకార్ యూనస్ సైతం ఇదే అర్థం వచ్చేలా మాట్లాడటం గమనార్హం. "మీరు మీలా లేరు. జీవితంలో మీరేం చేస్తారనేదే మిమ్మల్ని నిర్వచిస్తుంది. పాకిస్థాన్ సెమీస్ చేరుతుందా లేదా అన్నదానిపై నాకు బాధ లేదు. కొందరు ఛాంపియన్ల క్రీడాస్ఫూర్తికి పరీక్ష ఎదురైంది. వాళ్లు దారుణంగా విఫలమయ్యారు" అని అన్నాడు వకార్.

ఛాంపియన్

# ఒసాకాకు షాక్


ఒసాకా


కోరి గాఫ్

**● వీనస్‌పై గాఫ్ సంచలనం**
**● జ్వెరెవ్, సిట్సిపాస్ ఔట్**
**● జకోవిచ్, హాలెప్ శుభారంభం**

**వింబుల్డన్ తొలి రోజే పెను సంచలనం. రెండో సీడ్ ఒసాకా ఔట్. అన్‌సీడెడ్ పుతిన్‌త్సెవా తొలి రౌండ్లో ఆమెకు షాకిచ్చింది. 15 ఏళ్ల బాలిక కోరి గాఫ్.. దిగ్గజ క్రీడాకారిణి వీనస్ విలియమ్స్‌ను కంగుతినిపించింది. అలెగ్జాండర్ జ్వెరెవ్, సిట్సిపాస్‌ల కథ కూడా మొదటి రౌండ్లోనే ముగిసింది.**

లండన్

వింబుల్డన్ సంచలనాలతో మొదలైంది. రెండో సీడ్ నవోమి ఒసాకా (జపాన్) కథ మొదటి రౌండ్‌నే దాటలేకపోయింది. సోమవారం జరిగిన పోరులో కజకిస్థాన్‌కు చెందిన పుతిన్‌త్సెవా 7-6 (7-4), 6-2తో ఒసాకాను ఓడించింది. వింబుల్డన్ ఆడుతున్న పిన్న వయస్కురాలైన కోరి గాఫ్ (అమెరికా).. 6-4, 6-4తో ఐదుసార్లు ఛాంపియన్ వీనస్ విలియమ్స్‌కు షాకిచ్చింది. ఏడో సీడ్ హాలెప్ (రొమేనియా), మూడో సీడ్ ప్లిస్కోవా (చెక్) శుభారంభం చేశారు. తొలి రౌండ్లో హాలెప్ 6-4, 7-5తో సస్నోవిచ్ (బెలారస్)పై నెగ్గగా.. ప్లిస్కోవా 6-2, 7-6 (7-4)తో లిన్ ఝు (చైనా)ను ఓడించింది. స్వితోలినా (ఉక్రెయిన్), మాడిసన్ కీస్ (అమెరికా), రిబరికోవా (స్లొవేకియా), సెవత్సోవా (లాత్వియా) రెండో రౌండ్లో అడుగుపెట్టారు. పురుషుల సింగిల్స్‌లో నొవాక్ జకోవిచ్ రెండో రౌండ్లో ప్రవేశించాడు. తొలి రౌండ్లో అతడు 6-3, 7-5, 6-3తో కొల్ష్రైబర్ (జర్మనీ)పై విజయం సాధించాడు. జకోవిచ్ 12 ఏస్‌లు కొట్టాడు. ఎన్నో అంచనాలున్న అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), స్టెఫనోస్ సిట్సిపాస్ (గ్రీస్)లకు మాత్రం షాక్ తగిలింది. జ్వెరెవ్ 6-4, 3-6, 2-6, 5-7తో వెస్లీ (చెక్) చేతిలో, సిట్సిపాస్ 4-6, 6-3, 4-6, 7-6 (10-6), 3-6తో ఫాబియానో (ఇటలీ) చేతిలో పరాజయంపాలయ్యారు. వావ్రింకా (స్విట్జర్లాండ్), అండర్సన్ (దక్షిణాఫ్రికా), కచనోవ్ (రష్యా) మెద్వెదెవ్ (రష్యా), కార్లోవిచ్ (క్రొయేషియా), తిప్సరెవిచ్ (సెర్బియా), సెప్పి (ఇటలీ) తొలి రౌండ్‌ను అధిగమించారు.

**పోరాడి ఓడిన ప్రజ్నేశ్:** సింగిల్స్ మెయిన్ డ్రా బరిలో నిలిచిన ఏకైక భారతీయుడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తొలి రౌండ్లోనే ఓడిపోయాడు. కానీ 15వ సీడ్ రోనిచ్‌కు అతడు గట్టి పోటీ ఇచ్చాడు. రోనిచ్ 7-6 (7-1), 6-4, 6-2తో ప్రజ్నేశ్‌పై విజయం సాధించాడు.

## విశ్లేషకురాలిగా సానియా



**ముంబయి:** భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా కొత్త అవతారం ఎత్తింది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌కు విశ్లేషకురాలిగా వ్యవహరిస్తుంది. సోమవారం ప్రారంభమైన వింబుల్డన్‌ను స్టార్ స్పోర్ట్స్ ఛానెల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. 'మ్యాచ్ పాయింట్' కార్యక్రమంలో సానియా తన అభిప్రాయాలు పంచుకుంటుంది.

## వార్నర్‌కు మళ్లీ అమ్మాయి

**లండన్:** ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ మూడోసారి తండ్రయ్యాడు. అతని భార్య క్యాండిస్ ఆదివారం రాత్రి మరోసారి పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తన భార్య, పిల్లలతో ఉన్న ఫోటోను వార్నర్ సామాజిక మాధ్యమాల్లో అభిమానులతో పంచుకున్నాడు. కొత్తగా పుట్టిన పాపకు ఐలా రోస్ వార్నర్ అనే పేరు పెట్టారు. ఇప్పటికే ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలున్న సంగతి తెలిసిందే.

## ఈ ఓటమి ఓ చురక

సౌరభ్ గంగూలీ

ఇంగ్లాండ్ చేతిలో ఓటమితో టీమ్‌ఇండియా జైత్రయాత్రకు అడ్డుకట్ట పడింది. ఐతే ఈ ఓటమి ఓ చురకలాంటిది. ఈ పరాజయం నుంచి పాఠాలు నేర్చుకొని తిరిగి బలంగా పుంజుకొని విజేతగా నిలిచి టోర్నీకి ముగింపు పలకాలి. భారత్ ఎలాగో సెమీస్ చేరుతుంది. ప్రస్తుత ఫార్మాట్ ప్రకారం నాకౌట్‌కు చేరే వరకే పాయింట్లతో పని. ఆ తర్వాతి మ్యాచ్‌ల్లో జట్లు ఎలాంటి ప్రదర్శన చేస్తాయన్నదే ముఖ్యం. ఇంగ్లాండ్ అత్యుత్తమ ప్రమాణాలతో ఆడింది. బెయిర్‌స్టోతో కలిసి రాయ్ మ్యాచ్‌ను లాక్కున్నాడు. బుమ్రా, షమి బౌలింగ్‌లో సానుకూలంగా బ్యాటింగ్ చేయడం, స్పిన్నర్లపై ఒత్తిడి పెంచడం.. ఆ జట్టుకు మిగతా జట్లకు మధ్య తేడాను తెలిపింది. భారత్ మిడిలార్డర్ గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి కానీ అది బలంగానే ఉందని నా నమ్మకం.

SEAGRAM'S
ROYAL STAG
MEGA MUSIC CDs

# బాధితులకు బాబు బాసట

- **హత్యకు గురైన తెదేపా కార్యకర్తల కుటుంబాల పరామర్శకు నిర్ణయం**
- **రూ.5 లక్షల ఆర్థిక సాయం**
- **వైకాపా దాడులపై జిల్లాల వారీగా కమిటీలు**

**ఈనాడు, గుంటూరు, అమరావతి:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక అధికార వైకాపా నేతల దాడుల్లో హత్యకు గురైన తెదేపా కార్యకర్తల కుటుంబాలకు బాసటగా నిలవాలని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయించారు. బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించనున్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించబోతున్నారు. కార్యకర్తలపై దాడులకు సంబంధించి కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తేవాలనే నిర్ణయానికొచ్చారు. సోమవారం గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. తెదేపా కార్యకర్తలపై దాడులను నివారించాలని డీజీపీ గౌతం సవాంగ్‌ను కలిసిన తెదేపా బృంద సభ్యులు ఆ వివరాలను చంద్రబాబుకు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల ధ్వంసంపై ఆయన నేతలను ఆరా తీశారు. 13 జిల్లాల్లో కమిటీలు నియమించి బాధితులను పరామర్శించి భరోసా ఇవ్వాలని సూచించారు.


కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

### కార్యకర్తలను కాపాడుకుంటా: చంద్రబాబు

'కార్యకర్తలు లేకపోతే రాజకీయ పార్టీలకు మనుగడ ఉండదు. ఆర్థికంగా చితికిపోయినా త్యాగాలు చేసేది కార్యకర్తలే. వైకాపా దాడులు చేస్తున్న గ్రామాల్లోనే ఉండి శ్రేణులను కాపాడుకుంటా' అని తెదేపా అధినేత చంద్రబాబు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. 'వైకాపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరుగురు తెదేపా కార్యకర్తలను హతమార్చారు. తెదేపా శ్రేణులపై దాడులు చేస్తున్న వారిపై బెయిలబుల్ కేసులు పెడుతూ మన కార్యకర్తలపై నాన్‌బెయిలబుల్ కేసులు పెడుతున్నారు. ఇక నుంచి రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటా. ప్రజలకు దగ్గరవుతూ కార్యకర్తలను కాపాడుకుంటాం' అని చంద్రబాబు చెప్పారు. మీ ఇల్లు ఖాళీ చేయిస్తే మా ఇంటికి వచ్చి ఉండాలని పెదనందిపాడు, అమరావతి ప్రాంతాల కార్యకర్తలు చంద్రబాబును ఆహ్వానించారు. మీ ఇల్లే నా ఇల్లు, మీ గుండెల్లో నాకు ప్రత్యేక స్థానం ఉందని తెలుసంటూ ఆయన బదులిచ్చారు.

### కాపులెందుకు దూరమయ్యారు?

'కాపుల సంక్షేమానికి మరే ప్రభుత్వమూ ఇవ్వనంత అధిక ప్రాధాన్యమిచ్చింది తెలుగుదేశమే. కాపు కార్పొరేషన్, ప్రత్యేక రిజర్వేషన్లు, బీసీల్లో చేర్చడం వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేశాం. అయినా సరైన నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడంతో ఎన్నికల్లో ఓటమిపాలయ్యాం' అని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుకు కాపు సామాజికవర్గ పార్టీ నేతలు స్పష్టం చేశారు. తెదేపా ఆవిర్భావం నుంచి కాపులు అండగా ఉన్నప్పుడే పార్టీ అధికారంలోకి వచ్చిందని వివరించారు. ఈ ఎన్నికల్లో వారు ఎందుకు దూరమయ్యారో? కారణాలేమిటో గుర్తించాలని కోరారు. తెదేపా కాపు సామాజికవర్గ నాయకులు సోమవారం సాయంత్రం చంద్రబాబుతో ఉండవల్లిలోని నివాసంలో సమావేశమయ్యారు. 'ముద్రగడ పద్మనాభం దీక్షల విషయంలో సమర్థంగా వ్యవహరించలేకపోయాం. పోలీసులూ దుర్మార్గంగా వ్యవహరించారు. ఇంట్లో మహిళలను అవమానించేలా ప్రవర్తించారు. ఇవన్నీ కాపుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి' అని బాబుతో వారు చెప్పారు. జనసేనతో పొత్తు పెట్టుకుని ఉంటే బాగుండేదని కొందరు అభిప్రాయపడ్డారు.

### భద్రత పునరుద్ధరించాలి: హైకోర్టులో పిటిషన్

తనకు కుదించిన భద్రతను తక్షణం పునరుద్ధరించేలా ఆదేశించాలని తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రాణహాని ఉన్న తనకు భద్రత కుదించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. రాజకీయ ప్రేరేపితంగానే వ్యక్తిగత భద్రతతోపాటు నివాసం వద్ద భద్రతను తగ్గించారని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండుసార్లు, తొమ్మిదేళ్ల ప్రతిపక్ష నేతగా, విభజన తర్వాత నవ్యాంధ్ర మొదటి ముఖ్యమంత్రిగా వ్యవహరించానని తెలిపారు. ముఖ్యమంత్రిగా శాంతిభద్రతల రక్షణకు, మావోల కార్యకలాపాల అణచివేతకు పలు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ప్రాణహాని ఉందన్న నివేదిక మేరకే తనకు జడ్‌ప్లస్ భద్రతనిచ్చారని వివరించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఆ భద్రతను విడతలవారీగా కుదిస్తున్నారని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు మంగళవారం ఈ వ్యాజ్యంపై విచారించనున్నారు.

## పోలీసుస్టేషన్ ఆవరణలో బాలికకు గర్భస్రావం

**నమ్మించి గర్భవతిని చేసిన బంధువు**

**వేములవాడ, న్యూస్‌టుడే:** అభం శుభం తెలియని ఓ బాలికను ఆమె బంధువు నమ్మించి అయిదు నెలల గర్భవతిని చేసిన ఘటన వేములవాడలో సోమవారం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు రాగా స్టేషన్‌లోనే ఆమెకు గర్భస్రావమైంది. పట్టణ సీఐ ఎన్.వెంకటస్వామి కథనం ప్రకారం... వేములవాడ పురపాలిక పరిధిలోని ఓ బాలిక (15)ను గంభీరావుపేట మండలానికి చెందిన ఆమె బంధువు రేవేళ్ల సాయి(22) నమ్మించి గర్భవతిని చేశాడు. శారీరకంగా మార్పులు రావడంతో గమనించిన తల్లిదండ్రులు నిలదీయడంతో ఆమె జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో పెళ్లి చేసుకోవాలని బాలిక కుటుంబ సభ్యులు అతన్ని నిలదీయడంతో నిరాకరిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో వారికి తెలియకుండా బాలికకు మాయమాటలు చెప్పి గర్భస్రావం చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చాడు. సమాచారం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లగా.. అతను పరారయ్యాడు. వారు కూతుర్ని వెంటబెట్టుకుని వేములవాడ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సమయంలో బాలికకు గర్భస్రావం అవ్వడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. సాయిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఏపీ సీఎం ఇంటికి జనం బారులు

- **వినతులిచ్చేందుకు పోటాపోటీ**
- **తొక్కిసలాటలో మహిళకు గాయాలు**

**తాడేపల్లి, న్యూస్‌టుడే:** సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తాడేపల్లికి భారీగా తరలివచ్చారు. వినతులిచ్చేందుకు వెళ్లే సమయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. తొక్కిసలాటలో అనంతపురం జిల్లా కనేకల్ మండలం ఎర్రగుంటకు చెందిన విశ్రాంతమ్మ స్పృహ తప్పి పడిపోయారు. సోమవారంనుంచి ముఖ్యమంత్రి జగనే స్వయంగా ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తారని ప్రచారమైన నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు. వారిని జగన్ నివాసానికి సమీపంలో ఉన్న భారతమాత విగ్రహం వద్ద నిలిపేశారు. రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఈ సమయంలో సీఎం నివాసం లోపలికి రెండు వాహనాలను పోలీసులు పంపించారు. వాటితోపాటు వెళ్లేందుకు అర్జీదారులు ప్రయత్నించారు. దీంతో తోపులాట చోటుచేసుకుంది. తన కుమారుడి విదేశీ విద్య ఉపకారవేతన బకాయిల కోసం అర్జీ ఇచ్చేందుకు అనంతపురంనుంచి వచ్చిన విశ్రాంతమ్మ స్పృహ తప్పి పడిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు బాధితురాలిని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు.


జగన్‌మోహన్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరిస్తున్న యాగ నిర్వాహకులు

### యాగం సంపూర్ణం

ఎన్నికల్లో వైకాపా విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షతో 23 నెలలుగా నిర్వహిస్తున్న శ్రీ మహారుద్ర సహిత ద్విసహస్ర చండీయాగం సోమవారంతో ముగిసింది. తాడేపల్లిలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని యాగనిర్వాహకులైన శివరామప్రసాద్‌కు కంకణ సన్మాన మహోత్సవం చేశారు.

## మేయర్, ఛైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు

- **అవినీతికి అడ్డుకట్టకు అంబుడ్స్‌మెన్**
- **సీఎంకు జయప్రకాశ్ నారాయణ్ లేఖ**

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేలా కొత్త పురపాలక చట్టం ఉండాలని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. కొత్త పురపాలక చట్టంలో ఉండాల్సిన అంశాలపై ముఖ్యమంత్రికి ఆయన సోమవారం లేఖ రాశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అవినీతి, అక్రమాలను అరికట్టేలా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సామాజిక తనిఖీ నిర్వహించేలా చట్టంలో అవకాశం కల్పించాలన్నారు. పురచట్టంలో భాగంగా పౌరసేవలు మెరుగుపడేందుకు పౌరసేవల చట్టాన్ని (రైట్ టు సర్వీసెస్) తీసుకురావాలని కోరారు. 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా సక్రమించిన అధికారాలు, విధులను, నిధులు, సిబ్బందిని వెంటనే బదలాయించాలని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధుల అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు అంబుడ్స్‌మన్ వ్యవస్థను లోకాయుక్త పరిధిలో ప్రతి జిల్లా, నగరానికి ఏర్పాటు చేయాలన్నారు.


సమావేశంలో 'జీఎస్టీ ఆన్ రియల్ ఎస్టేట్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఆర్ఎస్ కుమార్, ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ఎం.ఆర్.ఆర్.రెడ్డి

## హైదరాబాద్ జోన్‌లో అత్యధిక జీఎస్టీ వసూళ్లు

- ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ వెల్లడి
- ఘనంగా జీఎస్టీ రెండో వార్షికోత్సవం

**పంజాగుట్ట:** హైదరాబాద్ జోన్‌లో అత్యధిక జీఎస్టీ వసూళ్లు అయ్యాయని హైదరాబాద్ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ వెల్లడించారు. జీఎస్టీ అమలు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ జీఎస్టీ విభాగం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ కీలకోపన్యాసం చేశారు. జీఎస్టీ అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. 2018-2019లో హైదరాబాద్ జీఎస్టీ జోన్ అత్యంత ప్రగతిని సాధించిందన్నారు. పన్ను ఎగవేతదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ద్వారా 250పైగా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రావాల్సిన రూ.459 కోట్లలో 60 శాతం తిరిగి రాబట్టగలిగామన్నారు. అవగాహన కేంద్రాల ద్వారా 5,580 మంది సందేహాలను నివృత్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు ఎం.ఆర్.ఆర్.రెడ్డి, ఏఆర్ఎస్. కుమార్ పాల్గొన్నారు.

### 'పీఆర్సీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి'

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ అమలు గడువు ముగిసి.. జులై ఒకటికి ఏడాదైన సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు సోమవారం వేతన సవరణ కమిటీ ఛైర్మన్ బిస్వాల్‌ను కలిసి చర్చించారు. 3నెలల్లో నివేదిక తెప్పించి అమలు చేస్తామని సీఎం చెప్పి ఏడాది గడిచినా నివేదికను సమర్పించడంలో జాప్యంపై యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.రాములు, ప్రధాన కార్యదర్శి చావా రవి అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే దీన్ని సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామని కమిటీ ఛైర్మన్ బిస్వాల్ వారికి హామీ ఇచ్చారు.

### మాంసం శుద్ధి, నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి

మాంసం ఉత్పత్తుల పరిశుభ్ర నిర్వహణకు, శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని మాంస పరిశోధన కేంద్రం డైరెక్టర్ వైద్యనాథన్ కోరారు. హైదరాబాద్‌లో మాంసం, మాంస ఉత్పత్తుల పరిశుభ్రమైన నిర్వహణ, శుద్ధికి సంబంధించి మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణను సోమవారం ఇక్కడ మాంస పరిశోధన కేంద్రంలో ప్రారంభించారు.

### విత్తన జన్యు పరీక్షలపై సదస్సు: ఇస్టా

విత్తనాల్లోని జన్యువుల ఆధారంగా నాణ్యత పరీక్షలు నిర్వహించాలనే అంశంపై వచ్చే ఏడాది అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని 'అంతర్జాతీయ విత్తన పరీక్షల సంఘం'(ఇస్టా) నిర్ణయించింది. గత నెల 26 నుంచి హైదరాబాద్‌లో జరుగుతున్న ఇస్టా సమావేశాల్లో భాగంగా సోమవారం విత్తన పరీక్షలపై చర్చించామని సంఘం సభ్యుడు కేశవులు తెలిపారు.

# బరువు తగ్గే మార్గంలో... 'యాప్'సోపాలు!

- మన అలవాట్లకు తగ్గట్టు సూచనలివ్వని అప్లికేషన్లు
- అత్యధిక డౌన్‌లోడ్స్, స్టార్ రేటింగ్స్ ఉన్నా పనితీరు అంతంతే...
- జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనంలో వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

జీవనశైలి అస్తవ్యస్తం. భోజనానికీ వేళాపాళా ఉండదు. పైగా తినేది జంక్‌ఫుడ్! ఫలితంగా చాలామంది అధిక బరువు, స్థూలకాయంతో సతమతమవుతున్నారు. బరువు తగ్గేందుకు కొందరు సెల్‌ఫోన్లలో యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అవి ఇచ్చే సూచనలను పాటిస్తున్నారు. కానీ.. . వీటిలో చాలామటుకు మన దేశ ప్రజల ఆహార అలవాట్లకు తగ్గట్టు లేవని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్తలు గుర్తించారు. 2016-17లో ప్లేస్టోర్ నుంచి అత్యధిక డౌన్‌లోడ్స్, స్టార్ రేటింగ్స్ వచ్చిన 20 'కేలరీ కౌంటింగ్ యాప్స్'పై ఆ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బారావు ఎం.గవరవరపు నేతృత్వంలోని బృందం అధ్యయనం చేసింది. హెల్త్ ఇన్ఫర్మాటిక్స్ పత్రిక ఈ వివరాలను ప్రచురించినట్టు ఎన్ఐఎన్ ఓ ప్రకటనలో తెలిపింది.

### అధ్యయనం ఇలా...

మొత్తం 20 అప్లికేషన్ల పనితీరును శాస్త్రవేత్తలు నిశితంగా పరిశీలించారు. వాటిలోని సమాచారం, శాస్త్రీయత, విషయ నైపుణ్యం, సాంకేతిక సలహాలు సజావుగా ఉన్నాయా? లేదా? అన్నది పరిగణనలోకి తీసుకున్నారు. ఏడు అప్లికేషన్లు నిర్దేశిత ప్రమాణాలకు దరిదాపుల్లో ఉండగా... మిగతావి కనీస ప్రమాణాలు లేనివి. బరువు తగ్గేందుకు ఉద్దేశించిన యాప్స్ శాస్త్రీయ సమాచారాన్ని ఇవ్వట్లేదనీ, ముఖ్యంగా భారతీయుల ఆహారపు అలవాట్లకు తగినట్టు అవి లేవని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఒక్కో యాప్ ఒక్కోలా సూచనలివ్వడంతో వేటిని పాటించాలన్న గందరగోళం కూడా నెలకొందన్నారు. "163 సెం.మీ. ఎత్తు, 66 కిలోల బరువు ఉన్న 22 ఏళ్ల యువతి... వారానికి 500 గ్రాముల బరువు తగ్గాలనుకుంది. కానీ ఇరవై అప్లికేషన్లు రకరకాల సూచనలిస్తూ నిత్యం 1,191 నుంచి 1,955 కిలో కేలరీల ఆహారాన్ని తగ్గించాలని సూచించాయి" అని డా.సుబ్బారావు వెల్లడించారు.



### ఆరోగ్యకర సమాచారమేదీ?

చాలా యాప్స్ ఆరోగ్యకరంగా బరువు తగ్గే అంశాలను సూచించడం లేదు. పండ్లు, కాయగూరలు... కొవ్వులేని, పీచు పదార్థాలను అధికంగా తినాలని చెప్పడం లేదని అధ్యయనంలో వెల్లడైంది. కేవలం 40% అప్లికేషన్లు మాత్రమే ఇలాంటి సూచనలిస్తున్నాయి. భారతీయులు తినే సాధారణ భోజనంలో ఎన్ని కేలరీలు ఉంటాయన్న సమాచారం కూడా వాటిలో లభ్యం కావడం లేదు. కేవలం అధిక డౌన్‌లోడ్స్, స్టార్ రేటింగ్ ఆధారంగా మాత్రమే యాప్స్‌ను వినియోగించడం మంచిదికాదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

### 'న్యూట్రిఫై ఇండియా నౌ'తో పరిష్కారం...

భారతీయ ఆహార అలవాట్లకు అనుగుణంగా కేలరీలను కరిగించుకునేందుకు వీలుగా ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో 'న్యూట్రిఫై ఇండియా నౌ' యాప్‌లో సూచనలిస్తున్నట్టు ఎన్ఐఎన్ సంచాలకురాలు ఆర్.హేమలత చెప్పారు. స్థానికంగా లభ్యమయ్యే ఆహారం, వంటకాలు, పోషకాల విలువ ఆధారంగా దీన్ని రూపొందించినట్టు వివరించారు. ప్రయోగ దశలో ఉన్న ఈ అప్లికేషన్ పనితీరును మెరుగుపరుస్తున్నట్టు పేర్కొన్నారు.



దిల్లీలో సోమవారం ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, పీయూష్ గోయల్, థావర్‌చంద్ గహ్లోత్, అమిత్ షా, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు

## వెంకయ్యనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని

### రాజ్యసభలో పార్టీ తరఫున ప్రకటన చేసిన అమిత్ షా
### గౌరవ సూచకంగా నిలబడి చప్పట్లతో సభ్యుల అభినందనలు

ఈనాడు, దిల్లీ: ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు జన్మ దినాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు ప్రముఖులు సోమవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి కోవింద్ జన్మదిన సందేశాన్ని తెలుగులో ట్వీట్ చేయటంతో పాటు ఫోన్ చేసి మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలపటంతో పాటు వెంకయ్యనాయుడితో ఫోన్లోనూ మాట్లాడారు. రాజ్యసభ ఛైర్మన్‌గా సభకు వన్నె తెస్తున్నారని, సభా కార్యక్రమాలను చక్కగా ముందుకు తీసుకెళుతున్నారని ప్రశంసించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. ప్రభుత్వం, భాజపా తరఫున ఉప రాష్ట్రపతికి శుభాకాంక్షలు తెలుపుతూ రాజ్యసభలో ప్రకటన చేశారు. ఆ సమయంలో సభ్యులు గౌరవ సూచికంగా నిలబడి కరతాళ ధ్వనులు చేశారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, పలు రంగాల ప్రముఖులు ఫోన్‌లో ఉపరాష్ట్రపతితో మాట్లాడారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఉపరాష్ట్రపతి ధన్యవాదాలు తెలిపారు. తనపై వారు చూపిన అభిమానం మరువలేనని పేర్కొన్నారు.

✦ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని గవర్నర్ నరసింహన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉపరాష్ట్రపతికి సందేశాన్ని పంపించారు.

### గవర్నర్‌తో కొత్త ఐఏఎస్‌ల భేటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణకు కేటాయించిన 2018 బ్యాచ్ ఐఏఎస్‌లు ఎనిమిది మంది సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య ఆధ్వర్యంలో వారు రాజ్‌భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారిని గవర్నర్ అభినందించారు.

## డీటీలుగా పదోన్నతులకు రంగం సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: అర్హులైన సీనియర్ అసిస్టెంట్లకు నాయబ్ తహసీల్దార్లుగా (డిప్యూటీ తహసీల్దార్లు) పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమైంది. పదోన్నతులకు అర్హులను తేల్చేందుకు వీలుగా 2016-17, 2017-18 సంవత్సరాలకు చెందిన కేడర్ ఆఫ్ సీనియారిటీ, నామినేషన్ జాబితాలను అత్యవసరంగా పంపాలంటూ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం కార్యదర్శి కె.హైమావతి ఏడు ఉమ్మడి జిల్లాలకు సర్క్యులర్ పంపించారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మెదక్ జిల్లాల కలెక్టర్లు సీనియర్ అసిస్టెంట్ల జాబితాలను రూపొందించి వీలైనంత త్వరగా పంపించాలని పేర్కొన్నారు. ప్రక్రియ పూర్తిచేసేందుకు వీలుగా సంబంధిత జీవోలను కూడా జతచేసి నాయబ్ తహసీల్దారు పానెల్ ప్రతిపాదనలను పంపించాలని సూచించారు.

## వైద్య ఆరోగ్యశాఖకు నూతన భవనాల కోసం అన్వేషణ

ఈనాడు, హైదరాబాద్: నూతన సచివాలయ నిర్మాణం నేపథ్యంలో ప్రస్తుతమున్న డి బ్లాక్‌లోని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి గదులు, పేషీ, విభాగాలను మరోప్రాంతానికి తరలించడంలో భాగంగా. . సోమవారం కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలోని భవనాలను వైద్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ కోసం కేటాయించిన భవనాలు ఇప్పుడు ఖాళీగా ఉండడంతో.. వాటిలోకి సచివాలయంలోని కార్యాలయాలను తరలించడంపై ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ భవనాలు కోఠి ప్రధాన రహదారికి అత్యంత సమీపంలో ఉండడం, రద్దీ విపరీతంగా ఉండే అవకాశాలుండడం, తదితర కారణాలతో సచివాలయ కార్యాలయ విధి నిర్వహణకు ఆటంకం కలిగే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది. కోఠిలోని భవనాల పరిశీలన అనంతరం అమీర్‌పేటలోని ప్రకృతి వైద్యశాల ప్రాంగణంలో ఖాళీగా ఉన్న నూతన భవనాన్ని ముఖ్యకార్యదర్శి సందర్శించారు. ఈ విషయంపై వైద్య మంత్రి ఈటల రాజేందర్‌తోనూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సమావేశమయ్యారు. ఎక్కడికి తరలించాలనేది ఒక ట్రెండు రోజుల్లో నిర్ణయిస్తామని వైద్యవర్గాలు తెలిపాయి.

### కేంద్ర జల సంఘం ఛైర్మన్‌గా ఏకే సిన్హా

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర జలం సంఘం నూతన ఛైర్మన్‌గా ఏకే సిన్హా నియామకమయ్యారు. ఆయన ఇప్పటి వరకు గంగా ఫ్లడ్ కంట్రోల్ మిషన్ ఛైర్మన్‌గా ఉన్నారు. సీడబ్ల్యూసీకి ఛైర్మన్‌గా ఉన్న మసూద్ హుస్సేన్ పదవి విరమణ చేయడంతో ఆ స్థానంలో సిన్హాను కేంద్ర ప్రభుత్వం నియమించింది.

# 9,10 షెడ్యూలు సంస్థలపై నివేదికలు సిద్ధం

- ఉన్నతాధికారులకు అందజేసిన ఆయా శాఖల కార్యదర్శులు
- నేడు పరిశీలించనున్న సీఎం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య విభజన సమస్యల పరిష్కారం, సచివాలయ నిర్మాణం, శాఖల తరలింపు, ప్రస్తుత భవనాల కూల్చివేత తదితర అంశాలపై సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సోమవారం సమావేశాలు జరిగాయి. వీటికి అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తొమ్మిది, పదో షెడ్యూలు సంస్థల విభజనపై తాజా పరిస్థితులను వివరిస్తూ నివేదికలను కార్యదర్శులు ఉన్నతాధికారులకు అందజేశారు. మరోవైపు సచివాలయం తరలింపు ప్రక్రియ వేగవంతానికి అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటన్నింటిపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రగతి భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ప్రగతి భవన్‌లో గత నెల తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌ల మధ్య జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనుసరించి 9, 10 షెడ్యూలు సంస్థలపై తాజా నివేదికను సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వం గతంలో అధికారులను ఆదేశించింది. విభజన ప్రక్రియ, షీలాభిడే కమిటీ సిఫార్సులు, సమస్యలు, నిర్వహణ, ఆదాయం, అప్పులు, ఆస్తుల వివరాలను వెల్లడించాలని అన్ని శాఖల కార్యదర్శులను కోరింది. అందుకు అనుగుణంగా సచివాలయంలో సోమవారం ఉదయం ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి సహా 29 శాఖల ముఖ్య కార్యదర్శులు హాజరయ్యారు. అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు రాజీవ్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. వీటిని పరిశీలించిన అనంతరం ఆయా శాఖల కార్యదర్శులతో ఉన్నతాధికారులు ముఖాముఖి మాట్లాడారు. అదనపు సమాచారం సేకరించారు. వివాదాలు, అభ్యంతరాల గురించి తెలుసుకున్నారు. ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలను ఆ రాష్ట్ర అధికారులు ఖాళీ చేసినప్పటికీ, వాటికి సంబంధించిన తాళాలు ఇవ్వలేదు. నారాయణగూడలోని ఆప్కో ప్రధాన కార్యాలయంలోని ఛైర్మన్, ఎండీ గదుల తాళాలు ఇవ్వలేదని టెస్కో అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లోనూ కొందరు ఛైర్మన్ల గదులు ఖాళీ చేయని విషయాన్నీ ప్రస్తావించారు. ఆయా సమస్యలను ఏపీ సీఎస్ దృష్టికి తీసుకెళ్లాలని, వెంటనే తాళాలు తెప్పించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థలతో ఇదే చివరి సమావేశమని, మళ్లీ వారితో సంప్రదింపులు ఉండవని అధికారులు స్పష్టం చేశారు. ఆమోద యోగ్య విభజనపై ఇప్పటికే తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మధ్య స్పష్టత వచ్చిందన్నారు. కార్యదర్శుల నుంచి వచ్చిన తాజా నివేదికలను మంగళవారం సీఎంకు సమర్పిస్తామని వెల్లడించారు.

తెలంగాణ సచివాలయం తరలింపుపై మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మరో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇందులోనూ రాజీవ్‌శర్మ, రామకృష్ణారావు, నర్సింగ్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరలింపు ప్రక్రియలో భాగంగా అన్ని శాఖల సమన్వయాధికారులు తమకు నిర్దేశించిన భవనాలను పరిశీలించి సేకరించిన సమాచారంపై కార్యదర్శులకు నివేదికలు ఇచ్చారు. వీటిని కార్యదర్శులు ఉపసంఘానికి సమర్పించారు. ఒకటి, రెండు రోజుల్లోనే శాఖల తరలింపునకు సన్నాహాలు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నట్లు తెలిసింది. భవనాల కూల్చివేతపైనా ఈ సమావేశంలో చర్చించారు.

### నేడు సీఎం కీలక నిర్ణయాలు

ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంలో జరిగిన నిర్ణయాలు అమలయ్యే దిశగా జరుగుతున్న కసరత్తు, తెలంగాణ సచివాలయం, శాసనసభ భవనాల నిర్మాణం తదితరాలపై సీఎం కేసీఆర్ మంగళవారం సమీక్షించనున్నారు. ఈ సమీక్షలో మంత్రివర్గ ఉపసంఘంతో పాటు, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్‌కే జోషి తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అంశాల వారీగా అందిన నివేదికలను సీఎం పరిశీలిస్తారు. ఈ నెల 3వ తేదీన రాజ్‌భవన్‌లో గవర్నర్ సమక్షంలో ఇరు రాష్ట్రాల అధికారుల సమావేశం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున నివేదిక ఇవ్వాల్సిన ఉన్న నేపథ్యంలో దానికి సీఎం ఆమోదం తెలపనున్నారు. మరోవైపు సచివాలయం తరలింపు, భవనాల నిర్మాణం, టెండర్ల ప్రక్రియ, నమూనా ఖరారు తదితర అంశాలపై సీఎం ఇదే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.




**Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office:** Commercial Complex II, Sector - 49 - 50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

**Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR:** Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; **JAGATIAL:** Samrat Honda - 9701200045, 9704500045; **HUZURABAD:** Samrat Honda - 8099979050; **SIRCILLA:** Srikanth Honda - 08723-233336, 7799700245; **PEDDAPALLY:** Srikanth Honda - 7799700259; **SULTANABAD:** Aradhna Honda - 9849885862; **VEMULAWADA:** Srikanth Honda - 9177662757; **METPALLY:** Saanvi Honda - 9581295818; **JAMMIKUNTA:** Srikanth Honda - 7799700263; **DHARMARAM:** Sairam Honda - 9642828885, 08728-270950; **HUSANABAD:** Laxmi Honda - 9949915222; **ADILABAD:** Sree Mahalakshmi Honda - 9010977757; **RAMAGUNDAM:** Sai Ram Krishna Honda - 8100779999; **MANCHERIAL:** Jagadamba Honda - 08736-259303; **BELLAMPALLY:** Thirumala Honda - 08735225975; 9059979909; **NIRMAL:** Sree Mahalakshmi Honda - 9010977757; **ASIFABAD:** Sainath Honda - 9010431431, 8500612233; **KHANAPUR:** Sri Ganesh Honda - 9010977757; **BHAINSA:** Sree Mahalakshmi Honda - 9010977757; **KAGAZNAGAR:** Sree Mahalakshmi Honda - 9010977757; **ICHODA:** Sree Mahalakshmi Honda - 9010977757; **NIZAMABAD:** Sairam Honda - 243434, 9052116500; Sai SRK Honda - 08462- 239966, 7095911666, **BHEEMAGAL:** Druva Honda - 08463238888, 9912151515; **NIZAMABAD:** Sai Krishna Honda - Pitlam - 08466-271372, 9949812751; **BODHAN:** Sairam Honda - 225588, 8886022883; **KAMAREDDY:** Sairam Honda - 220034, 9951426969; **DHARMARAM:** Sairam Honda - 9494555511, 08463-226696; **ARMOOR:** Sairam Honda - 9052416222; **NIRMAL:** Mahalakshmi Honda - 08734-244155, 9553408811; **KHANAPUR:** Sri Ganesh Honda - 9705559111, 9705559222; **BHAINSA:** Mahalakshmi Honda - 9010977757; **KAGAZNAGAR:** Mahalakshmi Honda - 9010977757; **ICHODA:** 9010977757; **WARANGAL:** Nagarjuna Honda - 9704377444, 9000477444; Borra Honda - 9849486292, 9100441821; **HANAMKONDA:** Sri Srinivasa Honda - 0870-2531111, 8374357999; **STATION GHANPUR:** Sri Srinivasa Honda - 8143498979; **JANGAON:** Sri Srinivasa Honda - 9951203333, 8340042555; **MAHABUBABAD:** Nagarjuna Honda - 9441933789; **BHUPALPALLY:** Nagarjuna Honda - 9052190444; **THORRUR:** Gajalakshmi Honda - 9441770871; **PARKAL:** Sri Sai Honda - 8686477444, 8341776222; **NARSAMPET:** Sneha Honda - 08718-231310, 9393982174; **NAIMNAGAR:** Sri Srinivasa Honda - 9160414222; **CHERYAL:** Sri Vigneshwara Honda - 8464806750, 9550697460.

**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

Eenadu epaper